
# ఈనాడు



విజయవాడ 26-11-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 106
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




## శతాబ్దాల గాయాలు మానుతున్నాయి

సత్యమేవ జయతే.. అంతా రామమయం

అయోధ్య రామాలయంపై ధ్వజారోహణలో ప్రధాని నరేంద్ర మోదీ

అధికారికంగా పూర్తయిన పనులు.. భక్తులతో కళకళ

3 లో



ధ్వజారోహణ వేడుకకు భారీగా హాజరైన ప్రజలు ★ పతాకానికి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ, ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్, యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, సీఎం యోగి



కొత్త జిల్లాల ఏర్పాటుపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు, అధికారులు

## కొత్తగా 3 జిల్లాలు.. 5 రెవెన్యూ డివిజన్లు

మంత్రివర్గ ఉపసంఘ సిఫార్సులకు సీఎం ఆమోదం

- మొత్తం జిల్లాలు 29, రెవెన్యూ డివిజన్లు 82కి చేరిక
- రంపచోడవరం కేంద్రంగా పోలవరం పేరుతో ప్రత్యేక జిల్లా
- మార్కాపురం, మదనపల్లె కేంద్రాలుగా మరో రెండు జిల్లాలు
- నక్కపల్లి, అద్దంకి, పీలేరు, బనగానపల్లె, మడకశిర కేంద్రాలుగా రెవెన్యూ డివిజన్లు
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో మార్పుచేర్పులు లేవు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాలు.. ఐదు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు కాబోతున్నాయి. దీంతో రాష్ట్రంలో జిల్లాలు 26 నుంచి 29కి, రెవెన్యూ డివిజన్లు 77 నుంచి 82కి పెరగనున్నాయి. మార్కాపురం, మదనపల్లె కేంద్రాలుగా కొత్త జిల్లాలతో పాటు.. రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటయ్యే జిల్లాకు పోలవరం పేరు నిర్ణయించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ మండలం ఇకపై వాసవీ పెనుగొండగా మారనుంది. జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, (మిగతా 3లో)

### పరకామణి కేసులో మీకు తెలిసే రాజీ జరిగిందా?


సతీష్‌కుమార్‌ది ఆత్మహత్యేనని ఎలా చెప్పగలిగారు?

గిఫ్ట్‌డీడ్‌ను టేబుల్ ఎజెండాగా ఎందుకు పెట్టారు?

భూమన కరుణాకరరెడ్డిపై సీఐడీ ప్రశ్నల వర్షం

11 లో

## అరాచకశక్తుల చేతుల్లో తుపాకులు!




- వారిలో అత్యధికులు ఎర్రచందనం స్మగ్లర్లు.. కబ్జాదారులే
- వైకాపా హయాంలో వైఎస్సార్ కడప జిల్లాలో ఎడాపెడా లైసెన్స్‌లు
- ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులు... వైకాపా ఛోటా నేతలకూ మంజూరు

ఈనాడు – కడప, అమరావతి

ఎర్రచందనం స్మగ్లర్లు.. అరాచక శక్తులు.. కబ్జాదారులు.. కిరాయి రౌడీలు.. గూండాలకు వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ సొంత జిల్లా వైఎస్సార్ కడపలో ఎడాపెడా తుపాకీ లైసెన్స్‌లు ఇచ్చేశారు. వైకాపా ముఖ్యనేతల సన్నిహితులు, అనుచరులు, వారి ముఠాల్లోని సభ్యులు, ఆ పార్టీ ఛోటా నాయకులకు పప్పుబెల్లాల్లా పంచేశారు. చివరకు ఒక పంచాయతీ కార్యదర్శికి, ఛోటా మైనింగ్ వ్యాపారికీ ఇచ్చేశారంటే ఏ స్థాయిలో అరాచకం రాజ్యమేలిందో అర్థమవుతుంది. వైకాపా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అనుచరులకు, పార్టీ నాయకులకు విచ్చలవిడిగా ఇచ్చేశారు. వైకాపా హయాంలో తుపాకీ లైసెన్సులు పొందినవారిలో ఒక సామాజికవర్గానికి చెందినవారే ఎక్కువగా ఉండటం గమనార్హం. వారిలో కొందరు హోదా, దర్పం ప్రదర్శించేందుకు.. ఎక్కువమంది బెదిరింపులు, వసూళ్లు, ప్రత్యర్థులపై దాడులకు ఉపయోగిస్తున్నారు. వైకాపా హయాంలో ఇచ్చినవి, అంతకుముందువి కలిపి జిల్లాలో ప్రస్తుతం 854మందికి తుపాకీ లైసెన్సులుంటే (మిగతా 3లో)

### పులివెందులలో ..

- పులివెందుల నియోజకవర్గం వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు ఎం.రవికుమార్‌రెడ్డి కొన్నాళ్ల క్రితం తన అనుచరులతో కలసి పోలీసుస్టేషన్‌పై దాడిచేశారు. అతనికి వైకాపా ప్రభుత్వం తుపాకీ లైసెన్స్ ఇచ్చి గన్‌మెన్‌నూ కేటాయించింది.
- వేంపల్లె మండలం వెలమవారిపల్లెకి చెందిన రుద్ర భాస్కర్‌రెడ్డి, వేంపల్లెకు చెందిన కామిశెట్టి సతీష్‌కుమార్, సింహాద్రిపురం మండలం లోమడకు చెందిన డి.పవన్‌చంద్రారెడ్డిలపై అరాచకశక్తులుగా ముద్ర ఉంది. వీరికి తుపాకీ లైసెన్స్ ఇవ్వడంతో మరింత చెలరేగిపోయారు.
- సింహాద్రిపురం మండలం బిదినంచెర్లకు చెందిన నేత బీఎన్ బ్రహ్మానందరెడ్డి.. పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని చంపడానికి జరిపిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. ఏడేళ్ల క్రితం జరిగిన ఈ జంట హత్యలు సంచలనం సృష్టించాయి.
- దిద్దేకుంటకు చెందిన తెదేపా నేత పరమేశ్వర్‌రెడ్డిని గత ప్రభుత్వ హయాంలో కత్తులతో నరికి చంపేశారు. కసనూరుకు చెందిన వైకాపా నేత వి.హరినాథ్‌రెడ్డి హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఈయనకూ తుపాకీ లైసెన్స్ ఉంది. వైకాపా హయాంలో జరిగిన ఈ ఘటనపై కేసు కూడా నమోదు కాకుండా చేసేశారు.



## ఆదిలో అడ్డంకులకే నీరుగారిపోవద్దు

స్వీయ అనుభవాల నుంచి నాయకత్వ పాఠాలు చెప్పిన దువ్వూరి సుబ్బారావు

విజయవాడ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కీలకోపన్యాసం

ఈనాడు, అమరావతి: 'జీవితంలో, కెరీర్‌లో ప్రారంభంలో తగిలే ఎదురుదెబ్బలకు, ప్రతికూల పరిస్థితులకు కుంగిపోకూడదు. వాటిని సరిగ్గా ఎదుర్కోవాలి' అని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా నాయకత్వ లక్షణాలపై ఆయన కీలకోపన్యాసం చేశారు. తన అనుభవాలనే ఉదాహరణలుగా తీసుకుని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీ ఛాన్సలర్ కె.వి.చౌదరి అధ్యక్షత వహించారు. అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపల్ మేకా రమేష్, డీన్ రాజేష్ సి.జంపాల, డైరెక్టర్ వేమూరి బాబూరావు (మిగతా 11లో)



### రేపటి నుంచి శ్రీవారి వైకుంఠ ఏకాదశి టికెట్ల రిజిస్ట్రేషన్

12లో

మొదటి 3 రోజులకు డిసెంబరు 2న లక్కీడిప్



ఆభరణాలను భక్తులకు చూపుతున్న అర్చకులు

## పద్మావతి అమ్మవారికి శ్రీవారి కానుక

### రూ.1.31 కోట్లతో బంగారు ఆభరణాలు



కమలాల హారం, వజ్రాల అడ్డిగతో అమ్మవారు

తిరుచానూరు, న్యూస్‌టుడే: తన ఇష్ట సఖి అయిన శ్రీపద్మావతి అమ్మవారికి శ్రీవేంకటేశ్వరస్వామి బంగారు ఆభరణాలు కానుకగా పంపారు. మంగళవారం పంచమీ తీర్థాన్ని పురస్కరించుకుని తితిదే రూ.1.31 కోట్లతో వాటిని ప్రత్యేకంగా తయారు చేయించి. ఒక కిలో బంగారు కమలాల హారం, వజ్రాల అడ్డిగను ఏనుగుపై ఊరేగింపుగా తీసుకొచ్చారు. వాటిని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలు అర్చకులకు అందజేశారు. స్నపన తిరుమంజనం సందర్భంగా అమ్మవారికి వాటిని అలంకరించారు.



# చదువుకున్నవారు తప్పు చేస్తే కఠిన చర్యలుండాలి

- నిరక్షరాస్యుల కంటే భిన్నకోణంలో చూడాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం సుందరేశ్
- ఏసీబీ కేసులను కొట్టేసిన ఏపీ హైకోర్టు తీర్పుపై ఎస్ఎల్‌పీ విచారణలో వ్యాఖ్యలు
- అదో 'అద్భుతమైన' తీర్పు అన్న జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ
- తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం



ఈనాడు, దిల్లీ: 'చట్టాన్ని పునఃపరిశీలించాలి. చదువుకున్న వ్యక్తి ఏ చిన్న తప్పు చేసినా అలాంటి వారిపట్ల చదువులేనివారి కంటే కఠినంగా ఉండాలి. చట్టం అంటే ఏంటో ఇతరులకు చెప్పే స్థితిలో ఉండి.. తప్పు చేసిన వారిని ప్రత్యేక కోణంలో చూడాలి. కానీ ఇక్కడ దానికి వ్యతిరేక దిశలో వ్యవహరిస్తున్నాం' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం సుందరేశ్ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ఏసీబీని హైదరాబాద్ నుంచి విజయవాడకు తరలించిన నేపథ్యంలో 2016-19 మధ్య కాలంలో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఏసీబీ నమోదు చేసిన కేసులను విచారించే అర్హత ఆ సంస్థకు లేదంటూ సుమారు 14 మందిపై నమోదైన అక్రమాస్తుల కేసులను కొట్టేస్తూ ఏపీ హైకోర్టు ఆగస్టు 1న తీర్పిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఎస్ఎల్‌పీ వేసింది. మంగళవారం జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కలిసి దీనిపై విచారించిన సందర్భంగా జస్టిస్ సుందరేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్, ప్రతివాదుల తరఫున సీనియర్ న్యాయవాది గురుకృష్ణకుమార్‌లు సుమారు 45 నిమిషాలు వాదనలు వినిపించిన అనంతరం న్యాయమూర్తి తీర్పు రిజర్వ్ చేశారు. 14 మంది ప్రతివాదుల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించడానికి ప్రయత్నించినప్పుడు జస్టిస్ సుందరేశ్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'మేం ఈ కేసులో ఏం చేయబోతున్నామో మీకందరికీ తెలుసు. అందువల్ల వాదనలు వినిపించే అవకాశం రాలేదని న్యాయవాదులు బాధపడొద్దు. ఈ కేసులో ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్లు, డిస్‌ఛార్జి పిటిషన్లు, అభియోగాల నమోదు, తర్వాత ప్రాసిక్యూషన్ అనుమతులు ఇలా చాలాసార్లు మీరు వాదనలు వినిపించాల్సి ఉంటుంది. ప్రస్తుత పిటిషన్‌లో మేం అధికారికంగా ఏమీ చెప్పడం లేదు. ఈ కేసును హైకోర్టు ఎలా డీల్ చేసిందన్న విషయంలో మేం ఆందోళనకు గురవుతున్నాం. అందుకే ప్రస్తుతానికి ఇంకేమీ మాట్లాడకుండా సంయమనం పాటిస్తున్నాం. ఇందులో హైకోర్టు బ్యాలెన్సింగ్‌గా వ్యవహరించి ఉండాల్సింది. ఒకరు తప్పు చేస్తున్నప్పుడు అందులో కనీసం సమతౌల్యమైనా పాటించాల్సి ఉండాల్సింది. జరిగింది జరిగిపోయింది ఇక మీరు మళ్లీ మొదలుపెట్టండని చెప్పాల్సింది. ప్రతివాదులంతా తమపై నమోదైన కేసులను విచారించే న్యాయ పరిధి ఏసీబీకి లేదని వాదిస్తున్నారు. వాళ్లు ఉందని చెబుతున్నారు. ఒకవేళ మేం మీ (ప్రతివాదుల) అభిప్రాయంతో ఏకీభవిస్తే దానిపై ఏం చేయాలా అన్న ప్రశ్న మాలో ఉదయిస్తుంది. దాని ప్రకారం వెళ్తే ప్రస్తుతం నమోదైన ఏసీబీ కేసులను తొలి నుంచీ మొదలుపెట్టడానికి అడ్డంకులేమీ ఉండవు. కానీ మేం విస్తృత అంశాన్ని చూస్తున్నాం. ఏమీలేని విషయంలో ఒక కేసును సృష్టించడానికి సీనియర్ న్యాయవాది ప్రయత్నిస్తున్నారని మాత్రం చెప్పగలం. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి రాకెట్‌సైన్స్ అక్కర్లేదు' అని జస్టిస్ సుందరేశ్ వ్యాఖ్యానించారు.

### ఏసీబీ కొత్త ఏజెన్సీ కాదు కదా!

ఈ విషయంలో హైకోర్టు 'అద్భుతమైన తీర్పు' ఇచ్చిందని జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ పేర్కొన్నారు. 'ఏసీబీ ఏమీ కొత్త ఏజెన్సీ కాదు కదా. అంతకుముందున్న ఏజెన్సీకి కొనసాగింపు మాత్రమే. ఈ కేసులో హైకోర్టు న్యాయమూర్తి చెప్పిన భాష్యం బాగుంది. అయితే అది ఆంధ్రప్రదేశ్‌కు కాకుండా తెలంగాణకు వర్తింపజేసి ఉంటే బాగుండేది. ఇక్కడ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ యథాతథంగా ఉంది. దాన్నుంచి తెలంగాణ ఏర్పాటైంది. దాని ఆధారంగా తెలంగాణ అసెంబ్లీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న చట్టాలు, ఉత్తర్వులను స్వీకరిస్తూ చట్టాలు చేస్తుంది. మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ విడిపోయినప్పుడు అదే జరిగింది. మధ్యప్రదేశ్ తన చట్టాలను రాష్ట్ర విభజన తర్వాత ఎప్పుడూ మార్చలేదు' అని గుర్తుచేశారు.

### కేసులను విచారించే అర్హత లేదంటే నమ్మితించడమేంటి?

అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ ఈ కేసులో హైకోర్టు పొరపాటు చేసిందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. 'రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణలకు ప్రత్యేక ఏసీబీలు ఏర్పాటయ్యాయి. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నందున ఏపీ ఏసీబీ 2015 వరకు అక్కడి నుంచే పని చేసింది. తర్వాత హైదరాబాద్‌లోని అధికారులను విజయవాడకు మార్చారు. తర్వాత 2016-20 వరకు పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే తమపై ఏసీబీ కేసుల ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యే నాటికి విజయవాడ కేంద్రంగా ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌ను నోటిఫై చేయనందున దానికి తమపై కేసులను విచారించే అర్హత లేదని నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పిచ్చింది' అని చెప్పారు. ప్రతివాదుల తరఫున సీనియర్ న్యాయవాది గురుకృష్ణకుమార్ వాదనలు వినిపిస్తూ ఉమ్మడి రాజధాని హైదరాబాద్ కేంద్రంగా పని చేసిన ఏసీబీని తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు తరలించినప్పుడు దానిపై తాజాగా మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయాలి తప్ప కేవలం సర్క్యులర్లు జారీ చేయడం కుదరదన్నారు. సీఆర్‌పీసీ ప్రకారం పోలీస్‌స్టేషన్ ఏర్పాటు, ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు, అందులో ఎన్ని పోస్టులు ఉంటాయో ఖరారు చేస్తూ నోటిఫికేషన్ ఇవ్వడమే అన్నింటి కంటే ముఖ్యమని చెప్పారు. వాదనలన్నీ విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. వారంలోపు వాద, ప్రతివాదులు మూడు పేజీల్లో క్లుప్తంగా వాదనలు సమర్పించాలని నిర్దేశించింది.

# బంగాళాఖాతంలో ఒకేసారి 2 వాయుగుండాలు

- మలక్కా జలసంధి, శ్రీలంకల సమీపంలో..

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఒక వాయుగుండం కొనసాగుతుండగానే మరొకటి ఏర్పడేందుకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. మలక్కా జలసంధి సమీపంలోని తీవ్ర అల్పపీడనం మంగళవారం ఉదయం వాయుగుండంగా బలపడింది. ఇది మరింత బలపడి, రాబోయే 24 గంటల్లో పశ్చిమ దిశగా, తర్వాత 24 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా కదిలే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. ఇది తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రెండు రోజుల్లో దీని గమనం, తీవ్రతపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. ఇది శనివారం లేదా ఆదివారం నాటికి తమిళనాడు, ఏపీ తీరాల వైపు వెళ్తుందని కొన్ని మోడళ్లు, సముద్రంలోనే బలహీనపడుతుందని మరికొన్ని మోడళ్లు సూచిస్తున్నాయి. నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక, భూమధ్యరేఖకు సమీపంలో మరో అల్పపీడనం ఏర్పడింది. ఇది ఉత్తర- వాయవ్య దిశగా కదులుతూ బుధవారానికి తీవ్ర అల్పపీడనంగా, తర్వాత 24 గంటల్లో వాయుగుండంగా బలపడుతుందని అంచనా. ఇది మరింత బలపడి ఉత్తర తమిళనాడు వైపు కదులుతుందని, దీని ప్రభావం ఏపీ, తమిళనాడులపై ఉంటుందని పలు వాతావరణ నమూనాలు సూచిస్తున్నాయి.

### శనివారం తర్వాత వర్షాలు

ఈ వాయుగుండాల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శనివారం తర్వాత వర్షాలు పడతాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. శనివారం ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు, ఆదివారం ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, శ్రీసత్యసాయి, నంద్యాల, బాపట్ల, పల్నాడు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. సముద్రంలో అధిక వేగంతో గాలులు వీచి, అలజడిగా మారనున్న నేపథ్యంలో గురువారం నుంచి మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు సూచించారు.

# 'రాక్రీట్' అవినీతి రూ.80 కోట్లు



- ఇది వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి సంబంధీకులది
- సంస్థపై కేసుల నమోదుకు ఆదేశం
- గృహనిర్మాణశాఖ మంత్రి పార్థసారథి

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో చేపట్టిన ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాల్లో ఆ పార్టీకి చెందిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సంబంధీకులకు చెందిన రాక్రీట్ (గుత్తేదారు) సంస్థ రూ.80 కోట్ల అవినీతికి పాల్పడినట్లు గృహనిర్మాణశాఖ మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. ఈ మేరకు విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. ఈ సంస్థ 47,850 గృహ నిర్మాణాలు చేపట్టి ఒక్కటి కూడా పూర్తి చేయలేదని తెలిపారు. అవినీతి జరిగిన ప్రాంతాల్లో ఆ సంస్థపై క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశాలిచ్చామన్నారు. ఆ మొత్తాన్ని వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సచివాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైకాపా హయాంలో నిర్దేశిత ఇంటి నిర్మాణ దశ పూర్తి కాకుండానే అదనంగా బిల్లు తీసుకున్న గుత్తేదారులు కూడా నెలలోపు ఆ నిర్మాణ పనుల్ని పూర్తి చేయాలని గడువిచ్చాం. ఆ మేరకు పనులు చేపట్టకపోతే వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించి అదనంగా తీసుకున్న మొత్తాన్ని వసూలు చేస్తాం' అని మంత్రి స్పష్టం చేశారు.

### పార గోడతో ఇళ్ల నిర్మాణానికి అనుమతి

'ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద పార గోడతో ఇళ్ల నిర్మాణానికి అనుమతిచ్చాం. త్వరలోనే దీనికి ఉత్తర్వులు జారీ చేయబోతున్నాం. మరికొందరు ఇంటి మీద పై అంతస్తు నిర్మాణానికి అనుమతివ్వాలని కోరగా, దీన్ని పరిశీలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పీఎంఏవై గ్రామీణ పథకం 2.0కి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 వరకే కేంద్రం గడువిచ్చింది. అర్హులందరూ గ్రామ, వార్డు సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్ లేదా గృహనిర్మాణశాఖ ఏఈ వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే కొంతమంది బేస్‌మెంట్, లెంటల్ స్థాయి వరకు కట్టుకున్న వారున్నారు. వారి వివరాలు కూడా ఆవాస్+ యాప్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించాం. వీటిని పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రాన్ని కోరతాం' అని మంత్రి వెల్లడించారు.

★ 'ఇళ్ల స్థలాలు లేని వారి వివరాల్ని సేకరిస్తున్నాం. ఇప్పటివరకు 81 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. మరో 1.15 లక్షల మంది ప్రభుత్వ, పోరంబోకు స్థలాల్లో ఉన్నట్లు గుర్తించాం. వారందరికీ పొసెషన్ సర్టిఫికెట్లు ఇచ్చి ఇళ్లను మంజూరు చేస్తాం' అని మంత్రి వివరించారు.

### వైకాపా ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ.920 కోట్లు చెల్లిస్తాం

'2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం చేపట్టిందనే కక్షతో నిర్మాణం పూర్తయిన గృహాలకు రూ.920 కోట్ల మేర బిల్లులు చెల్లించకుండా లబ్ధిదారులను వైకాపా ప్రభుత్వం వేధించింది. ఈ నిధుల్ని విడుదల చేస్తాం. గత 17 నెలల్లో 3 లక్షల ఇళ్లను పూర్తి చేశాం. ఉగాది నాటికి మరో 5 లక్షల గృహాలు పూర్తి చేస్తాం. ప్రతి మూడు నెలలకొకసారి గృహప్రవేశాలు చేయిస్తాం. 2029 నాటికి అర్హులందరికీ ఇళ్ల నిర్మాణం చేపడతాం' అని మంత్రి భరోసా ఇచ్చారు.

## గ్రామ సచివాలయ వ్యవస్థ నిర్మాణంపై అధ్యయనం

- ఉద్యోగుల పదోన్నతులపై కూడా..
- మార్చి నాటికి నివేదిక రూపొందించాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం



ఈనాడు, అమరావతి: గ్రామ సచివాలయాల పనితీరు, వ్యవస్థ నిర్మాణంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులను ఆయా శాఖలకు ఎలా అనుసంధానించాలనే అంశంపైనా కూలంకషంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుని వచ్చే ఏడాది మార్చి నాటికి నివేదిక అందించాలన్నారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మంత్రుల బృందంతో కలిసి సచివాలయ సిబ్బందికి పదోన్నతుల కల్పన, వారిని ఇతర శాఖలతో అనుసంధానించడానికి ఉన్న అవకాశాలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో చర్చించారు. మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, అనిత, సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు, నారాయణ, రవికుమార్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినప్పటికీ ఆ వ్యవస్థ నిర్మాణం దెబ్బతినకూడదనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పవన్‌కల్యాణ్ సూచించారు. పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైతే ప్రతినెలా సమావేశమై లోటుపాట్లపై చర్చిద్దామన్నారు.

## రూ.527 కోట్ల విలువైన 'వింజో' ఆస్తుల జప్తు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: అక్రమంగా నగదు లావాదేవీలు, సొమ్ము బదిలీలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వింజో గేమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రూ.527 కోట్ల విలువైన చరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జప్తు చేశారు. కంపెనీకి బెంగళూరు, గురుగ్రామ్‌లలోని బ్యాంకులలో ఉన్న రూ.505 కోట్ల నగదు, మరో రూ.22 కోట్ల విలువైన బాండ్లు, మ్యూచువల్ ఫండ్లను జప్తు చేసినట్లు ఈడీ అధికారులు బెంగళూరులో మంగళవారం ప్రకటించారు. రహస్యంగా అల్గరిథం, సాఫ్ట్‌వేర్లను ఉపయోగించి, వినియోగదారులను ఓడిస్తోందని దర్యాప్తులో ఈడీ గుర్తించింది. వింజో యూఎస్ ఇంటర్నేషనల్ కంపెనీ పేరిట నకిలీ కంపెనీని సృష్టించి రూ.489.90 కోట్ల నగదును అమెరికా, సింగపూర్‌కు బదిలీ చేశారని అధికారులు తెలిపారు. కేంద్రం రియల్ మనీ గేమ్స్‌పై నిషేధాన్ని విధించాక.. వినియోగదారులకు తిరిగి చెల్లించాల్సిన రూ.43 కోట్ల నగదును విడుదల చేయలేదని గుర్తించారు.

## సామాజిక సంక్షేమ మండలి ఛైర్మన్‌గా పోతుల బాలకోటయ్య

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సామాజిక సంక్షేమ మండలి ఛైర్మన్‌గా అమరావతి బహుజన ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు పోతుల బాలకోటయ్యను ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు చేపట్టిన తేదీ నుంచి రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. నెలకు రూ.60,000 గౌరవ వేతనంగా చెల్లించనున్నారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు బాలకోటయ్య కృతజ్ఞతలు తెలిపారు


## జగ్గన్నతోట ప్రభల తీర్థానికి రాష్ట్ర పండుగగా గుర్తింపు

- సీఎం అంగీకరించినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడి

మలికిపురం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ఏటా సంక్రాంతి పర్వదినాల్లో నిర్వహిస్తున్న జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మలికిపురం గ్రామానికి మంగళవారం వచ్చిన ఆయనకు స్థానికులు వినతిపత్రం ఇవ్వగా.. ఈ మేరకు స్పందించారు. లక్షల మంది భక్తుల కోలాహలం మధ్య ఏటా వైభవంగా నిర్వహించే ప్రభల తీర్థానికి 450 సంవత్సరాల ఘనచరిత్ర ఉందని, ఈ విషయాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, తాను వేర్వేరు సందర్భాల్లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని దుర్గేష్ చెప్పారు. ఈ నేపథ్యంలోనే ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం సమ్మతించారని తెలిపారు.



మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



### ఆరోగ్య సిప్‌ను ఆరంభించండి

ఆరోగ్యం కోసం క్రమానుగత పెట్టుబడి విధానం(సిప్)లా మంచి అలవాట్లను దీర్ఘకాలం పాటు కొనసాగించడం ఉత్తమం. ఈ విధానంలో ప్రతిరోజు.. ✦ 30 నిమిషాలు వేగంగా నడవండి. ✦ ఇంట్లో వండిన ఆహారాన్నే భుజించండి. ✦ 7-8 గంటలు నిద్రపోండి. ✦ ధూమపానాన్ని వదిలిపెట్టండి. ఆరు నెలల్లో మీకు పెద్ద మార్పు కనిపించకపోవచ్చు. 15-20 ఏళ్ల తర్వాత ఈ అలవాట్లు లేని మీ తోటివారు ఆసుపత్రులకు రూ.లక్షలు చెల్లించే పరిస్థితి ఎదుర్కోవచ్చు. మీరు మాత్రం ఆరోగ్యంగా నడకను ఆస్వాదిస్తూ ఉంటారు.

– సయాజీరావు గైక్వాడ్, వైద్యుడు

## నౌకాదళ గూఢచర్యం కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: దేశ భద్రతా రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేశారన్న కేసులో నేరం రుజువు కావడంతో మరో ఇద్దరు నిందితులకు 71 నెలల చొప్పున సాధారణ జైలుశిక్ష, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ విశాఖపట్నంలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఎనిమిది మందికి శిక్ష పడింది. 2019 డిసెంబరులో జాతీయ దర్యాప్తు సంస్థ 14 మంది నౌకాదళ సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. విశాఖలోని నౌకాదళ స్థావరాల రహస్యాలను వాట్సప్, ఫేస్‌బుక్ ద్వారా పాకిస్థాన్‌కు చేరవేసినట్లు అధికారులు గుర్తించారు. తాజాగా రాజస్థాన్‌కు చెందిన అశోక్‌కుమార్, వికాస్‌కుమార్‌లకు శిక్ష పడింది.

## దరఖాస్తు గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: దివ్యాంగులకు 100% రాయితీపై అందించే రెట్రోఫిటెడ్ మోటరైజ్డ్ వాహనాలకు దరఖాస్తుల గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈ నెల 24తో గడువు ముగియగా, దాన్ని 30 వరకు పొడిగించినట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

# శతాబ్దాల గాయాలు మానుతున్నాయి

**100 టన్నుల పూలతో ముస్తాబు**

సీతారాముల కళ్యాణం జరిగిన మార్గశిర మాసం శుక్లపంచమి రోజున అభిజిత్ ముహూర్తంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం సందర్భంగా అయోధ్య అంగరంగవైభవంగా ముస్తాబైంది. సుమారు 100 టన్నుల పూలతో ఆలయాన్ని, నగరంలోని మార్గాలను సుందరంగా అలంకరించారు. దాదాపు 7 వేల మంది ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. జై శ్రీరాం నినాదాలు అడుగడుగునా ప్రతిధ్వనించాయి. కట్టుదిట్టమైన భద్రత మధ్య మోదీ రోడ్ షో నిర్వహించారు. చిన్నారులు, మహిళలు ఆయనపై పూల వర్షం కురిపించారు.

## అయోధ్య రామాలయంపై ధ్వజారోహణలో మోదీ

**అయోధ్య:** శతాబ్దాలుగా కలిగిన గాయాలు, నొప్పులు ఇప్పుడు తీరాయని, 500 ఏళ్ల క్రితం నాటి సంకల్పం పూర్తిస్థాయిలో సాకారమైందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. యూపీలోని అయోధ్యలో భారీస్థాయిలో నిర్మించిన రామాలయం పనులు అన్నివిధాలా పూర్తయినట్లు ప్రకటించే ధ్వజారోహణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. 22 అడుగుల పొడవు, 11 అడుగుల వెడల్పుతో నాణ్యమైన వస్త్రంతో తయారైన ఈ పతాకాన్ని 161 అడుగుల ఆలయ శిఖరంపై ఎగరేశారు. శ్రీరాముడిది సూర్యవంశం కావడంతో సూర్యుడి చిహ్నం, ఓం, రామరాజ్య అధికార వృక్షమైన కోవిదార్ చిహ్నాలు పతాకంపై పొందుపరిచారు. బంగారు దారంతో చేతితో వీటిని ఎంబ్రాయిడరీ చేశారు. ఇది లంబకోణ త్రిభుజాకృతిలో ఉంది. జైశ్రీరామ్ నినాదంతో మోదీ ప్రసంగం ప్రారంభించారు. ధర్మధ్వజం కేవలం జెండా మాత్రమే కాదని భారతీయ సాంస్కృతిక పునర్వికాసానికి చిహ్నమని ఉద్ఘాటించారు. రామరాజ్య వైభవాన్ని ఈ జెండా ప్రతిబింబిస్తుందని, శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుందని అన్నారు. అసత్యంపై చివరికి సత్యం విజయం సాధిస్తుందనడానికి ఈ పవిత్ర జెండా నిదర్శనమని వ్యాఖ్యానించారు. దేశం, ప్రపంచం రామమయంగా మారిందన్నారు.

### ప్రపంచానికి స్ఫూర్తి.. ప్రేరణ

“కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీక. భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి అయోధ్య. రామభక్తుల సంకల్పం సిద్ధించింది. రామాలయ నిర్మాణ యజ్ఞానికి ఇవాళ పూర్ణాహుతి. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నం. శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి ఇది చాటుతుంది.. స్ఫూర్తి, ప్రేరణలను ఇస్తుంది. కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని చెబుతుంది. ధర్మధ్వజాన్ని దూరం నుంచి చూసినా రాముడిని చూసినంత పుణ్యం వస్తుంది. బానిస భావజాలంతో ఉన్న కొంతమంది మాత్రం శ్రీరాముడిని ఓ కాల్పనిక వ్యక్తి అని చెబుతున్నారు. భారత్‌లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాముడు ఉన్నాడు. రాముడంటే వ్యక్తి కాదు.. విలువ. క్రమశిక్షణకు, మార్గదర్శనానికి మారుపేరు. బానిస భావజాలం నుంచి భారత్ బయటపడాలి. సాంస్కృతిక గుర్తింపును చూసి గర్వపడాలి. మనం స్వాతంత్ర్యం సముపార్జించినా న్యూనత నుంచి స్వేచ్ఛ పొందలేకపోయాం. రాబోయే దశాబ్దంలో దీనిని తిరగరాయాలి. ప్రజాస్వామ్యాన్ని మనం అరువు తెచ్చుకోలేదు..



రామ దర్బార్‌లో హారతి ఇస్తున్న ప్రధాని మోదీ, ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్

అది మన మాతృమూర్తి. మన డీఎన్‌ఏలోనే అది ఉంది. వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలి. మానవ వికాసానికి అయోధ్య కొత్త నమూనా ఇస్తుంది. రాముడు కులం చూడడు, భక్తి మాత్రమే చూస్తాడు. భేద భావాలు ఉండవు. క్షమాగుణాన్ని మించిన గొప్ప గుణం మరొకటి లేదు” అని మోదీ అన్నారు. గర్భగుడిలో బాలరాముడికి హారతి ఇచ్చి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. సప్త మందిర్‌ను సందర్శించారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. ధ్వజారోహణతో కొత్త యుగానికి శుభారంభమైందన్నారు. అయోధ్య కోసం ప్రాణాలు కోల్పోయినవారి ఆత్మలు ఈరోజు శాంతిస్తాయని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ పేర్కొన్నారు. యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ పాల్గొన్నారు.

### దళితుడిననే నన్ను ఆహ్వానించలేదు

– ఎంపీ అవధేశ్

దళితుడైన కారణంగానే ధ్వజారోహణ కార్యక్రమానికి తనను ఆహ్వానించలేదని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)కి చెందిన ఫైజాబాద్ ఎంపీ అవధేశ్ ప్రసాద్ ఆరోపించారు. ఇది దేవుడి గౌరవానికి సంబంధించింది కాదని, కొంతమంది సంకుచిత భావజాలం మాత్రమేనని అన్నారు. భాజపా ఈ వ్యాఖ్యలను తోసిపుచ్చింది. ఆయనకు నిజంగా భక్తి ఉంటే ప్రజల్లో చేరి ఆ కార్యక్రమానికి హాజరయ్యేవారన్నారు.

## పత్తి రైతుల సమస్యలకు మూడ్రోజుల్లో పరిష్కారం

**వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు**



కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు. చిత్రంలో కన్నా లక్ష్మీనారాయణ

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే:** సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించే రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని రెండు, మూడ్రోజుల్లో పరిష్కరించేందుకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో మంగళవారం ఆయన రైతులతో మాట్లాడారు. “పత్తి రైతుల సమస్యలపై ఇప్పటికే కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాశారు. తేమ శాతం 18 ఉన్నా కొనుగోలు చేయాలని కోరారు. డిసెంబరు 1 నుంచి పూర్తిస్థాయిలో పత్తి కొనుగోళ్లు జరిగేలా చూస్తాం. కొనుగోలు కేంద్రాలు పెంచాలని కేంద్రాన్ని కోరగా సానుకూలంగా స్పందించింది. అన్నదాతా సుఖీభవ మూడో విడత లబ్ధిని ఫిబ్రవరిలో అందజేస్తాం” అని మంత్రి వివరించారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా తెదేపా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

**ఈనాడు, అమరావతి:** తుపాను హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. కోతల తర్వాత ధాన్యాన్ని కర్షకులు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవి తడవకుండా చూసుకునేందుకు ఉచితంగా టార్పాలిన్లు అందిస్తున్నామని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## మన ప్రభుత్వం వస్తుంది.. అధైర్యపడొద్దు

● **కార్యకర్తలతో మాజీ సీఎం జగన్**

**పులివెందుల, న్యూస్‌టుడే:** ‘మన ప్రభుత్వం వస్తుంది.. అధైర్యపడొద్దు.. అంతా మంచే జరుగుతుంది’ అని వైకాపా కార్యకర్తలతో మాజీ సీఎం జగన్ అన్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా కడప జిల్లా పులివెందులకు మంగళవారం చేరుకున్న ఆయన తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు కార్యకర్తలు ఆయనకు పలు సమస్యలను విన్నవించారు. అంతా ధైర్యంగా ఉండాలని.. మన ప్రభుత్వం రాగానే అందరికీ మంచి జరుగుతుందని ఆయన అన్నారు. వైకాపా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రావడంతో కొద్దిసేపు తోపులాట జరిగింది. వారంతా ఒక్కసారిగా కిటికీల మీద పడడంతో అద్దాలు పగిలిపోయాయి. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ వారిని చెదరగొట్టారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేష్‌యాదవ్, ఎమ్మెల్యేలు సుధ, ఆకేపాటి అమర్నాథరెడ్డి, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రాచమల్లు ప్రసాదరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గోవిందురెడ్డి తదితరులున్నారు.

# కొత్తగా 3 జిల్లాలు.. 5 రెవెన్యూ డివిజన్లు

(మొదటి పేజీ తరువాయి)

మండలాల సరిహద్దుల మార్పులు, చేర్పులపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘంతో సచివాలయంలో సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులపై చర్చించి ఆమోదముద్ర వేశారు. 28న మంత్రివర్గంలో ఆమోదించాక నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నెల రోజుల సమయం ఇస్తారు. డిసెంబరు ఆఖరులోగా తుది గెజిట్ విడుదల చేస్తారు.

**కొత్తగా ఏర్పాటయ్యే జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు**

**జిల్లాలు**

మదనపల్లె, మార్కాపురం, పోలవరం

**రెవెన్యూ డివిజన్లు**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి, ప్రకాశం జిల్లా అద్దంకి, మదనపల్లె జిల్లా(కొత్తగా ఏర్పడే) పీలేరు, నంద్యాల జిల్లా బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర

**మండలం**

కర్నూలు జిల్లా పెద్దహరివాణం (ఆదోని మండలాన్ని విభజించి)

### పోలవరం ప్రాంత ప్రజల అభివృద్ధి లక్ష్యంగా

పోలవరం ముంపు ప్రాంతంలోని అధికశాతం ప్రాంతాలు చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్లలో ఉన్నాయి. పునరావాస గ్రామాలు కూడా అక్కడే ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాభివృద్ధి లక్ష్యంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటుచేయాలని చంద్రబాబు నిర్ణయించారు. జిల్లాకు పోలవరం పేరు పెట్టాలని సూచించారు. ఈ రెండు డివిజన్లు తూర్పుగోదావరి జిల్లాలో కలిపి తొలుత ప్రత్యేక అథారిటీ ద్వారా అభివృద్ధి చేయొచ్చనే ప్రతిపాదన వచ్చినా దాన్ని పక్కన పెట్టి ప్రత్యేక జిల్లా ఏర్పాటుకే మొగ్గుచూపారు. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరుకు 200 కి.మీ పైగా ప్రయాణించే బాధలు తప్పాయి.

### పశ్చిమ ప్రకాశం వాసుల కల సాకారం

మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత వాసులు దశాబ్దాలుగా డిమాండు చేస్తున్నారు. అక్కడి ప్రజలు 100-150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలు వెళ్లాల్సి వస్తోంది. వైకాపా హయాంలో జిల్లాల విభజన సందర్భంగా ప్రత్యేక జిల్లా డిమాండు వచ్చినా పట్టించుకోలేదు. నాలుగు నియోజకవర్గాలతో మార్కాపురం జిల్లా ఏర్పాటు కల ఎట్టకేలకు నెరవేరనుంది. మార్కాపురం, యర్రగొండపాలెం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాలతో ఈ జిల్లా ఏర్పాటుకానుంది. అద్దంకి, కందుకూరు నియోజకవర్గాల్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతున్నారు.

### నెరవేరిన మదనపల్లె ప్రజల ఆకాంక్షలు

మదనపల్లె ప్రాంత ప్రజలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాతోనే భౌగోళిక, సాంస్కృతిక సంబంధాలున్నాయి. వైకాపా హయాంలో మదనపల్లె డివిజన్‌ను అన్నమయ్య జిల్లాలో కలిపారు. దీన్ని స్థానిక ప్రజలు వ్యతిరేకించారు. మదనపల్లె జిల్లా ఏర్పాటు ప్రతిపాదన తెరమీదకు వచ్చినా, అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. మదనపల్లె ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా అన్నమయ్య జిల్లా నుంచి విభజించి ప్రత్యేక జిల్లా ఏర్పాటుచేశారు.

### 17 జిల్లాల్లో మార్పులు.. చేర్పులు

జిల్లాల విభజన, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు నేపథ్యంలో 17 జిల్లాల్లో మార్పుచేర్పులు చోటు చేసుకున్నాయి. రాజధాని ప్రాంత పరిధిలోని కృష్ణా, గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో మార్పులు చేయలేదు. జనగణన, నియోజకవర్గ పునర్విభజన తర్వాత వీటిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. గ్రేటర్ అమరావతి ఏర్పాటుపైనా సీఎం ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, ఏలూరు, అనంతపురం జిల్లాల్లోనూ మార్పులు చేయలేదు.

### నెరవేరిన పెనమలూరు నేతల పంతం

తమ నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపొద్దంటూ ఒత్తిడి తెచ్చిన పెనమలూరు నియోజకవర్గ నేతల పంతం నెరవేరింది. గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల్ని ఎన్టీఆర్ జిల్లాలో, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని మంత్రివర్గ ఉపసంఘం తొలుత ప్రతిపాదించింది. స్థానిక నేతల ఒత్తిళ్లకు తలాడిస్తూ.. విజయవాడలో భాగమైన పెనమలూరును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలనే ప్రతిపాదన పక్కన పెట్టారు. వీటన్నింటిపై సోమవారం నాటి సమావేశంలో చర్చ జరిగింది. ప్రస్తుతానికి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మార్పుచేర్పులేవీ చేయొద్దని సీఎం సూచించారు.

### మంత్రి జనార్దన్‌రెడ్డి కృతజ్ఞతలు

బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశాన్ని పక్కన పెట్టాలని సోమవారం నాటి సమావేశంలో నిర్ణయించారు. అయితే మంగళవారం జరిగిన సమీక్షలో ఈ డివిజన్ ఏర్పాటుకు సీఎం ఆమోదముద్ర వేశారు. దీంతో అక్కడే ఉన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని ఆయనే ప్రతిపాదించారు.

## కొత్త జిల్లాల భౌగోళిక స్వరూపం




**పోలవరం జిల్లా**


**జిల్లా కేంద్రం:** రంపచోడవరం
**జనాభా:** 3,49,953
**రెవెన్యూ డివిజన్లు:** రంపచోడవరం, చింతూరు
**మండలాలు:** 12 (రంపచోడవరం, దేవీపట్నం, వై.రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, ఎటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం)

**మార్కాపురం జిల్లా**




**జిల్లా కేంద్రం:** మార్కాపురం
**జనాభా:** 11,42,313
**నియోజకవర్గాలు (4):** యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు
**రెవెన్యూ డివిజన్లు:** మార్కాపురం, కనిగిరి
**మండలాలు:** 21 (యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల, హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పీసీపల్లి, సీఎస్‌పురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు

**మదనపల్లె జిల్లా**




**జిల్లా కేంద్రం:** మదనపల్లె
**జనాభా:** 11.05 లక్షలు
**నియోజకవర్గాలు (4):** మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు
**రెవెన్యూ డివిజన్లు:** మదనపల్లె, పీలేరు
**మండలాలు (19):** మదనపల్లె, నిమ్మనపల్లి, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెదమండ్యం, కురబలకోట, పెదతిప్పసముద్రం, బి.కొత్తకోట, చౌడేపల్లి, పుంగనూరు, సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లె, కలికిరి, వాల్మీకిపురం

### కొత్త రెవెన్యూ డివిజన్లలో మండలాలు ఇలా

**నక్కపల్లి (8):** యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లోని యలమంచిలి, రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాలు

**అద్దంకి (10):** అద్దంకి, దర్శి నియోజకవర్గాల్లోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు, ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి, దొనకొండ, కురిచేడు,

**మడకశిర (5):** మడకశిర, గుడిబండ, రొళ్ల, అమరాపురం, అగలి

**పీలేరు (8):** పుంగనూరు నియోజకవర్గంలోని సదుం, సోమల, పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లి, కలికిరి, వాల్మీకిపురం

**బనగానపల్లి (5):** బనగానపల్లి, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల

### కొత్తగా పెద్ద హరివాణం మండలం

■ కర్నూలు జిల్లా ఆదోని మండలంలో 46 గ్రామాల పరిధిలో 2,69,286 మంది జనాభా ఉన్నారు. దీన్ని రెండు మండలాలుగా విభజించనున్నారు.
■ పెద్దహరివాణం కేంద్రంగా ఏర్పడే మండలంలో 16 గ్రామాలు, 43,105 మంది జనాభా ఉంటారు.
■ ఆదోని కేంద్రంగా ఉండే మండలంలో 30 గ్రామాలు, 2,26,181 మంది జనాభా ఉంటారు.

### అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలు ప్రకాశం జిల్లాలోకి

బాపట్ల జిల్లాలోని అద్దంకి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గాలు తిరిగి ప్రకాశం జిల్లాలోకి..

### మండపేట నియోజకవర్గం తూర్పుగోదావరి జిల్లాలో

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట నియోజకవర్గం తిరిగి తూర్పు గోదావరి జిల్లాలో కలుస్తుంది. ఈ నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్ని రాజమహేంద్రవరం డివిజన్‌లో కలుపుతారు. దీంతో మండపేట నియోజకవర్గం తూర్పుగోదావరి జిల్లాలోకి వస్తుంది.

### తిరుపతి జిల్లాలో వెంకటగిరి

ప్రస్తుతం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఉన్న.. వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల్ని తిరుపతి జిల్లాలోని గూడూరు డివిజన్‌లోకి చేరుస్తారు. దీంతో వెంకటగిరి నియోజకవర్గంలోని మండలాలన్నీ గూడూరు డివిజన్‌లోకి వస్తాయి. తిరుపతి జిల్లా పరిధిలో ఉంటుంది.

### అన్నమయ్య జిల్లాలోకి రాజంపేట

వైఎస్సార్ కడప జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలు రాజంపేట రెవెన్యూ డివిజన్‌లోకి చేరుస్తారు. దీంతో ఈ నియోజకవర్గ పరిధిలోని మండలాలన్నీ అన్నమయ్య జిల్లా పరిధిలోకి వస్తాయి. వైఎస్సార్ కడప జిల్లాలో నియోజకవర్గాలు 8 నుంచి 7 అవుతాయి.

### రెవెన్యూ డివిజన్లలోకి మండలాల మార్పుచేర్పులు

■ శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్‌లోని నందిగాం మండలం టెక్కలి డివిజన్‌లోకి
■ నర్సీపట్నం డివిజన్‌లోని మాడుగుల, చీడికాడ మండలాలను అనకాపల్లి డివిజన్‌లో చేరుస్తారు.
■ కాకినాడ డివిజన్‌లోని సామర్లకోట మండలం పెద్దాపురం డివిజన్‌లో కలుపుతారు.
■ కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని మర్రిపూడి, పొన్నలూరు మండలాలు కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో విలీనం అవుతాయి.
■ పలమనేరు డివిజన్‌లోని బంగారుపాళ్యం మండలాన్ని చిత్తూరు డివిజన్‌లో చేరుస్తారు.
■ పలమనేరు డివిజన్‌లోని చౌడేపల్లి, పుంగనూరు మండలాలు మదనపల్లె డివిజన్‌లో కలుపుతారు.
■ కదిరి డివిజన్‌లోని ఆమడగూరు మండలం పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తారు.
■ పుట్టపర్తి డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ డివిజన్‌లో చేరుస్తారు.

## నేడు కోనసీమలో పవన్‌కల్యాణ్ పర్యటన

**మామిడికుదురు, న్యూస్‌టుడే:** బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలులో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం పర్యటించనున్నారు. మలికిపురం మండలంలోని కేశనపల్లి తీర గ్రామాల్లో శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌లోంచి వస్తున్న సముద్రపు జలాల కారణంగా దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పరిశీలించి, బాధిత రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారు. అనంతరం రాజోలు మండలం శివకోటిలో రాష్ట్ర స్థాయి పల్లెపండగ 2.0 స్టూపాన్ని ఆవిష్కరిస్తారు. అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

**ఇదీ సంగతి!**




## అరాచకశక్తుల చేతుల్లో తుపాకులు!

(మొదటి పేజీ తరువాయి)

వారిలో 25 మంది వరకు హత్యకేసుల్లో నిందితులు.

### అవినాష్‌రెడ్డి అనుచరులకు లైసెన్స్‌లు

జమ్మలమడుగుకు చెందిన వైకాపా నేత మల్కిరెడ్డి హనుమంతరెడ్డి... వివేకా హత్యకేసులో నిందితులైన ఎంపీ అవినాష్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకరరెడ్డిలకు అత్యంత సన్నిహితుడు. 2019లో వైకాపా అధికారంలోకి రాగానే అతనికి తుపాకీ లైసెన్స్ ఇచ్చేశారు. దానితో బెదిరించి భూదందాలు, అరాచకాలు చేశారన్న ఆరోపణలున్నాయి. 2022లో అతనికి వైకాపా ప్రభుత్వం గన్‌మెన్‌ను కూడా ఇచ్చింది. ■ కొండాపురం మండలం లావనూరుకు చెందిన నిరంజన్‌రెడ్డి వైకాపా మండల కన్వీనర్. ఎంపీ అవినాష్‌రెడ్డితో సంబంధాలు ఉండటంతో లైసెన్స్ ఇచ్చేశారు. ■ జమ్మలమడుగు నియోజకవర్గం కోడూరుకు చెందిన ఎల్.రామమునిరెడ్డి... అవినాష్‌రెడ్డికి సన్నిహితుడు. వైకాపా ప్రభుత్వం తుపాకి లైసెన్స్ ఇప్పించింది. దాంతో గ్రామంలో ప్రత్యర్థులపై కాల్పులు జరిపారు. ఫలితంగా లైసెన్స్ రద్దు చేశారు. ■ జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరుకు చెందిన ఆర్.హరినారాయణరెడ్డిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ప్రత్యర్థులపై దాడులు చేశారనే అభియోగాలపై మూడు కేసులున్నాయి. అయినా వైకాపా హయాంలో తుపాకీ లైసెన్స్ ఇచ్చారు.

**వైకాపా నాయకులైతే చాలు..**

వల్లూరు మండలం తిమ్మాపురానికి చెందిన టి.రజనీకాంత్‌రెడ్డి జగన్‌కు ప్రధాన అనుచరుడు. అతనికి తుపాకీ లైసెన్స్ ఇవ్వడానికి అంతకంటే అర్హతేం కావాలనుకున్నారు అప్పటి అధికారులు. అతను ఆ తుపాకీతో బెదిరించి భూదందాలు చేస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. అదే మండలంలోని ఎ.గంగాయపల్లెకి చెందిన వెంకటసుబ్బారెడ్డి వైకాపా కార్యకర్త. ఆర్టీసీ మాజీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డికి అనుచరుడన్న కారణంతో అతనికీ లైసెన్స్ ఇచ్చేశారు.
■ నల్లపరెడ్డిపల్లెకి చెందిన వైకాపా నేత పి.విశ్వనాథరెడ్డికి జగన్ ప్రభుత్వం తుపాకీ లైసెన్స్ ఇచ్చింది. తుపాకీతో బెదిరించి అరాచకాలు చేశారు. అప్పులు చేసి, ఇప్పుడు పరారీలో ఉన్నారు.
■ కొండాపురం మండలంతాళ్లప్రొద్దుటూరుకు చెందిన హరినారాయణరెడ్డి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు. అతనిపై నాలుగు కేసులున్నా లైసెన్స్ ఇచ్చేశారు.
■ చక్రాయపేట మండలం చిలకాంపల్లెకు చెందిన మాజీ ఎంపీపీ రుక్మాంగదరెడ్డికీ వైకాపా నేత కావడమే తుపాకీ లైసెన్స్‌కు అర్హత.
■ లింగాల మండలం కర్ణ పాపాయపల్లెకు చెందిన కర్ణ శివకంచిరెడ్డి లింగాల మండలంలో మైనింగ్ చేస్తున్నారు. వైకాపా అండతో లైసెన్స్ పొందారు.

### పంచాయతీ కార్యదర్శికీ తుపాకీ లైసెన్స్

■ జమ్మలమడుగుకు చెందిన గురుమోహన్ గతంలో పెద్దముడియం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. అతనికీ తుపాకీ లైసెన్స్ ఉంది.
■ జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం గొల్లపల్లెకు చెందిన వెంకట శివారెడ్డికి సైతం వైకాపా కార్యకర్త కావడమే అర్హతగా లైసెన్స్ ఇచ్చారు. ఈయన ఎమ్మెల్యే శివారెడ్డి హత్య కేసులో నిందితుడు.
■ ప్రొద్దుటూరు ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన ఎస్.శేఖర్.. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు. ప్రస్తుతం ప్రొద్దుటూరు ఎంపీపీ. ఇటీవల ఓ స్థలం విషయంలో తెదేపా నాయకులతో వివాదం తలెత్తడంతో తుపాకీతో బెదిరించారు.
■ రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి వైకాపా హయాంలో తుపాకీ లైసెన్స్ తీసుకున్నారు.

**వివేకా హత్యకేసులో అనుమానితుడు... చిన్న గొడవకే ప్రాణాలు తీశాడు**

పులివెందుల ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా టిఫిన్ సెంటర్ నడిపే భరత్‌యాదవ్ అత్యంత వివాదాస్పదుడు. వివేకా హత్యకేసులో అనుమానితుడు. అలాంటి వ్యక్తికీ... ప్రాణహాని ఉందని చెప్పడంతో తుపాకీ లైసెన్స్ ఇచ్చేశారు. ఏవో ఆర్థిక లావాదేవీల్లో పులివెందులకు చెందిన దిలీప్, మహబూబ్ బాషాలతో గొడవ జరగడంతో, ఇంటికెళ్లి తుపాకీ తెచ్చి మూడు రౌండ్ల కాల్పులు జరిపాడు. దిలీప్ ప్రాణాలు కోల్పోగా, బాషా తీవ్రంగా గాయపడ్డాడు.
■ వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లెలో వైకాపాకి చెందిన మహేశ్వర్‌రెడ్డి, నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి వర్గాల మధ్య ఘర్షణ తలెత్తడంతో... 2021 జనవరిలో కర్రలు, కత్తులతో పరస్పరం దాడులు చేసుకున్నారు. సుధాకర్‌రెడ్డి లైసెన్స్‌డ్ తుపాకీతో కాల్పులు జరపడంతో పలువురు గాయపడ్డారు. వైకాపా నేతల అండతోనే అతనికి లైసెన్స్ లభించింది.

### తుపాకీ లైసెన్స్ తీసుకుని.. ఎర్రచందనం స్మగ్లింగ్!

సీకేదిన్నె మండలం ఇందిరానగర్‌కి చెందిన జి.వీరనాగిరెడ్డి వైకాపా నాయకులతో తిరుగుతూ, వారి అండతో తుపాకీ లైసెన్స్ సంపాదించి ఎర్రచందనం స్మగ్లర్ అవతారమెత్తాడు. అదే ప్రాంతంలో ఉండే ఎస్.మురళీకృష్ణకూ తుపాకీ లైసెన్స్ ఉంది. అతనిపైనా ఎర్రచందనం స్మగ్లింగ్ ఆరోపణలున్నాయి.

### లోతైన విచారణ జరపాలి

అనర్హులు, అరాచక శక్తులకు తుపాకీ లైసెన్స్‌లు ఇవ్వడమే తప్పు. వారి చేతుల్లో తుపాకులు ఉన్నాయని తెలిసీ ప్రభుత్వం ఉపేక్షించడం మరింత తప్పు. కూటమి ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఎవరెవరికి తుపాకీ లైసెన్స్‌లు ఉన్నాయో లోతుగా విచారించాలి. అరాచక శక్తులు, నేరచరిత్ర ఉన్నవారు, అనర్హులకు వెంటనే లైసెన్స్‌లు రద్దుచేసి, తుపాకులు స్వాధీనం చేసుకోవాలి.

## గ్రహం అనుగ్రహం

26-11-2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం

షష్ఠి: రా. 7-14 తదుపరి సప్తమి; శ్రవణ: రా. 9-56 తదుపరి ధనిష్ఠ
వర్జ్యం: రా. 2-00 నుంచి 3-37 వరకు; **అమృత ఘడియలు:** ఉ. 11-08 నుంచి 12-48 వరకు; **దుర్ముహూర్తం:** ఉ. 11-24 నుంచి 12-09 వరకు;
**రాహుకాలం:** మ. 12-00 నుంచి 1-30 వరకు;
**సూర్యోదయం:** ఉ.6.14; **సూర్యాస్తమయం:** సా.5.20
సుబ్రహ్మణ్య షష్ఠి

## చలి-పులి

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| విజయనగరం | 19.0 | 30.0 |
| రాజమహేంద్రవరం | 19.0 | 35.0 |
| కడప | 20.0 | 29.0 |
| శ్రీకాకుళం | 20.0 | 30.0 |
| కర్నూలు | 21.2 | 32.4 |
| అనంతపురం | 21.3 | 33.1 |
| విశాఖపట్నం | 22.0 | 30.2 |
| నరసాపురం | 22.4 | 32.6 |
| విజయవాడ | 22.6 | 30.5 |
| గుంటూరు | 24.0 | 31.0 |
| ఒంగోలు | 24.0 | 31.0 |
| తిరుపతి | 24.6 | 30.5 |
| నెల్లూరు | 25.5 | 32.0 |
| తాడేపల్లిగూడెం | 27.0 | 30.0 |

ఈనాడు

# విద్వేష వ్యాఖ్యలపై కఠిన చర్యలేవీ?

పౌరహక్కులు అనేవి వ్యక్తి స్వాతంత్ర్యానికి మూలస్తంభాల వంటివి. జనజీవితాల్లో ప్రభుత్వాలు అనుచిత జోక్యం చేసుకోకుండా నిలువరిస్తాయవి. అలాంటి హక్కుల్లో ముఖ్యమైనదైన భావప్రకటనా స్వేచ్ఛ- స్వతంత్రంగా మనగలిగే సామర్థ్యాన్ని పౌరుల్లో పెంచుతూ, పాలనలో ప్రజాభాగస్వామ్యాన్ని ఇనుమడింపజేస్తుంది. ఈ విధంగా ప్రజాస్వామ్య వ్యవస్థకు వాక్ స్వాతంత్ర్యమెంతగా ప్రాణప్రదమైనదో వివరించిన లా కమిషన్ 267వ నివేదిక- ఆ హక్కును దుర్వినియోగపరుస్తున్న స్వార్థశక్తుల విద్వేష ప్రసంగాలు, వాటి విపరిణామాలనూ లోతుగా చర్చించింది. అలాంటి విషవ్యాఖ్యల కట్టడికి చట్టపరంగా గట్టి చర్యలు అవసరమని చెప్పింది. సీజేఐగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ సూర్యకాంత్ సైతం భావప్రకటన స్వేచ్ఛ అంటే, ఇతరుల గౌరవ ప్రతిష్ఠలకు హాని చేయడం కాదని హితవు పలికారు. అలాంటి పెడపోకడల నియంత్రణకు తగిన ఏర్పాట్లు ఉండాలని అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగం స్వేచ్ఛాయుత సమాజాన్ని మాత్రమే స్వప్నించలేదు. గౌరవనీయమైన, సామరస్యపూర్వకమైన సంఘ నిర్మాణాన్ని అది ఆకాంక్షిస్తోంది. ఆ సంవిధాన స్ఫూర్తికి సమాధికడుతూ వ్యక్తిత్వ హననాలకు ఒడిగడుతున్న వదరుబోతుల వాచాలత్వం కఠినంగా దండనార్హమైనది!

విమర్శలు, భిన్నాభిప్రాయాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. కానీ, వాటి ముసుగులో మురుగునీళ్ల మాదిరిగా వరదలెత్తుతున్న వ్యక్తిగత దూషణలు దేశీయ రాజకీయాలపై ఏవగింపు పుట్టిస్తున్నాయి. ప్రత్యర్థులపై ఇష్టమొచ్చినట్లు నోరుపారేసుకుంటున్న కొందరు నాయకులు- గిట్టనివారిపై తమ అనుచరులతో సామాజిక మాధ్యమాల్లో మరింతగా హేయదాడులు చేయిస్తున్నారు. వైరిపక్షంలోని వ్యక్తుల కుటుంబాలపై, ముఖ్యంగా మహిళలపై రోత కూతలు కూయిస్తూ ప్రజాజీవితంలో విలువలకు పాతరేస్తున్నారు. నోటిపై అదుపు లేని ఇలాంటి ప్రబుద్ధ నాయకులు అన్ని రాష్ట్రాల్లో ఉన్నప్పటికీ ఏపీలో వైకాపా తాలునేతాగణాల బూతులభాష మరీ ఘోరమైనది! 'మీ బట్టలూడదీస్తాం' అంటూ పరమ అభ్యంతరకర రీతిలో పోలీసులపై జగన్ గుడ్లురిమితే- ఆయన పార్టీ మూకలేమో తమకు నచ్చని వ్యక్తులు, వ్యవస్థలు, పత్రికాసంస్థలపై ఇంకా జుగుప్సాకరమైన తిట్ల దండకాలకు దిగుతున్నాయి. జనవర్గాల నడుమ చిచ్చురేపే కుట్రలకు తెగబడుతున్నాయి. ప్రజాస్వామ్యానికి చీడపురుగులుగా దాపురించిన వాళ్లను ప్రభుత్వాలు ఉపేక్షించడమంటే- కోరి పాములకు పాలుపోసినట్లే అవుతుంది!

ప్రజల నడుమ వైమనస్య భావనలను ఎగదోసి, ఆ విద్వేష మంటల్లో ఓట్ల చలికాచుకోవడం నేరమని శాసనాలు నిర్దేశిస్తున్నాయి. కానీ- కులమతాలూ ప్రాంతాలూ భాషల పేరిట జనాన్ని రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలనుకునే నాయకుల ఉపన్యాసాలు విపరీతమైన వాక్ కాలుష్యాన్ని సృష్టిస్తూనే ఉన్నాయి. 2014తో పోలిస్తే 2020 నాటికి దేశవ్యాప్తంగా విద్వేష వ్యాఖ్యల కేసులు 500శాతం పెరిగినట్లు ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇండియా హేట్ ల్యాబ్ నివేదిక ప్రకారం- 2024లో అలాంటి ఉన్మత్త ప్రసంగాలు 74శాతం అధికమై 1165కి చేరాయి. నిరుటి జూన్ నుంచి ఈ ఏడాది జూన్ మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 947 విద్వేష నేరాలు జరిగాయని మరో అధ్యయనం పేర్కొంది. అయితే, ఈ లెక్కలన్నీ అసమగ్రమే! జనసమూహాల మధ్య శత్రుత్వాన్ని పెంచిపోషిస్తున్న, వ్యక్తులూ సంస్థల పరువుమర్యాదలకు భంగం కలిగిస్తున్న మురికి మాటలరాయుళ్ల అందరిపైనా కేసులు నమోదు కావట్లేదు. విద్వేష ప్రసంగీకులపై సుమోటోగా చర్యలు తీసుకోవాలన్న సుప్రీంకోర్టు నిర్దేశాలను ప్రభుత్వాలు శిరసావహిస్తేనే- జాతీయ సమగ్రతకు, వ్యక్తి గౌరవానికి చేటుచేసే దుర్మార్గాలకు అడ్డుకట్ట పడుతుంది!



ఒక వ్యక్తి ప్రతిభాసామర్థ్యాలను నమ్మి ఒక ప్రాజెక్టును అప్పగించేటప్పుడు దాన్నుంచి ఏం ఆశిస్తున్నారో స్పష్టంగా చెప్పాలి. ఇక ఆ తరవాత వాళ్ల పనిలో జోక్యం చేసుకోకుండా స్వతంత్రంగా పనిచేయనివ్వాలి. అప్పుడే ప్రాజెక్టూ విజయవంతమవుతుంది, రెండో తరం నాయకులు సిద్ధమవుతారు.

– డాక్టర్ వర్ఘీస్ కురియన్

## ఆలంబన

ఓ కవి కావ్యసృజనకైనా, చిత్రకారుడి చిత్రానికైనా, శాస్త్రవేత్త ఆవిష్కరణకైనా, శిల్పి చెక్కే శిల్పానికైనా- ఆలోచన, కల్పన, ఊహలే ఆలంబనం. అవే వారి అద్భుత సృష్టిని జగత్తు ముందుంచి, మనసులను మంత్ర ముగ్ధం చేస్తాయి. మానవాళికి ఉపయుక్తమవుతాయి. జిజ్ఞాస ఆలంబనతోనే జ్ఞానాన్ని పొందుతారు ఎవరైనా. అలా అక్షరసృజన శీలికైనా, జీవితాన్వేషికైనా, యోగికైనా - ఏదో ఒక ఆలంబన అవసరం.

మనసు, భావం, చింతనల మీద లేదా జీవితం ఆధారపడిన కేంద్రబిందువు ఆలంబన. తాత్వికంగా, ఆధ్యాత్మికంగా కూడా ఇది అత్యంత లోతైన అర్థాన్ని కలిగి ఉంది. మనిషి జీవితం ఓ నిరంతర పయనం. ఆ ప్రయాణంలో మనసుకు ఒక ఆశ్రయం కావాలి- అది ప్రేమ కావచ్చు, భగవంతుడిపై భక్తి కావచ్చు, ఒక సిద్ధాంతంలో విశ్వాసం కావచ్చు. అదే మనకు ఆలంబన. ఈ ఆధారమంటూ లేకపోతే జీవితం అర్థరహితంగా మారుతుంది. అందుకే మనసు ఏదో ఒక దాన్ని ఆలంబనగా చేసుకున్నప్పుడు అది స్థిరత్వాన్ని, ప్రశాంతతను, ఒక గొప్ప స్థితిని పొందుతుందంటారు తత్వవేత్తలు.



అంతర్యామి

భారతీయ తాత్విక దృష్టిలో ఆలంబనకు ఎంతో ప్రాధాన్యం, విస్తృతి, ప్రసిద్ధి, లోతులున్నాయి. ధ్యానంలో మన మనసు నిలిచే బిందువునే ఆలంబనంటారు. ఒక యోగి, లేదా భక్తుడు ఎవరైనా భగవంతుడి రూపాన్ని, శబ్దాన్ని లేదా నిశ్శబ్దాన్ని ఆలంబనగా చేసుకుని సాధన చేస్తారు. అలా తమలోని చైతన్యాన్ని ఆ కేంద్రంలో నిలుపుతారు. ధ్యానం అనేది ఆ ఆలంబనతో మమేకమయ్యే ప్రక్రియ. చివరికి ఆ ఆలంబనలో లయమైపోవడమే సమాధి. అదే యోగులు తపించే స్థితి.

భగవంతుడి రూపం, నామం, లీల- మూడూ ఆధ్యాత్మిక చింతనకు ఆధారాలు. భక్తుడు తన ఆరాధనలో ఈ మూడు ప్రధానమార్గాలను ఆశ్రయిస్తాడు. అవి అతడికి ఆశ్రయం, ఆధారం, సహాయమవుతాయి. ధ్యానిస్తూ తన మనసును ఆ త్రయంలో నిక్షిప్తం చేస్తాడు. అలా చేయడం ద్వారా అతని మనసు చంచలత్వాన్ని వీడుతుంది. అప్పుడది త్రిశూల నిశ్చలత్వాన్ని, స్థిరత్వాన్ని, నిశితత్వాన్ని సంతరించుకుని ఓ దివ్యశక్తి సమన్వితంగా మారుతుంది. ఈ ఆలంబన లేనట్లయితే, మనసు ఉప్పొంగిన దిశారహిత భావ సముద్రమవుతుంది.

భగవంతుణ్ని చేరేందుకు భక్తి ఓ ఆలంబన. ఆయన సర్వవ్యాపకత్వాన్ని, చైతన్య రూపాన్ని, చూడగలిగే మార్గంలోకి భక్తిని పయనింప చేయగలగాలి. ఈ భావనను అణువణువునా నింపుకోగల స్థాయికి చేరుకోవాలి. మనసు ఆ అద్భుతస్థితికి చేరుకున్న ఉత్తర క్షణం, భక్తుడికి ఇక ఏ ప్రాప్తి, ఆలంబనల అవసరముండదు. అది జీవాత్మ పరమాత్మల అద్భుత సంయోజనం. అది పరమానంద స్థితిని దాటి చేరుకునే బ్రహ్మానంద స్థితి. ఆనంద యోగం. అప్పుడే అహం బ్రహ్మాస్మి అన్న భావన మన అనుభవంలోకి వస్తుంది. ఆలంబన అనేది కేవలం ఓ చేరుగడ, ఓ ఆసరానే కాదు. అది జీవన సారాంశం, చైతన్యపు నిలయం. ఆలంబన పరమార్థసారమిదే.

– బొడ్డపాటి చంద్రశేఖర్

# మాటలు ఘనం... ఆచరణలో విఫలం!

**ఇటీవల బ్రెజిల్‌లోని బెలెంలో భారీ అంచనాల నడుమ కాప్-30 సదస్సు జరిగింది. వాతావరణ మార్పుల నిరోధానికి ఉద్దేశించిన యూఎన్ఎఫ్‌సీసీసీ ఛత్రం కింద సభ్యదేశాలు జరుపుకొన్న 30వ మహా సదస్సు ఇది. మూలవాసులు, ఉష్ణమండల అరణ్యాల రక్షణపై ఆతిథ్య దేశం బ్రెజిల్ చూపిన నిబద్ధత కారణంగా 'ఫారెస్ట్ కాప్'గా ఈ సదస్సుకు పేరొచ్చింది. వాతావరణ మార్పుల నిరోధంపై ప్రపంచ దేశాలు చేసిన భీషణ ప్రతిజ్ఞలు బెలెంలో కార్యరూపం ధరిస్తాయనే ఆశలు చివరికి తేలిపోయాయి.**

వాతావరణ మార్పుల నిరోధానికి ప్రతి దేశం ప్రణాళికలు ప్రకటిస్తుందనీ, పాత ప్రణాళికను అమలు చేస్తుందనీ, సంపన్న దేశాలు ఇచ్చే వందల కోట్ల డాలర్ల నిధులతో వర్ధమాన దేశాలు హరిత ఇంధనాలకు మారతాయనీ కాప్-30 మొదలవడానికి ముందు ఆశలూ అంచనాలు వినవచ్చాయి. ప్రకృతి సంరక్షణ, మూలవాసులకు భూమి హక్కులు, వాతావరణ మార్పుల నుంచి పంటలను రక్షించుకుని ఆహార భద్రత సాధనకు పకడ్బందీ కార్యాచరణ పథకాలు బెలెంలో రూపుదిద్దుకుంటాయనే ఆశాభావమూ వ్యక్తమైంది. కానీ, ఆశలూ ఆశయాలను కార్యరూపంలోకి తీసుకురావడంలో, మాటలను చేతల్లో చూపడంలో కాప్-30 సదస్సు ముందడుగు వేయలేకపోయింది.

### 'చమురు' దేశాల ప్రతిఘటన

వాతావరణ మార్పుల నిరోధానికి పౌర సమాజం, ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు కలిసికట్టుగా కృషి చేయాలి. టుపీ తెగవారి భాషలో ఇలాంటి సమైక్య కార్యాచరణను 'మోటిరో' అంటారు. ఈ




నేపథ్యంలోనే కాప్-30 సదస్సు అంతర్జాతీయ మోటిరోకు పిలుపిచ్చింది. వాతావరణ మార్పులను నిరోధించడమనేది ప్రసంగాలు, సంప్రదింపుల దశ నుంచి అంతర్జాతీయ, సామాజిక కార్యాచరణ దశకు మారాలన్నది ఈ నినాద సారాంశం. తదనుగుణంగా అడవులు, ఆదివాసుల ప్రయోజనాల రక్షణకు 2500 కోట్ల డాలర్ల ఉష్ణమండల అరణ్య రక్షణ నిధిని బ్రెజిల్ ప్రతిపాదించింది. దీనికి ఇంతవరకు 660 కోట్ల డాలర్ల విరాళాలే వచ్చినా, శుభారంభంగానే పరిగణించాలి. అడవుల రక్షణలో పురోగతి సాధించే దేశాలకు ఈ మహానిధి నుంచి నిధులు ఇస్తారు. బ్రెజిల్ తన భూభాగంలో వెయ్యి చదరపు మైళ్ల విస్తీర్ణంలోని అటవీ ప్రాంతాలను కొత్తగా పది ఆదివాసీ గ్రూపులకు కేటాయించింది. వాతావరణ, ప్రకృతి సంరక్షణ కోసం ఉద్దేశించిన నిధుల్లో అయిదో వంతును ఆదివాసీ అటవీ సంరక్షకులకు కేటాయించాలని ప్రతిపాదించింది. కాప్ చరిత్రలో మొదటిసారిగా వాతావరణ మార్పుల నిరోధ కృషిలో మానవ, కార్మిక, ఆదివాసీల హక్కులను గుర్తించిన ప్రత్యేకతను బెలెం కార్యాచరణ పథకం సొంతం చేసుకుంది. లింగ సమానత్వం, మహిళా సాధికారత, యువజన భాగస్వామ్యంతో అందరూ కలిసికట్టుగా వాతావరణ మార్పులను ఎదుర్కోవాలని ఈ పథకం పిలుపిస్తోంది. వాతావరణ మార్పులకు మూలకారణమైన బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాలకు స్వస్తిచెప్పి పునరుత్పాదక ఇంధనాలకు మారడానికి వాస్తవిక రోడ్ మ్యాప్‌ను అందించడంలో మాత్రం బెలెం సభ విఫలమైంది. ఈ వైఫల్యం వెనక చమురు పరిశ్రమ పైరవీలు ఉన్నాయనేది నిర్వివాదాంశం. ఒకవైపు సౌర, పవన, హరిత హైడ్రోజన్ విద్యుదుత్పాదన వ్యయం తగ్గుతున్నా... ప్రపంచం ఇప్పటికీ శిలాజ ఇంధనాలపైనే ఆధారపడే పరిస్థితిని మార్చడానికి పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక తప్పనిసరి. దీన్ని కాప్-30 తుది తీర్మానంలోనే పొందుపరచాల్సింది. కానీ, చమురు ఉత్పత్తి చేసే సౌదీ అరేబియా, చమురును అధికంగా వినియోగించే చైనా వంటి దేశాల ప్రతిఘటనతో సాధ్యపడలేదు.

కాప్ సదస్సులలో చర్చోపచర్చలు జరిపి, తీర్మానాలు చేస్తే సరిపోదు. వాతావరణ మార్పుల నిరోధానికి నడుం బిగించాలి. భవిష్యత్తులో జరిగే కాప్ సదస్సులైనా ఈ విషయంలో ముందడుగు వేస్తాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితిని అధిగమించడానికి ఐరాస పరిధికి వెలుపల సొంతంగా రోడ్ మ్యాప్‌ను రూపొందించి అమలు చేస్తామని బ్రెజిల్ ప్రకటించింది. ఇది తదుపరి కాప్ సభలు, జీ20 సమావేశాల్లో చర్చించడానికి ముసాయిదా పత్రంగా ఉపయోగపడుతుంది. ప్రపంచ దేశాలు తమవంతు ఉద్గారాలను తగ్గించకపోతే దానికి మూల్యం చెల్లించుకునేలా చూడాలని అంతర్జాతీయ న్యాయస్థానం కూడా ఇటీవల అభిప్రాయపడింది. బెలెం సభలో ఈ అంశాన్ని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఐరాస వేదికగా వాతావరణ మార్పుల నిరోధానికి పకడ్బందీగా కృషి జరుగుతుందనే ఆశలు సన్నగిల్లుతున్నాయి.

### కనపడని పురోగతి

ప్రధాన దేశాలు చమురు ఉత్పత్తి, వినియోగాలను వదిలించుకోలేకపోవడం వల్లే సమితి ఆధ్వర్యంలో జరిగే చర్చలు, సభలు పురోగతి సాధించలేకపోతున్నాయి. దీంతో పౌర సమాజమే కార్యాచరణకు ఉపక్రమిస్తోంది. నవంబరు 15న ప్రపంచంలోని 60 నగరాల్లో పౌర సంఘాలు వాతావరణ మార్పుల నిరోధానికి అంతర్జాతీయ కార్యాచరణ దినాన్ని పాటించాయి. బెలెంలో ఆదివాసీ గ్రూపులు, పౌర సంఘాలు శిలాజ ఇంధనాలకు వ్యతిరేకంగా ప్రదర్శన జరిపాయి. గతంలో కాప్ సదస్సుల సందర్భంగా పౌర సంఘాల ప్రదర్శనలకు అనుమతి ఇచ్చేవారు కాదు. బ్రెజిల్ ప్రభుత్వం ఆ స్వేచ్ఛను కల్పించింది. ఏదిఏమైనా ప్రభుత్వాలు గట్టిగా పూనుకోనిదే నిజమైన పురోగతి సాధ్యం కాదు. భూగోళ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ దగ్గర పట్టి నిలపాలని పారిస్ వాతావరణ సభ తీర్మానించిన సంగతి తెలిసిందే. ఈ లక్ష్య సాధనకు తమవంతుగా ఎంతమేరకు ఉద్గారాలు తగ్గించేదీ ప్రపంచ దేశాలు ప్రకటించాలి. వీటిని జాతీయ స్వచ్ఛంద కోటాలుగా లేదా ఎన్‌డీసీలుగా వ్యవహరిస్తున్నారు. బెలెం సదస్సులో 120 దేశాలు గతంలో ప్రకటించిన ఎన్‌డీసీలకన్నా ఎక్కువ ఉద్గారాలు తగ్గిస్తామని ప్రకటించాయి. సమష్టి కార్యాచరణలో మాత్రం బెలెం సదస్సు పురోగతి చూపలేకపోయింది. వర్ధమాన దేశాలకు ఉద్గారాల నిరోధం, పునరుత్పాదక ఇంధన వినియోగంలో హెచ్చు నిధులు ఇవ్వాలనీ, అవి ప్రధానంగా సంపన్న దేశాల నుంచే అందాలని భారత్ డిమాండ్ చేసింది. వాతావరణ మార్పుల నిరోధానికి ప్రభుత్వాలు, వాణిజ్య సంస్థలు, ప్రజా సంఘాలు ఉమ్మడిగా కృషి చేస్తేనే ఆశించిన లక్ష్యాలను అందుకోగలుగుతామని బెలెంలో మళ్లీ నిరూపితమైంది.



హరికృష్ణ నిభానుపూడి
సీనియర్ యూఎన్ క్లైమేట్ ఎమర్జెన్సీ అడ్వైజర్

ఇంగ్లాండ్‌కి చెందిన భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ మనకి తెలుసు. అచ్చం అలాగే చక్రాల కుర్చీలో ఉండి శాస్త్రవేత్తగా రాణిస్తున్నారు దక్షిణ కొరియాకు చెందిన లీ సాంగ్ మూక్. ఎంఐటీలో పీహెచ్‌డీ చేసి, ఇంగ్లాండ్‌లో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ చేసిన మూక్ సియోల్ నేషనల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన మెరైన్ జియాలజిస్టు, కంప్యుటేషనల్ సైంటిస్టు కూడా. సముద్రం అడుగున టెక్టానిక్ ప్లేట్లు, భూకంపాలు, అగ్నిపర్వతాలు తదితర అంశాల మీద ఆయన పరిశోధనలు చేశారు.

## కొరియన్ స్టీఫెన్ హాకింగ్!



ఇష్టమైన రంగంలో పరిశోధనలతో జీవితం హాయిగా సాగిపోతున్నవేళ, నలభై నాలుగో ఏట కాలిఫోర్నియాలో మూక్ పెద్ద కారు ప్రమాదానికి గురయ్యారు. రెండు రోజులు కోమాలో ఉండి బయటపడ్డాక చూస్తే మెడనుంచి కిందికి శరీరమంతా చచ్చుబడిపోయింది. ప్రమాదానికి ముందు... తరవాత తన జీవితమూ, జీవితం పట్ల తన దృక్పథమూ ఎలా మారిపోయాయో ఆయనే ఇలా చెబుతారు...

'అసలు చనిపోతాననే అనుకున్నాను. కానీ అదృష్టవశాత్తూ బతికి బయటపడ్డాను. ఇంత తీవ్రమైన వైకల్యంతో బతకడం అవసరమా అనుకోలేదు, మరణం అంచుల దాకా వెళ్లి మళ్లీ బతికానంటే ఈ జీవితానికి ఏదో ప్రయోజనం ఉండాలనిపించింది. సాధారణంగా ఎవరైనా ఇలాంటి పరిస్థితి ఎదుర్కొన్నప్పుడు కుంగిపోతారు. దేవుడి మీద భారం వేస్తారు. నేను శాస్త్రవేత్తను. పరిస్థితిని అర్థం చేసుకుని అందుకు తగినట్లుగా నన్ను నేను మలచుకున్నాను. త్వరగా కోలుకునేందుకు ప్రయత్నించాను. ప్రమాదం అమెరికాలో కాకుండా దక్షిణ కొరియాలో జరిగి ఉంటే ఇంత త్వరగా కోలుకునేవాణ్నే కాదు. నాలాంటి వారికి సాయపడే టెక్నాలజీ అమెరికాలో అందుబాటులో ఉన్నంత ఇక్కడ లేదు. దాని సాయంతో సాధ్యమైనంత త్వరగా పని విషయంలో సాధారణ స్థితికి రాగలిగాను. కోలుకుని తిరిగి పనిచేయాలన్న నా ఆలోచనని మావాళ్లు అసంభవం అన్నట్లే చూశారు. నా ఆలోచన వేరు. నాలాంటి వాళ్లు ఎందరో ఉన్నారు. కానీ అందుబాటులో ఉన్న వసతులేవీ తెలియక వారు జీవితాలను నిస్సారంగా గడుపుతున్నారు. వారందరికీ ప్రేరణనివ్వాలి. నైతికంగానూ సాంకేతికంగానూ అండగా నిలవాలన్నది నా ఆశయం' అనే మూక్ ఆ విషయంలో విజయం సాధించారు.

ప్రొఫెసర్‌గా తన ఉద్యోగాన్ని కొనసాగిస్తూనే మూక్ పరిశోధనలూ చేస్తున్నారు. పలు ప్రతిష్ఠాత్మక అవార్డులు పొందారు. కొరియాలో దివ్యాంగులు లాయర్లుగానో, సంఘసేవకులుగానో మారుతున్నారు తప్ప సైన్సు, ఇంజినీరింగ్ రంగాలవైపు పెద్దగా రారు. అందుకే ఆయన 'రియలైజింగ్ అవర్ పొటెన్షియల్ ఇన్ సైన్స్- రోపోస్' అనే ప్రాజెక్టు ప్రారంభించారు. దివ్యాంగులకు శిక్షణ ఇచ్చి వాళ్లను సైంటిస్టులుగా, ఇంజినీర్లుగా తీర్చిదిద్దడం దీని ఉద్దేశం. వాళ్ల కుటుంబాలకు భారం కాకుండా స్వతంత్రంగా జీవించేందుకు కావాల్సిన సాంకేతిక పరికరాలనూ అందిస్తారు. వాటి సాయంతో చదువుకుని లాయర్ అయిన ఒకరి కథని మూక్ రాయగా ఒక పేపరు ప్రచురించింది. అది చూసిన ప్రభుత్వ అధికారి ఒకరు దివ్యాంగుల కోసం ఒక జాతీయ కార్యక్రమాన్ని రూపొందించాల్సిందిగా మూక్‌ను కోరడం విశేషం. అలా తన ఆశయసాధనలో కృతకృత్యులయ్యారు ఈ కొరియన్ స్టీఫెన్ హాకింగ్.

– బి.సృజని



## డిజిటల్ వినోదం

**అందరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు ఉండటం, తక్కువ ధరకు డేటా లభిస్తుండటం వల్ల వినోదం ఇప్పుడు డిజిటల్ తెరలకు మళ్లింది. 2019లో ఇండియాలో 19.7 కోట్ల ఇళ్లలో టీవీలుంటే, 2025 నాటికి అలాంటి గృహాల సంఖ్య 24.8 కోట్లకు చేరింది. అదే కాలంలో ఓటీటీ వినియోగదారులు, ఇన్‌స్టాగ్రామ్ యూజర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఇన్‌స్టా యూజర్ల పరంగా భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుస్తోంది. ఆయా సంవత్సరాల్లో ఓటీటీ, ఇన్‌స్టా యూజర్లు (కోట్లలో)...**




(ఆధారం: ఫైర్‌సైడ్ వెంచర్స్ నివేదిక)

# సత్వర న్యాయానికి 'రాజీ' మార్గం

**నేడు రాజ్యాంగ దినోత్సవం. అందరికీ సమన్యాయం సత్వరం జరగాలన్నది సంవిధాన లక్ష్యం. సంవత్సరాల తరబడి తెమలని కోట్లాది కోర్టు కేసులతో రాజ్యాంగ లక్ష్యం నీరుగారిపోతోంది. ఈ దుస్థితిని చక్కదిద్దగల లోక్‌అదాలత్‌లను బలోపేతం చేయాల్సి ఉంది.**

న్యాయస్థానాల్లో కోట్ల సంఖ్యలో కేసులు పేరుకుపోతున్నాయి. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార పద్ధతులే వాటిని ఎక్కువగా కరిగించగలవు. ఈ క్రమంలో లక్షలాది కేసులను కోర్టులదాకా వెళ్లకుండా ఆపాలనే లక్ష్యంతో లీగల్ సర్వీసెస్ చట్టం-1987 కింద లోక్‌అదాలత్‌లు ఏర్పాటయ్యాయి. కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయి న్యాయసేవా ప్రాధికార సంస్థల నేతృత్వంలో నడుస్తాయి. ఇవి న్యాయస్థానాలు కాకపోయినా, కోర్టుల ప్రాంగణాల్లోనే పనిచేస్తాయి. ప్రభుత్వం నియమించిన వకీళ్లు, స్వచ్ఛంద సంస్థల్లోని నిపుణులు, జ్యుడీషియల్ అధికారులు సభ్యులుగా ఉంటారు. కక్షిదారులు పరస్పర రాజీతో రాసుకునే ఒప్పందాలనే అవార్డులుగా ప్రకటిస్తారు. అవి సివిల్ కోర్టులు ఇచ్చే డిక్రీలకు సమానమని చట్టం చెబుతోంది. ప్రత్యామ్నాయ న్యాయవితరణ వ్యవస్థగా లోక్‌అదాలత్‌లు పేరొందినా, అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. న్యాయవితరణ సవ్యంగా జరగడం లేదన్న అపవాదు కూడా ఉంది. ఆస్తి వివాదాలు, కుటుంబ తగాదాలూ, అప్పులు, పింఛన్లు, ప్రభుత్వ నష్టపరిహారాలపై వివాదాలను లోక్‌అదాలత్‌లలో పరిష్కరించుకునే అవకాశం ఉంది. కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నవారూ, కేసు దాఖలు చేయనివారు సైతం వీటిని ఆశ్రయించవచ్చు.

### సరైన అవగాహన లేక...

లోక్‌అదాలత్‌లు ఏటా పెద్ద సంఖ్యలో కేసుల్ని పరిష్కరిస్తుండటం వల్ల ఎంతోమందికి సత్వర న్యాయం పొందే అవకాశం దక్కుతోంది. నిరుడు లోక్‌అదాలత్‌ల ద్వారా కోట్ల సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయి. కోర్టు ఆవరణలో వారానికి రెండు మూడు రోజులు పనిచేసే జిల్లాస్థాయి లోక్ అదాలత్‌లు ఒక రకంకాగా; కరెంటు, నీళ్లు, బీమా, రోడ్లు, మున్సిపల్ వంటి ప్రజా సేవలకోసం ఏర్పాటయ్యే ప్రత్యేక శాశ్వత లోక్‌అదాలత్‌లు మరోరకం. జాతీయ న్యాయసేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాతీయ లోక్‌అదాలత్ శిబిరాలు ఇంకోరకం. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వ్యవస్థగా పేరొందినా లోక్‌అదాలత్‌ల పనితీరు విమర్శలకు, సవాళ్లకు దూరంగా ఉండలేకపోతోంది. వీటిలో సభ్యులకు న్యాయవితరణలో,



మధ్యవర్తిత్వం ద్వారా రాజీ కుదర్చడంలో సరైన శిక్షణ లేదన్నది బలమైన విమర్శ. లోక్‌అదాలత్ బెంచిమీద ఉండాల్సిన ముగ్గురు సభ్యుల్లో ఒకరు అనుభవం ఉన్న న్యాయవాది, మరొకరు పేరున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు, మరొకరు పనిచేస్తున్న లేదా పదవీ విరమణ పొందిన న్యాయాధికారి అయ్యి ఉండాలి. వారిని రాష్ట్ర న్యాయసేవా ప్రాధికార సంస్థ నియమిస్తోంది. నియామక ప్రక్రియలో దేశవ్యాప్తంగా ఒకే పద్ధతిని అనుసరించడం లేదన్న విమర్శలున్నాయి.

లోక్‌అదాలత్ బెంచిపై ముగ్గురు సభ్యులు కనిపించడం అరుదేననేది మరో విమర్శ. ఇవి సంప్రదాయ కోర్టులు కాకపోవడంతో, సభ్యులకు సంపూర్ణ అధికారాలు ఉండటం లేదు. దీంతో ఇరుపక్షాలు రాజీకి రాకపోతే తీర్పులు ఇవ్వడం కుదరడం లేదన్న విమర్శ ఉంది. వేగంగా పరిష్కరించాలన్న ఉద్దేశంతో కేసుల సంఖ్య మీద పెట్టిన శ్రద్ధ, గుణాత్మక పరిష్కారంపై చూపడం లేదన్నది మరో విమర్శ. వివాద పరిష్కారం కోసం వచ్చేవారిలో బలమైన పక్షం అభిప్రాయమే బలవంతపు రాజీకి కారణమవుతోందని, ముఖ్యంగా బ్యాంకులు, బీమా కంపెనీలు, ఆర్థిక సంస్థలు, సంపన్నుల పక్షమే అవార్డులు ప్రకటిస్తున్నారన్న విమర్శలు ప్రబలంగా ఉన్నాయి. లోక్‌అదాలత్‌లో వెలువడిన అవార్డుకు వ్యతిరేకంగా అప్పీలు చేసుకునే వీలు లేదు. దీంతో అసంతృప్తి చెందిన కక్షిదారు మళ్లీ కొత్తగా కోర్టులో కేసు వేసుకోవాల్సి వస్తోంది. భూవివాదాల్లో చాలామంది లోక్‌అదాలత్‌కు వెళ్లడం లేదు. భూవివాదాలపై సభ్యులకు సరైన అవగాహన లేకపోవడంతో రాజీ చేయకూడనివి కూడా పరిష్కారమై పోతున్నాయనే విమర్శలున్నాయి. ప్రజలతోపాటు న్యాయవాదులు, ప్రభుత్వాధికారుల్లో సైతం లోక్‌అదాలత్‌లపై సరైన అవగాహన లేదు. ప్రభుత్వాలకూ సరైన యోచన కొరవడిందన్న ఆరోపణలున్నాయి.

### మరేం చేయాలి?

కోర్టుల్లోని పెండింగ్ కేసులను లోక్‌అదాలత్‌లకు పంపి, పరిష్కారానికి ప్రయత్నించే అవకాశమున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. ఈ క్రమంలో వీలైనన్ని కేసుల్లో ముందుగా రాజీపడేలా ప్రయత్నించడం వల్ల కోర్టులపై భారం తగ్గుతుంది. న్యాయ వితరణను సులభతరం చేసే లోక్ అదాలత్ వ్యవస్థను మరింత బలంగా తీర్చిదిద్దాలి. లోక్‌అదాలత్ సభ్యులకు రాజీ కుదిర్చే ప్రక్రియ, కౌన్సెలింగ్‌లో శాస్త్రీయ శిక్షణ అవసరం. సభ్యులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం వల్ల మరింత ఇష్టంగా పనిచేసే అవకాశం ఉంటుంది. క్రమం తప్పకుండా తగిన నిధులు విడుదల చేయాలి. శాశ్వత ప్రాతిపదికపై రోజూ అన్ని కోర్టుల్లో లోక్‌అదాలత్‌లు నిర్వహించకపోవడంతో రాజీతో పోయే కేసులు కోర్టులదాకా వెళ్తున్నాయనే వాదనలున్నాయి. అందుకని, ప్రతి కోర్టు ప్రాంగణంలో లోక్‌అదాలత్‌లను ప్రతి రోజూ నిర్వహించేలా చూడాలి. పకడ్బందీ చర్యల ద్వారా లోక్ అదాలత్ వ్యవస్థను సంస్థాగతంగా మరింతగా బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది.




డాక్టర్ పి.మాధవరావు
ఐక్యరాజ్య సమితి
మాజీ సీనియర్ సలహాదారు

## మూడు గుండెల జీవి!

హాయ్ నేస్తాలు..! ఆక్టోపస్ గురించి చాలాసార్లు వినే ఉంటాం కదా! అయితే దానిలో చాలా ప్రత్యేకతలు ఉంటాయి. అవేంటో తెలుసుకుందాం పదండి!

ఆక్టోపస్ సముద్రజీవి. దానికి తొమ్మిది మెదడులు ఉంటాయి. ఒకటి శరీరానికి కేంద్రకంగా పనిచేస్తే, మిగిలిన ఎనిమిది చేతుల్లో ఉంటాయి. అందుకే ఆక్టోపస్ చేతులు కొంతవరకు సొంతంగా కదులుతాయి. అలాగే దానికి మూడు గుండెలు ఉంటాయి. అందులో రెండు శరీరంలోని వివిధ భాగాల నుంచి రక్తాన్ని స్వీకరిస్తే.. మిగిలిన గుండె ఆ రక్తాన్ని సరఫరా చేస్తుంది. సాధారణంగా అయితే అన్ని జీవుల రక్తం ఎరుపు రంగులో ఉంటుంది. కానీ ఆక్టోపస్



రక్తం మాత్రం నీలి రంగులో ఉంటుంది. 'అలా ఎలా ఉంటుంది?' అనుకుంటున్నారా.. మన రక్తం హిమోగ్లోబిన్ వల్ల ఎరుపు రంగులో ఉంటుంది కదా! అలాగే దాని రక్తంలో హిమోసైనిన్ అనే రాగి ఆధారిత ప్రొటీన్ ఉండటం వల్ల నీలి రంగులో ఉంటుందన్నమాట.


ఆక్టోపస్‌కి ఎనిమిది చేతులు ఉంటాయి కదా! కానీ చాలామంది వాటిని కాళ్లు అనుకుని పొరబడుతుంటారు. ఆ చేతులను ఆహారాన్ని పట్టుకోవడానికి, నడవడానికి, పర్యావరణాన్ని తెలుసుకోవడానికి ఉపయోగిస్తుంది. తెలుగులో దీన్ని 'అష్టబాహు' అని పిలుస్తారు. ప్రపంచంలో సుమారు 300జాతుల ఆక్టోపస్‌లు ఉన్నాయట.

ఆక్టోపస్ వెన్నెముక లేని జీవి. దాని శరీరమంతా చాలా మృదువుగా ఉంటుంది. అందుకే చిన్న ప్రదేశంలో కూడా సులువుగా దూరిపోగలదు. దీని చర్మంలో క్రోమాటోఫోర్స్ అనే ప్రత్యేక కణాలు ఉంటాయి. దాని సహాయంతో ఆక్టోపస్ సమయానికి తగ్గట్టుగా క్షణాల్లో రంగులు.. కొన్నిసార్లు ఆకారాన్ని కూడా మార్చుకుని చుట్టూ ఉన్న పరిసరాల్లో కలిసిపోతుంది. అలా తనను తాను శత్రువుల నుంచి రక్షించుకుంటుందన్నమాట. ఇంకా ఏదైనా ప్రమాదం ఎదురైనప్పుడు, ఇతర జీవులు దాన్ని వెంబడించినప్పుడు శరీరం నుంచి నల్లరంగు సిరాను విడుదల చేస్తుంది. అలా వాటి దృష్టిని మళ్లించి తప్పించుకుంటుంది.

హాయ్! బుజ్జీ!!

ఆక్టోపస్‌లలో చాలా రకాలుంటాయి అనుకున్నాం కదా! అయితే అందులో కొన్ని ఆరు నెలల వరకే జీవిస్తే మరికొన్ని నాలుగేళ్ల వరకు బతుకుతాయట. నేస్తాలూ.. పొరపాటున ఇవి మనుషులను కరిస్తే ఒక్కోసారి బతకడం చాలా కష్టమట. అందుకే ఆక్టోపస్‌ను సముద్ర రాక్షసి అని కూడా పిలుస్తుంటారు. ఆకలేస్తే కొన్నిసార్లు దాని చెయ్యిని అదే కొరుక్కుని తినేస్తుందట.

– తాడూరి స్వాతి



**నేడు జాతీయ పాల దినోత్సవం**

భారతీయ పాడి పరిశ్రమ పురోగమన నిర్దేశకుడు డాక్టర్ వర్గీస్ కురియన్. పాడి పరిశ్రమలో మన దేశ ఉజ్వల భవితకు మార్గ నిర్దేశకుడైన శ్వేత విప్లవ పితామహుడు డాక్టర్ కురియన్ జన్మదినమైన నేషనల్ మిల్క్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.




# కృష్ణా మణిహారం.. 'విజయ' వికాసం!

## పాడి రైతుల జీవితాల్లో సిరుల పంట

**నాయకత్వం అంటే కర్ర పెత్తనం కాదు.. కలిసి నడవడం! విజయ పథంలో సహచరులను నడిపించడం! సమస్యల పట్ల అవగాహన.. అధిగమించడంలో నైపుణ్యత.. పరిష్కారం పట్ల ఆశావహ దృక్పథం.. ఇవే నాయకత్వ లక్షణాలు! దీక్ష దక్షతలకు తోడు ఓర్పు నేర్పు కలబోస్తే కృష్ణ మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు! ఆ నేర్పరితనమే చరిత్ర చూడని ఘన విజయాలను సాకారం చేసింది.. దిగ్విజయ జయకేతనం ఎగురవేసింది!**

ముందడుగు వేయాలంటే దారి ఉండాలి.. దారి కావాలంటే దానిని చేసుకోవాలి.. ఏ దారి తనంతట తానుగా కనిపించదు.. అన్వేషించాలి.. శోధించాలి.. సాధించాలి! కృష్ణ మిల్క్ యూనియన్‌ను గెలుపు బాటలో నడిపించడానికి సంస్థ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు సారథి అయ్యారు. పాలకమండలి సభ్యులు సేనా నాయకులయ్యారు!

గత ప్రభుత్వ కాలంలో ఎన్నో ఒత్తిళ్లు ఒడిదుడుకులు ఎదురైనా ఎదురు నిలిచి నమ్మిన సిద్ధాంతాన్నే తలకెత్తుకుని నిలబడ్డారు. రాష్ట్రమంతా రాజకీయంగా ఎదురుగాలు వీచినా.. మిల్క్ యూనియన్ ఎన్నికల్లో తన రాజకీయ చతురతను ప్రదర్శించి విజయం సాధించారు. అలాగే వరుసగా ఐదేళ్లపాటు గత ప్రభుత్వ అధికార పార్టీ రాజకీయాన్ని బలగాన్ని ఎదుర్కొని 15 మంది పాలకమండలి సభ్యులను గెలిపించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ విజయ డెయిరీని విజయపథంలో నడిపించారు. ఉద్యమాల బాటలో నడిచి నేతగా నిలిచి కృష్ణా మిల్క్ యూనియన్‌కు కొత్త ఊపిరి పోశారు. పాల సేకరణ ధరలను దేశంలోనే అత్యధికంగా పెంచి పాడి రైతుల కలలను సాకారం చేసిన 'విజయ' గాథ ఇది. విజయ డెయిరీ ప్రయాణం అంటే కేవలం రాజకీయాలకు సంబంధించినది కాదు.. ఇది పాడి పరిశ్రమ చరిత్రలో సువర్ణ అధ్యాయం.. లక్షలాది మంది పాడి రైతుల జీవన వికాసం.. కోట్లాది మంది వినియోగదారుల పౌష్టిక ఆహార వినియోగం.. ఆరు దశాబ్దాల కృష్ణా మిల్క్ యూనియన్ ఘన చరిత్రకు నిదర్శనం!



### సహకార మార్గం తారక మంత్రం..

ఆదరణ కరువై అనేక కష్ట నష్టాలకు గురవుతున్న సహకార సంస్థలు నిర్వీర్యం కాకుండా పరస్పర సహాయక సహకార చట్టం (MACS) ప్రవేశపెట్టి కాపుగాచిన దార్శనికుడు స్వర్గీయ ఎన్టీఆర్! వారి దూర దృష్టికి నిదర్శనమే రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధికి లభించిన స్వయం ప్రతిపత్తి. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఉదాత్త ఆలోచనలతో పాడి రైతులే సంస్థ యజమానులయ్యారు. పరస్పర సహాయక సహకార రంగంపై ప్రత్యేక దృష్టి సారించిన ఎన్టీఆర్ కృష్ణా మిల్క్ యూనియన్ అభివృద్ధికి తన సహాయ సహకారాలు అపారంగా అందించారు. పాడి రైతులు ఆర్థికంగా బాగున్నప్పుడు మాత్రమే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సుసాధ్యం కాగలదని నమ్మిన ఎన్టీఆర్ అందుకోసం అవసరమైన అన్ని చర్యలను ఆగమేఘాలమీద తీసుకునేవారు. నాడు దివంగత నేత తీసుకున్న నిర్ణయాల ఫలితమే కృష్ణా మిల్క్ యూనియన్ విజయ వికాసం.


### సహజం.. సంపూర్ణం.. సురక్షితం..

పాడిరైతుల నుంచి నేరుగా పాలను సేకరించి అత్యాధునిక పద్ధతులలో శుద్ధిచేసి అత్యంత నాణ్యమైన పాలను, పాల ఉత్పత్తులను వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోంది. ఈ క్రమంలో 54 రకాల నాణ్యతా పరీక్షలు నిర్వహించడం అను నిత్యము ఒక యజ్ఞంలా సాగుతుంది. పాల రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు వినియోగదారుల ఆకాంక్షలను అందుకోవడమే లక్ష్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ పని చేస్తుంది.

### కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్‌గా విప్లవాత్మక మార్పులు



కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి చలసాని ఆంజనేయులు తనదైన మార్క్ చూపించారు. సంస్థ లాభాలు పెంచడంతోపాటు ఆ లాభాలను రైతులకు చేరే విధంగా విశేష కృషి చేశారు. పాడి రైతు బాగుంటేనే పాడి పరిశ్రమ బాగుంటుందనే తలంపుతో రైతుల సంక్షేమం కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకుని విజయవంతంగా అమలు చేశారు. పాడి రైతు ఆరోగ్యంతోపాటు పాడి పశువుల ఆరోగ్యం కూడా బాగుండాలనే బృహత్తర ఆలోచనతో బీమా, ప్రత్యేక అంబులెన్సులు, ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించారు. శ్వేత విప్లవ పితామహులు డాక్టర్ వర్గీస్ కురియన్ గారి మార్గ నిర్దేశాలకు అనుగుణంగా పని చేస్తున్న సంస్థ కృష్ణా మిల్క్ యూనియన్ అని, కురియన్ గారు వినియోగదారుని నుంచి ఆర్జించిన ప్రతి రూపాయిలో 75% రైతుకు చేరినప్పుడే సహకార స్ఫూర్తికి సార్థకం అని చెప్పిన నినాదాన్నే స్ఫూర్తిగా తీసుకుని, కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో అంతకు మించి రైతుకు అందజేసి చూపించారు. గడిచిన ఆరు సంవత్సరాలలో కిలో ఫ్యాట్‌కు ధర రూ. 240 పెంచి రికార్డు సృష్టించారు. అంటే లీటరుకు అత్యధికంగా సుమారు రూ. 17 పెరగడం కృష్ణా మిల్క్ యూనియన్ చరిత్రలో సరికొత్త రికార్డుగా చెప్పవచ్చు ఇదిలా ఉంటే వినియోగదారుని నుంచి ఆర్జించిన ప్రతి రూపాయిలో 85% పాడి రైతులకు అందజేస్తున్న ఏకైక సంస్థగా కృష్ణా మిల్క్ యూనియన్‌ను నిలిపారు.



### చంద్రహాసంతో సమితి వికాసం..

1997 నాటి ముందు కాలం కృష్ణా మిల్క్ యూనియన్‌కు చీకటి రోజులు. ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించడమే గగనంగా మారిన పరిస్థితి. మూసివేతకు చేరువుగా ఉన్న సమితికి జవసత్వాలు నింపేందుకు నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నడుం బిగించారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక గ్రాంటు విడుదల చేయడంతో పాటు NDDB ద్వారా రుణం మంజూరు చేయించి, ఆ రుణభారానికి ప్రభుత్వమే గ్యారెంటీ ఇవ్వడం ఒక చరిత్ర. సరిగ్గా అదే సమయంలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకం అమలు చారిత్రాత్మక నిర్ణయం. ఫలితంగా కృష్ణా మిల్క్ యూనియన్ పునరుత్తేజమైంది. పాడి రైతుల కలలు నెరవేర్చి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారి హృదయాలలో దేవుడయ్యారు.

### విలక్షణం.. వినూత్నం.. విశిష్టం..

ఆరు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో అద్భుత విజయాలకు అలుపెరుగని అవిశ్రాంత కృషి పట్టుదలలే ముఖ్య కారణం. పాల సేకరణ నుంచి శుద్ధి, ప్యాకింగ్.. సరఫరా.. క్రమంలో నిరంతర పర్యవేక్షణ వజ్రోత్సవ సంబరాలకు చేరువచేసింది. అందువల్లనే విజయ పాల ఉత్పత్తులు సురక్షితమనే నమ్మకాన్ని.. విశ్వాసాన్ని.. ఆదరణను.. తమ సొంతం చేసుకున్నాయి. ఈ నమ్మకమే విజయ పాల ఉత్పత్తులు కృష్ణా జిల్లా సరిహద్దులు దాటి ఉభయ గోదావరి, గుంటూరు, ప్రకాశం, ఖమ్మం, హైదరాబాద్ జిల్లాలలో విజయ బావుటా ఎగురవేస్తున్నాయి. తమకు ఎదురేలేదని చాటి చెబుతున్నాయి.

### ప్రాజెక్ట్ కామధేను.. రూ. 160 కోట్లతో అత్యాధునిక ప్లాంట్

కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు వారి పాలకవర్గం ప్రాజెక్టు కామధేను క్రింద వీరవల్లిలో అత్యాధునిక మిల్క్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను 2023 డిసెంబరు 7న ప్రారంభించి రైతుల కలలను సాకారం చేశారు. మొత్తం 22 ఎకరాల్లో రూ. 180 కోట్ల ప్లాన్‌ను కేవలం రూ. 160 కోట్లలో పూర్తి చేయడం అరుదైన ఘనతగా చెప్పవచ్చు ఈ ప్లాంట్ రోజుకు 6 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగి ఉంది (8 లక్షలకు విస్తరణ సామర్థ్యంతో ప్రణాళిక ఉంది). ఇది పూర్తిగా ఆటోమేటెడ్, ఇంకా ఖర్చు ఆదాతో మరియు పర్యావరణ అనుకూల సాంకేతికతతో నిర్మించబడింది.



విజయవాడలో 2020 మార్చి 20న ప్రారంభించిన పాల ఉత్పత్తుల భవనం

విజయ
కృష్ణా మిల్క్ యూనియన్
లక్షా యాభైవేల పాడి రైతు కుటుంబాల సంస్థ

### బెస్ట్ స్వచ్ఛ పరిశ్రమగా వీరవల్లి కామధేను ప్లాంట్



- రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా ఉత్తమ పనితీరు కనబరచిన సంస్థలు, వ్యక్తులకు 'స్వచ్ఛాంధ్ర పురస్కారాలు' అందిస్తోంది. ఈ ఏడాది అక్టోబర్ 6వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందజేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా మెగా భారీ పరిశ్రమల కేటగిరిలో 'బెస్ట్ స్వచ్ఛ ఇండస్ట్రీ' కృష్ణా మిల్క్ యూనియన్ ప్రాజెక్ట్ అయిన వీరవల్లిలోని కామధేను ప్లాంట్‌ను వరించింది. విజయవాడలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు గారికి అవార్డును అందజేశారు.

### అంచెలంచెలుగా ఎదిగిన చలసాని

కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు రైతు సంఘ నాయకుడిగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశారు. రైతుల శ్రేయస్సే పరమావధిగా నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, పలు అంశాల్లో రైతు అనుకూల నిర్ణయాలు వెలువడేలా చేశారు. 2003 లో తిరుపతి మహానాడులో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి చేతుల మీదుగా ఉత్తమ సమన్వయకర్త అవార్డు అందుకున్నారు. 2005-08లో కృష్ణా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా 2008 డిసెంబరు 5న వరి ధాన్యం, చెరకు ధరలకు మద్దతు ధర పెంచాలని హనుమాన్ జంక్షన్‌లో 8 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలకు తెగించి పోరాడారు. ఆయన చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షకు అప్పుడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు గారు మరియు రాష్ట్ర నాయకులు పరామర్శించారు. ప్రభుత్వం సైతం తీవ్ర ఒత్తిడికి గురై, దీక్షను ఎలాగైనా భగ్నం చేయాలని పోలీసులను రంగంలోకి దింపింది. చలసాని ఆంజనేయులు చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేయడంతో 9వ రోజు ఆమరణ నిరాహార దీక్షను విరమించాల్సి వచ్చింది. అనంతరం రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ ఉవ్వెత్తున ఎగసిపడిన సమైక్యాంధ్ర ఉద్యమంలో చలసాని ఆంజనేయులు కీలక పాత్ర పోషించారు. సమైక్యాంధ్ర ఉద్యమాన్ని పురస్కరించుకుని ఆయన అధ్యక్షతన హనుమాన్ జంక్షన్‌లో



రైతు గర్జన నిర్వహించారు. నాటి ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు పరుచూరి అశోక్ బాబు, విద్యాసాగర్ గార్లు ముఖ్య అతిథులుగా హాజరైన రైతు గర్జన సభకు లక్ష మందికిపైగా రైతులు హాజరై విజయవంతం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా రైతు సంఘం నేతగా, జిల్లా రైతు నాయకులుగా చలసాని ఆంజనేయులు నిరంతరం రైతు పక్షాన నిలిచారు.

### పాల సేకరణలో అత్యుత్తమ రికార్డు

**10.33 కోట్ల లీటర్లకు చేరిన కృష్ణా మిల్క్ యూనియన్**



పాల సేకరణలో కృష్ణా మిల్క్ యూనియన్ గతంలో ఎన్నడూ లేని రికార్డు నెలకొల్పింది. పాడి రైతుల నుంచి పాలను సేకరించడంలో అత్యద్భుతమైన వృద్ధిని నమోదు చేసింది. యూనియన్ పాల సేకరణ 2023-24 నాటికి 4% పెరిగి ఏకంగా 10.33 కోట్ల లీటర్లకు చేరడం విశేషం. ఛైర్మన్ చలసాని ఆంజనేయులు రూపొందించిన 'పల్లెకు పోదాం.. పాడిని చూద్దాం' అనే నినాదం మారుమూల గ్రామాలను కూడా తాకిందనడంలో ఆశ్చర్యం లేదు. ఛైర్మన్, పాలకవర్గ సభ్యులు ఇలా చేపట్టిన పలు కార్యక్రమాలు రైతుల సమస్యలను పరిష్కరించి, పాల ఉత్పత్తిని పెంచడానికి దోహదపడ్డాయి. 2024-25లో విజయవాడలో భారీ వర్షాల వల్ల వరదలు వచ్చినప్పటికీ 10.29 కోట్ల లీటర్లు సేకరించి, ఎలాంటి ఒడిదుడుకులనైనా తట్టుకుని స్థిరంగా నిలబడుతుందని చూపించింది.

### రైతు సంక్షేమమే లక్ష్యంగా ..

- కృష్ణా క్షీర బంధు కింద మరణించిన రైతు కుటుంబాలకు రూ. 50,000 (ఇప్పటి వరకు 5000కు పైగా కుటుంబాలకు) సహాయం అందించింది.
- కళ్యాణమస్తు ద్వారా వివాహం చేసుకుంటున్న దంపతులకు రూ. 20,000 విలువ చేసే బంగారు నాణెం. 7000 కుటుంబాలకు ఇప్పటికే ఈ పథకం కింద అందించడం జరిగింది.
- 'ప్రతిభ' కింద చదువులో ముందుండే పిల్లలకు ఆర్థిక సహాయం అందిస్తోంది.
- విజయ హెల్త్ కార్డులు, యాక్సిడెంట్ కేర్ ట్రస్ట్ వంటి ఆరోగ్య భద్రత అందిస్తోంది.
- తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) సహాయంతో శీతలీకరణ కేంద్రాల వద్ద ఉచిత కంటి శిబిరాలు నిర్వహించారు. దాదాపు 3000 మంది పాడి రైతులు ఉచితంగా పరీక్షలు చేయించుకున్నారు. 400కు పైగా క్యాటరాక్ట్ సర్జరీలను పూర్తి ఉచితంగా చేయడంతోపాటు 1500 మందికి పైగా కళ్లజోళ్లను అందించారు. అంతే కాకుండా గౌరవనీయులైన ఛైర్మన్ మరియు పాలకవర్గ సభ్యులు మరో వినూత్న ఆలోచన చేశారు. పాడి రైతులకు ఆరోగ్య సంరక్షణ అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులైన ఆంధ్రా ఆసుపత్రి, ఆయుష్ ఆసుపత్రి, అను ఆసుపత్రి, పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రి, ఆశ్రమ్ ఆసుపత్రులతో ఒప్పందాలు (ఎంవోయూ) కుదుర్చుకున్నారు. తద్వారా రైతులకు రాయితీతో కూడిన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించడంతోపాటు ఆసుపత్రిలో రాయితీతో కూడిన వైద్యం, ఉచిత సంప్రదింపులు (కన్సల్టేషన్), గ్రామాల్లో తరచుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి ఏర్పాట్లు చేశారు. పాడి రైతుల ఆరోగ్యం కోసం వరుణ్ కార్డియాక్ సెంటర్ ద్వారా 700 మంది రైతులకు ఉచిత హృద్రోగ పరీక్షలు నిర్వహించారు. అంతే కాకుండా 50 మందికి యాంజియో ప్లాస్టీ, 9 మందికి గుండె ఆపరేషన్లు, 500 మందికి యాంజియోగ్రామ్‌లు చేయించారు.



2003లో తిరుపతి మహానాడులో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి చేతుల మీదుగా ఉత్తమ సమన్వయకర్త అవార్డు తీసుకోవడం జరిగింది.

- గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో ఇటీవల పశువులకు హాస్టళ్లు (చంద్రన్న సామూహిక గోకులాలు) ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని సేకరించడంతోపాటు వాటికి మేత (75 శాతం సూపర్ నేపియర్ గడ్డి మరియు 25 శాతం పోషక విలువలున్న హెడ్జ్ లూసర్న్) అందించాలని నిర్ణయించారు. తద్వారా పాల ఉత్పత్తికి అయ్యే ఖర్చు తగ్గించడంతో పాటు, పశువులకు మెరుగైన ఆరోగ్యం, నాణ్యమైన మేతను అందించుచున్నారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకమైన 'భారత్ పశుధన్' కింద కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు నాణ్యమైన లింగ నిర్ధారిత వీర్యం రాయితీతో అందిస్తోంది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పాడి రైతులందరికీ రూ. 100 సబ్సిడీతో కేవలం రూ. 50కే అందించాలని, ఈ పథకం కింద ఏడాదికి రూ. 2 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది.

### ఆర్థిక వృద్ధితో టర్నోవర్..

**రికార్డు స్థాయిలో 74% శాతం పెరుగుదల**



- కృష్ణా మిల్క్ యూనియన్ ఆర్థికంగా అద్భుతమైన వృద్ధిని నమోదు చేస్తోంది. ఛైర్మన్‌గా చలసాని ఆంజనేయులు పదవీ కాలంలో టర్నోవర్ 74% పెరిగి 2024-25 సంవత్సరానికి రూ. 1211 కోట్లకు చేరడం విశేషం. కోవిడ్ సమయంలో కూడా యూనియన్ 2018-19 నుంచి 2019-20కి 12 శాతం వార్షిక టర్నోవర్ పెరగడం ఒక రికార్డు. అదే 2020-21 నాటికి 15 శాతం, 2021- 22 ఏడాదికి 10 శాతం వార్షిక వృద్ధి నమోదు చేసింది. ఇది యూనియన్ యొక్క సమిష్టి కృషి వల్లే సాధ్యమైంది. కోవిడ్ కాలంలో దేశమంతా అమ్మకాలు పడిపోయిన సమయంలోనూ విజయ డెయిరీ పెరుగుదలనే సాధించింది. పొరుగు జిల్లాలైన గుంటూరు, ప్రకాశం, తూర్పు, పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాలకు విస్తరించింది. 2022-23లో యూనియన్ రికార్డు స్థాయిలో రూ. 1104 కోట్ల టర్నోవర్ సాధించి, 2023-24 ఏడాదికి రూ. 1200 కోట్లు అంటే 9 శాతం వృద్ధిని నమోదు చేసింది. విజయవాడ పరిసర ప్రాంతాలను వణికించిన బుడమేరు వరదల తాకిడిలోనూ 2024-25 ఏడాదిలో రూ. 1211 కోట్లు సాధించింది. బుడమేరు వరదల్లో 42 రోజులపాటు విజయవాడ పాల ఫ్యాక్టరీ ఉత్పత్తి నిలిచిపోయింది. మొత్తంగా చలసాని ఆంజనేయులు గారి పాలనలో 74 శాతం వృద్ధి సాధించి, రాబోయే కాలానికి కూడా స్థిరమైన వృద్ధికి బాటలు వేశారు.



కామధేను వీరవల్లి ప్లాంట్

ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి నిలిచిన అద్భుత సాహసం విజయ డెయిరీ. బుడమేరు వరదలతో విజయవాడ మిల్క్ ఫ్యాక్టరీ 42 రోజులపాటు వరద నీటిలో చిక్కుడిన సందర్భంలో పాడి రైతులు, పాల వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతర సేవలు అందించడంలో ముందు చూపుతో నూతనంగా నిర్మించిన ప్రాజెక్ట్ కామధేను వీరవల్లి ప్లాంట్ సేవలు అద్భుతం.. అమోఘం.. అద్వితీయం.. అనుపమానం..!

### లాభాలతో బోనస్ జాతర..

కార్పొరేట్ వ్యాపారానికి, సహకార వ్యాపారానికి సహస్ర యోజనాల తేడా ఉంటుంది. కార్పొరేట్ వ్యాపారంలో లాభాలు యాజమాన్యానికే చెందుతాయి. సహకార రంగంలో లాభాలు పాడి రైతులకే అందుతాయి. సరిగ్గా అదే జరిగింది కృష్ణా మిల్క్ యూనియన్ విషయంలో.! సంస్థ లాభాలు 2019-20తో పోలిస్తే 2020 - 21లో 95 శాతం పెరిగాయి. ఈ మొత్తం 2021-22లో 23%, 2022 - 23కి మరో 10 శాతం, 2023 - 24కి 12 శాతం వృద్ధి జరిగింది. ఈ ప్రకారంగా చూస్తే గడచిన ఐదేళ్లలో 104 శాతం లాభార్జన జరగగా యూనియన్ రిజర్వులు రూ. 228.58 కోట్లకు చేరాయి. పాడి రైతులకు మేలు చేయడంలో ముందుండే కృష్ణా మిల్క్ యూనియన్ పాల సేకరణ ధరను ఎప్పటికప్పుడు పెంచుతూ దేశంలోనే అత్యధిక మొత్తాన్ని అందజేస్తోంది. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి వంతున రైతులకు బోనస్ చెల్లించిన కృష్ణా మిల్క్ యూనియన్ గత 13 ఏళ్లలో రూ. 1000 కోట్లకు పైగా బోనస్ అందించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అండగా ఉంటోంది.

### వజ్రోత్సవ సంబరాలలో పాలవెల్లువ..

వర్ధమాన భారతదేశంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడ మహానగరం 1965 చారిత్రక విప్లవానికి నాంది పలికింది. యూనిసెఫ్ వారి ఆర్థిక సహాయంతో సమీకృత పాల ఫ్యాక్టరీ అంకురార్పణ జరిగింది. పాల ఉత్పత్తిదారుల ప్రయోజనాలే లక్ష్యంగా సాగుతున్న ఈ మహత్తర ఉద్యమం 1983లో సహకార సమితిగా రూపాంతరం చెందింది. 2001లో నాటి ముఖ్యమంత్రి అభ్యుదయ పథ నిర్దేశకుడు ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పరస్పర సహాయక సహకార చట్టంతో పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘంగా ఆవిర్భవించి నేటి వజ్రోత్సవ సంబరాలకు మార్గం సుగమం చేసింది. నిర్దిష్ట ప్రణాళికలతో పాడి రైతుల బంగారు భవితకు ఊతంగా నిలచింది. అతి స్వల్ప పాల సేకరణతో ప్రారంభమైన కృష్ణా మిల్క్ యూనియన్ ప్రయాణం ప్రస్తుతం 1220 కోట్ల వార్షిక టర్నోవర్‌తో కొనసాగుతోంది. సంస్థ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, పాలకవర్గం మరియు మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబుల సారథ్యంలో మూడు వేల కోట్ల టర్నోవర్ సాధనే లక్ష్యంగా ముందడుగు వేస్తోంది. ఇందుకోసం నిర్దిష్ట ప్రణాళికలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. పాడి రైతులకు మరింత మెరుగైన పాల సేకరణ ధర అందించడంతోపాటు పాడి రైతుల కుటుంబాలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం ప్రాథమిక లక్ష్యం కాగా.. ప్రస్తుత మార్కెట్టును మన దేశంలోని ఇతర రాష్ట్రాలకు.. అలాగే ఇతర దేశాలకు విస్తరింపజేయడం.. మరిన్ని నూతన ఉత్పత్తులు ఆవిష్కరించడం.. ఇదే క్రమంలో వినియోగదారులకు విజయ పాల ఉత్పత్తుల నాణ్యతపై మరింత విశ్వాసం కలిగించడం తన ముందున్న లక్ష్యాలుగా సమితి ప్రయాణం కొనసాగిస్తోంది.




ADVERTORIAL



'బిజినెస్ ఎక్స్‌పో' 2025' బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, చిత్రంలో అక్కయ్య నాయుడు, ఆర్వీ స్వామి, ఆర్.సుబ్బారావు, వి.రవి, పి.భాస్కరరావు, ఎం.మురళీకృష్ణ, రాజశేఖర్

## ఆంధ్రప్రదేశ్.. పెట్టుబడులకు అనుకూలమైన ప్రదేశం

విజయవాడ (గుణదల-పటమట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు మంచి ప్రదేశమని.. ఐటీ, పర్యాటకం, పారిశ్రామిక తదితర రంగాల్లో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని మంత్రులు కొలుసు పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో (గుణదలలోని హయత్ హోటల్‌లో) 'బిజినెస్ ఎక్స్‌పో' 2025' కార్యక్రమ బ్రోచర్, ఏవీలను ఆవిష్కరించారు. మంత్రులు కొలుసు పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్‌లు ముఖ్యఅతిథులుగా వేర్వేరుగా హాజరయ్యారు. విజయవాడలో డిసెంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు బిజినెస్ ఎక్స్‌పో జరగనుంది. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం ఆర్థికాభివృద్ధి దిశగా పయనిస్తోందని, ఇలాంటి సమయంలో ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో నిర్వహించడం శుభ పరిణామమన్నారు. ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ గత ఏడాది నవంబర్‌లో విజయవాడలో ఏపీ ఛాంబర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ ఎక్స్‌పో విజయవంతమైందని గుర్తు చేశారు. ఈ ఏడాదిలో నిర్వహించనున్న ఎక్స్‌పోకు 160 మంది ఎగ్జిబిటర్లు, 30 వేల మందికిపైగా సందర్శకులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏపీ ఛాంబర్స్ ఎన్టీఆర్ జిల్లా ఛైర్మన్ వేమూరు రవి, ఏపీ ఛాంబర్స్ మాజీ అధ్యక్షుడు ముత్తవరపు మురళీకృష్ణ, ఛాంబర్స్ పర్యాటక ఛైర్మన్ ఆర్వీ స్వామి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బి.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు, కోశాధికారి ఎస్.అక్కయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఎంఎస్ఎంఈలకు అండగా జర్మనీ సహకారం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్


మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో లెటర్ ఆఫ్ ఇంటెంట్‌తో ప్రతినిధులు

చెన్నై, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని ఎంఎస్ఎంఈలకు అండగా నిలిచేందుకు జర్మనీ సహకారం తీసుకోనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. చెన్నైలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ఇండో-జర్మన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇండో-జర్మన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కలిసికట్టుగా ఏపీలో ఎంఎస్ఎంఈల ప్రోత్సాహకానికిగాను, జర్మన్ ఎంఎస్ఎంఈలకు సంబంధించిన నిపుణులు ఏపీకి వచ్చేందుకు వీలుగా మంత్రి సమక్షంలో లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకాలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, యువ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చేందుకు, ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధి, ఎగుమతులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు జర్మనీ సహకారం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఇండో-జర్మన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ 59వ వార్షిక ప్రాంతీయ సమావేశంలోనూ మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

## ఏడు నెలలుగా జైల్లో ఉన్నారు.. బెయిలివ్వండి

- హైకోర్టుకు కెసిరెడ్డి న్యాయవాది వినతి


ఈనాడు, అమరావతి: కొందరిని లక్ష్యంగా చేసుకొని సీఐడీ చర్యలు తీసుకుంటోందని మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు కెసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మంగళవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. కెసిరెడ్డి గత ఏడు నెలలుగా జైల్లో ఉన్నారని బెయిల్ మంజూరు చేయాలని కోరారు. మద్యం కేసులో దర్యాప్తును పూర్తి చేసిన సీఐడీ అభియోగ పత్రం దాఖలు చేసిందన్నారు. ఇదే కేసులో కొందరు నిందితులకు ఏసీబీ కోర్టు బెయిలిచ్చిందని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి (ఏ-2), ఎక్సైజ్ శాఖ ప్రత్యేక అధికారి దొడ్డా వెంకట సత్యప్రసాద్ (ఏ-3)ను సీఐడీ అరెస్టు చేయలేదన్నారు. సీఐడీ కొందరిని లక్ష్యంగా చేసుకొని పని చేస్తోందని ఆరోపించారు. వాదనల కొనసాగింపునకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. దీంతో కెసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ 28కి వాయిదా పడింది.

## ఎయిమ్స్‌లో చెవిరెడ్డి భాస్కరరెడ్డికి వైద్య పరీక్షలు

మంగళగిరి, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న వైకాపా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి మంగళగిరి ఎయిమ్స్‌లో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఆయన్ను జైలు అధికారులు ఇక్కడికి తీసుకొచ్చారు. వెరికోస్ వీన్స్ సమస్య ఉందని విజయవాడ జీజీహెచ్ వైద్యులు ఎయిమ్స్‌కు రిఫర్ చేయడంతో అందుకు సంబంధించిన పరీక్షలు చేశారు. ఉదయం 10 గంటలకు చెవిరెడ్డిని ఆసుపత్రికి తీసుకొచ్చిన అధికారులు.. సాయంత్రం 3.30 గంటల తర్వాత తిరిగి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించే ప్రాంతానికి ఇతరులెవరూ వెళ్లకుండా భద్రతా సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారు. ఇంకా కొన్ని పరీక్షలు చేసి ఫలితాలు విశ్లేషించాల్సి ఉన్నందున బుధవారం కూడా ఆయన్ను ఎయిమ్స్‌కు తీసుకురానున్నట్లు సమాచారం.

# కానిస్టేబుల్ శిక్షణ ఇంకెప్పుడు?

- ఫలితాలు విడుదలై మూడున్నర నెలలు
- సెప్టెంబరులోనే ప్రారంభిస్తామన్న హోం మంత్రి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు




ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాలు, ఎంపిక జాబితా విడుదలై మూడున్నర నెలలు దాటుతున్నా.. అభ్యర్థులకు ఇప్పటికీ శిక్షణ ప్రారంభించకపోవటంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎంపికైన అభ్యర్థులందరికీ సెప్టెంబరు నుంచి శిక్షణ ప్రారంభించి 9 నెలల్లో పూర్తి చేసి, పోస్టింగులిస్తామంటూ ఆగస్టు ఒకటిన ఫలితాల విడుదల సందర్భంగా హోంమంత్రి అనిత ప్రకటించారు. నవంబరు ముగుస్తున్నా శిక్షణకు సంబంధించి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పటికే చాలా జాప్యమవడంతో చాలామంది అభ్యర్థులు చిన్నాచితకా పనులకు వెళ్తున్నారు.

### నోటిఫికేషన్‌కు మూడేళ్ల పైనే..

రాష్ట్రంలో మొత్తం 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 2022 నవంబరులో నాటి వైకాపా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించి, ఎంపిక ప్రక్రియలను నిలిపేసింది. అభ్యర్థులు ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. న్యాయపరమైన చిక్కులన్నింటినీ అధిగమించి. పరీక్షలు నిర్వహించి, ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితా ఖరారు చేసింది.

- 6,014 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. బీసీ-సీ, బీసీ-ఈ కేటగిరీల్లో అర్హులు రాకపోవటంతో 86 పోస్టులకు ఎంపిక చేయలేదు.
- ఎంపికైన వారికి వెంటనే శిక్షణ ప్రారంభించాల్సి ఉన్నా.. ఇప్పటివరకూ వివిధ కారణాలతో మొదలు కాలేదు. 7,500 మందికి ఏకకాలంలో శిక్షణ ఇచ్చే వనరులు రాష్ట్రంలో ఉన్నాయి. అయినా శిక్షణ మొదలుపెట్టకపోవడం గమనార్హం.
- 'నోటిఫికేషన్ జారీ చేసి మూడేళ్లపైనే అయింది. ఈ మూడేళ్లు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చాం. ఎంతో ఓర్పుతో ఉన్నాం. శిక్షణలో జాప్యం వల్ల ఇబ్బందులు పడుతున్నాం' అని గుంటూరుకు చెందిన ఓ అభ్యర్థి వాపోయారు. ఉద్యోగానికి ఎంపికైనా సరే శిక్షణ మొదలు కాకపోవడం వల్ల కూలీ పనులకు వెళ్లాల్సి వస్తోందని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ అభ్యర్థి చెప్పారు.

### 810 మంది సాంకేతిక కోర్సులు చేసిన వారే..

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన 6,014 మందిలో 810 మంది (13.46%) బీటెక్, ఎంటెక్, బీసీఏ వంటి సాంకేతిక కోర్సులు చేసిన పట్టభద్రులే. ఈ పోస్టులకు ఇంటర్మీడియట్ కనీస విద్యార్హత కాగా.. ఎంపికైన మొత్తం అభ్యర్థుల్లో 4,051 మంది (67.35%) డిగ్రీ, అంతకుమించి చదివిన వారే. ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎల్ఎల్‌బీ, ఎంఏ వంటి ఉన్నత విద్య అభ్యసించిన వారూ ఎక్కువగానే ఉన్నారు.

### డిసెంబరు రెండో వారంలో ప్రారంభిస్తాం

-బి.సత్య ఏసుబాబు, డీఐజీ, శిక్షణ విభాగం

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ప్రారంభించటానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. డిసెంబరు రెండో వారంలో శిక్షణ ప్రారంభిస్తాం. అభ్యర్థులకు ఈ సమాచారాన్ని అందజేస్తాం.

## త్వరలోనే పోలీసుస్టేషన్లకు కొత్త వాహనాలు

- హోంమంత్రి అనిత



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని పోలీసుస్టేషన్లకూ త్వరలోనే కొత్త వాహనాలు అందిస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వసతుల కల్పన కోసం అవసరమైన వనరులను ప్రభుత్వం సమకూరుస్తుందని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం హోంశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిస్తుందని వివరించారు. కార్యక్రమంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, ప్రత్యేక కార్యదర్శి విజయ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇద్దరు డ్రైవర్లపై దాడులు.. ఆగిన అద్దె బస్సులు

జగ్గయ్యపేటలో ఎమ్మెల్యే చొరవతో తిరిగి రోడ్డెక్కిన వాహనాలు


కార్మికులకు సర్దిచెబుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎస్సై రాజు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట డిపో నుంచి విజయవాడకు తిరిగే అద్దె బస్సుల డ్రైవర్లు ఇద్దరిపై సోమవారం రాత్రి వేర్వేరు ఘటనల్లో దాడులు జరిగాయి. తమ డ్రైవర్లకు రక్షణ లేదంటూ యజమానులు మంగళవారం మొత్తం 33 అద్దెబస్సులను ఆపేశారు. విజయవాడ నుంచి జగ్గయ్యపేట వచ్చే బస్సులో ఎక్కిన రమణ అనే వ్యక్తి.. సీటులో లగేజీ తీయండి అని చెప్పినందుకు గొడవ పెట్టుకోవడమే కాక తన అనుచరులను జగ్గయ్యపేట బస్టాండ్‌కు పిలిపించి, డ్రైవర్ వీరబాబుపై దాడికి దిగాడు. కత్తితో మెడపై పొడవబోగా అది ముక్కుకు తగిలి తీవ్ర రక్తస్రావమైంది. మరో ఘటనలో సోమవారం రాత్రి విజయవాడ నుంచి వచ్చే అద్దె బస్సు డ్రైవర్ బాషా.. జగ్గయ్యపేట ఎస్‌జీఎస్ కళాశాల వద్ద ప్రయాణికులు దిగేందుకు ఆపారు. వెనుకగా వచ్చిన ఆటోడ్రైవర్లు అకస్మాత్తుగా బస్సు ఎందుకు ఆపావని గొడవకు దిగారు. తర్వాత రెండు ఆటోల్లో బస్టాండ్‌కు వచ్చి బాషాను కొట్టి, గాయపర్చారు. ఆర్టీసీ కార్మికులు బాధిత డ్రైవర్లను ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్రైవర్లపై దాడుల నేపథ్యంలో యజమానులందరూ అద్దె బస్సులు నిలిపివేయడంతో ఎస్సై రాజు డిపో వద్దకు వెళ్లి చర్చించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కూడా అక్కడికి వచ్చి ఉన్నతాధికారులతో మాట్లాడారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పడంతో అద్దెబస్సుల రాకపోకలను పునరుద్ధరించారు.

## ఏపీ విభజన చట్టానికి లోబడే వ్యవహరించాలి

- తెలంగాణ వాదనలు చెల్లవు
- బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది వాదన

ఈనాడు, అమరావతి: 'ప్రాజెక్టుల నీటి కేటాయింపులను తిరగదోడేందుకు ఏ మాత్రం వీల్లేదు. కృష్ణా జలాల పంపకం తొలి, రెండో ట్రైబ్యునళ్ల ద్వారా పూర్తయింది. పూర్తి తీర్పుగా వెలువడింది. ఇప్పుడు ట్రైబ్యునల్‌కు కేంద్రం ఇచ్చిన అదనపు మార్గదర్శకాలకు సంబంధించి చట్టపరమైన పరిధిని గుర్తించాలి. గతంలోని అవార్డుల్లో ఉన్న నిర్ణయాలకు, సూత్రాలకు కట్టుబడి ఉండాలి. నీటి పంపకాలను కొత్తగా చేపట్టడం లేదు. ఇప్పటికే నీటి పంపకాలు పూర్తయ్యాయి. ఇప్పుడు చేయాల్సింది కొనసాగింపు మాత్రమే' అని ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ కౌన్సిల్ జయదీప్ గుప్తా వాదించారు. బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట మంగళవారం ఆయన వాదనలు వినిపించారు. తెలంగాణ చేసిన వాదనలు చెల్లుబాటు కావని, ఏ విషయాన్నీ వారు నిరూపించలేకపోయారని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది జయదీప్‌గుప్తాకు మరో సీనియర్ న్యాయవాది ఉమాపతి, న్యాయవాదులు ఎస్.సంజయ్, శరత్‌చంద్రలు సహకరించారు. మూడు రోజుల పాటు ట్రైబ్యునల్ ముందు ఏపీ వాదనలు కొనసాగనున్నాయి.

### మంగళవారం నాటి వాదనల్లో కీలకాంశాలు ఇవి..

- ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లో 9వ భాగానికి లోబడి మాత్రమే నీటి అంశాల్లో మార్పుల అనుమతికి అవకాశం ఉంది. అంతకుమించి చేసేందుకు సాధ్యం కాదు. బచావత్ ట్రైబ్యునల్, బ్రిజేష్ ట్రైబ్యునల్ సూత్రాలు, తీర్పులు, విశ్లేషణలు, నిర్ధారణలను ఇప్పుడు మళ్లీ తిరగదోడలేరు. ఆ ట్రైబ్యునళ్ల తీర్పులకు పూర్తి రక్షణ ఉంది.
- 2014 ఏపీ పునర్ విభజన చట్టంలో అలాంటి ఆదేశాలు లేనందున వీటిని తిరగదోడేందుకు, విడిచిపెట్టడానికి ఎలాంటి అధికారాలూ ట్రైబ్యునల్‌కు లేవు.
- 2002లో సవరించిన అంతర్రాష్ట్ర జలవివాద చట్టం ద్వారా 2002కు ముందు పరిష్కరించిన నీటి వివాదాలకు రక్షణ ఉంటుంది. వాటిపై తిరిగి నిర్ణయాలు సాధ్యం కాదు
- బ్రిజేష్ ట్రైబ్యునల్‌కు అప్పగించిన అదనపు అంశాలు కేవలం ప్రొసీజర్ మాత్రమే. ఇప్పటికే నిర్ణయమైన వాటికి అనుబంధంగా చేపట్టే ప్రక్రియ మాత్రమే. 2014 పునర్ విభజన చట్టంలో ఏం పేర్కొన్నారో అదే కీలకం. అది దాటి వ్యవహరించేందుకు ఎలాంటి అవకాశమూ లేదు.
- అంతర్‌రాష్ట్ర జల వివాదాల చట్టం గెజిట్‌లో ప్రచురించిన తీర్పులు శాశ్వతం అని సుప్రీంకోర్టు ఇప్పటికే తేల్చి చెప్పింది.
- బచావత్ ట్రైబ్యునల్ తేల్చిన అంశాలన్నీ ఇప్పటికీ అమల్లో ఉంటాయని బ్రిజేష్ ట్రైబ్యునల్ కూడా ఇప్పటికే స్పష్టం చేసింది.
- ట్రైబ్యునల్ తీర్పులకు సుప్రీంకోర్టు డిక్రీలతో సమానమైన బలం ఉంది. మునుపటి ఆదేశాలను పాటించాల్సిందే.
- కృష్ణా ట్రైబ్యునల్-2 అవార్డు ప్రచురణ వల్ల సెక్షన్ 6 (ఏ) కింద గెజిట్‌లో ప్రచురితమైన తర్వాత సగటు ప్రవాహంలో 194 టీఎంసీల అదనపు నీరు కేటాయించాలన్న నిబంధన అమల్లోకి వచ్చింది. ఇప్పటికే వినియోగంలో ఉన్న నీటి కేటాయింపులకు కొత్త ప్రాజెక్టులు, నిర్మించేందుకు ప్రణాళికలో ఉన్న ప్రాజెక్టుల కన్నా ప్రాధాన్యం ఇవ్వాల్సిందే.
- తెలంగాణ తన ప్రణాళికాబద్ధ ప్రాజెక్టుల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు కలిగే నష్టాన్ని మించిన లాభాలు ఇస్తాయని నిరూపించలేదు. విభజన చట్టం నిర్దేశించిన మేరకే ట్రైబ్యునల్ పరిమితం కావాలి.

## ఓర్వకల్లు, శ్రీసిటీల్లో రైల్వే సైడింగ్ ఏర్పాటుకు ప్రతిపాదన

- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన మంత్రి టీజీ భరత్


అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి భరత్


ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ఓర్వకల్లు, శ్రీసిటీల్లో రైల్వే సైడింగ్ ఏర్పాటు అంశంపై కేంద్రం సానుకూలత వ్యక్తం చేసిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను దిల్లీలో కలిసి చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ''ప్రధాన పారిశ్రామిక పార్కుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు పారిశ్రామిక, లాజిస్టిక్ సదుపాయాలను బలోపేతం చేయడంపై చర్చించాం. అలాగే విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులు, వ్యాపార వర్గాలకు ఉపయోగంగా కర్నూలు నుంచి విజయవాడకు కొత్త రైలు సౌకర్యం కోసం ప్రతిపాదించాం. వాటిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు'' అని వెల్లడించారు.

## మయన్మార్ సైబర్ ముఠా నుంచి.. 43 మంది ఏపీవాసులకు విముక్తి

ఈనాడు, అమరావతి: మయన్మార్ సైబర్ క్రైం ముఠా చెర నుంచి విముక్తి పొంది స్వదేశానికి తిరిగొచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మయన్మార్ నుంచి 370 మంది భారతీయులతో కూడిన 3 ప్రత్యేక విమానాలు దిల్లీ చేరుకోగా, అందులో ఏపీకి చెందిన 43 మందిని వారి స్వస్థలాలకు చేర్చామన్నారు. వీరు విశాఖ, విజయవాడ ప్రాంతాలకు చెందిన వారని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరికి దిల్లీలో వసతి, భోజన ఏర్పాట్లు చేసి అవసరమైన వారికి ఆర్థిక సాయాన్నీ ఏపీ భవన్ అధికారులు అందించారని తెలిపారు.

# నిరుద్యోగుల గోడు పట్టని ఏపీపీఎస్సీ

- 890 పోస్టులకు పరీక్షల షెడ్యూల్ విడుదలలో జాప్యం
- డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఫలితాల విడుదలలోనూ ఆలస్యమే
- పీసీబీలో 18 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించినా ప్రకటన ఇవ్వని వైనం




ఈనాడు, అమరావతి: ఉద్యోగ ప్రకటనలు.. పరీక్షల నిర్వహణలో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) అంతులేని జాప్యం చేస్తోంది. పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించినా ప్రకటనలు విడుదల చేయట్లేదు. కొన్నింటికి నోటిఫికేషన్లు ఇచ్చినా పరీక్షల షెడ్యూల్ ఇవ్వకుండా జాప్యం చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో నిరుద్యోగులకు ఎదురుచూపులు తప్పడం లేదు. న్యాయ వివాదాలు లేని వాటి విషయంలోనూ అలసత్వం కొనసాగుతోంది. ఏపీపీఎస్సీ ఛైర్మన్ పదవి ఖాళీగా ఉంది. ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా సభ్యుడు శశిధర్ కొనసాగుతున్నారు. ఏపీపీఎస్సీ వద్ద భర్తీచేయాల్సిన పోస్టులు ఎక్కువగా పెండింగ్‌లో ఉంటే కొత్త ప్రకటనల విడుదల కష్టంగా మారుతుంది. ఇప్పటికే కోర్టు కేసులతో గ్రూపు-1, గ్రూపు-2 ఫలితాలు పెండింగ్‌లో పడ్డాయి.

### 890 పోస్టుల భర్తీకి ఎదురుచూపులు

ఏపీపీఎస్సీ ఇటీవల 890 పోస్టుల భర్తీకి 21 నోటిఫికేషన్లను విడుదల చేసింది. ఈ ఏడాది జులై నుంచి సెప్టెంబరు వరకు ఈ ప్రకటనలు ఇచ్చింది. వీటిల్లో అటవీశాఖ బీట్ అధికారులు, సహాయ బీట్ అధికారుల 691, సెక్షన్ అధికారుల 100 పోస్టులకు సెప్టెంబరు 7న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. మెయిన్ పరీక్షకు ఇంతవరకు షెడ్యూల్ ఇవ్వలేదు.

- 19 నోటిఫికేషన్లకు సంబంధించి 99 పోస్టులు ఉన్నాయి. అన్ని పోస్టులకూ అక్టోబరు 29లోపే దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. దేవాదాయశాఖలో ఈఓ పోస్టులకు ఆగస్టులో నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంతవరకు పరీక్షలు ఎప్పుడో స్పష్టత లేదు.
- పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు రెండు, మూడు పోస్టులకు పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతుంటారు. పరీక్షల షెడ్యూల్‌లో జాప్యం జరిగితే నిరుద్యోగులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

### లెక్చరర్ పోస్టుల ఫలితాలు ఎప్పుడు?

డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ లెక్చరర్ల పోస్టులకు పరీక్షలు నిర్వహించారు. వీటికి ఫలితాలు ఇవ్వలేదు. పాలిటెక్నిక్ లెక్చరర్లు-99, జూనియర్ లెక్చరర్లు- 47, డిగ్రీ లెక్చరర్లు-290 పోస్టులకు జులై 15 నుంచి 23 వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు పూర్తయి మూడు నెలలైనా ఫలితాల కోసం ఎదురుచూపులు తప్పట్లేదు.

### ప్రకటనలోనూ అదే దుస్థితి

కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)లో 18 పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీకి అనుమతిస్తూ ఆర్థికశాఖ అక్టోబరు 1న ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు వచ్చి 45 రోజులు గడిచినా ఇంతవరకు ప్రకటన విడుదల కాలేదు. పీసీబీలో 18 ఎనలిస్ట్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి తెలిపింది. వీటిని భర్తీ చేయడంలో ఏపీపీఎస్సీలో జాప్యం జరుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పోస్టుల పూర్తి వివరాలను సైతం పీసీబీ నుంచి ఇప్పటివరకు తీసుకోలేదని తెలిసింది.

## మహిళతో హోంగార్డ్ అసభ్య నృత్యాలు

- సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు

కంకిపాడు, న్యూస్‌టుడే: హోంగార్డ్‌గా పనిచేస్తున్న వ్యక్తే నిబంధనలు మరిచి చిన్నపిల్లల ముందు మహిళతో అసభ్యకరంగా నృత్యం చేసిన వైనమిది. కృష్ణా జిల్లా కంకిపాడు పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో విధుల్లో ఉన్న గండిగుంటకు చెందిన అజయ్‌కుమార్ రెండేళ్లుగా సీఐ మురళీకృష్ణ వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నెల కిందట గొంతేనమ్మ పండగ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ సామాజిక భవనంలో అసభ్య నృత్యాలు ఏర్పాటు చేశారు. ఇందులో అజయకుమార్ ఓ మహిళతో చేసిన నృత్యం వీడియోలు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అయ్యాయి. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీశారు. స్థానిక పోలీస్ అధికారుల నివేదిక ఆధారంగా అజయ్‌కుమార్‌ను విధుల్లోంచి తొలగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గతంలోనూ ఇలాంటి ప్రదర్శనలు జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

## సాంబారు గిన్నెలో పడి చిన్నారి మృతి


ప్రేరణ

పెదపారుపూడి, న్యూస్‌టుడే: వేడి సాంబారు గిన్నెలో పడి ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం వానపాములలో ఆదివారం రాత్రి ఓ ఫంక్షన్‌కి గ్రామానికే చెందిన మదిరి ప్రవీణ్‌కుమార్ దంపతులు తమ నాలుగేళ్ల కుమార్తె ప్రేరణతో కలిసి వెళ్లారు. ఫంక్షన్ మరికాసేపట్లో ప్రారంభం అవుతుందనగా.. చిన్నారి ఆడుకుంటూ భోజనాల కోసం సిద్ధం చేసిన సాంబారు గిన్నెపై కూర్చుంది. ప్లేటు పక్కకు ఒరగడంతో ఒక్కసారిగా వేడి సాంబారులో పడిపోయింది. దీంతో చిన్నారి శరీరం పూర్తిగా కాలింది. ఫంక్షన్‌కి వచ్చినవారు దీన్ని గుర్తించి.. చిన్నారిని వెంటనే విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రేరణ సోమవారం మృతి చెందింది. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రవీణ్‌కుమార్ దంపతులకు నలుగురు సంతానం. ప్రేరణ మూడో సంతానం. అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొని చిన్నారి శవపేటిక మోశారు. కుటుంబసభ్యులను ఓదార్చారు.

## బెంగళూరులో రూ.23 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

- నైజీరియాకు చెందిన నిందితుడి అరెస్ట్


మాదక ద్రవ్యాలను పరిశీలిస్తున్న సీమంత్ కుమార్ సింగ్ తదితరులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: టెకీలు, యువతకు మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న నైజీరియాకు చెందిన నిందితుడు ఇజికే ఇంజిగో(42) బెంగళూరు పోలీసులకు మంగళవారం పట్టుబడ్డాడు. యలహంక పరిధిలో అద్దె ఇంట్లో ఉంటున్న ఇతడి నుంచి రూ.23.74 కోట్ల విలువైన 11.640 కిలోల ఎండీఎంఏ గుళికలు, మాదక ద్రవ్యాలు తయారు చేసేందుకు ఉపయోగించే 2.235 కిలోల ముడి సరకును స్వాధీనం చేసుకున్నామని నగర కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తెలిపారు. వ్యాపార వీసా తీసుకుని 2017లో భారత్‌కు వచ్చిన నిందితుడు గతంలోనూ మాదక ద్రవ్యాలు విక్రయిస్తూ పట్టుబడ్డాడని, బెయిలుపై బయటకు వచ్చి మళ్లీ నేరాలకు పాల్పడుతున్నాడని చెప్పారు.

## సాక్ష్యాధారాలు లేవని సీఐడీ రిఫర్డ్ ఛార్జిషీట్ వేసింది

- హైకోర్టుకు నివేదించిన విక్రాంత్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: కాకినాడ సీపోర్ట్స్ (కేఎస్‌పీఎల్), కాకినాడ సెజ్ (కేఎస్ఈజడ్)లోని తమ వాటాను బలవంతంగా లాక్కొని అరబిందో సంస్థ పరం చేశారంటూ నమోదు చేసిన కేసులో సాక్ష్యాధారాలు లేవంటూ కాకినాడ కోర్టులో సీఐడీ రిఫర్డ్ ఛార్జిషీట్ దాఖలు చేసిందని వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి తరఫు న్యాయవాది వై.నాగిరెడ్డి హైకోర్టుకు నివేదించారు. రిఫర్డ్ ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న కాకినాడలోని రెండో అదనపు జ్యుడిషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ కోర్టు (సీఐడీ కోర్టు) ఈ ఏడాది అక్టోబరు 27న విక్రాంత్‌రెడ్డిపై కేసును మూసివేసిందన్నారు. ఈ నేపథ్యంలో సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ విక్రాంత్‌రెడ్డి ఈ ఏడాది మార్చిలో హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరణకు అనుమతించాలని కోరారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు.. పిటిషన్ ఉపసంహరణకు అనుమతిస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. కేఎస్‌పీఎల్, కేఎస్ఈజడ్‌లో తమకు చెందిన రూ.3,609 కోట్ల విలువైన వాటాను బలవంతంగా లాక్కొన్నారంటూ కేవీహెచ్‌పీఎల్, కేవీఆర్ గ్రూప్ యజమాని కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మంగళగిరి సీఐడీ అధికారులు 2024 డిసెంబర్లో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

## జెన్‌కో బొగ్గు టెండరు అదానీకే

- ఇండోనేసియా నుంచి 5 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి
- టన్ను ధర రూ.10 వేలకు కోట్ చేసిన సంస్థ

ఈనాడు, అమరావతి: ఇండోనేసియా నుంచి ఐదు లక్షల టన్నుల బొగ్గు కొనుగోలుకు ఏపీ జెన్‌కో పిలిచిన టెండర్‌ను అదానీ సంస్థ మరోసారి దక్కించుకుంది. ఈ బిడ్ దక్కించుకునేందుకు అదానీతో పాటు మోహిత్ మినరల్స్, స్మార్ట్ జెన్ ఇన్‌ఫ్రా కంపెనీలు పోటీ పడ్డాయి. టన్ను బొగ్గును రూ.10 వేలకు సరఫరా చేసేలా కోట్ చేసిన అదానీ సంస్థ ఎల్-1గా నిలిచింది. ఆ సంస్థ వచ్చే ఏడాది జనవరి నుంచి 6 నెలల్లో బొగ్గు సరఫరా చేయాల్సి ఉంటుంది. మోహిత్ మినరల్స్ జెన్‌కో టెండర్ల ప్రక్రియలో గతంలో ఒకసారి పాల్గొనగా.. దిల్లీకి చెందిన స్మార్ట్ జెన్ ఇన్‌ఫ్రా మొదటిసారి బిడ్డింగ్‌లో పాల్గొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటిసారి విదేశీ బొగ్గు కొనుగోలుకు జెన్‌కో టెండరు పిలిచింది.

### మార్కెట్ ధరల సూచీ ఆధారంగా

ఇండోనేసియా ప్రైస్ ఇండెక్స్, బొగ్గు రవాణా చేసే వెసల్‌లో వినియోగించే డీజిల్ ధరల ఆధారంగా బొగ్గు ధర నిర్దేశించేలా టెండరులో నిబంధన పెట్టారు. దీని ప్రకారం అప్పటి ఇండెక్స్ ఆధారంగా సరఫరా సంస్థకు టన్ను బొగ్గు ధర నిర్దేశించనున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బొగ్గు ధరలు తక్కువగా ఉన్నాయి. బిడ్డింగ్ ప్రక్రియ నాటితో పోలిస్తే టన్ను బొగ్గుపై రూ.500 తగ్గినట్లు అధికారులు పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి వరకు బొగ్గు ధరలు తగ్గుతూ ఉంటాయన్నది అధికారుల అంచనా. ఈ వ్యవధిలో సాధ్యమైనంత మేర బొగ్గు తీసుకోవాలని భావిస్తున్నారు.

### కృష్ణపట్నంలో మొదటి రెండు యూనిట్ల కోసం

కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రంలోని మొదటి రెండు యూనిట్లకు కనీసం 6,000 గ్రాస్ కెలోరిఫిక్ వాల్యూ (జీసీవీ) ఉన్న బొగ్గు అవసరం. సింగరేణి, మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి తీసుకునే బొగ్గు గరిష్ఠంగా 4,500 జీసీవీ మించడం లేదు. ఈ యూనిట్లకు వాష్డ్ కోల్ వినియోగించారు. ఈ సమయంలో సుమారు 30 శాతం మేర బొగ్గు వృథా అవుతోంది. తక్కువ జీసీవీ ఉన్న బొగ్గును వాడటం వల్ల బూడిద శాతం పెరుగుతోంది. ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం దెబ్బతింటోంది. ఈ దృష్ట్యా ప్లాంటు డిజైన్ ప్రకారం దేశీయ బొగ్గుతో పాటు 30 శాతం విదేశీ బొగ్గును కలిపి వినియోగించాలని అధికారులు నిర్ణయించారు. తద్వారా ప్లాంటు ఉత్పాదక సామర్థ్యాన్ని కనీసం 80 శాతానికి తీసుకురావాలన్నది ఆలోచన. ప్రస్తుతం రెండు యూనిట్లలో ఉత్పత్తి సామర్థ్యం 50 శాతం మించడం లేదు. దీనికితోడు తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.

- వచ్చే ఏడాది వేసవి జెన్‌కో థర్మల్ కేంద్రాల ద్వారా 100 మిలియన్ యూనిట్లకు తగ్గకుండా ఉత్పత్తి ఉండాలన్నది అధికారుల ఆలోచన. ఈ దృష్ట్యా మార్చి నాటికి విదేశీ బొగ్గు అందుబాటులో ఉంచుకోవాలని నిర్ణయించారు.

## మా దారి.. రహదారి!

**వి**శాలమైన బందరు రోడ్డులో... చాలా దుకాణాలకు సెల్లార్ పార్కింగ్ సదుపాయం అంతంతగానే ఉంది. దీంతో చాలా మంది వాహనాలను ఇలా రహదారిపైనే ఆపేసి వెళ్లిపోతున్నారు. బందరురోడ్డులో ఆలిండియా రేడియో స్టేషన్ సమీపంలో మంగళవారం బారులు తీరిన వాహనాలివి.



విశాలంగా ఉందిగా ఎవరు అడుగుతారులే.. ట్రాఫిక్‌కు అంతరాయం ఉండదు అనుకుని ఇలా వాహనాలు ఆపేసి వెళ్లిపోతున్నారు.
- ఈనాడు, అమరావతి

## ఒక్కో మెట్టు.. దిగజారేట్టు!
### సమస్యల సుడిగుండంలో కృష్ణా వర్సిటీ

**ఈనాడు డిజిటల్, మచిలీపట్నం**

**ఏ**ళ్లుగా కృష్ణా యూనివర్సిటీ సమస్యల సుడిగుండంలోనే కొట్టుమిట్టాడుతోంది. 2008లో యూనివర్సిటీ స్థాపించినప్పుడు దాని పరిధిలో 167 కళాశాలలు ఉండగా ఆ సంఖ్య 144కు తగ్గింది. సరైన వసతి భవనాలు లేక వర్సిటీలో విద్యార్థుల చేరికలపై ప్రభావం చూపుతోంది. వైకాపా ఐదేళ్ల పాలనలో వర్సిటీని అంతర్గత రాజకీయాలతో దిగజార్చారు. కొత్త వీసీ వచ్చాక అన్ని పనులు చక్కదిద్దుతున్నా ఉద్యోగుల అంతర్గత కలహాలు వీడట్లేదు. ఐదేళ్లుగా ఓ అధికారి ఒంటెద్దు పోకడలతో ఉద్యోగులపై చేయి చేసుకున్నారు. పలువురు ప్రొఫెసర్లు పదవుల కోసం పాకులాడుతున్నారే తప్ప విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టట్లేదు. పెద్దఎత్తున ఇంజినీరింగ్ విద్యార్థులు పరీక్షలు తప్పారు. కూటమి ప్రభుత్వంలోనైనా పరిష్కారం లభిస్తుందనుకుంటే పరిస్థితి మారట్లేదు.

**ప్రాంగణం ఉన్నా.. ఈవెంట్లు బయటే..**
దాదాపు 102 ఎకరాల్లో ఉన్న కృష్ణా వర్సిటీ ప్రాంగణంలో భవనాలు పోనూ మిగిలినదంతా చెరువులా మారిపోయింది. వీసీలు, రిజిస్ట్రార్లు మారుతున్నా మెరక చేయించలేకపోతున్నారు. ప్రభుత్వానికి దుల సహకారం కోరితే అదిగో ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. జూన్-జులైలోనే పూర్తి కావాల్సిన విద్యార్థినుల వసతి భవనం పలు కారణాలతో ఆలస్యం చేశారు. దీన్ని పూర్తి చేయకుండానే మరో అంతస్తుకు ప్రయత్నిస్తున్నారు. వర్సిటీ పరిధిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలకు అనువైన చోటు లేక బయట సంస్థలపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఐదేళ్ల రూసా నిధులు రూ. 20కోట్లు మంజూరవగా అందులో కొంత మేర కేటాయిస్తే ఏళ్లుగా పునాదుల్లో ఆగిపోయిన విద్యార్థుల వసతి భవనం పూర్తవుతుంది. దీనివల్ల చేరికలు పెరుగుతాయని ప్రొఫెసర్లు, విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**కొలిక్కిరాని నిర్మాణాలు..**

✦ ఇంజినీరింగ్, యువకుల వసతి భవనాలకు రూ.10 కోట్ల మేర ఖర్చు చేసి నిధులు చాలవని పునాదుల్లో నిలిపేశారు. పనుల పూర్తికి రూ. 45కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టి నెలలు గడుస్తున్నా ఫలితం కనిపించట్లేదు. ఇటీవల తుప్పుపట్టిన చువ్వలను శుభ్రం చేయించారు. వర్షాలకు మళ్లీ పాడవుతున్నాయి.
✦ రాజధాని డిమాండ్‌కు తగిన కోర్సులు ప్రారంభించేందుకు ఎన్టీఆర్ జిల్లాలో పీజీ సెంటర్ ఏర్పాటు చేసి పరిశోధనలకు ఊతమివ్వాలని, తక్షణ అవసరాలకు భవనం చూపాలని పెట్టిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి.
✦ వర్సిటీకి 108 మంది శాశ్వత ప్రొఫెసర్లు ఉండాలి. కానీ 17 మందే ఉన్నారు. 53 మంది ఒప్పంద ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు.



చెరువులా మారిన వర్సిటీ ప్రాంగణం.. సగంలో నిలిచిన విద్యార్థుల వసతి భవనం

**పూర్తి చేసేలా..**
నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వీసీ కూన రాంజీ తెలిపారు.

## ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా తిరుమలకుమార్

**ఈనాడు, అమరావతి-పాయకాపురం, న్యూస్‌టుడే:** ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఎస్ఈగా సీహెచ్ తిరుమలకుమార్‌ను నియమిస్తూ ఈఎన్సీ గాయత్రిదేవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన విజయవాడలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి ఎస్ఈగా బాధ్యతలు నిర్వహించిన విద్యాసాగర్‌ను కలెక్టర్ లక్ష్మీశ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఈఈగా వచ్చిన ఆయనకు ఎస్ఈగా బాధ్యతలు అప్పగించినా ఆశించిన స్థాయిలో పని చేయలేకపోయారు. జలజీవన్ మిషన్ పనులు మంజూరైనా టెండర్ల ప్రక్రియ ముందుకు వెళ్లనివ్వలేకపోయారు. పనులు పట్టాలెక్కించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలో అలసత్వం.. అక్కడ కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతున్నా పనులపై దృష్టి సారించలేదనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పులేని నేపథ్యంలో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

## ప్రతిపాదించు.. ప్రతిదీ విస్మరించు!
### స్టేషన్ల పరిధి పెరిగి.. పర్యవేక్షణ కరవు..
### సుదీర్ఘకాలంగా కొలిక్కిరాని కొత్త అంశాలు

**ఈనాడు - అమరావతి**

విజయవాడ నగరం శరవేగంగా విస్తరిస్తోంది. ఏటా జనాభా పెరుగుతూనే ఉంది. వాణిజ్య కూడలిగా అభివృద్ధి చెందింది. ముఖ్యంగా శివార్లలో జనసాంద్రత పెరుగుతోంది. నేరాలు పెచ్చుమీరుతున్నాయి. ఆ స్థాయిలో పోలీసుస్టేషన్లు ఏర్పాటుకాక.. ఉన్న వాటిపై కేసుల భారం పెరుగుతోంది. నగర కమిషనరేట్ నుంచి పెట్టిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు. శివార్లలో ఏటైనా... రోజువారీగా ఎస్‌హెచ్‌ఓ, ఎస్.ఐలకు పర్యవేక్షణ కష్టమవుతోంది.


**కత్తి మీద సామే..**
★ రెండో పట్టణ రాజా పరిధి బాగా పెరిగింది. నగరంలో కాలువల వెంట ఉన్న చాలా ఆవాసాలు తొలగించి జక్కంపూడిలో ప్రత్యేక కాలనీ నిర్మించారు. జక్కంపూడి, పరిసరాల్లో నేరాలు పెరగడంతో పర్యవేక్షణ గతి తప్పి.. అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరాయి. ఇది నేరస్థులకు అడ్డాగా మారుతోంది. వీటిని సమర్థంగా అరికట్టేందుకు టూటౌన్ స్టేషన్‌ను విభజన గతంలో ప్రతిపాదించారు.

జక్కంపూడి, పాతపాడు, కొత్తూరు తాడేపల్లి, కొత్తూరు, అంబాపురంల్లో కొత్త స్టేషన్ ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదన



★ పటమట రాజా పరిధి కూడా పెద్దదే. స్క్యూ బ్రిడ్జి నుంచి గూడవల్లి వరకు ఉంది. బందరు రోడ్డులో బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ వరకు విస్తరించింది. పరిధి ఎక్కువై పర్యవేక్షణ కష్టమవుతోంది. ఇక్కడ ఆవాస ప్రాంతాలు, కాలనీలు ఎక్కువ. వైట్ కాలర్, ఆర్థిక నేరాలు అధికంగా జరుగుతుంటాయి. దీనిని విభజించాలనే ప్రతిపాదన ఏళ్లుగా ఉన్నా మోక్షం లేదు.

**రాకపోకలకూ చుక్కలే..**
★ నగరంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. ఇప్పటికే 5 ట్రాఫిక్ స్టేషన్లు ఉన్నాయి. వీటికి అదనంగా మరొకటి అవసరం. కమిషనరేట్ పరిధిలో జాతీయ రహదారులు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఇబ్రహీంపట్నంలో స్టేషన్ అవసరమని ప్రతిపాదించారు. ఇబ్రహీంపట్నం వద్ద విజయవాడ - హైదరాబాద్, విజయవాడ - జగదల్‌పూర్ జాతీయ రహదారులు ఉన్నాయి.



**ఆర్థిక భారంతోనే వెనక్కి...**
కొత్త స్టేషన్ల ఏర్పాటు వ్యయంతో కూడిన పనికావడంతో ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. ఆర్థిక శాఖ వద్ద ఈ దస్త్రాలు అంతే ఉన్నాయి. అక్కడ ఆమోదిస్తేనే ఫలితం ఉండేది. భారీగా సిబ్బంది కూడా అవసరమే. సీఐ, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, క్రైం సిబ్బందితో కలిపి 30-40 మంది కావాలి.

**దే**శంలో ఉగ్ర కదలికల నేపథ్యంలో విజయవాడ రైల్వేస్టేషన్ భద్రత మరోసారి వెలుగులోకి వచ్చింది. రైళ్లలో దొంగతనాలు, దోపిడీలు, దాడులు విపరీతంగా పెరిగాయి. వీటితో పాటు పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా శ్రుతిమించిపోతోంది. దీనికి తోడు ప్రధానంగా మహిళల భద్రతపైనా సందేహాలు పెరిగాయి. ఇటీవల గుంటూరు జిల్లాలో ఓ మహిళపై అత్యాచారం జరిగిన ఘటన ఆందోళన కలిగిస్తుంది. ఈ క్రమంలో రైల్వే శాఖ అన్ని రైళ్లలో ప్రయాణికులకు భరోసా కల్పించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని రైళ్లల్లో ఏర్పాటు చేశారు.
**- విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే**

## ప్రయాణికులకు భయం ఉండదిక..!
### దశలవారీగా సీసీ కెమెరాల ఏర్పాటు

మొత్తం రైళ్లు - 250
ప్రయాణికుల రాకపోకలు: 1.5 లక్షలు
రద్దీ వేళల్లో: 2 నుంచి 2.5 లక్షలు

**నేరాలకు అడ్డుకట్ట..** పెరుగుతున్న నేరాలకు అడ్డు కట్ట వేయడం.. ప్రయాణికుల భద్రతపై రైల్వే ప్రధానంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా 74 వేల ప్రయాణికుల, 15 వేల సరకు రవాణా బోగీల్లో సీసీ కెమెరాలను తొలి దశలో భాగంగా అమర్చనున్నారు. ★ రైలు బోగీలో ప్రయాణికులు ఎక్కే మార్గం, లోపల వైపు అధునాతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా విజయవాడ డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని రైళ్లలో ఇప్పటికే కెమెరాలను బిగించారు.



బోగిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

సీసీ కెమెరాలు నమోదు చేస్తున్న పుటేజీ చాలా స్పష్టంగా ఉందని అధికారులు తెలిపారు.

★ రైలు ఎంత వేగంలో ఉన్నా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రికార్డు చేసేలా ఉందని పేర్కొన్నారు. ఉగ్ర కదలికల నేపథ్యంలో విజయవాడ డివిజన్‌లోని అన్ని ప్రధాన రైళ్లలో సీసీ కెమెరాలను వెంటనే ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

## భక్తులకు సువర్ణావకాశం..
### ఉచితంగా అంతరాలయ దర్శనం ట్రయల్ రన్

**ఇంద్రకీలాద్రి:** దుర్గగుడిలో అంతరాలయ దర్శనం టికెట్ రూ.500 ఖర్చు పెట్టలేని పేదలు సర్వదర్శనానికే పరిమితం అవుతున్నారు. ఇదేతరుణంలో దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ క్షేత్ర పరిస్థితి పరిశీలించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఆకాంక్షతో దసరా ఉత్సవాల్లో సైతం గతంలో ఎన్నడూ లేనివిధంగా టికెట్ల విక్రయాలు వారం రోజులు నిలిపి ఉచితంగా అమ్మవారి దర్శనం చేయించారు. ఈ క్రమంలో మధ్యాహ్నం వేళ సర్వదర్శనం క్యూలైన్లో వచ్చే భక్తులకు గంటపాటు అంతరాలయ దర్శనం కల్పించేందుకు మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించగా విశేష స్పందన లభించింది. దీనిపై పాలకమండలిలో తీర్మానం చేసి ఆ నిర్ణయాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ ఆమోదం పొందాకే అమల్లోకి వస్తుందని ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ పేర్కొన్నారు.



సర్వ దర్శనం క్యూలైన్ల భక్తులను అంతరాలయానికి అనుమతిస్తున్న ఈవో, ఛైర్మన్

## అఖండ.. నారసింహ..



**మా**గల్లులో 108 అడుగుల ఎత్తైన లక్ష్మీనరసింహస్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అడుగు భాగంలో దేవాలయం, పైన స్వామి విగ్రహం కనిపించేలా దేవాలయం(వైకుంఠ నారాయణ క్షేత్రం) నిర్మించారు. 2017లో రూ.2 కోట్ల భక్తుల విరాళాలతో ఏఎస్ఎన్ఎస్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దీనిని నిర్మించారు. స్వామివారు తొలుత రాతిపై స్వయంభుగా కనిపించడంతో దేవాలయం నిర్మించామని, 108 అడుగుల ఎత్తైన లక్ష్మీనరసింహస్వామి విగ్రహం కట్టడం దేశంలో ఓ ప్రత్యేకతగా నిలుస్తుందని ట్రస్టు గౌరవాధ్యక్షుడు అంగర రాంబాబు తెలిపారు. దేవాలయం లోపల మూలవిరాట్ వద్ద నేపాల్‌లోని గండకీ నది నుంచి తీసుకువచ్చిన సాలగ్రామ లక్ష్మీనరసింహస్వామి విగ్రహం ప్రతిష్ఠ చేశారు. ఆంధ్రా, తెలంగాణలోని భక్తులు ఈ దేవాలయాన్ని సందర్శిస్తున్నారు. విజయవాడ, హైదరాబాద్ నుంచి బస్సు ద్వారా నందిగామకు చేరుకుని అక్కడి నుంచి దేవాలయాన్ని దర్శించుకోవచ్చు. తెలంగాణ ఖమ్మం జిల్లా మధిర వరకు రైలులో చేరుకుని అక్కడి నుంచి బస్సులో 13 కి.మీ దూరంలో క్షేత్రాన్ని దర్శించుకోవచ్చు.
**- మాగల్లు(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే**

## ఇంకెందరిని అప్రోచ్ అవ్వాలి?

నందిగామ, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

- నాలుగేళ్లుగా ముఖం చాటేసిన గుత్తేదారు
- చోద్యం చూస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్

**నం**దిగామ మండలం దాములూరు వద్ద వైరా ఏరుపై ఎనిమిదేళ్ల క్రితం వంతెన నిర్మించినా ఇంతవరకు అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయలేదు. గత వైకాపా ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేదని గుత్తేదారుడు ముఖం చాటేశాడు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర పూర్తయినా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌లు ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో మాట్లాడినా ఫలితం కనిపించడం లేదు.

**40**
వైరా ఏటికి వరదలు వస్తే దాములూరు వద్ద రాకపోకలు బంద్ అవుతున్నాయి. దీనివల్ల రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోని 40 గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదలకు లోలెవల్ కాజ్‌వే పూర్తిగా ధ్వంసమైంది. కాంక్రీట్ కొట్టుకుపోయింది. పెద్ద పెద్ద రాళ్లు బయటకు వచ్చాయి. రోజుల తరబడి మధిర, కంచికచర్ల మీదుగా చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. దీంతో పాటు దాములూరు వద్ద నుంచి వంతెన వరకు రోడ్డు పలుచోట్ల దెబ్బతింది.



అప్రోచ్ రోడ్డుకు నోచుకోని హైలెవల్ వంతెన

**2021 నుంచి..**
వత్సవాయి-చెవిటికల్లు ఆర్అండ్‌బీ రోడ్డు.. వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, వీరులపాడు, కంచికచర్ల మండలాల మీదుగా వెళుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ రోడ్డు గుండా రాకపోకలు చేస్తుంటారు. ఈ మార్గంలో దాములూరు వద్ద వైరా ఏరుపై ఎనిమిదేళ్ల కిందట వారధి నిర్మించారు. అనంతరం అప్రోచ్ రోడ్లు నిర్మించలేదు. 2019లో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) నిధులు రూ.39 కోట్లతో ఇరు వైపులా 400 మీటర్ల అప్రోచ్ రోడ్డు, 14 కి.మీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచి 2021లో గుత్తేదారుకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. చేసిన పనులకు గత బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు గుత్తేదారు పనులు ఆపేశాడు. మధ్యలో మరో గుత్తేదారుకు అప్పగించాలని ప్రయత్నించినా అతడు అనారోగ్యానికి గురికావడంతో ముందుకు రాలేదు. గతంలో ఆర్అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ వచ్చి పరిశీలించి వెళ్లినా ఫలితం శూన్యం.

**మరమ్మతులు చేస్తాం**
కాజ్‌వే మరమ్మతులకు రూ.8 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులు త్వరలో చేపడతాం. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నాం. - పరుశురాముడు, డీఈ, ఆర్అండ్‌బీ, జగ్గయ్యపేట

## సిరులనిచ్చే కల్పతరువు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

**ఎ**క్కడైనా చెట్లకు కాసే కాయల ద్వారా ఆదాయం వస్తే దీనికి భిన్నంగా చెట్టు నీడకే ఇక్కడ వస్తుంది. ఎక్కడంటారా.. పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయం వద్ద మామిడి తోటల్లో.. తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ దేవాలయంగా విరాజిల్లుతున్న అమ్మవారి ఆలయానికి భక్తులు భారీగా వస్తుంటారు. ప్రతి శుక్ర, ఆదివారాల్లో రద్దీ ఎక్కువ. మునేరుకు ఓ పక్కన ఆలయం, మరో పక్కన ఆహ్లాదకరమైన వాతావరణంలో మామిడి తోటలు ఉన్నాయి. ఆలయానికి వచ్చే భక్తులు ఎక్కువగా తోటల్లోనే విడిది చేస్తారు. అనంతరం అమ్మవారికి మొక్కుబడులు సమర్పిస్తారు. వీరికి వసతులు తోటల నిర్వాహకులు సమకూర్చుతున్నారు. తోటల యజమానులు వీటిని ఏడాదికి కౌలు లెక్కన లీజుకు ఇస్తారు. మరి కొందరు సొంతంగా నిర్వహిస్తుంటారు. ☆ మామిడి తోటల్లో ఉన్నందుకు భక్తుల వద్ద నిర్వాహకులు డబ్బులు తీసుకుంటారు. దేవాలయం వద్ద మేక, గొర్రెపోతులు సమర్పించి మొక్కుబడులు తీర్చుకుంటారు. ఇక్కడే వంట చేసుకుని తినేసి ఇళ్లకు వెళ్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మామిడి చెట్ల నీడన ఉన్నందుకు నిర్వాహకులకు అద్దె రూపంలో డబ్బులు చెల్లించాలి. దీనికి మేక, గొర్రెకు రూ.700 చొప్పున తీసుకుంటారు. వంట సామగ్రి, ఇతర వస్తువులు అద్దెకు ఇస్తారు. తోటల్లో షెడ్లు ఇచ్చి అద్దె తీసుకుంటారు. ఎకరం మామిడి తోటకు ఏడాదికి రూ.5 లక్షల వరకు సమకూరుతుంది. పలువురు కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు నిర్మించటంతో రోజురోజుకు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది.



చెట్ల నీడలో భోజనాలు చేస్తున్న భక్తులు

## కొండారెడ్డిపై పీటీ వారెంట్‌కు కోర్టు అనుమతి

**ఈనాడు - అమరావతి:** డ్రగ్స్ కేసులో వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డికి పీటీ వారెంట్ జారీ అయింది. ఈమేరకు విజయవాడలోని ఎంఎస్‌జే కోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో కొండారెడ్డి ప్రమేయంపై ఆధారాలు బయటపడడంతో.. మాచవరం పోలీసులు నిందితుడిగా చేర్చారు. ప్రస్తుతం నిందితుడు డ్రగ్స్ కేసులో విశాఖలో అరెస్టు అయ్యాడు. రిమాండ్ నిమిత్తం విశాఖలోని కేంద్ర కారాగారంలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఇక్కడి కేసులో విజయవాడ కోర్టులో హాజరుపరిచేందుకు పీటీ వారెంట్ వేశారు. దీనికి కోర్టు అనుమతించింది. నిందితుడిని బుధవారం విశాఖపట్నం కారాగారంలో అదుపులోకి తీసుకుని.. విజయవాడకు తరలించనున్నారు.

## అభివృద్ధి పనులకు నిధులివ్వండి

**పటమట, జగ్గయ్యపేట, నందిగామ, న్యూస్‌టుడే:** ఎన్టీఆర్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, నందిగామ, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్యలు మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో మునేరు పాత ఆనకట్ట వద్ద తాత్కాలిక రింగ్ బండ్ల ఏర్పాటుకు రూ. 71.45 లక్షలు, తిరువూరు నియోజకవర్గంలోని కట్టలేరు వంతెన నిర్మాణానికి రూ. 30 కోట్లు.. నందిగామ నియోజకవర్గంలోని కంచల ఎత్తిపోతలకు రూ.15 కోట్లు మంజూరు చేయాలని వారు సీఎం చంద్రబాబును కోరారు. ఈ సమస్యలపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. కాగా జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న రహదారులు, వంతెనల పునర్నిర్మాణం, అభివృద్ధి కోసం రూ.170 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అందజేశారు.



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యేలు సౌమ్య, తాతయ్య

## 15 నుంచి శ్రీతిరుపతమ్మ అమ్మవారి మండల దీక్షలు ప్రారంభం

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** శ్రీతిరుపతమ్మ అమ్మవారి మండల దీక్షలు డిసెంబరు 15 నుంచి ప్రారంభమౌతుందని ఆలయ ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశంలో ఉత్సవాల గోడపత్రికలు ఆవిష్కరించారు. వచ్చే నెల 15 నుంచి 21 వరకు మండల దీక్షధారణ, జనవరి 1 నుంచి 10 వరకు అర్ధ మండల దీక్షధారణ ఉంటాయన్నారు. ఫిబ్రవరి 01న అఖండ జ్యోతి స్థాపన, హోమగుండం ప్రజ్వలనతో పెద్ద తిరునాళ్ల ప్రారంభిస్తామన్నారు. ఫిబ్రవరి 1న శివాలయంలో దీక్షాస్వాములు గ్రామంలోని తిరుముడి పూజలు చేస్తారన్నారు. అమ్మవారి దీక్షాస్వాములు తిరుముడి సమర్పించి దీక్ష విరమిస్తారన్నారు. అదేరోజు రాత్రి 9.05 గంటలకు అమ్మవారి వార్షిక కల్యాణం, 2న జలబిందెల మహోత్సవం, 3న ఉదయం పొంగళి అంకసేవ, 4న దీవెన బండారు, మహాపూర్ణాహుతి ఉంటాయన్నారు.

## రైతు ఖాతాలో రూ.9.26 లక్షలు మాయం

**విజయవాడ నేరవార్తలు:** మెడికల్ షాపులో మందులు కొని డబ్బులు చెల్లించేందుకు ప్రయత్నిస్తే.. ఖాతాలో డబ్బులు లేవు. కంగారుపడి బ్యాంకు అధికారులను సంప్రదిస్తే.. రూ. 9.26 లక్షలు మాయమైనట్లు తెలుసుకుని బెంబేలెత్తిపోయారు. నందిగామ మండలం కోడూరు గ్రామ రైతు తోట వీరభద్రరావుకు యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. ఈ నెల 17న మెడికల్ షాపులో మందులు కొన్నారు. డబ్బులు చెల్లించేందుకు ప్రయత్నించగా.. లేవని వచ్చింది. వెంటనే బ్యాంకుకు వెళ్లగా.. ఈ నెల 16న రూ.5 లక్షలు, రూ. 50 వేలు; 17న రూ. 50వేలు, రూ. 3.26 లక్షలు చొప్పున నాలుగు విడతల్లో రూ. 9.26 లక్షలు గుర్తు తెలియని వ్యక్తులు విత్‌డ్రా చేసినట్లు తేల్చారు. సదరు లావాదేవీలు తాను చేయలేదని చెప్పటంతో బ్యాంకు అధికారుల సూచన మేరకు సైబర్ క్రైం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

**ఏపీకే ఫైల్ క్లిక్ చేయడంతో...** గుర్తు తెలియని వ్యక్తి పంపిన ఏపీకే ఫైల్‌ను క్లిక్ చేయటంతో వీరభద్రరావు చరవాణి హ్యాక్ అయిందని పోలీసులు గుర్తించారు. అతని ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు తస్కరించి. . వాటి సాయంతో సైబర్ నేరగాళ్లు డబ్బులను వేరే ఖాతాలకు మళ్లించేశారు. ఆయా ఖాతాల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. దీనిపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్రెడాయ్ ప్రాపర్టీ షోకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

**గవర్నర్‌పేట, న్యూస్‌టుడే :** వచ్చే ఏడాది జనవరిలో నగరంలో నిర్వహించే క్రెడాయ్ ప్రాపర్టీ షోలో పాల్గొనాలని క్రెడాయ్ విజయవాడ చాప్టర్ సభ్యులు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించారు. ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి క్రెడాయ్ ఛైర్మన్ పి.సతీష్ బాబు, అధ్యక్షుడు జి.ఎస్.ఆర్.మోహన్‌రావు, కార్యదర్శి కె.రఘురామ్, ఉపాధ్యక్షులు బి.పవన్, పి.శ్రీనివాస్‌రాజులు సీఎం కార్యాలయంలోని ముఖ్యమంత్రిని కలిశారు. కార్యక్రమానికి హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

**బ్రాయిలర్ ధరలు** (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -108 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

**నెక్ సూచించిన కోడిగుడ్లు ధర**

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

## నోటీసు

మహారాజశ్రీ కృష్ణాజిల్లా, మచిలీపట్నం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

**OS No. 2/2024**

Between: M/s Shriram Finance Ltd, Rep by its Recovery Manager ....... Plaintiff
And
Vakkalagadda Naga Venkata Satya Ranjit Kumar & 3 Others
......Defendants

D-4: Amit Malhotra, S/o. Vijay Malhotra, Hindu, a/g: 33 years, Business, R/o. Plot No. 503, Sri Lakshmi Home Land, Seetharampuram, Vijayawada, NTR Dist. ...Defendant NO-4.

పై నెంబరు దావాలో మీరు 4వ ప్రతివాదిగా పున్నారు. కోర్టు వారి నుండి మీకు అనేక పర్యాయములు దావా సమన్సు పంపినను, మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీకు ఈ పత్రికా ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు చేసి యున్నారు. కావున ది. 05.12.2025న ఉదయం గం. 10.30 లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని హాజరు అయ్యి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని పక్షంలో మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ: 05.12.2025

పుప్పాల శివ రామకృష్ణ ప్రసాద్
వాది తరుపున న్యాయవాది
మచిలీపట్నం

ప్రదేశం: మచిలీపట్నం
తేది. 25.11.2025

# భారతదేశ ఆత్మ.. మన రాజ్యాంగం


అవార్డు గ్రహీతలతో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శైలజ, రాజా తదితరులు

**విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే :** భారతదేశం ఆత్మ.. మన రాజ్యాంగం అని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన విజయవాడలోని హోటల్ ఐలాపురం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భారత రాజ్యాంగం హక్కుల రక్షణ, న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం వంటి విలువలకు ప్రతిబింబం అని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లాంటి మేధావి కృషి ఫలితంగా తయారైన మన రాజ్యాంగం విలువలను గౌరవించి నిలబెట్టుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. రాజ్యాంగం కేవలం ఒక పత్రం కాదని, ఇది దేశం ఆత్మగా అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా జీవిస్తూ.. న్యాయమైన సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. కళారత్న కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రాముఖ్యత, ముసాయిదా కమిటీ అవిశ్రాంత కృషిని పౌరులకు అవగాహన కల్పించేందుకు రాజ్యాంగ దినోత్సవం జరుపుకొంటున్నామని చెప్పారు. రాజ్యాంగ ప్రవేశికను చదవడం ద్వారా దేశ నిర్మాణంలో రాజ్యాంగ పాత్ర గురించి అందరూ తెలుసుకునే అవకాశం ఉందన్నారు. పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు అద్దంకి రాజా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మీడియా అకాడమీ పూర్వ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, వి.వరలక్ష్మి, వేదాల విమల్, కె.వి.రెడ్డి, పరిపూర్ణ నాచారి తదితరులు పాల్గొని ప్రసంగించారు. వివిధ రంగాల్లో సేవలు అందించిన 20 మందికి జాతీయ ఇన్‌స్పైర్-2025 పురస్కారాలతో ఘనంగా సత్కరించారు.

# త్వరలో అమరావతిలో జర్నలిస్ట్ హౌసింగ్ ప్రాజెక్ట్ అమలు


మంత్రి పార్థసారథికి వినతిపత్రం ఇస్తున్న అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు

**విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే :** జర్నలిస్టుల కోసం సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బహుళ అంతస్తుల గృహ సముదాయాన్ని నాలుగు కేటగిరిల్లో నిర్మిస్తామని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కె.పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలోని మంత్రి పార్థసారథిని అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు కలిసి వినతిపత్రం సమర్పించారు. గృహ సముదాయ నిర్మాణ నిమిత్తం మందడం, తుళ్లూరు పరిధిలో అమరావతి హౌసింగ్ సొసైటీకి 30 ఎకరాల భూమిని 2019లో ప్రభుత్వం కేటాయించింది. సీఆర్‌డీఏ సంస్థనే డెవలపర్‌గా ప్రాజెక్టు నిర్మించాలని గతంలో సొసైటీ ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి మేరకు.. సదరు భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకారం తెలపడంతో.. ప్రభుత్వం జీవో నెంబరు 107 ఇస్తూ హ్యాపీనెస్ట్ మోడల్‌లో గృహ సముదాయం నిర్మిస్తామని తెలిపింది. ఈ ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మంత్రిని కోరారు. ఆయన స్పందించి.. ప్రభుత్వ ఉత్తర్వులను, హౌసింగ్ సొసైటీ విజ్ఞప్తిని మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ సమాచార శాఖ డైరెక్టర్ విశ్వనాథ్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ సొసైటీ ప్రతినిధులు పాటిబండ్ల నాగ శ్రీనివాసరావు, చావా రవి, ఈశ్వర్, శ్రీనివాస్, గోపీ, సత్యనారాయణ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగో తరగతి ఉద్యోగులకు గుర్తింపు


చంద్రశేఖర్, సాయిరామ్‌లను అభినందిస్తున్న విద్యాసాగర్

**విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే :** ఏపీ ఎన్జీవో నాలుగో తరగతి ఉద్యోగులకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. మంగళవారం గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ స్థాయి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఎ.వి.ఎస్.సాయిరామ్‌లను అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన వారికి సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, బి.జానకి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు వెండి గిన్నెలు.. పాత్రల బహూకరణ


ఈవో శీనానాయక్‌కు పాత్రలు అందజేస్తున్న దాతలు

**ఇంద్రకీలాద్రి:** ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన మారం శివ పార్వతి, వెంకటరెడ్డి, శైలజ, సుధీర్‌రెడ్డి, పిచ్చమ్మ తదితరులు రూ.12.82 లక్షలు విలువ చేసే వెండి గిన్నెలు, పాత్రలు మంగళవారం బహూకరించారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. వెండి పాత్రలను అమ్మవారి సన్నిధిలో పూజ చేయించారు. అనంతరం దేవస్థానం ఈవో శీనానాయక్‌కు అందజేశారు. అమ్మవారికి మొక్కు నిమిత్తం అందజేసినట్లు దాత కుటుంబ సభ్యులు తెలిపారు. దేవస్థానం ఈవో వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

# తక్కువ సాగు వ్యయం.. బెండతో ఆదాయం

పమిడిముక్కల, న్యూస్‌టుడే





కొద్దిపాటి పెట్టుబడితో మంచి ఆదాయం పొందటానికి బెండ సాగు అనువుగా ఉంటుందని కృష్ణాపురానికి చెందిన **రైతు వీరంకి చిరంజీవి** నిరూపిస్తున్నారు. ఈయన ఏటా 50 సెంట్లలో బెండ పంట సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా తన సాగు విధానం ఆయన మాటల్లోనే..

☛ బెండసాగుకు తేలికపాటి నల్లరేగడి నేలలు, ఒండ్రు నేలలు, వర్షాకాలం, వేసవికాలం అనుకూలం. నేలను 5, 6 సార్లు కలియ దున్నుకోవాలి. వర్షాకాలంలో మురుగు నీరు బయటకు పోయేలా, వేసవిలో ప్రతి మొక్కకు నీరు చేరేలా బోదెలు చేసుకోవాలి. మొక్క మొక్కకు మధ్య 6 నుంచి 7 అంగుళాలు తగ్గకుండా విత్తాలి. చివరి దుక్కిలో పశువుల ఎరువు వేసి దుక్కి చేయాలి. పొటాషియం, భాస్వరం ఎరువులు తగు పాళ్లలో వేయాలి. నీటి తడుల విషయంలో వానాకాలంలో నేల తేమను బట్టి, వేసవిలో ప్రతి 4, 5 రోజులకోసారి పెట్టాలి. విత్తిన 35 రోజుల నుంచి కాయ కోతకు వస్తుంది. కాయల తీరును బట్టి రెండు రోజులకొకసారి కాయలు కోయాలి. లేకుంటే ముదిరిపోతాయి.

**ఆదాయ వ్యయాలు :** 50 సెంట్లకు కిలో విత్తనం అవసరం. ఇవి కిలో రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు ఉంటాయి. మొక్క మొలక నుంచి కాపు పూర్తయే వరకు ఉపయోగించాల్సిన పురుగు మందులకు సుమారుగా రూ.4 వేలు అవుతుంది. స్థానికతను బట్టి కూలీల ఖర్చు ఉంటుంది. మొత్తం సుమారు రూ.15 వేలు ఖర్చు అవుతాయి. కోత మొదలు కాగానే రోజుకు 70 కిలోలకు తగ్గకుండా దిగుబడి ఉంటుంది. మార్కెట్ ధర ఎక్కువ, తక్కువను బట్టి మొత్తం మీద ఖర్చులు పోగా రూ.50 వేలు మిగిలే అవకాశం ఉంది.

# శీతాకాలంలో చేపలకు వచ్చే వ్యాధులు.. నివారణ చర్యలు

ఘంటసాల, చల్లపల్లి, న్యూస్‌టుడే



శీతాకాలంలో చేపలకు సక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని ఘంటసాల కేవీకే మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్‌కుమార్, సమన్వయకర్త డి.సుధారాణి తెలిపారు.

**ఎర్రమొప్ప వ్యాధి:** ఈ వ్యాధి సోకిన చేపల పొట్ట, తల, రెక్కలు, తోక వద్ద ఎర్రటి మచ్చలు వస్తాయి. మొప్పల్లో పుండ్లు ఏర్పడతాయి. నివారణ చర్యలు: ఎన్విరోఫ్లోక్స్+ఆక్సిటెట్రాసైక్లిన్ 10 గ్రాములు చొప్పున టన్ను చేపల బరువుకు మేతలో కలిపి ఇవ్వాలి. నీటిలో 5 శాతం బ్రోమిన్ లేదా అయోడిన్ అనే శానిటైజర్లను ఎకరానికి లీటరు చొప్పున వాడాలి.

**శంఖు జలగలు:** ప్లాటి హెల్మింథిస్ చెందిన గైరో డాక్టిలస్, డాక్టిలోగైరస్ అనే పరాన్న జీవులు చేపల మొప్పల మీద ఉండి వాటిలోని పోషకాలను తీసుకుంటూ పెరుగుతాయి. ఇవి శంఖు కణజాలాలను తినడంతో చేపల శంఖువులు దెబ్బతిని అధికంగా జిగురు స్రవించడంతో ఊపిరి ఆడక చనిపోతాయి. నివారణకు ఎకరానికి 150 మి.లీ.డెల్టా మైత్రిన్ లేదా 150మి.లీ.సైపర్ మైత్రిన్ చల్లాలి. మేత ద్వారా అల్బెండజోల్ ఇవ్వాలి.

**తాటాకు తెగులు:** ఈ వ్యాధి సోకిన చేపల శరీరంపై మచ్చలు ఏర్పడతాయి. బొప్పల రంగు మారి పాలిపోతాయి. ఆహారం తీసుకోవు. నివారణకు ట్రైమిథోప్రిమ్+సల్ఫాడైజీన్ 10 గ్రాములు+ఆక్సిటెట్రాసైక్లిన్ 10 గ్రాముల చొప్పున టన్ను చేపల బరువుకు మేతలో కలిపి ఇవ్వాలి. నీటిలో 5 శాతం బ్రోమిన్ లేదా అయోడిన్ అనే శానిటైజర్లు ఎకరానికి లీటరు చొప్పున వాడాలి.

**ఈయూఎస్:** ఈ కురుపుల వ్యాధి తెల్ల, నల్ల చేపలకు సోకుతుంటుంది. తొలిదశలో ఎరుపు లేదా బూడిద రంగు మచ్చలు, లోతైన పుండ్లు ఏర్పడి తోకలు, రెక్కలు తదితర భాగాలు కుళ్లినట్టు కనిపిస్తాయి. నివారణకు నీటిలో 5 శాతం బ్రోమిన్ లేదా అయోడిన్ అనే సిబిసైడ్స్ ఎకరానికి లీటరు చొప్పున చల్లాలి. 'సిఫాక్స్' అనే మందు ఎకరానికి లీటరు చొప్పున చల్లాలి. ఒక టన్ను చేపల బరువుకు ఆక్సిటెట్రాసైక్లిన్ మందును 100 గ్రాముల చొప్పున మేతలో కలిపి 5నుంచి 7రోజులు ఇవ్వాలి.

**రైతు ప్రశ్న**

**ప్రశ్న:** టమాట తోటకు వాతావరణం, నేలలు, విత్తకాలం, విత్తన మోతాదు తెలపండి? -జి.రాజారావు, రైతు, చినకళ్లేపల్లి

**సమాధానం:** టమాటను ఏడాది పొడవునా అన్ని కాలాల్లో పండించవచ్చు. అధిక దిగుబడికి శీతాకాలం అనువైనది. నవంబరు నెల అనుకూలం. ఇసుకతో కూడిన గరప, బరువైన బంక నేలల్లో సాగు చేయవచ్చు. నేల ఉదజని సూచిక 6-7 ఉండాలి. సూటి రకాల విత్తనాలు ఎకరానికి 200 గ్రాములు, సంకర రకాల విత్తనాలైతే 60-80 గ్రాములు సరిపోతాయి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ 2 గంటల తరువాత 4 గ్రాముల ట్రైకోడెర్మా విరిడితో విత్తన శుద్ధి చేసుకోవాలి.

**ప్రశ్న:** షేడ్ నెట్‌లో కూరగాయల నారు పెంపకం గురించి వివరించండి? -బి.నాగరాజు, రైతు, పూషడం

**సమాధానం:** షేడ్ నెట్‌లో ప్లాస్టిక్ ట్రేలలో ఉత్పత్తి చేసిన నారు దృఢంగా, చీడపీడల నుంచి రక్షణ కలిగి ఉంటుంది. మొక్కలకు నీరు, ఎరువులు వినియోగించుకునే సామర్థ్యం, ప్రతికూల పరిస్థితులను తట్టుకుంటాయి. టమాట, వంగ, మిరప, పూల మొక్కల్లో బంతి, పండ్ల మొక్కల్లో బొప్పాయి వంటి వాటిని ప్రోట్రేలలో, షేడ్ నెట్‌లలో పెంచితే తేమ శాతం, కాంతి సరిపడా అంది.. నాణ్యమైన నారు పొంద వచ్చు. సాధారణంగా నారు పెంపకానికి 50 శాతం నీడనిచ్చే షేడ్‌నెట్‌లను ఎంచుకోవాలి. -వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే, ఘంటసాల.

- న్యూస్‌టుడే, ఘంటసాల

## రైతేరాజు

### బొప్పాయిలో తెగుళ్ల నివారణ

**తోట్లవల్లూరు, న్యూస్‌టుడే:** ఆకు ముడత, పండు ఈగ కారణంగా బొప్పాయి తోటలకు నష్టం వాటిల్లుతోంది. నివారణ చర్యల ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ అధికారిణి మానస తెలిపారు.

**ఆకుముడత:** ఈ వైరస్ ఆశిస్తే ఆకులు ముడుచుకు పోతాయి. సమస్య తీవ్రమైతే ఉండలుగా మారతాయి. కాయలు సైతం సహజ ఆకృతిని కోల్పోయి.. వంకరగా మారి దిగుబడి తగ్గుతుంది. రసం పీల్చే పురుగులైన తెల్లదోమ, పేనుబంక.. ఈ వైరస్ తెగుళ్లను తోటంతా విస్తరింపజేస్తాయి. అంతర్వాహిక కీటక నాశనుల వినియోగంలో వైరస్ తెగుళ్లను పూర్తిస్థాయిలో అరికట్టవచ్చు.



**పండు ఈగ:** కాయలు పక్వానికి వచ్చే సమయంలో పండు ఈగ ఆశించి నష్టం కలిగిస్తుంది. గోధుమ రంగు రెక్కలు కలిగి ఉండే తల్లి ఈగ.. సూదిలాంటి మొనను కాయ చర్మం కింది భాగంలో చొప్పించి గుడ్లు పెడుతుంది. మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలో ఇవి లార్వాలా వృద్ధి చెంది.. కాయలోని గుజ్జును తినడం ద్వారా మెత్తబడి కుళ్లిపోతాయి. నివారణకు.. తోటలను శుభ్రంగా ఉంచాలి. రాలిన ఆకులు, పండ్లను ఏరి నాశనం చేయాలి. మిథైల్ యూజినాల్ ఎర బుట్టలను ఉపయోగించి పురుగులను నాశనం చేయాలి.

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం, శ్రీశైలం, నంద్యాల జిల్లా.

**ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీస్**

Rc.No.E2/437570/2025 Dated: 25.11.2025

శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం, శ్రీశైలం నందు మహాశివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవములు -2026 సందర్భముగా సివిల్, ఎలక్ట్రికల్, వాటర్ సప్లై మరియు ఇతర పనులు చేపట్టుటకుగాను ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు పిలువడమైనది.

టెండర్ల యందు పాల్గొనదలచిన వారు టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ కొరకు తేదీ: 29.11.2025 ఉదయం 11-00 గంటల నుండి 45 రోజుల వరకు వెబ్‌సైట్ www.apeprocurement.gov.in (or) tender.apeprocurement.gov.in నందు చూడగలరు.

శివకార్యంలో.. సం/- యం.శ్రీనివాస రావు
స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి

## సమష్టి కృషితో సమగ్రాభివృద్ధి సాధ్యం


కలెక్టర్‌ను అభినందిస్తున్న ఏపీ ఎన్జీవో జిల్లా కార్యవర్గ సభ్యులు

**పాయకాపురం, న్యూస్‌టుడే :** సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూర్తయిన నేపథ్యంలో ఏపీ ఎన్జీవో జిల్లా సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి, సహాధ్యక్షుడు వేమూరి ప్రసాద్, కార్యదర్శి డి.రమేష్, నగర అధ్యక్షుడు సి.వి.ఆర్. ప్రసాద్ తదితరులు కలిశారు. లక్ష్మీశ మాట్లాడుతూ.. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విజయవంతంలో ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో సుస్థిరాభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక, పర్యాటక, సేవా రంగాల్లో వార్షిక వృద్ధి లక్ష్యసాధనకు సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కోరారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తూ ప్రజల కలెక్టర్‌గా పేరు తెచ్చుకోవడం ఉద్యోగులకు గర్వకారణమని ఎన్జీవో నాయకులు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వర్తించేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉంటారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సభ్యులు వి.వి.ప్రసాద్, బి.సతీష్‌కుమార్, ఎం.రాజుబాబు, డి.విశ్వనాథ్, బి.వి.రమణ, రామకృష్ణ, కె.శివలీల, సి.వి.ఆర్.ప్రసాద్, ఎస్.కె.నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫెర్రీ నుంచి ఆగిన ఇసుక రవాణా

ఈనాడు కథనానికి స్పందన

**ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే :** 'ఇసుక దందా కనబడుతోందా..!' అనే శీర్షికన ఈ నెల 24న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మైనింగ్ అధికారులు స్పందించారు. సోమ, మంగళవారాల్లో ఇబ్రహీంపట్నం ఫెర్రీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. మొదటి రోజున తనిఖీలు నిర్వహించగా, రెండు రోజు నిఘా నిమిత్తం సిబ్బంది ఒకరికి విధులు కేటాయించారు. దీంతో ఫెర్రీ నుంచి ఇసుక రవాణా నిలిచింది. రోజూ వందలాది ట్రాక్టర్ల రణగొణ ధ్వనులతో ఇబ్బంది పడుతున్న స్థానికులకు కాస్త ఊరట లభించింది. అయితే మైనింగ్ సిబ్బంది అక్కడ ఉన్నంత వరకే ఈ రవాణా ఆగుతుందని, రాత్రి వేళల్లో, సిబ్బంది లేని సమయంలో ఇసుక రవాణా కొనసాగుతుందని పలువురు పేర్కొంటున్నారు.



## అనిల్ ఛోక్రా పిటిషన్లపై కౌంటర్ల దాఖలుకు ఆదేశం

**విచారణ ఈనెల 27వ తేదీకి వాయిదా**

**ఈనాడు - అమరావతి:** మద్యం కేసులో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్, వెంకటేష్ నాయుడులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ల విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈనెల 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో ముంబయి వ్యాపారి అనిల్ ఛోక్రా కస్టడీ, బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టు మంగళవారం విచారణ జరిపింది. కౌంటర్లు దాఖలు చేయాలని సిట్‌ను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 27వ తేదీకి వాయిదా వేసింది. నిందితులు బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణల బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 26వ తేదీకి వాయిదా వేసింది. తమను గుంటూరు జైలు నుంచి విజయవాడ కారాగారానికి మార్చాలని కోరుతూ వీరు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ గురువారానికి వాయిదా పడింది. తన బెయిల్ ఆంక్షలు సడలించాలని కోరుతూ బాలాజీ గోవిందప్ప దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

★ఈ కేసులో సాక్షి అయిన షేక్ ముబారక్ అలీ నుంచి స్వాధీనం చేసుకున్న రూ.9.20 లక్షల నగదుపై తగు నిర్ణయం తీసుకోవాలని సిట్ మెమో దాఖలు చేసింది. తాను పార్లమెంటు శీతాకాల సమావేశాలకు వెళ్లేందుకు అనుమతించాలని కోరుతూ వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. విచారణ బుధవారానికి వాయిదా పడింది.

★గత ఏడాది ఎన్నికల సమయంలో జగ్గయ్యపేట సమీపంలోని గరికపాడు చెక్‌పోస్టు వద్ద సీజ్ చేసిన రూ.8 కోట్ల నగదుతో మద్యం కేసుకు సంబంధం లేదనీ, తమకు చెందిన డబ్బు అని ఈషా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ మంగళవారం ఏసీబీ కోర్టులో పిటిషన్ ఫైల్ చేసింది. ఈ సంస్థ జీపీఏ హోల్డర్ లక్ష్మీ తేజస్విని అని మరో పిటిషన్ దాఖలైంది. వీటిపై సిట్ మంగళవారం కౌంటర్లు దాఖలు చేసింది. విచారణ 27వ తేదీకి వాయిదా పడింది.

## పరిధి తేలక ప్రారంభం కాని విచారణ

### మావోల కస్టడీ పిటిషన్లపై నేడు స్పష్టత వచ్చే వీలు

**ఈనాడు - అమరావతి:** ఎన్టీఆర్, కృష్ణా జిల్లా పోలీసులు దాఖలు చేసిన మావోయిస్టుల కస్టడీ పిటిషన్లు ఇంకా కొలిక్కి రాలేదు. కోర్టుల పరిధి తేలకపోవడంతో విచారణ ప్రారంభం కాలేదు. ★ విజయవాడ నగరంలో అరెస్టు చేసిన రంగు అలియాస్ బీమా, లక్మ అలియాస్ మదన్, చిన్మయ్ అలియాస్ మనీలా, మంగిని తమ కస్టడీకి ఇవ్వాలని పటమట పోలీసులు నాలుగో ఏసీజేఎం కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. కానీ విచారణ ప్రారంభం కాలేదు. కేసు తీవ్ర దృష్ట్యా పిటిషన్ ఏ కోర్టు పరిధిలోకి వస్తుందనే విషయమై తేలలేదు. ★ కృష్ణా పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఉద్దే రఘు, ఓఎం జ్యోతి, మదకం దివాకర్ అలియాస్ మిట్టు కస్టడీని కోరుతూ తొలుత తాలూకా కోర్టులో వేసిన పిటిషన్‌ను న్యాయాధికారి తిరస్కరించారు. సంబంధిత కోర్టులో వేసుకోవాలని సూచించారు. దీంతో పిటిషన్‌ను మంగళవారం రెండో ఏడీజే కోర్టులో వేశారు. దీనిపై కూడా సందిగ్ధత నెలకొంది. ఇది ఏ కోర్టు పరిధిలోకి వస్తుందనే దానిపై బుధవారం నిర్ణయం వెలువడే వీలుంది.

# తిరువూరు

• తిరువూరు • మైలవరం


**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

★ నరసాపురం పంచాయతీ పరిధి యాదవుల బజారులోని డ్రెయినేజీలో చెత్త పేరుకుని మురుగు నిలిచి దుర్వాసన వస్తోందని నివాసితులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపారు. ఈవో జి.స్వాతి స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. - **న్యూస్‌టుడే, విస్సన్నపేట**

★ చెవుటూరులో ప్రధాన రహదారి వెంబడి ఉన్న పంచాయతీ నీటి పైపులైన్ మరమ్మతులకు గురై నీరు వృథాగా పోతోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' అధికారులకు తెలిపారు. స్పందించిన కార్యదర్శి బసవ లింగేశ్వరరావు సిబ్బందిని పంపి పైపులైన్ మరమ్మతులు చేయించారు. - **న్యూస్‌టుడే, జి.కొండూరు**

★ తిరువూరు 9వ వార్డులోని తమ ఇంటి ముందు చెత్త పేరుకుందని స్థానికుడు సోహైల్‌ఖాన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. - **న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

? స్థానిక చెరువు బజారులోని కాలువల్లో పూడిక పేరుకుపోయింది. దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నాం. **డి.శ్రీనివాసరావు (గ్రామస్థుడు)** ✔ కార్మికులను పంపించి పూడిక తీయిస్తాం. దోమల నివారణ చర్యలు చేపడతాం. - **బసవ లింగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి, జి.కొండూరు** - న్యూస్‌టుడే, జి.కొండూరు

## పాఠశాలకు బల్లలు వితరణ

**మైలవరం, న్యూస్‌టుడే :** స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లోని గ్రంథాలయంలో విద్యార్థుల సౌకర్యార్థం రూ.15 వేల విలువైన బల్లలను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సీహెచ్. ప్రసాద్ మంగళవారం అందజేశారు. ఈ మేరకు ఆయన్ను ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్, ఎస్ఎంసీ ఛైర్మన్ బాబూరావు, ఉపాధ్యాయులు సన్మానించారు.

## కేసు విచారణకు హాజరు

**సూర్యారావుపేట, న్యూస్‌టుడే :** నిరసన ప్రదర్శన నిర్వహించిన కేసులో మాజీ మంత్రి, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు మంగళవారం ఉదయం చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు విచారణకు హాజరయ్యారు. గత ప్రభుత్వ హయాంలో విజయవాడ రూరల్ మండలం జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో తెదేపా నిరసన ప్రదర్శన నిర్వహించింది. దీనిపై కొత్తపేట పోలీసులు దేవినేని ఉమామహేశ్వరరావుతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు మంగళవారం సీఎంఎం న్యాయస్థానంలో విచారణ జరగ్గా.. మాజీ మంత్రి హాజరయ్యారు.

## ఈవీఎం గోదాము పరిశీలన



సీసీ ఫుటేజీ వీక్షిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

**గొల్లపూడి, న్యూస్‌టుడే :** ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం పరిశీలించారు. గోదాము వద్ద ఉన్న సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలను చూశారు. పలు రికార్డులను పరిశీలించి సంతకం చేశారు. గోదాము వద్ద పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

# అధిక వ్యయం.. రైతులకు భారం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే



చింతలపాడు వద్ద యంత్రంతో వరి నూర్పిడి

**తిరువూరు** రెవెన్యూ డివిజన్‌లో ఖరీఫ్ వరి నూర్పిడికి యంత్రాల వ్యయం అధికమైందని రైతులు వాపోతున్నారు. ఇక్కడ తమిళనాడుకు చెందిన హార్వెస్టర్ యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తారు. ఏటేటా నూర్పిడి ధరను వాటి యజమానులు పెంచుతున్నారు. ఇది కౌలు రైతులకు భారంగా మారింది. తుపాన్ తాకిడి ఉంటే యంత్రాలకు డిమాండ్ పెరిగి యజమానులు చెప్పిందే ధర అన్నట్లు వసూలు చేస్తుంటారు. దీంతో అన్నదాతలు చేతికొచ్చిన పంట దక్కుండా పోతుందనే భయంతో అడిగినంతా ఇస్తున్నారు. ఈ ఏడాది ఎకరాలో పంట నూర్పిడికి ట్రాక్ మిషన్‌కు రూ.3,300 నుంచి రూ.3,500, టైర్ల యంత్రాలకు రూ.2,200 వరకు వసూలు చేస్తున్నారు.

**అడిగినంత ఇస్తేనే పంపిస్తాం :** చైన్(ట్రాక్) లేదా టైర్ల యంత్రాలతో వరి నూర్పిడికి ఎకరాకు గంట నుంచి గంటన్నర సమయం పడుతోంది. భూముల్లో నీరు, బురద కారణంగా టైర్ల యంత్రాలు పని చేయక ట్రాక్(చైన్) యంత్రాలు వినియోగిస్తున్నారు. పొలాల్లో బురద, నేలవాలిన వరి ఉంటే ట్రాక్ మిషన్‌కు అధిక సమయం తప్పడం లేదు. దీంతో కర్షకులు నూర్పిడికి ఎకరాకు రూ.3 వేల వరకు అదనంగా చెల్లిస్తున్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి తాము అడిగినంత ఇస్తేనే యంత్రాలు పంపిస్తామని యాజమానులు చెబుతున్నారు.

మూడేళ్లుగా వరి కోత యంత్రాలకు గంటకు వ్యయం (రూ.లో)

| సంవత్సరం | 2023 | 2024 | 2025 |
|---|---|---|---|
| చైన్ | 2,400 | 3,000 | 3,500 |
| టైర్లు | 1,600 | 1,800 | 2,200 |

**చొరవ చూపితే మేలు :** తిరువూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లో ఖరీఫ్ వరి 58,422 ఎకరాల్లో సాగు చేయగా ఇప్పటి వరకు 15,570 ఎకరాల్లో(40%) నూర్పిడి పూర్తయింది. ఈ నెల మొదటి వారం నుంచి వరి కోతలు ప్రారంభించగా వచ్చే నెల 15 వరకు కొనసాగుతాయి. ఇంకా 42,852 ఎకరాల్లో(60%) పంట నూర్పిడి చేయాల్సి ఉన్నందున రైతులపై యంత్రాల భారం తగ్గించేందుకు అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు. డివిజన్‌లో ఈ ఏడాది 1,56,327 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు దిగుబడి అంచనాలో 1,31,197 మెట్రిక్ టన్నుల(60%) పంటను మద్దతు ధర చెల్లించి పీపీసీల్లో కొనాల్సి ఉంది. ఇప్పటి 44 వేల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి రాగా కేంద్రాల్లో 13 వేల మెట్రిక్ టన్నుల వరకు కొన్నారు.

## పురపాలిక ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వెంకటరత్నం

**కొండపల్లి, న్యూస్‌టుడే :** కొండపల్లి పురపాలిక ఇన్‌ఛార్జిగా మేనేజర్ వెంకటరత్నం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా ఉన్న రమ్యకీర్తన సెలవుపై వెళ్లడంతో పురపాలిక పూర్తి బాధ్యతలను మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటరత్నంకు కేటాయించినట్లు పురపాలిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కమిషనర్ రమ్యకీర్తనతో పాటు కొంత కాలం ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహించిన సహాయక ఇంజినీరు మౌర్య కూడా సెలవులో ఉండటంతో పురపాలిక శాఖ మేనేజర్‌కు బాధ్యతలను అప్పగించింది. అయితే కమిషనర్, ఏఈలపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో వారు సెలవు తీసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి సిద్ధమైనట్లు సమాచారం.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ

**తిరువూరు టౌన్, న్యూస్‌టుడే :** పట్టణంలోని అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పడిపూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక అలంకరణతో ఏర్పాటు చేసిన మకరజ్యోతి ఆకర్షణగా నిలిచింది.

# ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణింపు



గానుగపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కనక దుర్గాభవాని, పక్కన హెచ్ఎం బాబాసాహెబ్



తిరువూరు బాలికోన్నత పాఠశాలలో..

**గంపలగూడెం, తిరువూరు:** విద్యార్థులు చదువు, ఆటల్లో రాణించాలంటే ఆరోగ్యంగా ఉండాలని చొటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అంబటి కనకదుర్గా భవాని స్పష్టం చేశారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో తిరువూరు మండలం గానుగపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలబాలికలకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. అనంతరం పలువురు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి కావాల్సిన మందులు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.కె.బాబాసాహెబ్, ఆరోగ్య పర్యవేక్షకులు కాశీ పి.మధుసూదనరెడ్డి, ఉపాధ్యాయులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**తిరువూరు టౌన్, న్యూస్‌టుడే :** స్థానిక బాలికోన్నత పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. చిన్ననాటి నుంచే ఆరోగ్య సూత్రాలు పాటిస్తే భవిష్యత్తులో రోగాలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు సూచించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులను ఉచితంగా అందజేశారు. తిరువూరు ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాల వైద్యులు రేష్మా, స్టాఫ్ నర్సు హేమలత, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మృదుల పాల్గొన్నారు.

ఈనాడు మీతోడు

**విస్సన్నపేట:** 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య అవగాహనతో పాటు వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించడం అభినందనీయమని విస్సన్నపేట మండల వైద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. విస్సన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం శోభా రాణి, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఏఎన్ఎం సీహెచ్. కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు జ్యోతి, శాంతిసీడీలు జీవన్ కిశోర్, శ్రీను, పాఠశాల కుటుంబం పాల్గొన్నారు.



విస్సన్నపేటలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, పక్కన హెచ్ఎం శోభారాణి

# సత్తా చాటారు.. బహుమతులు పొందారు

**మైలవరం, న్యూస్‌టుడే :** విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి బహుమతులు సాధించాలని స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాల కరస్పాండెంటు వీవీ లక్ష్మి సూచించారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా మంగళవారం ఆ పాఠశాలలో ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను ఉపన్యసించారు. వి.పూజిత(8వ తరగతి) ఎం.అభిలక్ష్మి, పి.ప్రియాంజలి(9వ తరగతి) విద్యార్థులు వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. కరస్పాండెంటు లక్ష్మి, ప్రిన్సిపల్ కేవీ కృష్ణారావు విజేతలకు బహుమతులు అందించి, అభినందించారు.



మైలవరం: బహుమతులు సాధించిన విద్యార్థులతో లక్ష్మి, కృష్ణారావు



విస్సన్నపేట: విజేతలతో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తదితరులు

**విస్సన్నపేట, న్యూస్‌టుడే :** స్థానిక శ్రీసిద్ధార్థ(కేవీఎస్‌పీ) జూనియర్ కళాశాలలో మంగళవారం 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థులు కొంగల నవ్యశ్రీ(ఎంపీసీ), రావి గుప్తా(సీఈసీ), కంప సోఫి(ఎంపీసీ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు శ్రీసిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ మేడా మోహన్‌రావు, డైరెక్టర్లు సాయిహర్ష, దీప్తి, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఏవో శ్రీనివాస్, అధ్యాపకులు జైపాల్ రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

# గృహాల మంజూరుకు అర్హులను గుర్తించండి

**గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే :** నియోజకవర్గంలో గృహాల మంజూరుకు అర్హులైన పేదలను గుర్తించాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గృహ నిర్మాణ సంస్థ అధికారులను కోరారు. తిరువూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆ శాఖ అధికారులతో గృహ నిర్మాణాల ప్రగతి, కొత్తవి మంజూరుకు ప్రతిపాదనలపై ఆయన సమీక్షించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఫేజ్‌లో ప్రస్తుతం గ్రామాల్లో సర్వే చేస్తున్నామని, సొంత స్థలం ఉన్న అర్హులను గుర్తిస్తున్నామని, నెలాఖరు వరకు దరఖాస్తుల గడువు ఉందని అధికారులు తెలిపారు. గృహ నిర్మాణ సంస్థ ఈఈ విజయభాస్కరరాజు, ఏఈలు కిశోర్, గోపీ, రవి, సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



తిరువూరు: అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

★ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాసరావు కోరారు. తిరువూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీవో వెంకటేశ్వరరావు, అనురాధ, రామారావు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

# 16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

**గంపలగూడెం, న్యూస్‌టుడే :** తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో మంగళవారం నాటికి 16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆర్డీవో కె.మాధురి తెలిపారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు, రెడ్డిగూడెం మండలాల పరిధిలోని 44 ప్రభుత్వ కేంద్రాల ద్వారా రైతులు ఆ మేరకు ధాన్యం విక్రయించారని చెప్పారు. పంట విక్రయించిన 24 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయిస్తున్నట్లు వివరించారు. పలువురు అధికారులు ఆమె వెంట ఉన్నారు.



ఎ.కొండూరులో ధాన్యం రైతులతో మాట్లాడుతున్న మాధురి

# అన్నదాతలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

**గంపలగూడెం, న్యూస్‌టుడే :** మండలంలోని ఉమ్మడి దేవరపల్లిలో నిర్వహించిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. తదుపరి దుందిరాలపాడులో కూడా ఆయన పర్యటించారు. విస్సన్నపేట మండలం కలగర, లక్ష్మీపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించే 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శ్రీనివాసరావు పాల్గొంటారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపారు.

**మైలవరం, న్యూస్‌టుడే :** కూటమి ప్రభుత్వంలో రైతులకు మేలు కలుగుతుందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మైలవరం, చంద్రగూడెం తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారులతో కలిసి కరపత్రాలను ప్రదర్శించి అన్నదాతలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు.



రెడ్డికుంటలో కరపత్రాలు అందుకున్న రైతులతో శశికళ, శ్రీనివాసరావు తదితరులు

**ఎ.కొండూరు, న్యూస్‌టుడే :** మండలంలోని కృష్ణారావుపాలెం శివారు కేశ్యాతండాలో తెదేపా మండల అధ్యక్షుడు బి.పీక్లానాయక్ ఆధ్వర్యంలో పంచ సూత్రాల పథకం కరపత్రాలు పంపిణీ చేశారు. సోమ్లా, బూత్ కన్వీనర్లు, రైతులు పాల్గొన్నారు.



మైలవరంలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఏడీఏ, తెదేపా నాయకులు

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే :** రంగాపురం పంచాయతీ పరిధిలోని రెడ్డికుంటలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్సన్నపేట ఏడీఏ కె.శశికళ, ఏవో డి.శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

**జి.కొండూరు, న్యూస్‌టుడే :** కవులూరులో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్ష కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు, లంకా నాగేశ్వరరావు, మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**తిరువూరు టౌన్ న్యూస్‌టుడే :** మండలంలోని చిట్యాల రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

# కలగా మిగిలింది.. వెతలు తీర్చండి!

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

**మండ**లానికి స్త్రీశక్తి భవన సౌకర్యం కలగానే మిగిలింది. వెలుగు, మహాత్మా గాంధీ ఉపాధి హామీ కార్యాలయాలకు భవనాలు లేకపోవడంతో తెదేపా హయాంలో ఉపాధి హామీ నిధులతో ఈ రెండు కార్యాలయాలకు రెండు అంతస్తుల భవనం నిర్మాణానికి సుమారు రూ.40 లక్షలు మంజూరు చేశారు. మొదట్లో భవన నిర్మాణానికి స్థలం దొరక్క కొంతకాలం గడిచింది. తర్వాత రెడ్డిగూడెం జడ్పీ ఆవరణలోని బీసీ వసతి గృహం పక్కనున్న స్థలంలో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టి పునాది దశ వరకు పనులు చేశారు. ఆ సమయంలో ఎన్నికలు వచ్చి వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టి దీని గురించి పట్టించుకోలేదు.



పునాది దశలో స్త్రీశక్తి భవనం

**ఇరుకు గదుల్లో..** ప్రస్తుతం వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాలు ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. దీంతో ఉద్యోగులు విధుల నిర్వహణ, రికార్డులు నిల్వ చేయడానికి అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వమైన స్త్రీశక్తి భవనం నిర్మించి, రెండు కార్యాలయాల నిర్వహణకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

**పూర్తి చేస్తే మేలు** భవనం లేక మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించుకోవడానికి, సిబ్బంది విధుల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీశక్తి భవనం నిర్మాణం పూర్తి చేస్తే అందరికి మేలు జరుగుతుంది. **- జి.రజని, అనుశ్రీ సంఘం సభ్యురాలు, కుదప గ్రామం**

# రక్షణ గోడ పూర్తి



**విస్సన్నపేట, న్యూస్‌టుడే :** హైదరాబాద్ నోస్ ల్యాబ్ వారు కార్పొరేట్ సేవల కింద రూ.40 లక్షలను నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు వితరణగా ఇవ్వడంతో బడికి రక్షణ గోడ సమకూరినట్లు హెచ్ఎం ఎస్. శోభాలత, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కన్వీనర్ పీడీ రమేష్ మంగళవారం తెలిపారు.



# నిపుణ్ భారత్ లక్ష్యాల అంచనాలకు సర్వే

**ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే :** ఒకటి నుంచి అయిదు తరగతుల్లోని ప్రతి విద్యార్థి నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించేలా చూడటానికి ప్రభుత్వం గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డైట్ అధ్యాపకుడు డాక్టరు కొచ్చెర్ల మోహన్‌రావు వివరించారు. గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమ సర్వేలో భాగంగా డైట్ విద్యార్థులు మంగళవారం కాచవరం ప్రాథమిక పాఠశాలలో సర్వే నిర్వహించారు. హెచ్ఎం భవాని, ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా పాల్గొన్నారు.



విద్యార్థి సామర్థ్యాలను యాప్‌లో నమోదు చేస్తున్న డైట్ విద్యార్థి

# ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమే ముఖ్యం

**మైలవరం, న్యూస్‌టుడే :** ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం ముఖ్యమని, రక్త పరీక్షలతో సమస్యలను తెలుసుకోవచ్చని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల గౌరవ ఛైర్మన్ లకిరెడ్డి జయప్రకాశరెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఐసీసీ, యాక్సిస్ బ్యాంకు శాఖ సహకారంతో కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బందికి పలు రకాల వైద్య పరీక్షలు చేశారు. లకిరెడ్డి హనిమిరెడ్డి, కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ అప్పారావు, ఉప ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రక్తపోటు పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

# శుభ్రత అవసరం

**గంపలగూడెం, న్యూస్‌టుడే :** గ్రామాల్లో సేకరించిన చెత్తను పంచాయతీ సిబ్బంది సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో టి.సరస్వతి ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. జనాలకు పరిసరాల శుభ్రత, పచ్చదనంపై అవగాహన కల్పించాలని సూచించారు.

# నేరాలు లేని సమాజాన్ని రూపొందిద్దాం

**ఎ.కొండూరు, న్యూస్‌టుడే :** పోలీసులు, ప్రజలు పరస్పర సహాయ సహకారాలతో నేరాలు లేని సమాజాన్ని రూపొందిద్దామని విజయవాడ గ్రామీణ డీసీపీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని కంభంపాడులో మంగళవారం రాత్రి సైబర్ సురక్షపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు, తిరువూరు సీఐ కె.గిరిబాబు, ఎస్సై జి.మహాలక్ష్మణుడు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డీసీపీ లక్ష్మీనారాయణ, వేదికపై పోలీసు అధికారులు

# భూ వివాదమై ఇరువర్గాల ఘర్షణ

**మైలవరం, న్యూస్‌టుడే :** మండలంలోని దాసుళ్లపాలెంలో భూ వివాదమై వరుసకు బంధువులైన రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. దాసుళ్లపాలేనికి చెందిన వింజమూరి లక్ష్మయ్య, చక్రపర్తి మధ్య కొన్నాళ్లుగా భూమి విషయంలో వివాదం నడుస్తోంది. దానిపై హక్కు తమదంటూ మంగళవారం రెండు వర్గాలు ఘర్షణ పడి కొట్టుకోగా లక్ష్మయ్య, చక్రపర్తి తలలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేరగా ఇరువురి ఫిర్యాదుపై రెండు కేసులు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం

**తిరువూరు టౌన్, న్యూస్‌టుడే :** తిరువూరు మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెదేపా కౌన్సిలర్ల బృందం కలెక్టర్ లక్ష్మీశను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం, కౌన్సిల్ సమావేశాల్లో జరిగిన అవకతవకలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని కౌన్సిలర్లు అబ్దుల్ హుస్సేన్, సురేంద్ర, సత్యవతి, దుర్గారావు తెలిపారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు పత్రం అందిస్తున్న తెదేపా కౌన్సిలర్లు

# అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

**విస్సన్నపేట, న్యూస్‌టుడే :** స్థానిక వెలుగు కార్యాలయంలో డీపీఎం శోభన్ బాబు, ఏపీఎం వి.సురేష్‌లతో కూడిన ద్విసభ్యుల బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గ్రీవెన్స్ ఓపెన్ అయిన సందర్భంగా రికార్డులు పరిశీలిస్తున్నామని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలగర భాజపా నాయకుడు సూరిబాబు విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో వెలుగు కార్యాలయంలో జరిగిన అవినీతిపై దరఖాస్తు అందజేస్తే సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఫిర్యాదును బుట్టదాఖలు చేశారని ఆవేదన చెందారు.




రికార్డులు పరిశీలిస్తున్న శోభన్ బాబు, పక్కన అధికారులు



# 'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అన్యాయం'

**గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే :** పీ- 4లో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం అన్యాయమని వైకాపా తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. ప్రభుత్వ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తిరువూరులో ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కోటి సంతకాల సేకరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ ఎన్.సుధారాణి, నాయకులు సత్యనారాయణ, ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



తిరువూరు: కోటి సంతకాల కార్యక్రమంలో స్వామిదాసు

**కొండపల్లి, న్యూస్‌టుడే :** వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా నాయకుల ఆధ్వర్యంలో కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కౌన్సిలర్ [illegible] కలు, యువత పాల్గొన్నారు.

# అమ్మో.. ఏఐ!

- ఏ మాత్రం గుర్తించలేనంతగా నకిలీ ఆధార్‌, పాన్‌ కార్డుల సృష్టి

బెంగళూరు(రాజాజీనగర), న్యూస్‌టుడే: కృత్రిమ మేధ(ఏఐ)తో ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో చెప్పాల్సిన పని లేదు. రోజురోజుకీ ఈ సాంకేతికత వినియోగం పెరుగుతోంది. అదే సమయంలో దాంతో పొంచి ఉన్న ముప్పు ఎప్పటికప్పుడు వెలుగులోకి వస్తోంది. తాజాగా ఏఐతో నకిలీ గుర్తింపు కార్డులను తయారు చేయొచ్చని వెల్లడైంది. కృత్రిమ మేధ సాంకేతికత రాక ముందే నకిలీ గుర్తింపు కార్డులను తయారు చేస్తున్నప్పటికీ, వాటిని సులభంగా గుర్తుపట్టే అవకాశం ఉండేది. ఇప్పుడు ఏఐతో రూపొందించేవి మాత్రం నకిలీవి అని గుర్తించలేనంత కచ్చితత్వంతో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయాన్ని బెంగళూరుకు చెందిన టెకీ హర్వీన్‌సింగ్‌ చద్దా తాజాగా వెలుగులోకి తెచ్చారు. ఫొటోల సృష్టి కోసం ఓ ప్రముఖ ఏఐ మోడల్‌ తీసుకొచ్చిన అత్యాధునిక ఫీచర్‌ను ఉపయోగించి నకిలీ ఆధార్‌, పాన్‌ కార్డులను రూపొందించారు. అందరికీ అర్థం కావడం కోసం వాటిని 'ఎక్స్‌'లో పోస్టు చేశారు. అవి అత్యంత కచ్చితత్వంతో అచ్చుగుద్దినట్లు ఉండడం గమనార్హం. అంటే ఏఐ మోడళ్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని చద్దా తెలిపారు. ఏఐ టూల్స్‌ను ఏ స్థాయిలో దుర్వినియోగం చేసే అవకాశం ఉందో ఈ ఉదంతం మనకు చెబుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. హర్వీన్‌సింగ్‌ పోస్టుపై ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్‌ చేస్తున్నారు. కొంతమంది మాత్రం ఏఐ జనరేట్‌ చేసిన ఫొటోలను గుర్తించేందుకు తగిన టూల్స్‌ అందుబాటులో ఉన్నాయని వాదించారు. దీనిపై హర్వీన్‌ స్పందిస్తూ.. ఎన్నిచోట్ల అలా ఆధార్‌, పాన్‌ను స్కాన్‌ చేసి గుర్తించే వెసులుబాటు ఉందని ప్రశ్నించారు.

# హస్తినలో తెగని కన్నడ కాంగ్రెస్‌ రచ్చ

- అధిష్ఠానం జోక్యానికి సిద్ధు పట్టు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో అధికార పంపిణీ వ్యవహారంపై దిల్లీలో చర్చల పరంపర మంగళవారం రోజంతా కొనసాగింది. విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌ గాంధీ రాష్ట్ర రాజకీయాలపై దృష్టి సారించారు. ఐదు రోజులుగా బెంగళూరులో సమీక్ష చేపట్టిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం దిల్లీకి చేరుకున్నారు. ఈలోగా రాహుల్‌గాంధీ రాష్ట్ర మంత్రి ప్రియాంక్‌ ఖర్గేతో పాటు సీనియర్‌ నేత, ఎమ్మెల్సీ బి.కె.హరిప్రసాద్‌ తదితరుల నుంచి కీలక సమాచారాన్ని సేకరించారు. రెండు మూడు రోజుల చర్చల తర్వాత ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులను దిల్లీకి పిలిపించి ఓ నిర్ణయం తీసుకునే వీలుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

### బహిరంగంగా మాట్లాడలేను: ఖర్గే

అధ్యక్ష స్థానంలో ఉండి తాను పార్టీ వ్యవహారాలపై బహిరంగంగా మాట్లాడలేనని మల్లికార్జున ఖర్గే మంగళవారం దిల్లీలో స్పష్టం చేశారు. "నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు దిల్లీకి వచ్చాను. ఆ తర్వాత పలు సమీక్ష సమావేశాల్లో పాల్గొంటాను" అని తెలిపారు. కర్ణాటక రాజకీయాలపై స్పందిస్తూ.. నేను నా అభిప్రాయాన్ని అధ్యక్ష హోదాలో ఎక్కడ చెప్పాలో అక్కడే చెబుతానని స్పష్టంచేశారు. మరోవైపు, దిల్లీకి పదే పదే ఎమ్మెల్యేల బృందం వెళుతుండడం, మంత్రులు, ఎమ్మెల్యేల్లో గందరగోళం నెలకొంది. అధిష్ఠానం జోక్యం చేసుకుని ఈ పరిస్థితిని చక్కబెట్టాలని సీఎం సిద్ధరామయ్య డిమాండ్‌ చేశారు. ఎమ్మెల్యేలకు తమ అభిప్రాయాలను తెలియజేసే స్వేచ్ఛ ఉందన్నారు. ఆ కారణంతోనే దిల్లీకి వెళ్లి ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు.

### డీకే, ఖర్గే భేటీ

ఐదు రోజులుగా బెంగళూరు సదాశివనగరలో తానుండే వీధిలోనే నివాసమున్న ఖర్గేతో మాట్లాడని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ నాటకీయంగా వ్యవహరించారు. మంగళవారం ఖర్గే దిల్లీకి బయలుదేరుతున్నారని తెలియగానే హుటాహుటిన వచ్చి. . ఆయన కారులో కూర్చుని విమానాశ్రయం వరకు వెళ్లారు. అనంతరం డీకే శివకుమార్‌ మాట్లాడుతూ.. ఐదారుగురి మధ్య కుదిరిన (అధికార పంపిణీ) ఒప్పందాలపై బహిరంగ చర్చ అనవసరమన్నారు. "నేనెప్పుడూ ముఖ్యమంత్రి కుర్చీ కోసం పట్టుబట్టలేదు. మా పరిమితులేమిటో మాకు తెలుసు. పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలు, మా అభిమానుల కోసం ఏమైనా చేయగలను. అలాగని పార్టీకి అప్రతిష్ఠ కలిగేలా ప్రవర్తించను. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పార్టీకి ఆస్తిలాంటివారు. ఆయన నాయకత్వం అవసరం. రాబోయే బడ్జెట్లు ప్రవేశపెడతానని ఆయనే చెప్పారు. ఆయనకు సహకరించి 2028 విధానసభ, 2029 లోక్‌సభ ఎన్నికల కోసం శ్రమిస్తాం" అని స్పష్టంచేశారు.

# వయసు పెరిగినా తరగని జ్ఞాన తృష్ణ!

రాజమహేంద్రవరం సాంస్కృతికం, కోటగుమ్మం-న్యూస్‌టుడే: వయసు పెరుగుతున్నా తనలోని జ్ఞానతృష్ణ తరిగిపోదని నిరూపిస్తున్నారు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్యులు కర్రి రామారెడ్డి. 40 ఏళ్లుగా చదువును హాబీగా మార్చుకుని వరుసగా డిగ్రీలు చేస్తూ తన జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు. ప్రస్తుతం 73 ఏళ్ల వయసులోకి వచ్చిన ఆయన 73 కోర్సులు పూర్తిచేసి నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో తాను సాధించిన డిగ్రీల వివరాలు వెల్లడించారు. 'దేశంలోని ప్రముఖ ఐఐటీ సంస్థలు నిర్వహించే ఎన్‌పీటీఈఎల్‌ కోర్సుల్లో ఒకే సెమిస్టర్‌లో 12 కోర్సులు పూర్తిచేశా. సైకియాట్రి సైకాలజీ, ఇంజినీరింగ్‌, మేనేజ్‌మెంట్‌, న్యాయశాస్త్రం, ఎడ్యుకేషన్‌, ఆంగ్ల సాహిత్యం, లైబ్రరీ సైన్స్‌, యోగా థెరపీ, జర్నలిజం, కామర్స్‌, పొలిటికల్‌ సైన్స్‌ తదితర విభాగాల్లో కోర్సులు చేసి సర్టిఫికెట్లు అందుకున్నా. డాక్టరేట్లు, పీజీలు, డిగ్రీలు, సర్టిఫికెట్‌ కోర్సులు, తాజాగా సాధించిన 12 సర్టిఫికెట్‌ కోర్సులతో కలిసి మొత్తం 73కు చేరాయి. ఐఐటీ సర్టిఫికెట్‌ కోర్సుల్లో మెగాస్టార్‌ అవార్డు రెండుసార్లు అందుకున్నా. ఈసారి సెమిస్టర్‌లోనూ 9 కోర్సుల్లో టాపర్‌గా నిలిచి మూడోసారి ఆ అవార్డు పొందా' అని వివరించారు. మాజీ ఎంపీ జి.వి.హర్షకుమార్‌, ఆరెస్సెస్‌ సీనియర్‌ నాయకుడు ఓలేటి సత్యనారాయణ మాట్లాడారు.



డిగ్రీల వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్‌ కర్రి రామారెడ్డి

# ఉప్పాడ చేపల రేవు నిర్మాణంలో లోపాలు!

- సముద్రంలోకి ప్రవేశ ద్వారం వెడల్పు పెంచేశారు.. టెట్రాపాడ్‌ల పరిమాణం తగ్గించేశారు
- ఫలితంగానే అలల తాకిడితో బోట్లు దెబ్బతింటున్నాయి
- మత్స్యశాఖ తీరప్రాంత ఇంజినీరింగ్‌ కేంద్ర సంస్థ నివేదికలో వెల్లడి

ఈనాడు, కాకినాడ: కాకినాడ జిల్లా ఉప్పాడ సమీపంలో చేపల రేవు (ఫిషింగ్‌ హార్బర్‌) నిర్మాణం దాదాపు 85 శాతం పూర్తయింది. మత్స్యకారులకు సుస్థిరమైన జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో నిర్మిస్తున్న ఈ రేవులో ప్రస్తుతం వారికి మేలు కంటే నష్టమే ఎక్కువగా జరుగుతోంది. హార్బర్‌ డిజైన్‌లో లోపాల కారణంగా మత్స్యకారుల బోట్లు దెబ్బతింటున్నాయి. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల తర్వాత మత్స్యశాఖ కమిషనర్‌ మూడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వ సంస్థలతో సంయుక్త తనిఖీలు చేయించారు. వాప్కోస్‌, సెంట్రల్‌ వాటర్‌ పవర్‌ రీసెర్చ్‌ స్టేషన్‌ (సీడబ్ల్యూపీఆర్‌ఎస్‌), సెంట్రల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ కోస్టల్‌ ఇంజినీరింగ్‌ ఫర్‌ ఫిషరీ (సీఐసీఈఎఫ్‌) అధికారులు ఆగస్టు నెలలో ఈ హార్బర్‌ను పరిశీలించి కొన్ని లోపాలను గుర్తించారు. 2017 అక్టోబర్‌లో సీడబ్ల్యూపీఆర్‌ఎస్‌ ఇచ్చిన సాంకేతిక డిజైన్‌కు అనుగుణంగా కొన్ని నిర్మాణాలు జరగలేదని వాటిని తప్పక సరిదిద్దుకోవాలని నివేదికలో పేర్కొన్నారు.



ఉప్పాడ సమీపంలో నిర్మిస్తున్న చేపల రేవు

### 26 బోట్లు దెబ్బతిన్నాయ్‌..

ఉప్పాడ తీరంలోని అమీనాబాద్‌ వద్ద 2,500 బోట్లు నిలిపి ఉంచేందుకు వీలుగా సుమారు రూ.289 కోట్ల అంచనాతో ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణానికి 2017లో అడుగులు పడ్డాయి. వాప్కోస్‌ డీపీఆర్‌ తయారు చేయించారు. చెన్నైకి చెందిన హిందుస్థాన్‌ యూనివర్సిటీ సివిల్‌ ఇంజినీరింగ్‌, సీడబ్ల్యూపీఆర్‌ఎస్‌ సంస్థలతో హైడ్రాలిక్‌ మోడల్స్‌, పూడిక, అలల తీవ్రతపై అధ్యయనం జరిపించారు. 2018లో సీఐసీఈఎఫ్‌ ఈ డిజైన్లను ఆమోదించింది. 2020లో ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఇప్పటి వరకు 85 శాతం పూర్తిచేశారు. ఇప్పటి నుంచి సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకార బోట్లు ఈ హార్బర్‌ నిర్మాణంతో అలల తాకిడికి ఎప్పుడూ లేనంతగా దెబ్బతింటున్నాయి. గత రెండేళ్లలో 26 బోట్లు దెబ్బతిన్నాయి. మత్స్యకారుల అభ్యర్థనతో ఇటీవలే రూ.72 లక్షలు పరిహారంగా కూటమి ప్రభుత్వం అందించింది. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్‌ కల్యాణ్‌ కూడా ఏరియల్‌ వ్యూ ద్వారా ఈ హార్బర్‌ను పరిశీలించారు. చెన్నై నిపుణులతో పరిశీలన చేసి మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

### కేంద్ర సంస్థల పరిశీలనలో గుర్తించిన లోపాలు..

- ఈ హార్బర్‌ ఆమోదిత డిజైన్‌ ప్రకారం ప్రవేశ ద్వారం (సీ మౌత్‌) వెడల్పు 90 మీటర్లు ఉండాలి. ఇక్కడ 145 మీటర్లు ఉంచారు. దీనివల్ల అలల శక్తి లోపలికి ఎక్కువగా వస్తుంది.
- తక్కువ లోతు ఉండడం వల్ల అలలు విరిగిపడుతున్నాయి (వేవ్‌ బ్రేకింగ్‌). మైనస్‌ 3 మీటర్ల లోతు వరకు డ్రెడ్జింగ్‌ చేయాల్సిన అవసరం ఉంది.
- నిర్మాణంలో వాడిన రాళ్లు, టెట్రాపాడ్‌ల బరువు డిజైన్‌కు భిన్నంగా ఉన్నాయి. దీనివల్ల నిర్మాణ బలంలో స్థిరత్వం కొరవడింది.
- బ్రేక్‌ వాటర్‌ దక్షిణ భాగం చివరిలో 8 టన్నుల టెట్రాపాడ్‌కు బదులు 6 టన్నులవి వినియోగించారు.
- ట్రైనింగ్‌ వాల్‌ హెడ్‌ వద్ద ఉత్తరం వైపున నాలుగు టన్నుల టెట్రాపాడ్‌లకు బదులు రెండు టన్నుల వాటితో సరిపెట్టారు. ఈ గోడను పూర్తిస్థాయిలో నిర్మించాలి.

# వందశాతం అక్షరాస్యతకు 'అక్షర ఆంధ్ర'

2029 నాటికి రాష్ట్రంలో నిరక్షరాస్యత నిర్మూలన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2029 నాటికి వందశాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రభుత్వం 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది ఫిబ్రవరిలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్రంలో 15-59 ఏళ్ల మధ్య నిరక్షరాస్యులు 81 లక్షల మంది ఉన్నారు. 2024-25లో నిర్వహించిన అక్షరాస్యత కార్యక్రమంలో 3.53 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు. మిగిలిన వారిని విడతల వారీగా అక్షరాస్యులుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఉల్లాస్‌' కార్యక్రమం కింద అక్షర ఆంధ్ర అమలు చేయనున్నారు. ఈ విధానంలో 15-59 ఏళ్ల మధ్యనున్న నిరక్షరాస్యులందరికీ చదవడం, రాయడం, సంఖ్యా నైపుణ్యాలు నేర్పిస్తారు. డిజిటల్‌, ఆర్థిక, ఆరోగ్యం, చట్టపరమైన, పౌర అక్షరాస్యత లాంటి జీవన నైపుణ్యాలను వాలంటీర్లు బోధిస్తారు. సెర్ప్‌, మెప్మా, విద్యా సంస్థలు, కమ్యూనిటీ నెట్‌వర్క్‌ల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రతి 10 మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్‌ను నియమిస్తారు.

# కనులపండువగా పద్మావతీ అమ్మవారి పంచమీతీర్థం

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమీతీర్థం మంగళవారం కనులపండువగా జరిగింది. మధ్యాహ్నం 12.10 నుంచి 12.20 గంటల మధ్య నయనానందకరంగా నిర్వహించారు. తొమ్మిది రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం ఘట్టంతో వైభవంగా ముగిశాయి. రాత్రి 10 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజాదికాల అనంతరం గజపటాన్ని అవరోహణ చేయడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. కార్యక్రమంలో తితిదే ఛైర్మన్‌ బీఆర్‌ నాయుడు, ఈవో అనిల్‌కుమార్‌ సింఘాల్‌, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, కలెక్టర్‌ వెంకటేశ్వర్‌, ఎమ్మెల్యే పులివర్తి నాని, పాలకమండలి సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాక లక్ష్మి, దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

# '2033 నాటికి పాల ఉత్పత్తిలో టాప్‌-3లో నిలవాలి'

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఏటా 139.46 లక్షల టన్నులున్న పాల ఉత్పత్తిని 2033 నాటికి 150 లక్షల టన్నులకు పెంచి జాతీయ స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలపాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌ డాక్టర్‌ టి.దామోదరనాయుడు తెలిపారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులు పశుపోషణతో జీవనోపాధి పొందుతున్నారని, పాల ఉత్పత్తిలో రాష్ట్రం ప్రస్తుతం ఏడో స్థానంలో ఉందని పేర్కొన్నారు. బుధవారం జాతీయ పాల దినోత్సవం నేపథ్యంలో రాష్ట్రంలో పాల ఉత్పత్తి పెంపుదల లక్ష్యాలను చేరుకునేందుకు తీసుకుంటున్న చర్యలను మంగళవారం దామోదరనాయుడు వివరించారు.

# లక్క సాగుతో రూ.లక్షల్లో ఆదాయం

దేశంలో నం.1గా నక్సల్స్‌ ప్రభావిత కాంకేర్‌

ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌ జిల్లా నక్సల్స్‌ ప్రభావిత ప్రాంతంగా ప్రసిద్ధి. ఇప్పుడు ఈ ప్రాంతం ఆధునిక వ్యవసాయంతో ప్రత్యేక గుర్తింపును పొందుతోంది. లక్క సాగు స్థానిక రైతులకు గణనీయమైన లాభాలను తెచ్చిపెడుతోంది. కాంకేర్‌ జిల్లా ఏటా దాదాపు 7 వేల మెట్రిక్‌ టన్నుల లక్కను ఉత్పత్తి చేస్తూ దేశంలోనే ప్రథమస్థానంలో ఉంది. ఇతర రాష్ట్రాలకు కూడా విత్తనాలను పంపిణీ చేస్తోంది. సాధారణంగా లక్క ఉత్పత్తిని కుసుమ, రేగు చెట్లపై చేసేవారు. కాంకేర్‌ జిల్లా రైతులు సెమియలాటా అనే మొక్కలపై లక్కను ఉత్పత్తి చేసి ఒక కొత్త మోడల్‌ను అభివృద్ధి చేశారు. ఈ మొక్కలు ఏడాది వ్యవధిలోనే లక్కను పండించేందుకు సిద్ధమవుతాయి. ప్రతి ఆరు నెలలకు పంటను తీసుకోవచ్చు. మొదట్లో ఖర్చు అధికంగా ఉన్నప్పటికీ తర్వాత తగ్గుతూ ఎకరాకు రూ.లక్ష వరకూ ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు. లక్క సాగుకు అటవీశాఖ శిక్షణ కూడా ఇస్తోంది.



ఈటీవీ భారత్‌

గత సీజన్లో కిలో లక్కను రూ.820కు విక్రయించినట్లు రైతు మనీశ్‌ సోరీ తెలిపారు. దేశంలో అత్యుత్తమమైన కుసుమి లక్క కాంకేర్‌లోనే ఉత్పత్తి అవుతోందని జిల్లా వ్యవసాయ విజ్ఞానకేంద్రం అధిపతి డాక్టర్‌ బీర్బల్‌ సాహు తెలిపారు. లక్కను విద్యుత్తు పరికరాల ఇన్సులేటర్లు, గ్రామ్‌ఫోన్‌ రికార్డులు, గాజులు, ఆభరణాలు, సిమెంటు, ఫర్నీచర్‌ పాలిష్‌, చెక్క బొమ్మలతోపాటు వైద్య అవసరాలకూ ఉపయోగిస్తారు.

# హోంవర్క్‌ చేయలేదని.. అయిదేళ్ల బాలుడిని వేలాడదీశారు

సూరజ్‌పుర్‌: ఛత్తీస్‌గఢ్‌లో హోంవర్క్‌ చేయలేదని అయిదేళ్ల బాలుడిని ఇద్దరు టీచర్లు చెట్టుకు వేలాడదీసి దారుణమైన శిక్ష విధించారు. సూరజ్‌పుర్‌ జిల్లా నారాయణ్‌పుర్‌లోని ప్రయివేటు పాఠశాలలో ఈ అమానవీయ ఘటన జరిగింది. స్థానికుల్లో ఒకరు దీన్ని వీడియో తీసి వైరల్‌ చేయడంతో బయటపడింది. తీవ్ర ఆగ్రహానికి గురైన గ్రామస్థులు పాఠశాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై విచారణకు ఓ బృందాన్ని పంపినట్లు డీఈవో అజయ్‌మిశ్ర తెలిపారు. స్కూలు యాజమాన్యానికి షోకాజ్‌ నోటీసు జారీచేసి వివరణ కోరామని వెల్లడించారు.



# గృహమే కదా నరక సీమ!

- 10 నిమిషాలకో మహిళ హత్య
- ఐక్యరాజ్య సమితి నివేదిక

న్యూయార్క్‌: ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికలకు ఇల్లే అతి ప్రమాదకరమైనదిగా మారింది! భర్త, సొంత కుటుంబ సభ్యుల చేతుల్లోనే ప్రతి 10 నిమిషాలకు ఒక మహిళ హత్యకు గురవుతున్నట్లు ఐక్యరాజ్యసమితి తాజాగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. గతేడాది ప్రపంచవ్యాప్తంగా 83,000 మంది మహిళలు, బాలికలు హత్యకు గురయ్యారు. వీరిలో 60 శాతం మంది వారి భాగస్వాములు లేదా కుటుంబ సభ్యుల వల్లే ప్రాణాలు కోల్పోయారు. ఈ లెక్కన రోజూ సగటున 137 మంది మహిళలు భాగస్వామి లేదా కుటుంబ సభ్యుల చేతిలో హత్యకు గురయ్యారు. ఐరాసకు చెందిన మాదకద్రవ్యాల నేరాల కార్యాలయం (యూఎన్‌డీడీసీ), ఐరాస మహిళా విభాగం కలిసి ఈ నివేదికను విడుదల చేశాయి. పురుషుల హత్యల విషయంలో భాగస్వాములు, కుటుంబ సభ్యుల పాత్ర 11 శాతంగా ఉంది. దీన్ని బట్టి చూస్తే మహిళలకు సొంతింటి నుంచే ప్రాణాలకు ముప్పు ఎక్కువ ఉందనే విషయం స్పష్టమవుతోంది. భాగస్వామి లేదా కుటుంబ సభ్యుల వల్ల జరిగిన హత్యల రేటు ఆఫ్రికాలో అత్యధికంగా నమోదైంది. లక్ష మంది మహిళల్లో ముగ్గురికి ఈ ముప్పు ఉంది. ఆసియాలో ఇది 0.7గా ఉంది.



### లక్ష్యాలను అనుసరించే విజయం

విజయం అనేది ప్రతిభకు సంబంధించిన విషయం కాదు. అది మన లక్ష్యాలకు సంబంధించింది. సాధారణ వ్యక్తులు సౌకర్యవంతంగా ఉండేవాటిని ఎంచుకుంటారు. విజేతలుగా నిలిచే వ్యక్తులు క్రమశిక్షణను, సాహసాలను ఎంపికచేసుకుంటారు. ఇతరులు సాధించలేనిది మీరు కోరుకుంటే..ఇతరులు చేయడానికి ఇష్టపడని కార్యాలను మీరు చేయగలగాలి.

– డ్రాగన్‌ సుతేవ్స్కి, రచయిత

# సత్యం కోసం ప్రాణాలర్పించిన గురు తేగ్‌ బహాదుర్‌: మోదీ

కురుక్షేత్ర: సత్యం, న్యాయం, విశ్వాసాల పరిరక్షణను తన ధర్మంగా సిక్కుల తొమ్మిదో పవిత్ర గురువు తేగ్‌ బహాదుర్‌ భావించారని, వాటి కోసం ప్రాణత్యాగం చేశారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. ఆయన 350వ బలిదాన దినం సందర్భంగా మంగళవారం హరియాణాలోని కురుక్షేత్రలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాని ప్రసంగించి, నివాళులు అర్పించారు. ప్రత్యేక నాణేన్ని, తపాలా బిళ్లను విడుదల చేశారు. తమ ప్రభుత్వం గురు పరంపరను గౌరవిస్తుందన్నారు. తేగ్‌ బహాదుర్‌ జీవితం, త్యాగచరిత్ర, గుణగణాలు మనకు ఎంతగానో స్ఫూర్తినిస్తాయని చెప్పారు. అలాంటివారు చరిత్రలో చాలా అరుదుగా ఉంటారన్నారు. ఆయన బోధనలు మన ప్రవర్తనలో శాంతికి పునాది కావాలని, విధానాల్లో సమతౌల్యానికి దోహదపడాలని ఆకాంక్షించారు. తమను మొగల్‌ పాలకులు బలవంతంగా ఇస్లాంలోకి మార్చాలని చూస్తున్నారని, ఆదుకోవాలని కశ్మీర్‌లోని హిందువులు కోరినప్పుడు.. మొగల్‌ చక్రవర్తి ఔరంగజేబ్‌కు ఎదురొడ్డి నిలబడి తేగ్‌ బహాదుర్‌ తన జీవితాన్ని త్యాగం చేశారని గుర్తుచేశారు. విశ్వాసాలు, సిద్ధాంతాల విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా, ధర్మపథాన్ని వీడకుండా ఆయన జీవితాంతం పోరాడారని చెప్పారు. అయోధ్య రామ మందిరంపై 2019 నవంబరు 9న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించినప్పుడు తాను పంజాబ్‌లో కర్తార్‌పుర్‌ నడవాను ప్రారంభిస్తున్నానని గుర్తుచేసుకున్నారు. కురుక్షేత్రలో కృష్ణ భగవానుని శంఖువుకు అంకితమిస్తూ కొత్తగా నిర్మించిన పాంచజన్య స్మారకాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఆయన మహాభారత అనుభవ్‌ కేంద్రాన్ని సందర్శించారు.



మహాభారత అనుభవ్‌ కేంద్రాన్ని తిలకిస్తున్న ప్రధాని మోదీ

# శబరిమల అన్నదానంలో 'కేరళ సాద్య'

తిరువనంతపురం: శబరిమల అయ్యప్పను దర్శించుకునే భక్తులు అక్కడ నిర్వహిస్తున్న నిత్య అన్నదానంలో ఇకపై కేరళ సంప్రదాయ భోజనమైన సాద్యనూ రుచి చూడనున్నారు.



ప్రస్తుతం అందిస్తున్న పులావ్‌, సాంబార్‌కు బదులుగా గురువారం నుంచి కేరళ సాద్యను అన్నదానంలో చేర్చనున్నట్లు ట్రావెన్‌కోర్‌ దేవస్థానం బోర్డు(టీడీబీ) అధ్యక్షుడు జయకుమార్‌ తెలిపారు. ఇందులో భాగంగా భక్తులకు పాయసం, అప్పడం వడ్డిస్తామన్నారు.

# పెద్దపేగు క్యాన్సర్‌కు పిప్పళ్లతో చెక్‌!

దిల్లీ: పెద్దపేగు క్యాన్సర్‌కు చౌకలో, ప్రభావవంతమైన ఔషధాన్ని కనుగొన్నట్లు రవూర్కెలాలోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఎన్‌ఐటీ) శాస్త్రవేత్తలు తెలిపారు. లాంగ్‌ పెప్పర్‌ (పిప్పళ్లు)లో ఉండే ఓ మూలకం క్యాన్సర్‌ను ఎదుర్కోవడంలో తోడ్పడుతుందని గుర్తించారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్‌ నార్త్‌ కరోలినా, గయలోని సెంట్రల్‌ యూనివర్సిటీ ఆఫ్‌ సౌత్‌ బిహార్‌ సంయుక్తంగా నిర్వహించిన ఈ అధ్యయన వివరాలు ఇటీవల 'బయో ఫ్యాక్టర్స్‌' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. 'క్యాన్సర్‌ రోగులకు కీమోథెరపీ వంటి సంప్రదాయ వైద్య విధానాల వల్ల దుష్ప్రభావాలు ఎదురవుతాయి. ఒకసారి క్యాన్సర్‌ కణాలు రోగ నిరోధక శక్తిని సంతరించుకుంటే ఆ చికిత్స పని చేయదు. పిప్పళ్లలోని పైపర్‌లాంగమీన్‌ మూలకం కేవలం క్యాన్సర్‌ కణాలనే నిర్మూలిస్తూ.. ఆరోగ్యకరమైన వాటిని వదిలేస్తోందని మేం చేసిన పరిశోధనల్లో తేలింది' అని అధ్యయనంలో పాలుపంచుకున్న అసోసియేట్‌ ప్రొఫెసర్‌ బిజేష్‌కుమార్‌ బిశ్వాల్‌ వివరించారు.



# గాయకుడు జుబిన్‌ గర్గ్‌ది హత్యే

- వెల్లడించిన అస్సాం సీఎం



జుబిన్‌ గర్గ్‌

గువాహటి: ప్రముఖ గాయకుడు జుబిన్‌ గర్గ్‌ (52) మృతిపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. జుబిన్‌ ప్రమాదంలో చనిపోలేదని.. ఆయన్ను కుట్రపూరితంగా హత్య చేశారని అసెంబ్లీలో వెల్లడించారు. జుబిన్‌ మరణంపై చర్చించడానికి ప్రతిపక్షాలు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానంపై హిమంత మాట్లాడారు. నేరం వెనుక ఉన్న ఉద్దేశం ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేస్తుందని తెలిపారు. డిసెంబరులో ఛార్జిషీటు సమర్పించిన తర్వాత పూర్తి వివరాలను పోలీసులు వెల్లడిస్తారన్నారు. నిందితులలో ఒకరు ఆయన్ను హత్య చేయగా. . మిగిలినవారు అతడికి సహకరించినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. ఈ హత్యతో సంబంధమున్న ఐదుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. జుబిన్‌ మరణంపై దర్యాప్తు చేస్తున్న ఏకసభ్య కమిషన్‌కు గడువును డిసెంబరు 12 వరకు పొడిగించారు.


### బహుభార్యత్వం నిషేధానికి శాసనసభలో బిల్లు

బహుభార్యత్వాన్ని నిషేధించే బిల్లును అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మొదటిసారి నేరం చేసినవారికి ఏడేళ్ల వరకు జైలుశిక్ష విధించేలా నిబంధన రూపొందించారు. బిల్లు పరిధి నుంచి గిరిజనులను, గిరిజన ప్రాంతాలను మినహాయించారు.

# కస్టడీ మరణాలు వ్యవస్థకే మచ్చ

- వీటిని దేశం సహించదు: సుప్రీంకోర్టు
- అఫిడవిట్లు సమర్పించని రాష్ట్రాలపై ఆగ్రహం

దిల్లీ: పోలీసు కస్టడీలో జరిగే హింస, మరణాలు వ్యవస్థకే 'మచ్చ' అని, వీటిని దేశం సహించదని సుప్రీంకోర్టు పేర్కొంది. పోలీసు స్టేషన్లలో సీసీటీవీలు పనిచేయకపోవడాన్ని సుమోటో కేసుగా తీసుకున్న న్యాయస్థానం మంగళవారం విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. రాజస్థాన్‌లో గత 8 నెలల్లో పోలీసు కస్టడీలో 11 మరణాలు సంభవించడంపై జస్టిస్‌ విక్రమ్‌నాథ్‌, జస్టిస్‌ సందీప్‌ మెహతాల ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. 'గత విచారణ సమయంలో ఆదేశాల మేరకు కస్టడీలో హింస, మరణాలకు సంబంధించి 11 రాష్ట్రాలు మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయి. మిగిలిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వం ఇంకా సమర్పించలేదు' అని ధర్మాసనం పేర్కొంది. ఇంకా అఫిడవిట్లు దాఖలు చేయని వారికి మూడు వారాల సమయం మంజూరు చేస్తూ తదుపరి విచారణను డిసెంబరు 16కు వాయిదా వేసింది. గడువులోగా అఫిడవిట్లు దాఖలు చేయకపోతే, ఆయా రాష్ట్రాలు, యూటీల హోంశాఖల్లోని ముఖ్య కార్యదర్శులు కోర్టు ముందు హాజరు కావాల్సి ఉంటుందని హెచ్చరించింది.



■ 2020 నాటి మరో కేసు ఉత్తర్వుల విషయంలో అమికస్‌ క్యూరీగా సుప్రీంకోర్టుకు సాయం చేస్తున్న సీనియర్‌ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ, ఈడీ, ఎన్‌ఐఏ కార్యాలయాల్లో మాత్రమే సీసీటీవీ కెమెరాలు, రికార్డింగ్‌ పరికరాలు ఏర్పాటు చేశారని.. మరో మూడు దర్యాప్తు సంస్థల కార్యాలయాల్లో వాటిని ఏర్పాటు చేయలేదని తెలిపారు.

# నన్ను సవాల్‌ చేస్తే భాజపా పునాదులు కదిలిస్తా

- బెంగాల్‌లో ఎస్‌ఐఆర్‌ వ్యతిరేక నిరసనలు చేపట్టిన సీఎం మమత

బోన్‌గావ్‌: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్‌)కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి ఆందోళన బాట పట్టారు. మంగళవారం బొన్‌గావ్‌లోని చందపారా నుంచి 24 పరగణాల జిల్లాలోని ఠాకుర్‌నగర్‌కు 3 కి.మీ. పాదయాత్రను చేపట్టారు. దీనికి ముందు బొన్‌గావ్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఆమె...ఎన్నికల సంఘం (ఈసీ)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈసీ 'భాజపా కమిషన్‌'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపించారు. ఎన్ని కేంద్ర సంస్థలను రాష్ట్రంలోకి తీసుకువచ్చినా...ఎన్ని రూ.కోట్లను ఖర్చుపెట్టినా తనను రాజకీయపరంగా ఓడించలేరని అన్నారు. "మీరు నన్ను లక్ష్యంగా చేసుకుని బెంగాల్‌లో రాజకీయపరంగా దెబ్బకొట్టాలని చూస్తే... దేశవ్యాప్తంగా మీ పార్టీ పునాదులను కదిలిస్తాను. గాయపడిన పులి మరింత ప్రమాదకరమైనది" అని భాజపాపై మమత ధ్వజమెత్తారు. ప్రాణాలు ఎంతో విలువైనవని, ఎస్‌ఐఆర్‌ భయంతో బలవన్మరణాలకు పాల్పడవద్దంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు వేసిన వారెవరూ నిజమైన ఓటర్లు కాదంటే... అసలు భాజపాకి పరిపాలించే హక్కే లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మతువా మెజారిటీ ప్రాంతాల్లోని ఓటర్లు 'సీఏఏ' కింద తమను తాము విదేశీయులుగా ప్రకటించుకుంటే వెంటనే ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లు తొలగిపోతాయన్నారు. బెంగాల్‌లో ఎస్‌ఐఆర్‌ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితా బయటకు వచ్చిన తర్వాత.. ఈసీ, భాజపా సృష్టించిన గందరగోళాన్ని ప్రజలు గుర్తిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను రెండు, మూడేళ్లపాటు నిర్వహిస్తే సహకరిస్తామని చెప్పారు.



# వసుంధర

vasundhara@eenadu.in

**శారీరక లోపాన్ని చూసి కుంగిపోలేదామె. దాన్నే తన బలంగా మార్చుకోవాలనుకున్నారు. పట్టుదలతో టెన్నిస్ నేర్చుకున్నారు 23 ఏళ్ల భవానీ కేడియా. ప్రస్తుతం టోక్యోలో జరుగుతోన్న 'డెఫ్లింపిక్స్‌లో దేశం తరఫున ఆడుతున్నారు. తన స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని వసుంధరతో పంచుకున్నారిలా.**


భవాని

## విధికి తలొగ్గకుండా...

మాది హైదరాబాద్. నాన్న నీరజ్ ఫర్నిచర్ షాపు నడిపేవారు. అమ్మ మధు. పుట్టుకతోనే సవాళ్లను చూశా. తక్కువ బరువుతో పుట్టడం వల్ల ఐసీయూలో ఉంచారు. రెండేళ్ల వయసులో నాకు ఒక కన్ను సరిగ్గా కనిపించదని తెలిసి అమ్మానాన్నలు వైద్యం చేయించారు. నయం అయ్యింది. తర్వాత మూడో సంవత్సరంలో నాకు వినపడదని తెలిసి అమ్మానాన్నలు చాలా బాధ పడ్డారు. వైద్యపరీక్షల అనంతరం వినికిడి పరికరం అమర్చారు. వీటికి తోడు మాటలు ఆలస్యం. ఎలాగో నేర్చుకుని స్కూల్‌కి వెళితే 'ఇన్ని లోపాలున్న మీ అమ్మాయికి చదువు అవసరమా?' అంటూ పాఠశాలలో నన్ను చేర్చుకోవడానికి నిరాకరించేవారు. అప్పుడు నాన్న 'మా అమ్మాయి అందరిలాంటి పాపే. తను అన్నీ చక్కగా నేర్చుకోగలదు. మీకు ఇబ్బంది అయితే కనీసం పాఠశాలలో ఓ మూల కూర్చోపెట్టి చదువు చెప్పినా చాలు' అని పాఠశాల సిబ్బందిని ప్రాధేయపడ్డారు. ఎన్నో ప్రయత్నాల తర్వాత ఓ స్కూల్లో చేరా. తరగతిలో నాతో ఎవరూ మాట్లాడేవారు కాదు. ఎప్పుడైనా ఎవరయినా మాట్లాడితే నాన్నతో చెప్పి తెగ సంబరపడిపోయేదాన్ని. స్కూల్లో చదువుతున్నప్పుడు ఓసారి అన్నతో కలిసి సరదాగా షటిల్ ఆడటానికి వెళ్లా. ఆటలో కిందపడి నా గడ్డానికి దెబ్బ కూడా తగిలింది. అయినా ఏడవలేదు. అమ్మానాన్న మొదట కంగారు పడ్డారు. కానీ, అప్పుడే నాలో ప్రతిభనీ, పట్టుదలనీ గుర్తించారు నాన్న. నా కాళ్లపై



నేను నిలబడాలనుకున్నారు. అందుకే ఆటల్లో రాణించేలా చేయాలనుకున్నారు.

### ఎప్పుడూ అధైర్య పడలేదు...

ఆట నేర్పించమని ఎంతమంది కోచ్‌ల దగ్గరకి వెళ్లినా ఇన్ని లోపాలున్న అమ్మాయి ఎలా ఆడుతుందనేవారు. అయినా నేను వెనకడుగు వేయలేదు. షటిల్ పక్కన పెట్టి టెన్నిస్ ఆడటం మొదలుపెట్టా. మొదట్లో ఇంట్లోనే సొంతంగా ప్రాక్టీసు చేసేదాన్ని. తర్వాత కోచ్ సాయంతో మూడేళ్లలో ఆట నేర్చుకున్నా. అలా 2018లో జాతీయ స్థాయిలో నాలుగో స్థానం, 2022లో బ్రెజిల్‌లో ప్రపంచ డెఫ్లింపిక్స్‌లో నాలుగో స్థానం సాధించగా, 2023లో జాతీయ స్థాయిలో బంగారు పతకాన్ని సాధించాను. ప్రస్తుతం టోక్యోలో జరుగుతోన్న డెఫ్లింపిక్స్‌కి మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాను. విధి ఎంత భయపెట్టినా మన సంకల్పంతో ముందుకు సాగితే విజయాలు వాటంతటవే వస్తాయి. అలా సాగితేనే ప్రపంచానికి స్ఫూర్తినివ్వగలం కూడా. క్రీడా రంగంలో వికలాంగ అథ్లెట్లకు గుర్తింపు లభిస్తోంది. ఆసక్తి ఉంటే ఎవరైనా ప్రయత్నించొచ్చు, రాణించొచ్చు.

– రామాంజనేయులు చింతలపాటి, హైదరాబాద్

## ఉద్యోగం మానేయడం... మంచి నిర్ణయమేనా!

రెండు దశాబ్దాలుగా నేనో కార్పొరేట్ కంపెనీలో పనిచేస్తున్నా. ఐదేళ్ల క్రితం ఓ వ్యాపకంగా ఉంటుందని చిరు వ్యాపారాన్ని ప్రారంభించా. రెండేళ్లుగా అది బాగా నడుస్తోంది. మంచి లాభాలు వస్తున్నాయి కూడా. అందుకే ఉద్యోగం మానేసి, వ్యాపారం మీద దృష్టి పెట్టాలి అనుకుంటున్నా. ఇది మంచి నిర్ణయమేనా?

– ఓ సోదరి

ఉద్యోగం మానేసి, పూర్తి సమయం వ్యాపారానికి కేటాయించాలా... వద్దా... అనేది పూర్తిగా మీ నిర్ణయం. అయితే అది తీసుకునే ముందు... కొన్ని కీలక విషయాల్ని పరిగణనలోకి తీసుకోండి. ఉద్యోగం ఒక ఆర్థిక భద్రత. దీనివల్ల ఇప్పటిదాకా ఫైనాన్షియల్‌గా ఏ లోటూ లేకుండా కాలం గడిచింది. మీ కాళ్ల మీద మీరు నిలబడగలిగారు. మీ అవసరాలన్నీ పూర్తిచేసుకోగలిగారు. పనులు, పని వేళలు కూడా పరిమితమే. ఇచ్చిన పని పూర్తిచేసుకుని, సమయం అవ్వగానే ఇంటికి చేరుకునేటట్లు ఉంటుంది ఉద్యోగిని రోల్. కానీ వ్యాపారంలో అలా కాదు. 24గంటలూ దీనికే కేటాయించాల్సిన అవసరమూ రావొచ్చు. అంతేకాదు పోటీ, అడ్డంకులూ, సమస్యల్నీ తట్టుకుని నిలబడగలగాలి. మార్గనిర్దేశం చేసే మెంటార్లు ఉన్నారా లేదా అనేదీ చెక్ చేసుకోవాలి. ఒకవేళ వెనుదిరగాల్సిన పరిస్థితే వస్తే... కుటుంబం నుంచి మీకు ఎంత వరకూ సహాయం అందుతుంది అన్నదీ ముఖ్యమే. ఓ పేషన్‌గా దీన్ని స్వీకరిస్తే ఈ సవాళ్లన్నీ ఇట్టే దాటగలరు. అలాకాకుండా దీన్ని కూడా మరో ప్రొఫెషన్‌గా భావిస్తే కష్టం. వీటన్నింటినీ తట్టుకోగలను, అన్నింటికీ సిద్ధంగా ఉన్నాను అనుకుంటే రాజీనామా చేయండి. లేదంటే ఆ నమ్మకం వచ్చే వరకూ ఉద్యోగాన్ని చేస్తూ, వ్యాపారాన్నీ కొనసాగించండి.

డియర్ వసుంధర


కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

## అమ్మాయిలు మెచ్చిన ఐఐఎం విశాఖ



**వ్యాపారంలో రాణించాలి, పెద్ద సంస్థల్లో నాయకత్వ హోదాకి చేరుకోవాలి అని ఆలోచిస్తున్న అమ్మాయిలు పెరుగుతున్నారు. అలాంటివారి ఎంపిక ఎంబీఏనే అవుతోంది. అందులోనూ మేనేజ్‌మెంట్ విద్యకి పేరుగాంచిన ఐఐఎంలకే ఓటేస్తున్నారు. ముఖ్యంగా ఐఐఎం-వైజాగ్ అమ్మాయిల్ని మరింతగా ఆకట్టుకుంటోంది. కాబట్టే, దీనిలో వీరి హవా కనిపిస్తోంది.**

విద్యార్థినుల సంఖ్య పెరగడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్- వైజాగ్ (ఐఐఎంవీ) ప్రత్యేకంగా కృషి చేస్తోంది. మేనేజ్‌మెంట్ విద్య దిశగా అమ్మాయిలను ప్రోత్సహించడానికి స్థానిక, జాతీయ విద్యాసంస్థల సాయంతో వర్క్‌షాప్‌లు, అవగాహన సదస్సులు నిర్వహించడం, జెండర్ డైవర్సిటీ వెయిటేజీ పేరుతో అదనపు పాయింట్లు కేటాయించడం, వేధింపులకు వ్యతిరేకంగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు వంటివెన్నో చేస్తోంది. నైపుణ్యాభివృద్ధి, ఆంత్రప్రెన్యూర్‌షిప్, నాయకత్వ లక్షణాలను పెంపొందించే కార్యక్రమాలు, సర్టిఫికేషన్ కోర్సుల నిర్వహణ వంటివాటికీ చోటిస్తోంది.

### ప్రాంగణ నియామకాలు

2015లో ఏర్పాటైన ఈ ఐఐఎం నాణ్యమైన విద్యపైనే కాదు... విద్యార్థులకు ఉద్యోగకల్పనపైనా దృష్టిసారిస్తోంది. ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, అమెజాన్, జీఎంఆర్, రిలయన్స్ వంటి 80కిపైగా సంస్థలు వైజాగ్ ఐఐఎంకి ప్రాంగణ నియామకాలకు వస్తున్నాయి. 2024-26 బ్యాచ్‌లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు సాధించినవారిలో 40 శాతం విద్యార్థినులే. సగటు వార్షిక వేతనం రూ.16.40 లక్షలుగా ఉంది. ఈ ఏడాది రెండేళ్ల ఎంబీఏ కోర్సులో మహిళలే ఎక్కువ సీట్లు సంపాదించారు. వీరి సంఖ్య 187 కాగా పురుషులు 166 మంది. మొత్తం క్యాంపస్‌లో 47 మంది ప్రొఫెసర్లుండగా.. వారిలో మహిళల సంఖ్య 18. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ (ఆన్‌లైన్ అండ్ ఆఫ్‌లైన్) కోర్సుల్లో ఏటా ప్రపంచవ్యాప్తంగా 3000 మందికిపైగా విద్యార్థులు చేరుతున్నారు. కొత్తగా ప్రారంభించిన ఐఐఎంలలో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లోనూ ముందు వరుసలో ఉంది విశాఖ ఐఐఎం.

### సొంత వ్యాపారానికి...

విద్యార్థుల స్టార్టప్‌లకు సాయపడుతోంది. ఇందుకోసం 'ఐఐఎంవీ ఫీల్డ్' పేరుతో ప్రత్యేకంగా ఇంక్యుబేటర్‌నీ ప్రారంభించారు సంస్థ ప్రతినిధులు. ఇది దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఇంక్యుబేటర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇక్కడ వ్యాపార వ్యూహాలు, నిర్వహణ, మార్కెటింగ్, ఆర్థిక నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణతోపాటు... ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఎదుర్కొనే సవాళ్లపై దృష్టిసారిస్తూ ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తున్నారు. పారిశ్రామిక నిపుణులతో అభ్యర్థులను అనుసంధానం చేస్తారు. ఈ స్టార్టప్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు రంగ సంస్థల నుంచి నిధులు సమకూరేలానూ చూస్తున్నారు. నీతి ఆయోగ్ మంజూరు చేసిన అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ కూడా ఇక్కడ ఉంది. దీనిలో ఇప్పటివరకూ 35 రంగాలకు చెందిన 180 అంకుర సంస్థలకు సాయం అందింది. వీటిలో 136 మహిళలకు చెందినవే. అంకురాలు ఏర్పాటైన మొదట్లో సంస్థ కార్యకలాపాలకు ఏడాది వరకు ఆ ప్రాంగణాన్ని వినియోగించుకునే అవకాశమూ కల్పిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ సాయంతో 'సోషల్ ఇంపాక్ట్‌ప్రెన్యూర్స్ ప్రోగ్రాం' కింద 28 అంకురాలకు శిక్షణ అందించారు. మహిళా ఆంత్రప్రెన్యూర్లను ప్రోత్సహించడానికి 'నారీప్రెన్యూర్ ఫర్ హర్' కింద 27 సంస్థలకు శిక్షణనిచ్చారు. ఈ రెండు కార్యక్రమాలకు ఇటీవల జాతీయస్థాయిలో అవార్డులు దక్కాయి. కాబట్టే, ఈ ఐఐఎం అమ్మాయిలకు భవిష్యత్ మార్గంగా కనపడుతోంది. అందుకే ఎంచుకుంటున్నవారి సంఖ్యా పెరుగుతోంది.

– కేతిరెడ్డి రాజ్యలక్ష్మి, విశాఖపట్నం

## వీటిని మార్చేయండి!



**మన ఆరోగ్యానికి నిద్ర ఎంత ముఖ్యమో తెలిసిందే కదా! అది దరిచేరడానికి ఎన్నెన్ని ప్రయత్నాలో చేస్తుంటాం. కానీ మనం చేసే కొన్ని తప్పిదాలు ఆరోగ్యాన్ని దరిచేర్చకపోగా అనారోగ్యానికి కారణమవుతాయి. కాబట్టి, వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిందే. ఇంతకీ అవేంటంటే...**

- పడకగదిలో మన ప్రధాన పెట్టుబడి ఏదంటే మంచం, పరుపనే చెబుతాం. అవి రెండూ ఎంత సౌకర్యంగా ఉంటే అంత మంచి నిద్ర మన దరిచేరుతుంది. మరకలు లేవు, కొత్తగా కనిపిస్తోందని పరుపులను ఏళ్లపాటు కొనసాగించట్లేదు కదా! చూడటానికి ఆకర్షణీయంగా ఉంటే సరిపోదు. సౌకర్యవంతంగానూ ఉండాలి. అందుకే ఏడెనిమిది ఏళ్లకు మించి పరుపులను కొనసాగించొద్దు. వాటిల్లోని ఫోమ్ నాణ్యత తగ్గి నడుము, మెడ నొప్పులకు కారణమవుతుంది. అంతేకాదు, నిద్ర కూడా దూరమవుతుంది. కాబట్టి, మార్చాల్సిందే.
- సువాసనలు మనసుని ప్రశాంతంగా ఉంచుతాయి. సుఖనిద్రనీ ఇస్తాయని ఎయిర్ ఫ్రెషనర్లను గదిలో స్ప్రే చేస్తున్నారా? ఇదీ చేటు చేసేదే. వీటిలోని రసాయనాలు ఊపిరితిత్తులపై దుష్ప్రభావాలకు కారణమవుతాయి. కావాలంటే ఎండబెట్టిన నిమ్మ, నారింజ, పూరేకల సువాసనలు కానీ ఎసెన్షియల్ ఆయిల్స్, సహజసిద్ధ పదార్థాలతో చేసిన సెంటెడ్ క్యాండిల్స్ కానీ వాడండి. అలాగే చలిగాలి వీస్తోంది, దుమ్ము చేరుతుందని కిటికీలను రోజూ మూసేసీ ఉంచొద్దు. రోజూ ఉదయాన్నే కొద్దిసేపు తెరవండి. సహజగాలి ఇంట్లోకి చేరుతుంది. ఇదీ సాంత్వన కలిగించేదే!
- హాయిగా నిద్రలోకి జారుకునేలా చేయడంలో దిండుదీ ప్రధాన పాత్రే. కానీ ఇది చర్మ, శ్వాస సమస్యలకు దారి తీయగలదని తెలుసా? చెమట, క్రిముల తాలూకూ అవశేషాలు, దుమ్ము వంటివి దీనిలోకి చేరుతుంటాయి. ఫలితంగా సూక్ష్మజీవులకు ఆవాసంగానూ మారుతుంది. ఫలితంగానే ఎన్నో సమస్యలు. అందుకే ప్రతివారం దిండుని కొంతసేపైనా ఎండలో ఉంచాలి. ప్రతి రెండేళ్లకోసారి వీటిని మార్చేయాలి.

## చలి తగ్గించే సూప్స్!

**చలికాలం వచ్చిందంటే చాలు... జలుబు, దగ్గు వంటివి వేధిస్తుంటాయి. మరి, ఈ సమస్యలు త్వరగా అదుపులోకి వచ్చి హాయిగా ఉండాలన్నా, వ్యాధినిరోధకశక్తి పెరగాలన్నా ఈ సూపులను తాగి చూడండి.**



**మొక్కజొన్న సూప్:** శరీరానికి వేడి పుట్టించి అరుగుదలను పెంచే సూపుల్లో కార్న్ ఒకటి. ఇందులోని సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. ఎక్కువసేపు చురుగ్గా ఉండేలా చేస్తాయి. ఫైబర్ తీసుకున్న ఆహారం సరిగా జీర్ణమయ్యేలా చేస్తుంది. ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఎముకల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇందులోని పోషకాలు వ్యాధులతో పోరాడే శక్తినిస్తాయి.



**పప్పుధాన్యాల సూప్:** చలిని పోగొట్టి శరీరానికి చురుకుదనం పుట్టించే సూప్‌ల్లో లెంటిల్ సూప్ ఒకటి. అంటే ఏం లేదండీ మీరు మెచ్చే పప్పు ధాన్యాలను ఏవైనా మూడింటిని ఎంచుకుని ఎంచక్కా దీన్ని తయారు చేసుకోవచ్చు. దీనికి అల్లం, వెల్లుల్లి, మిరియాలు, కొత్తిమీర చేర్చితే రుచి కూడాను. రక్తప్రసరణ మెరుగవుతుంది. వీటిల్లో ఐరన్, ఫోలేట్ వంటివి రక్తహీనత రానివ్వవు. వీటిల్లో ఉండే ఫైటో ఈస్ట్రోజన్స్ పీసీఓఎస్, మెనోపాజ్ లక్షణాల ప్రభావాన్ని తగ్గిస్తాయి. ఈ సూప్ పాలిచ్చే తల్లులకు సూపర్‌ఫుడ్‌గానూ పనిచేస్తుంది. ఇందులోని జింక్, విటమిన్ బీ6, యాంటీఆక్సిడెంట్స్ జలుబు, దగ్గుల నుంచి ఉపశమనం అందిస్తాయి. రోగనిరోధకశక్తిని పెంచుతాయి.



**అల్లం సూప్:** చలి చిక్కుల్ని తప్పించే సూపర్ డ్రింక్ అల్లం సూప్. యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉండటంతో ఇన్ఫెక్షన్లను అడ్డుకుంటుంది. ఇందులోని విటమిన్ సి, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్స్ రోగనిరోధకశక్తిని పెంచుతాయి. జీర్ణప్రక్రియను సులభం చేస్తుంది. రక్తప్రసరణను పెంచి శరీరంలో వేడి పుట్టిస్తుంది. అల్లానికి ఉండే థర్మోజెనిక్ గుణాల వల్ల మెటబాలిజం పెరుగుతుంది. ఒంట్లో అదనంగా ఉన్న కొవ్వు కరుగుతుంది.

శోధిత

## గర్భిణుల్లో వికారం ఎందుకంటే...



గర్భిణులకు ఉదయాన్నే వికారం, కొన్ని రకాల ఆహార పదార్థాలు, వాసనలు పడకపోవడం, వాంతులు... వంటివన్నీ మామూలే. వైద్యులూ దీన్ని సహజంగానే భావించి, తగ్గడానికి ఏ ట్యాబ్లెట్లో ఇస్తారు. కానీ అలా ఎందుకు జరుగుతుందనేది ఇప్పటివరకూ శాస్త్రవేత్తలకీ సరైన కారణం తెలియలేదట. ఇటీవల కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ నిపుణులు దీనికో సమాధానాన్ని కనుగొన్నారు. ఈ వికారం కేవలం యాదృచ్ఛికం కాదు. గర్భంలో పెరిగే శిశువును రక్షించే ప్రక్రియలో భాగమని చెబుతున్నారు. పైగా ఈ లక్షణాలు కనిపిస్తే అది ఆరోగ్యకరమైన గర్భధారణకు సంకేతాలని అంటున్నారు. దాదాపు 80 శాతం గర్భిణుల్లో తొలినాళ్లలో వికారం ఉంటుంది. ఇలా ఎందుకు జరుగుతుందంటే కొత్తగా వచ్చిన శిశువుని శరీరం అంగీకరించి, హానికర పదార్థాల నుంచి రక్షించేందుకేనట.

గర్భధారణ సమయంలో రోగనిరోధక వ్యవస్థ గమ్మత్తైన సవాల్‌ను ఎదుర్కొంటుంది. శిశువు డీఎన్ఏలో సగం తండ్రిది కావడంతో పిండాన్ని తల్లి శరీరం ఫారెన్ బాడీగా భావిస్తుంది. సాధారణంగా ఈ వ్యవస్థ కొత్తగా శరీరంలో ప్రవేశించిన దేనిమీదైనా దాడి చేస్తుంది. అలా జరగకుండా తల్లినీ, పిండాన్నీ సురక్షితంగా ఉంచేందుకు శరీరం సర్దుబాటు చేసుకునే ప్రయత్నంలో జరిగేదే ఈ మార్నింగ్ సిక్‌నెస్ అంటున్నారు. ఇందుకోసం వీళ్లు కొందరు గర్భిణుల్ని ప్రశ్నించడంతోపాటు వాళ్ల రోగనిరోధక వ్యవస్థలో కీలకమైన సైటోకైన్ల పనితీరునీ పరిశీలించి ఈ అభిప్రాయానికి వచ్చారు. అంటే, వికారం, వాంతులు అనేవి ఆరోగ్యకరమైన గర్భానికి చిహ్నాలే అన్నమాట!

## ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

## బంగారం - వెండి



25న ముగింపు

| | బంగారం (24క్యా) | ఆర్నమెంట్ (22క్యా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,29,120 | 1,16,850 | 1,61,593 |
| విజయవాడ | 1,25,355 | 1,16,450 | 1,61,500 |
| ప్రొద్దుటూరు | 1,25,900 | 1,15,830 | 1,61,600 |
| రాజమహేంద్రవరం | 1,27,040 | 1,16,450 | 1,74,000 |
| విశాఖపట్నం | 1,24,680 | 1,14,700 | 1,65,000 |
| తమిళనాడు | ----- | 1,17,200 | 1,74,000 |

## అప్పటికప్పుడే తాజాగా..!

**వేడివేడి టోస్ట్ నిమిషాల్లో తయారై... తినడానికి రెడీగా ఉంటే! అప్పటికప్పుడు పల్లీలు వేసి పీనట్ బటర్ తయారుచేసుకుంటే! చికెన్, మటన్‌లను కీమా చేయడానికి ఓ గ్యాడ్జెట్ ఉంటే... ఎంత బాగుంటుందో కదా! ఎక్కువ శ్రమా ఉండదు. రుచితో రాజీ పడాల్సిన అవసరమూ లేదు. పైగా అనారోగ్యాల బారినపడతామన్న బెంగా ఉండదు. అందుకు ఉపయోగపడే గ్యాడ్జెట్లే ఇవి...**

స్మార్ట్ కిచెన్




### టోస్ట్ నిమిషాల్లో రెడీ...

మనం ఎంత కాదన్నా పాశ్చాత్య ఆహారపు అలవాట్లు మన జీవనశైలిలో భాగమవుతున్నాయి. పిల్లల ఓటూ దీనికే. అందుకే అమ్మలు కూడా కాదనలేకపోతున్నారు. అయితే బయట దొరికే ఆహారం కన్నా... ఇంట్లో చేసివ్వడానికే ఆసక్తి చూపిస్తున్నారు. అందుకు సహాయపడుతుందీ 'ఇన్‌స్టా గ్లో స్మార్ట్ టోస్టర్'. టోస్ట్, వేఫల్స్, మఫిన్స్, శాండ్‌విచ్‌లకు సంబంధించిన రెసిపీలు అన్నీ మెషీన్ మెనూలో ఉంటాయి. దానికి తగ్గట్లుగా పదార్థాల్ని సిద్ధం చేసుకుని, మేకర్‌లో పెట్టి, స్విచ్ ఆన్‌చేయాలి. నచ్చిన రెసిపీని ఎంపిక చేసుకుని ఒకే బటన్ ప్రెస్ చేస్తే... నిమిషాల్లో ఆహారం తయారైపోతుంది. ఇది వైఫైతో పనిచేస్తుంది.





### ఎప్పుడు కావాలంటే అప్పుడు...

బ్రెడ్, రోటీ, సలాడ్స్‌లో పీనట్ బటర్‌ను వేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. కానీ దాని తయారీ గురించిన అనుమానాలే వెంటాడతాయి అమ్మలకు. అందుకే మనకు ఎప్పుడు కావాలంటే అప్పుడు పీనట్ బటర్ తయారుచేసుకునేందుకు వీలుగా వచ్చిందే ఈ 'బటర్ మేకర్'. కప్పులా కనిపించే భాగంలో పల్లీలు వేయాలి. మూత పెట్టి స్విచ్ ఆన్‌చేస్తే సరి. బటర్ తయారై కింద ఉండే కప్‌లోకి వచ్చేస్తుంది. క్రీమ్‌లా కావాలి అనుకుంటే.. . ఆలివ్, పల్లీ నూనెలను రెండు మూడు స్పూన్లు వేస్తే సరి. బాదం, జీడిపప్పు అన్ని రకాల డ్రైఫ్రూట్స్‌ను ఉపయోగించి కూడా బటర్‌లా తయారుచేసుకోవచ్చు.





### కీమా చేయడం సులువిక...

సలాడ్స్, సూప్స్, కీమా బాల్స్, తొక్కు పచ్చళ్లు చేసుకునేటప్పుడు ఉడికించిన చికెన్, మటన్‌ను గరిటెతో మెత్తగా చేస్తాం. లేదా మిక్సీని వాడుతుంటాం దాంతో అది పేస్ట్‌లా అయిపోతుంది. అలా కాకూడదంటే ఈ 'మీట్ ష్రెడ్డర్'ను వాడి చూడండి. కప్‌లా కనిపించే దానిలో మాంసాన్ని ఉంచి మూత పెట్టి తిప్పితే చాలు. దీనిలో ఉండే బ్లేడ్లు మాంసాన్ని సన్నగా తరిగేస్తాయి.

## ఆ వీధులు... అమ్మాయిలకు సురక్షితం!



**ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో... మహిళలు బయటికి రావాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంటారు. కారణం అల్లరి మూకల వికృత చేష్టలు. వాటికి అడ్డుకట్ట వేయాలన్న ఉద్దేశంతో ప్రారంభమైంది ఇందూ ఆంటోని ప్రయాణం. దీనంతటికీ కారణం ఏడేళ్ల క్రితం తనకు ఎదురైన ఓ చేదు అనుభవం అంటారీమె. ఈమె ఎవరు? ఆ ఘటన ఏంటో తెలియాలంటే...**

ఒక ఆడపిల్ల పెరిగి పెద్దయ్యే క్రమంలో ఇంటా బయటా ఎన్నో వేధింపుల్ని ఎదుర్కొంటోంది. ఎక్కడ ఏమవుతుందోనని భయపడని రోజు ఉండదు. అప్పటికీ ధైర్యాన్ని కూడగట్టుకుని లక్ష్యాల్ని సాధించడానికి నడుం బిగిస్తున్నారు అమ్మాయిలు. కానీ, ఎక్కడో ఒక దగ్గర ఎదురైన పరాజయాలు, అవమానాలతో వారు ఇంటికే పరిమితం అవ్వాల్సి వస్తోంది. అంతేనా ఆ ఘటనలు వాళ్లని మానసికంగా బలహీనుల్నీ చేస్తున్నాయి. అలాంటి ఓ ఘటననే 2018లో ఇందూకి ఎదురైంది. 'ఆ రోజు పని పూర్తిచేసుకుని ఇంటికి వెళ్లేసరికి ఆలస్యమైంది. బెంగళూరులోని హెచ్‌బీఆర్ లేఅవుట్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నా... గుర్తుతెలియని ఇద్దరు అబ్బాయిలు అటుగా బండి మీద వెళ్తూ నా మొహం మీద ఉమ్మి వేశారు. కొద్దిసేపటి వరకూ ఏం జరిగిందో కూడా అర్థం కాలేదు. షాక్‌లోనే ఉండిపోయా. అసలు వాళ్లు ఎవరు? ఎందుకు ఇలా చేశారు? నేనేం తప్పు చేశా? అంటూ ఎన్నో ప్రశ్నలు. చాలా డిప్రెషన్‌కు గురయ్యాను. చాలా రోజుల వరకు అటువైపుగా వెళ్లాలంటేనే భయపడ్డా. ఇదీ ఓ రకమైన వేధింపే... ఆడవాళ్ల అస్తిత్వాన్ని దెబ్బతీయడానికి జరిగిన ప్రయత్నమే' అంటారు ఇందు. ఈమె ఒక కళాకారిణి. ఆర్ట్ గ్యాలరీని నడుపుతున్నారు.

### సిసిలియా ప్రేరణతో...

ఆ ట్రామా నుంచి కోలుకున్నాక బెంగళూరులో ఇలాంటి ప్రాంతాలు ఎన్ని ఉన్నాయో వెతకడం మొదలుపెట్టారు ఇందు. స్థానిక పోలీస్ స్టేషన్లకు వెళ్లి లైంగిక వేధింపులు, వీధుల్లో నడుస్తున్న మహిళల్ని ఏడిపించే ఆకతాయిలు, చైన్ స్నాచింగ్ కేసులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల జాబితా సేకరించడం మొదలుపెట్టారు. ఆ ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో సందర్శించారట. అన్నిచోట్లా సీసీటీవీ కెమెరాలు అందుబాటులో లేకపోవడం, వీధిలైట్లు పగలగొట్టి ఉండటం గమనించారీమె. వాటన్నింటినీ పునరుద్ధరించి ఆ వీధుల్ని సురక్షిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి అనుకున్నారు. ఈ క్రమంలోనే ఓరోజు సిసిలియా అనే స్థానిక కళాకారిణిని కలిశారీమె. 'సిసిలియా... 70ఏళ్ల మహిళ. సంప్రదాయాలు, కట్టుబాట్లకు అతీతంగా తనకు నచ్చిన దుస్తులు ధరించి, ఏ భయమూ లేకుండా తన శేష జీవితాన్ని గడుపుతున్న మహిళ. ఈమెలానే ప్రతి మహిళా ఉండగలిగితే ఎంత బాగున్ను అనిపించింది. ఆమెతో మాట్లాడుతుంటే... ఇప్పటితరం మహిళలు ఎంత వెనకబడ్డారో అర్థమైంది. అందుకే ఆమె పేరునే ఈ ప్రాజెక్టుకు పెట్టా. 'ప్రాజెక్ట్ సిసిలియా'యిడ్ అని గుర్తుచేసుకుంటారు ఇందు.


ఇందు

### స్థానిక మహిళల సహకారంతో...

స్థానిక ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్ల సహాయంతో ప్రాజెక్ట్ మొదలు పెట్టారు ఇందు. 'నిధుల కోసం ఎఫ్ఐసీఏ (ఫౌండేషన్ ఫర్ ఇండియన్ కాంటెంపరరీ ఆర్ట్)ను ఆశ్రయించా. నా ఆలోచనలు నచ్చి వారూ ప్రాజెక్టులో భాగమయ్యారు. కావాల్సిన నిధుల్ని విడుదల చేశారు. హెచ్‌బీఆర్ లేఅవుట్ నుంచి ఒక్కొక్కటిగా వీధుల్ని పునరుద్ధరించడం మొదలుపెట్టా. ప్రతి వీధిలో కావాల్సిన సౌకర్యాల్ని అమర్చి... కనెక్షన్లను స్థానిక పోలీస్ స్టేషన్లకు ఇచ్చాం. ఆ వీధుల్ని సిసిలియా చేత ప్రారంభోత్సవం చేయించాం. ఇక నుంచి అవి సురక్షిత ప్రదేశాలని మహిళలకు తెలియాలి. ఆకతాయి మూకలకు ఏదైనా చేస్తే పట్టుబడతారనే భయం రావాలి. అందుకే ప్రారంభోత్సవ వేడుకల్ని జరపడం ఆనవాయితీగా పెట్టుకున్నాం. స్టేజ్ షోలు నిర్వహించి... ఆ ప్రాంతంలో జరిగిన కొన్ని ఘటనలు, ఇకపై ఇలా చేస్తే జరిగే చర్యల్ని నాటక రూపంలో చెప్పేవారు సిసిలియా' అనే ఇందు అక్కడితో తన ప్రయాణాన్ని ఆపలేదు. ఇది మహిళల ప్రాంతం(నమ్మ కట్టా) అనే క్లబ్‌లను ఏర్పాటుచేశారు. స్థానిక మహిళలంతా ఇక్కడికి వచ్చి విశ్రాంతి తీసుకోవచ్చు. తమ బాధల్ని ఇతరులతో పంచుకోవచ్చు. ఉపాధి, ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాల్ని సంపాదించుకోవచ్చు. మహిళలకి రక్షణ కల్పించడానికి ఇలాంటి ఎన్నో కార్యక్రమాల్ని చేస్తున్నారీమె. నేనూ నా కుటుంబం సురక్షితంగా ఉంటే చాలనుకుంటున్న ఈ రోజుల్లో... తనకేం సంబంధం లేని వారికోసం ఇంతలా పాటుపడుతున్న ఇందు ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!

# ఛాంపియన్



యశస్వి జైస్వాల్

సిరీస్ పోతుందని ముందే తేలిపోయింది. టీమ్‌ఇండియా కనీసం వైట్‌వాష్ అయినా తప్పించుకుంటుందేమో అని చూస్తే.. అలాంటి సంకేతాలేమీ కనిపించడం లేదు. డ్రా చేసుకోవడానికి ప్రత్యేకంగా అవకాశమిచ్చినా.. మన బ్యాటర్లు ఉపయోగించుకుంటేనా? డ్రాతో గట్టెక్కాలంటే ఒక రోజు కంటే కాస్త ఎక్కువగా బ్యాటింగ్ చేయాల్సిన స్థితిలో రెండో ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన భారత్.. నాలుగో రోజు 15.5 ఓవర్లలోనే ఓపెనర్ల వికెట్లు చేజార్చుకుని ఓటమి వైపు అడుగేసింది.

తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా పరుగుల వరద పారించిన పిచ్ మీద మన బ్యాటర్లు తడబడడం చూసి దక్షిణాఫ్రికా మన దగ్గరికి వచ్చిందా.. మనవాళ్లే వాళ్ల దేశానికి వెళ్లారా అని ఆశ్చర్యపోయారు భారత అభిమానులు. రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే కథ పునరావృతం అయింది. రోజంతా సఫారీ బ్యాటర్లు రెచ్చిపోయాక.. ఆఖర్లో మన బ్యాటర్లు క్రీజులో నిలవడానికి ఆపసోపాలు చూస్తే వైట్‌వాష్ తప్పించుకోవడం అసాధ్యంగానే కనిపిస్తోంది.

## రోజంతా నిలవగలరా!

- ఓటమి బాటలో భారత్
- క్లీన్‌స్వీప్ ముంగిట దక్షిణాఫ్రికా
- లక్ష్యం 549.. ప్రస్తుతం 27/2



స్టబ్స్ 94



జడేజా

గువాహటి: నిరుడు ఇదే నవంబరులో సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో టీమ్‌ఇండియా మూడు టెస్టుల సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురవడం భారత క్రికెట్‌ను కుదిపేసింది. స్వదేశంలో ఇంతవరకూ ఇలాంటి పరాభవం చూడకపోవడంతో అనుకున్నారంతా కానీ ఇప్పుడు భారత జట్టుకు మరో వైట్‌వాష్ తప్పేలా లేదు. ఇప్పటికే కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టులో కంగుతిన్న టీమ్‌ఇండియా.. గువాహటిలో జరుగుతున్న రెండో టెస్టులో పేలవ ఆటతీరును కొనసాగించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌పై 288 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన దక్షిణాఫ్రికా.. రెండో ఇన్నింగ్స్‌లోనూ చెలరేగింది. 5 వికెట్లకు 260 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ (94; 180 బంతుల్లో 9×4, 1×6) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టోనీ డి జోర్జి (49), ర్యాన్ రికెల్టన్ (35), వియాన్ ముల్డర్ (35 నాటౌట్) కూడా రాణించారు. ఏకంగా 549 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. నాలుగో రోజు ఆట చివరికి రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 27 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (13), కేఎల్ రాహుల్ (6) ఔటయ్యారు. సాయి సుదర్శన్ (2)కు తోడుగా నైట్ వాచ్‌మన్ కుల్‌దీప్ యాదవ్ (4) క్రీజులో ఉన్నారు.

**దక్షిణాఫ్రికా.. తాపీగా:** ఓవర్‌నైట్ స్కోరు 26/0తో మంగళవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికాకు.. తొలి గంటలో ఎలాంటి ఇబ్బందులూ ఎదురు కాలేదు. ఓపెనర్లు రికెల్టన్ (ఓవర్‌నైట్ స్కోరు 13), మార్‌క్రమ్ (ఓవర్‌నైట్ 12) నిలకడగా బ్యాటింగ్ చేశారు. వీరిని పేసర్లు బుమ్రా, సిరాజ్ పెద్దగా ఇబ్బంది పెట్టలేకపోయారు. అయితే తొలి ఇన్నింగ్స్‌లో ప్రభావం చూపలేకపోయిన జడేజా.. ఉన్నట్టుండి విజృంభించడంతో దక్షిణాఫ్రికా 18 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయింది. ముందుగా రికెల్టన్‌ను క్యాచౌట్ చేసిన జడ్డూ.. తర్వాత మార్‌క్రమ్ (29), బవుమా (3)లను స్వల్ప వ్యవధిలో బౌల్డ్ చేశాడు. దీంతో దక్షిణాఫ్రికా 59/0 నుంచి 77/3కు చేరుకుంది. వెంటవెంటనే వికెట్లు పడటంతో దక్షిణాఫ్రికా అప్రమత్తమైంది. స్టబ్స్, జోర్జి ఆచితూచి బ్యాటింగ్ చేశారు. ఈ జోడీ శతక భాగస్వామ్యం (101)తో జట్టును తిరుగులేని స్థితికి తీసుకెళ్లింది. ఆరంభంలో పంత్ స్టంపింగ్ ఛాన్స్ వదిలేయడంతో బతికిపోయిన స్టబ్స్.. స్వీప్ షాట్లతో స్పిన్నర్లకు చెక్ పెట్టాడు. రెండో సెషన్లో అర్ధశతకం ముంగిట జోర్జి ఔటైనప్పటికీ.. ముల్డర్‌తో స్టబ్స్ మరో భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆధిక్యం 450 దాటినా డిక్లరేషన్‌కు దక్షిణాఫ్రికా తొందరపడలేదు. బ్యాటర్లు తాపీగా బ్యాటింగ్ చేశారు. రెండో సెషన్ ముగిసేసరికి స్కోరు 220/4. ఆధిక్యం 508కు చేరుకుంది. అప్పటికి స్టబ్స్ 60 పరుగులపై ఉన్నాడు. మూడో సెషన్లోనూ బ్యాటింగ్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. స్టబ్స్‌కు సెంచరీ చేసే అవకాశమిచ్చింది. అతను దాటిగా ఆడి 90పైకి వచ్చాడు. ఒక స్వీప్ షాట్‌తో 94కు చేరుకున్న అతణ్ని జడేజా బౌల్డ్ చేశాడు.. వెంటనే దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తర్వాత డ్రా కోసం తప్ప గెలుపు కోసం ఆడే అవకాశమే లేని స్థితిలో భారత్ ఉండగా.. ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఆశ్చర్యకరంగా షాట్లకు దిగాడు. ఒక ఫోర్, సిక్సర్ బాదిన అతను.. యాన్సెన్ బౌలింగ్‌లో కట్ షాట్ ఆడబోయి వికెట్ కీపర్‌కు దొరికిపోయాడు. కాసేపటికే రాహుల్‌ను స్పిన్నర్ హార్మర్ బౌల్డ్ చేశాడు. సుదర్శన్, కుల్‌దీప్ మరో వికెట్ పడనీయకుండా ఆటను ముగించారు.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 489

భారత్ తొలి ఇన్నింగ్స్: 201

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) సిరాజ్ (బి) జడేజా 35; మార్‌క్రమ్ (బి) జడేజా 29; స్టబ్స్ (బి) జడేజా 94; బవుమా (సి) నితీశ్ (బి) సుందర్ 3; జోర్జి ఎల్బీ (బి) జడేజా 49; ముల్డర్ నాటౌట్ 35; ఎక్స్‌ట్రాలు 15 మొత్తం: (78.3 ఓవర్లలో 5 వికెట్లకు) 260 డిక్లేర్డ్; వికెట్ల పతనం: 1-59, 2-74, 3-77, 4-178, 5-260; బౌలింగ్: బుమ్రా 6-0-22-0; సిరాజ్ 5-1-19-0; జడేజా 28.3-3-62-4; కుల్‌దీప్ 12-0-48-0; సుందర్ 22-2-67-1; యశస్వి 1-0-9-0; నితీశ్ 4-0-24-0

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి (సి) వెరీన్ (బి) యాన్సెన్ 13; రాహుల్ (బి) హార్మర్ 6; సుదర్శన్ బ్యాటింగ్ 2; కుల్‌దీప్ బ్యాటింగ్ 4; ఎక్స్‌ట్రాలు 2 మొత్తం: (15.5 ఓవర్లలో 2 వికెట్లకు) 27; వికెట్ల పతనం: 1-17, 2-21; బౌలింగ్: యాన్సెన్ 5-2-14-1; ముల్డర్ 4-1-6-0; హార్మర్ 3.5-2-1-1; కేశవ్ మహరాజ్ 3-1-5-0

### అద్భుతాన్ని ఆశించగలమా?

తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకే ఆలౌటైంది భారత జట్టు. అలాంటిది నాలుగో ఇన్నింగ్స్‌లో లక్ష్యం 400 దాటినా ఛేదన చాలా కష్టమనే అంచనా. మూడో రోజు చివరికి 314 పరుగుల ముందంజలో ఉన్న దక్షిణాఫ్రికా.. నాలుగో రోజు సగం వరకు ఆడి, 450 పైచిలుకు లక్ష్యాన్ని నిర్దేశిస్తుందనే అంచనాలు ఏర్పడ్డాయి. కానీ ఆ జట్టు రెండో సెషన్ అయ్యాక కూడా రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయలేదు. అప్పటికే ఆ జట్టు ఆధిక్యం 508 పరుగులకు చేరుకుంది. మూడో సెషన్లోనూ మరో 8.3 ఓవర్లు బ్యాటింగ్ చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన దక్షిణాకాఫ్రికా.. భారత్‌కు ఏకంగా 549 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటికే ఒక టెస్టు నెగ్గి ఉండడంతో ఈ మ్యాచ్ డ్రా అయినా సిరీస్ సొంతమవుతుందనే ఉద్దేశంతో దక్షిణాఫ్రికా డిక్లరేషన్ అంత ఆలస్యం చేసి ఉండొచ్చు. ఈ ఆలస్యం వల్ల భారత్‌కు ఓటమి తప్పించుకుని, మ్యాచ్‌ను డ్రా చేసుకునేందుకు అవకాశాలు మెరుగయ్యాయి. నాలుగో రోజు భారత్ ఆడింది 15.5 ఓవర్లే. అది కాక చివరి రోజు ఓ 90 ఓవర్లు ఆడాలి. ఓపిక, పట్టుదలతో ఆడితే అది మరీ కష్టమేమీ కాదు. కానీ మంగళవారం ఆడిన కొన్ని ఓవర్లకే ఓపెనర్లను కోల్పోయిన టీమ్‌ఇండియా.. ఓటమి వైపు అడుగులేసింది. మరి మిగిలిన 8 వికెట్లతో చివరి రోజు పూర్తిగా నిలిచి మ్యాచ్‌ను డ్రా చేసుకోవడం అంటే ఆషామాషీ విషయం కాదు. ఈ మ్యాచ్ ఇప్పటిదాకా జరిగిన తీరును బట్టి చూస్తే మాత్రం.. అలా చేయగలిగితే మాత్రం అది అద్భుతమే అవుతుంది. మరి టీమ్‌ఇండియా ఏం చేస్తుందో?





రోహిత్ శర్మ, జై షా, సూర్యకుమార్, హర్మన్‌ప్రీత్ కౌర్

## ఫిబ్రవరి 15న భారత్ × పాకిస్థాన్

2026 టీ20 ప్రపంచకప్ షెడ్యూలు విడుదల

**ఇవీ గ్రూపులు**

గ్రూప్‌-ఎ: భారత్, పాకిస్థాన్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా

గ్రూప్‌-బి: శ్రీలంక, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జింబాబ్వే, ఒమన్

గ్రూప్‌-సి: ఇంగ్లాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, నేపాల్, ఇటలీ

గ్రూప్‌-డి: న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్, కెనడా, యూఏఈ

ముంబయి: చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మరో సమరానికి సిద్ధమవుతున్నాయి. 2026 టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్‌-ఎలో ఉన్న ఈ జట్లు ఫిబ్రవరి 15న తలపడతాయి. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ టోర్నీ షెడ్యూలును మంగళవారం ఐసీసీ ప్రకటించింది. భారత్, పాకిస్థాన్ తటస్థ వేదికల్లో మాత్రమే తలపడుతున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాక్‌కు వెళ్లని భారత్ తన మ్యాచ్‌లను యూఏఈలో ఆడింది. మహిళల వన్డే ప్రపంచకప్ కోసం భారత్‌కు రాని పాక్.. తన మ్యాచ్‌లకు కొలంబోను వేదికగా చేసుకుంది. టీ20 ప్రపంచకప్‌లోనూ పాక్ తన మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడనుంది. భారత్, పాక్‌తో పాటు అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా గ్రూప్‌-ఎలో ఉన్నాయి. ఇటలీ ఈ టోర్నీతో ప్రపంచకప్ అరంగేట్రం చేస్తోంది. ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్, పాకిస్థాన్ మ్యాచ్‌తో ప్రపంచకప్ ఆరంభమవుతుంది. అదే రోజు అమెరికా మ్యాచ్‌తో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్.. తన టైటిల్ వేటను ఆరంభిస్తుంది. ఆ రోజే బంగ్లాదేశ్, వెస్టిండీస్ మ్యాచ్ కూడా జరుగుతుంది. ఐసీసీ ఛైర్మన్ జై షా ప్రపంచకప్ షెడ్యూలును విడుదల చేశారు.

**ఎనిమిది వేదికల్లో..**

మొత్తం ఎనిమిది వేదికల్లో టీ20 ప్రపంచకప్ జరగనుంది. భారత్‌లో అయిదు వేదికలు (కోల్‌కతా, ముంబయి, చెన్నై, అహ్మదాబాద్, దిల్లీ) టోర్నీకి ఆతిథ్యమివ్వనున్నాయి. శ్రీలంకలోని మూడు వేదికల్లో పోటీలు ఉంటాయి. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం, సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్‌తో పాటు పల్లెకెలె మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తాయి. పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నింటినీ శ్రీలంకలోనే ఆడుతుంది. తొలి సెమీఫైనల్ (మార్చి 4) కోల్‌కతా లేదా కొలంబోలో జరుగుతుంది. ఇది పాకిస్థాన్ క్వాలిఫికేషన్‌పై ఆధారపడి ఉంటుంది. రెండో సెమీఫైనల్ (మార్చి 5)కు ముంబయి ఆతిథ్యమిస్తుంది. ఫైనల్ (మార్చి 8) అహ్మదాబాద్‌లో జరుగుతుంది. పాకిస్థాన్ ఫైనల్ చేరితే మాత్రం టైటిల్ పోరుకు కొలంబో ఆతిథ్యమిస్తుంది.

**టీమ్‌ఇండియా ఇలా..**

టీ20 ప్రపంచకప్‌లో తన తొలి మ్యాచ్‌లో ముంబయిలో అమెరికాతో తలపడే భారత్.. ఫిబ్రవరి 12న దిల్లీలో నమీబియాను ఢీకొంటుంది. 15న కొలంబోలో పాకిస్థాన్‌తో, 18న అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లు ఆడుతుంది. "గ్రూప్‌-ఎ బాగుంది. టీ20ల్లో ఎప్పుడు ఏ జట్టు బాగా ఆడుతుందో చెప్పలేం. ఇద్దరు బ్యాటర్లు, ఇద్దరు బౌలర్లు సత్తా చాటితే చాలు" అని భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నాడు.

**టోర్నీ ప్రచారకర్తగా రోహిత్**

టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ 2026 టీ20 ప్రపంచకప్ ప్రచారకర్తగా నియమితుడయ్యాడు. అతడి సారథ్యంలో భారత్ 2024 టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత పొట్టి ఫార్మాట్ నుంచి రిటైరైన హిట్‌మ్యాన్.. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. రోహిత్ టీ20ల్లో 32.01 సగటు, 140.89 స్ట్రైక్‌రేట్‌తో 4231 పరుగులు చేశాడు. "క్రికెట్లో కొనసాగుతున్న ఎవరినీ ఇప్పటివరకు ప్రపంచకప్ ప్రచారకర్తగా నియమించలేదని ఎవరో నాకు చెప్పారు. ఇది నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా" అని అన్నాడు.

**ఇదీ ఫార్మాట్**

ఫైనల్ సహా టోర్నీలో 55 మ్యాచ్‌లు జరుగుతాయి. మొత్తం 20 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్‌-8కు అర్హత సాధిస్తాయి. అక్కడ జట్లను రెండు గ్రూపులుగా విభజిస్తారు. ఒక్కో గ్రూపులో 4 జట్లు ఉంటాయి. టాప్‌-2 జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశిస్తాయి.

## చరిత్ర సృష్టించిన టీటీ జట్టు



భారత ఆటగాళ్లు

దిల్లీ: ఐటీటీఎఫ్ ప్రపంచ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టు చరిత్ర సృష్టించింది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ(రొమేనియా)లో తొలిసారిగా భారత అండర్‌-19 జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. బాలుర సెమీఫైనల్లో భారత్ 3-2తో చైనీస్ తైపీపై విజయం సాధించింది. అంకుర్ భట్టాచార్య, అభినంద్, ప్రియానుజ్ భట్టాచార్య అద్భుత ప్రదర్శనతో భారత్‌కు ఫైనల్ బెర్తు అందించారు. ఫైనల్లో జపాన్‌తో భారత్ తలపడుతుంది. అండర్‌-15 బాలికల విభాగంలో అంకోలిక చక్రవర్తి, దివ్యాంషి భౌమిక్, అనన్య మురళీధరన్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతకం సాధించింది. సెమీస్‌లో భారత్ 0-3తో దక్షిణ కొరియా చేతిలో ఓడింది.

## హార్దిక్ పునరాగమనం

### ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ నేటినుంచే



హార్దిక్

ఈనాడు, హైదరాబాద్: గాయంతో అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైన భారత అగ్రశ్రేణి ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య దేశవాళీలో పునరాగమనం చేయనున్నాడు. బుధవారం ప్రారంభంకానున్న సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో బరోడా తరపున బరిలో దిగనున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి- మార్చిలో భారత్‌లో జరగనున్న టీ20 ప్రపంచకప్‌నకు ముందు ఫామ్, ఫిట్‌నెస్ నిరూపించుకోడానికి హార్దిక్‌కు ఇదే సరైన వేదిక. మరోవైపు ఐపీఎల్ ఆటగాళ్ల వేలానికి ముందు తామేంటో నిరూపించేందుకు యువ ప్రతిభావంతులకు ముస్తాక్ అలీ ట్రోఫీ సువర్ణావకాశమే. హైదరాబాద్‌లో గ్రూపు-సి మ్యాచ్‌లు జరగనుండగా.. పూల్‌-ఎ, బి, డి పోరాటాలకు వరుసగా అహ్మదాబాద్, కోల్‌కతా, లఖ్‌నవూ ఆతిథ్యమివ్వనున్నాయి. బుధవారం జింఖానా మైదానంలో గుజరాత్‌తో సర్వీసెస్, హరియాణాతో పుదుచ్చేరి.. ఉప్పల్ స్టేడియంలో హిమాచల్‌ప్రదేశ్‌తో పంజాబ్, బెంగాల్‌తో బరోడా తలపడనున్నాయి. భారత స్టార్ ఓపెనర్ అభిషేక్‌శర్మ పంజాబ్ జట్టులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. శార్దూల్ ఠాకూర్ సారథ్యంలోని ముంబయి డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగుతోంది. సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబె (ముంబయి).. సంజు శాంసన్ (కేరళ).. వరుణ్ చక్రవర్తి (తమిళనాడు).. పృథ్వీ షా (మహారాష్ట్ర) ఈ టోర్నీపై తమదైన ముద్ర వేయాలని పట్టుదలగా ఉన్నారు.

## జకోవిచ్ రికార్డు



జకోవిచ్

న్యూయార్క్: ఏటీపీ టాప్‌-4 ర్యాంకుతో సీజన్‌ను ముగించిన అతి పెద్ద వయస్కుడిగా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ రికార్డు సృష్టించాడు. అతడు ప్రస్తుతం నాలుగో ర్యాంకులో ఉన్నాడు. 38 ఏళ్ల 5 నెలల జకోవిచ్.. ఫెదరర్ పేరిట ఉన్న రికార్డు (38 ఏళ్ల 3 నెలలు)ను బద్దలు కొట్టాడు. ఓపెన్ శకంలో 35పై వయసులో టాప్‌-4తో ర్యాంకుతో సీజన్‌ను ముగించిన ఆటగాళ్లతో జాబితాలో జకోవిచ్, ఫెదరర్‌తో పాటు నాదల్, రాడ్ లేవర్, జిమ్మీ కానర్స్ ఉన్నారు. ఫెదరర్ మూడుసార్లు, జకోవిచ్ రెండు సార్లు ఈ ఘనత సాధించారు.

## నగాల్ శుభారంభం



నగాల్

చెంగ్డూ: ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆసియా-పసిఫిక్ వైల్డ్‌కార్డు ప్లేఆఫ్ టెన్నిస్ టోర్నీలో భారత స్టార్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. మంగళవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో నగాల్ 2-6, 6-0, 6-2తో మింగ్‌హుయ్ జాంగ్ (చైనా)ను ఓడించాడు. తొలి సెట్లో ఓడినా.. నగాల్ గొప్పగా పుంజుకున్నాడు. తర్వాతి రెండు సెట్లలో 14 గేముల్లో 12 తానే గెలిచి తేలిగ్గా విజయాన్ని అందుకున్నాడు. ఈ టోర్నీలో పురుషులు, మహిళల విభాగాల్లో విజేతగా నిలిచే ప్లేయర్లు 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్లో మెయిన్ డ్రాలో ఆడేందుకు వైల్డ్‌కార్డు దక్కుతుంది.

## భారత్ కామన్వెల్త్ బిడ్‌కు నేడు ఆమోదం

దిల్లీ: భారత్‌కు 2030 కామన్వెల్త్ క్రీడల నిర్వహణ హక్కులు నెల కిందే దాదాపు ఖాయమైన సంగతి తెలిసిందే. భారత్ బిడ్‌ను బుధవారం గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ స్పోర్ట్ వార్షిక సర్వసభ్య సమావేశంలో లాంఛనంగా ధ్రువీకరించనున్నారు. 2010 క్రీడలకు భారత్ దిల్లీలో ఆతిథ్యమిచ్చింది. ఈసారి మాత్రం క్రీడలకు అహ్మదాబాద్ వేదికగా నిలవనుంది. "సమావేశం సందర్భంగా శతాబ్ది కామన్వెల్త్ క్రీడల (2030) ఆతిథ్య హక్కులపై సభ్యులు తుది నిర్ణయం తీసుకుంటారు. తాము ఈ క్రీడలను ఎలా నిర్వహించబోతున్నామన్నది మొదట భారత ప్రతినిధులు వివరిస్తారు" అని కామన్వెల్త్ స్పోర్ట్ తెలిపింది. 2036 ఒలింపిక్స్ నిర్వహించాలనే లక్ష్యంతో భారత్ సాగుతున్న తెలిసిందే. సీడబ్ల్యూజీ ఆతిథ్య హక్కులు పొందడం ఆ దిశగా పెద్ద మైలురాయే అనడంలో సందేహం లేదు.

## బెల్జియం చేతిలో భారత్ ఓటమి

ఇఫో: అజ్లాన్ షా హాకీ టోర్నమెంట్లో భారత్ మంగళవారం 2-3తో బెల్జియం చేతిలో పరాజయంపాలైంది. జట్టు గట్టిగా పోరాడినప్పటికీ ఫలితం లేకపోయింది. భారత్ తరఫున అభిషేక్ (33వ), శిలానంద్ లక్రా (57వ) చెరో గోల్ కొట్టారు. బెల్జియం జట్టులో రోమన్ దువకోట్ (17వ, 54వ) రెండు గోల్స్ కొట్టగా.. నికోలస్ డి కెర్పెల్ (45వ) ఓ గోల్ సాధించాడు. భారత్ తన తొలి మ్యాచ్‌లో 1-0తో కొరియాపై గెలిచిన సంగతి తెలిసిందే. తన తర్వాతి మ్యాచ్‌లో భారత్ బుధవారం మలేసియాను ఢీకొంటుంది.

## వచ్చే ఏడాది భారత్‌లో ప్రపంచ అథ్లెటిక్స్

దిల్లీ: ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ సిల్వర్ టోర్నీకి భారత్ వేదికగా నిలవనుంది. వచ్చే ఏడాది ఆగస్టు 22న భువనేశ్వర్‌లో ఈ ఈవెంట్ జరగనుంది. 2025లో బ్రాంజ్ పోటీలు జరగ్గా.. వచ్చే సంవత్సరం ఆ స్థాయిని మించిన క్రీడలను భారత్ నిర్వహించనుంది. దీని వల్ల ఎక్కువమంది స్టార్ అథ్లెట్లు ఈ టోర్నీలో పాల్గొనే అవకాశాలున్నాయి. 2026లో జరిగే జాతీయ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ షెడ్యూల్ కూడా మారింది. ఈ టోర్నీ జనవరిలో కాకుండా మార్చిలో నిర్వహిస్తున్నట్లు భారత అథ్లెటిక్స్ సమాఖ్య తెలిపింది.

## శ్రీలంకకు తొలి గెలుపు

రావల్పిండి: ముక్కోణపు టీ20 టోర్నీలో శ్రీలంక తొలి విజయాన్ని అందుకుంది. మంగళవారం ఆ జట్టు 9 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. మొదట జింబాబ్వే 5 వికెట్లకు 146 పరుగులు చేసింది. సికందర్ రజా (37), ర్యాన్ బర్ల్ (37 నాటౌట్), బెన్నిట్ (34) రాణించారు. తీక్షణ (2/23), ఇషాన్ మలింగ (2/23) ప్రత్యర్థిని కట్టడి చేశారు. నిశాంక (98 నాటౌట్; 58 బంతుల్లో 11×4, 4×6) మెరుపులతో లంక 16.2 ఓవర్లలో ఒక వికెటే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. 3 మ్యాచ్‌లు ఆడిన లంకకు ఇదే తొలి గెలుపు.

## ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ




గాయత్రి

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ ప్రపంచ టూర్ సూపర్ 300 టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్ గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్లో టాప్ సీడ్ భారత జంట 19-21, 22-20, 21-9తో చెంగ్ హ్స్యా- టాన్ జింగ్ (మలేసియా) ద్వయంపై గెలిచి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. ప్రియ- శ్రుతి జోడీ 21-8, 21-11తో పీవా ఇవాంజెలిన్- సమృద్ధి సింగ్ జంటపై నెగ్గి ప్రిక్వార్టర్స్ చేరుకుంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో హరిహరన్- అర్జున్ 21-11, 21-13తో ఆయుష్- సుజయ్‌పై, పృథ్వీ- సాయి ప్రతీక్ 21-8, 21-17తో స్వర్ణరాజ్- నిబిర్‌పై విజయం సాధించారు.

# రూ.40 వేల కోట్లతో.. రాయలసీమ రైతుల అభివృద్ధికి కార్యాచరణ

- 50 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగు లక్ష్యం
- పూర్వోదయ నిధుల వినియోగం
- ముఖ్యమంత్రి చంద్రబాబు



ఈనాడు, అమరావతి: రాయలసీమ రైతుల అభివృద్ధికి రూ. 40 వేల కోట్లతో కార్యాచరణ అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పూర్వోదయ పథకంలో భాగంగా రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 92 క్లస్టర్ల ద్వారా రైతులకు జీవనోపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించామని, ఇందులో భాగంగా రహదారులు, జలవనరుల ప్రాజెక్టులు, పంచాయతీరాజ్ రోడ్ల లాంటి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పూర్వోదయ పథకంలో రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధిపై సీఎం సమీక్షించారు. ప్రపంచబ్యాంకు నిధులతో రాయలసీమ అభివృద్ధికి ఏయే అంశాల్లో దృష్టి సారించాలనే అంశంపై అధికారులతో చర్చించారు. "ప్రపంచంలో డిమాండ్ ఉన్న ఉద్యానపంటల్లో 18 రకాల పంటలు రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లోనే పండుతున్నాయి. ఉద్యాన రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి. రాయలసీమను ఉద్యానపంటల హబ్‌గా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకోవాలి. సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ వంటి అంశాలపై దృష్టిపెట్టాలి. రాయలసీమలో 65 రకాల ఉద్యానపంటలు పండుతుంటే 18రకాల పంటలకు మంచి డిమాండ్ ఉంది. వీటిపై రైతులను ప్రోత్సహించాలి. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి. రెగ్యులర్ పంటల కంటే భవిష్యత్తులో ప్రజల అలవాట్లకు అనుగుణంగా పంటలు పండించాలి" అని సూచించారు.

### అంతర్జాతీయ మార్కెట్‌కు ఉత్పత్తులు

"50 లక్షల ఎకరాల్లో ఉద్యానపంటల ద్వారా పెద్ద ఎత్తున రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఉద్యాన పంటలకు రవాణా, మార్కెటింగ్, కోల్డ్ చైన్ తదితర సదుపాయాలు కల్పించాలి. దుబాయ్ లాంటి ప్రాంతాలకు విమానాల్లో పంపితే, అక్కడి నుంచి ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు పంపొచ్చు. రాయలసీమకు మంచి రహదారులు వచ్చాయి. మారుమూల ప్రాంతాలను కలుపుతూ మరికొన్ని రహదారులు రావాలి. దీంతో మార్కెటింగ్ మెరుగుపడుతుంది. ఉద్యాన పంటల సాగు మొదలుకుని మార్కెటింగ్ వరకు వివిధ ప్రాజెక్టులను చేపడుతున్నాం. ఇందులో రాయితీ రూపంలో రూ.9వేల కోట్లు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. అరటి, చీనీ, బొప్పాయి, దానిమ్మ, మామిడి, ఉల్లి, టమాటా, మిరప, నిమ్మ లాంటి పంటలపై దృష్టిపెట్టాలి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఉత్పత్తి, టేబుల్ వెరైటీలను పండించి వాటికి విలువ జోడించాలి. అప్పుడు రైతులకు ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. ఆక్వారంగంలాగే ఉద్యానరంగం సైతం భవిష్యత్తులో అగ్రస్థానానికి చేరుతుంది" అని తెలిపారు. హంద్రీనీవా సహా వివిధ ప్రాజెక్టుల ద్వారా నీటిని సరఫరా చేయడంతో సీమలో ఉద్యానసాగు గతంతో పోల్చుకుంటే సులభతరమైందని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. పంటలు చక్కగా పండడంతో రైతులకు ఆదాయం రావడంతో పాటు భూముల ధరలు పెరిగాయని దీనికి తమ అనంతపురం జిల్లానే ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన చెప్పారు.

# అన్ని వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్లు

- నీటి నమూనాలు తీసుకుని పరీక్షించాలి
- ప్రతి విద్యార్థికీ డిజిటల్ హెల్త్ రికార్డు నిర్వహించాలి
- చిన్న పొరపాటు జరిగినా సహించేది లేదు.. నేరుగా చర్యలే
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ



ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో తనిఖీలపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో ఏ చిన్న పొరపాటు జరిగినా సహించేది ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఏం జరిగిందో తెలుసుకునేది ఉండదని, నేరుగా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. వసతిగృహాలు, గురుకులాల్లో 100 శాతం పారిశుద్ధ్య నిర్వహణ ఉండాలన్నారు. ప్రతి వసతిగృహంలో ఆర్వో ప్లాంటును అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అన్నిచోట్లా నీటి నమూనాలు తీసుకుని పరీక్షించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల్లో తనిఖీలను మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు తమ విధినిర్వహణలో భాగంగా చేసుకోవాలని సూచించారు. సచివాలయంలో మంగళవారం ఆయన సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయంపై అధికారులతో సమీక్షించారు.

### పరిశుభ్రత, ఆరోగ్యం ముఖ్యం

'వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు మూలకు చేరాయి. ఇలా ఉండటం సరికాదు. 20% వసతిగృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణం ఇంకా చేపట్టాలి. వీటికి అవసరమైన రూ.40 కోట్లు విడుదల చేస్తాం. యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి' అని సీఎం ఆదేశించారు. 'విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలి. మొత్తం 4.17 లక్షల మంది రక్తనమూనాలు సేకరించి, సమస్యలున్న వారిని ముందుగానే గుర్తించి చికిత్స అందించాలి. పేద విద్యార్థులకు చేసే పనిని బాధ్యతగా తీసుకోవాలి' అని ఆదేశించారు.

### నిరంతర పర్యవేక్షణకు ఉమ్మడిగా కమాండ్ కంట్రోల్

'నిరంతర పర్యవేక్షణ కోసం సంక్షేమ శాఖలన్నీ కలిపి ఉమ్మడిగా ఒక కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటుచేయాలి. అన్ని వసతి గృహాల్లోని విద్యార్థులకు డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించాలి. వైద్యపరీక్షలు చేసేటప్పుడు అనారోగ్య సమస్యలు గుర్తిస్తే, కారణాలను విశ్లేషించి తదనుగుణంగా చికిత్స అందించాలి.

- ఏజెన్సీలో వసతి గృహాలపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలి
- విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా కౌన్సెలింగ్ ఇప్పించాలి
- వసతిగృహాలకు నీటి సరఫరా విషయంలో పంచాయతీరాజ్, వైద్యారోగ్య, మునిసిపల్, సంక్షేమశాఖలు కలిసి పనిచేయాలి
- ఎనీమియా, సికిల్‌సెల్ వ్యాధులపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే బాధ్యత అధికారులదే.



## ధర్మవరం పట్టువస్త్రాల్లో అయోధ్య రాముడు

ధర్మవరం, న్యూస్‌టుడే: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో రాముడు మంగళవారం ధర్మవరం పట్టువస్త్రాలతో దర్శనమిచ్చాడు. రామమందిర శిఖరంపై ధ్వజారోహణం సందర్భంగా గర్భగుడిలోని దేవతామూర్తుల అన్ని విగ్రహాలూ ధర్మవరం పట్టుతో మెరిసిపోయాయి. ధర్మవరానికి చెందిన పట్టుచీరల వ్యాపారి జింకా రామాంజినేయులు ప్రత్యేకంగా నేయించి నెల రోజుల క్రితం అయోధ్య రామాలయ కమిటీ ప్రతినిధులకు వీటిని అందజేశారు. ప్రత్యేక డిజైన్లతో చేనేత మగ్గాలపై వీటిని రూపొందించినట్లు రామాంజినేయులు తెలిపారు.

## సామాజిక సమస్యగా మారిన లింగ వివక్ష

- మహిళల ఆర్థిక స్వాతంత్ర్యంతోనే అది దూరం
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ఈనాడు, దిల్లీ: దేశంలో లింగ వివక్ష సామాజిక సమస్యగా మారిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కారణంగా దేశంలో ఏటా దాదాపు 4.5 లక్షల కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాల ప్రకారం ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు శారీరక, లైంగిక హింసను ఎదుర్కొంటున్నారని చెప్పారు. భయం, వ్యవస్థలపై నమ్మకం లేకపోవడం వల్ల ఇంకా చాలా సంఘటనలు బయటకు రావడం లేదన్నారు. ఈ పరిస్థితి మారాలంటే మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలన్నారు. అప్పుడే మహిళలకు భద్రత, గౌరవం, హక్కులు దక్కుతాయని స్పష్టంచేశారు. లింగ సమానత్వం, మహిళా సాధికారతపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టిన నయా చేతన 4.0 ప్రారంభోత్సవ కార్యక్రమంలో చంద్రశేఖర్ మాట్లాడారు. గ్రామస్థాయిలో జెండర్ రిసోర్స్ సెంటర్లను మరింత బలోపేతం చేయాలని కోరారు.

## 'భారత రాజ్యాంగం.. పిల్లల కోసం' పుస్తకం

విద్యార్థులకు ఉచితంగా అందజేయనున్న పాఠశాల విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: పాఠశాల విద్యాశాఖ ప్రత్యేకంగా 'భారత రాజ్యాంగం పిల్లల కోసం' అనే పుస్తకాన్ని తీసుకొచ్చింది. హక్కులు, విధులు, రాజ్యాంగం గొప్పతనం తెలిసేలా దీన్ని రూపొందించారు. చిన్నచిన్న కథలతో రాజ్యాంగంలోని అంశాలను పిల్లలకు అర్థమయ్యేలా ఇచ్చారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దీనికి ముందుమాట రాశారు. ఆంగ్ల భాషలో 100 పేజీలతో ముద్రించిన ఈ పుస్తకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అందిస్తారు.

## మన్యం నుంచే ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత

- ప్రశ్నోత్తరాలు, శూన్యగంటలో కలిపి 20 ప్రశ్నలు
- అమరావతిలో నేడు విద్యార్థుల 'మాక్ అసెంబ్లీ'

ఈనాడు, అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా నుంచే ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతలు రాబోతున్నారు. . ఇదేంటి అనుకుంటున్నారా? పాఠశాల విద్యాశాఖ విద్యార్థులతో బుధవారం నిర్వహిస్తున్న 'మాక్ అసెంబ్లీ'లో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఎం.లీలాగౌతమ్ ముఖ్యమంత్రిగా.. శాసనసభలో ప్రతిపక్షనేతగా అదే జిల్లాకు చెందిన సౌమ్య వ్యవహరించనున్నారు. డిప్యూటీ సీఎంగా విశాఖపట్నం జిల్లాకు చెందిన కోడి యోగి ఉంటారు. విద్యా మంత్రి పదవి తిరుపతి జిల్లాకు చెందిన చిన్మయి సాయికి దక్కింది. కాకినాడ జిల్లాకు చెందిన స్వాతిని స్పీకర్‌గా ఎన్నుకుంటారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో విద్యార్థుల మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులతో రిహార్సల్స్ పూర్తిచేశారు. మొత్తం 175 మంది సభ్యులు, సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు 26మంది మంత్రులు, సభాపతి, ప్రతిపక్షనేత ఉంటారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు ఈ మాక్ అసెంబ్లీ కొనసాగుతుంది. ప్రశ్నోత్తరాల్లో 10 ప్రశ్నలను సభ్యులు లేవనెత్తనున్నారు. వీటికి మంత్రులు సమాధానమిస్తారు. శూన్యగంటలో 10 ప్రశ్నలు రానున్నాయి. విద్యార్థుల ఆన్‌లైన్ భద్రత, సామాజిక మాధ్యమాల నియంత్రణ, విద్యార్థి పర్యావరణ పరిరక్షణ బిల్లులను ప్రవేశపెట్టి, వాటిపై స్వల్పకాలిక చర్చ నిర్వహిస్తారు. 45 వేల పాఠశాలల్లో మాక్ అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారానికి విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రూపొందించిన 'బాలల రాజ్యాంగం'ను సీఎం చంద్రబాబు బుధవారం ఆవిష్కరిస్తారు.

## రాజకీయ ప్రత్యర్థులైనా వ్యక్తిగతంగా దూషించొద్దు

- తెదేపా శ్రేణులకు విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ హితవు

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్‌ను కించపరిచేలా ఏఐ ఆధారంగా రూపొందించిన పోస్టును కొందరు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. 'రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ప్రజాస్వామ్యంలో సహజం. కానీ తెదేపా శ్రేణులు రాజకీయ ప్రత్యర్థుల మీద వ్యక్తిగత విమర్శలు చేయడం మంచిది కాదు. మీ భావోద్వేగాలు అర్థం చేసుకున్నా. కానీ ఇలాంటి వ్యక్తిగత దూషణలు వద్దు. రాజకీయ భేదాలున్నా సామాజిక మాధ్యమాల్లో గౌరవం, విలువలు తప్పక పాటించాలి. మన కార్యకర్తలు సహా అందరూ ఇలాంటి పోస్టులు షేర్ చేయకుండా, ప్రచారం చేయకుండా ఉండాలి' అని సూచించారు. రాష్ట్రాభివృద్ధికి దోహదపడే నిర్మాణాత్మక రాజకీయాలపై అంతా దృష్టి పెట్టాలని లోకేశ్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ నడుచుకుంటూ వస్తుంటే.. జగన్ తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ప్లకార్డు పట్టుకుని కోరుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన పోస్టులపై లోకేశ్ ఇలా స్పందించారు.

# విద్యార్థుల్లో నైతిక విలువల పెంపునకు కృషి

- 'మాక్ అసెంబ్లీ'కి ఎంపికైన బాలికకు మంత్రి లోకేశ్ అభినందన

తాడేపల్లి, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాజధాని అమరావతిలో బుధవారం నిర్వహించనున్న 'మాక్ అసెంబ్లీ'కి మంగళగిరి బీఆర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కూర్మాల కనకపుట్లమ్మ ఎంపికైంది. 'రాజ్యాంగం కల్పించిన హక్కులు' అంశంపై ఆమె మాట్లాడనుంది. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులను మంగళవారం ఉండవల్లి నివాసానికి



ఉండవల్లి నివాసంలో విద్యార్థిని కనకపుట్లమ్మతో ముచ్చటిస్తున్న మంత్రి లోకేశ్, చిత్రంలో బాలిక తల్లిదండ్రులు

పిలిపించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ఏటా రాజ్యాంగ దినోత్సవం నాడు మాక్ అసెంబ్లీ నిర్వహిస్తామన్నారు.

### మాకేమైనా సలహాలిస్తారా..

'అసెంబ్లీకి వెళ్లే మాకేమైనా సలహా ఇస్తారా' అని కనకపుట్లమ్మను లోకేశ్ సరదగా ప్రశ్నించడంతో నవ్వులు విరిశాయి. మాక్ అసెంబ్లీకి సీఎం చంద్రబాబు, స్పీకర్ హాజరవుతారని, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. గతం కంటే మధ్యాహ్న భోజనం చాలా బాగుందని విద్యార్థిని చెప్పగా.. మరింత నాణ్యమైన భోజనం అందించేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్స్ ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి చెప్పారు. కనకపుట్లమ్మ తండ్రి రాము దివ్యాంగుడు కావడంతో చక్రాల కుర్చీలో వచ్చారు. అవసరమైన సాయం అందిస్తామని మంత్రి లోకేశ్ ఆయనకు భరోసా ఇచ్చారు.

# ఆదిలో అడ్డంకులకే నీరుగారిపోవద్దు






విజయవాడ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్బీఐ పూర్వ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, ఊర్మిళ దంపతులను సత్కరించి జ్ఞాపిక అందజేసిన సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ ఛాన్సలర్ కేవీ చౌదరి, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య ● కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)

తదితరులు పాల్గొన్నారు. దువ్వూరి సుబ్బారావు ప్రసంగంలోని కీలకాంశాలు ఇవి...

### మొదటి దెబ్బకే నిరుత్సాహ పడొద్దు

మన జీవితం, కెరీర్ చాలా సుదీర్ఘమైనవి. ప్రారంభంలో ఎదురుదెబ్బలకు కుంగిపోకూడదు. లేచి నిలబడటం, ముందుకు సాగడం ముఖ్యం. నా ఐఏఎస్ ఇంటర్వ్యూ అనుభవం చెబుతాను. కాన్పూర్ ఐఐటీలో ఉండగా దిల్లీలో ఐఏఎస్ ఇంటర్వ్యూకు హాజరయ్యాను. ప్రారంభంలో బోర్డు సభ్యుడు ఆరోజు పత్రిక ప్రధాన శీర్షికపై అడిగారు. బోర్డు ఛైర్మన్ ఇంటర్వ్యూ హడావుడిలో పత్రిక చూసి ఉండరన్నారు. ఆ ముందురోజు ఫొటో అడిగారు. మొహర్రం పండగ ఫొటో అని చెప్పా. 'మొహర్రం.. పండగనా?' అని ఆయన ఆగ్రహించారు. తొలి మూడు నిమిషాల్లోనే జావగారిపోయే స్థితి. బోర్డు ఛైర్మన్ కలగజేసుకుని, వేరే ప్రశ్నలు అడిగారు. 35-40 నిమిషాల పాటు ఇంటర్వ్యూ జరిగింది. జాతీయ, అంతర్జాతీయ అంశాలన్నింటికీ జవాబులు చెప్పాను. ఇంటర్వ్యూలో రెండో అత్యధిక మార్కులు సాధించా. అందుకే ప్రారంభంలో ఎదురయ్యే ప్రతికూలాంశాలకు నిరుత్సాహపడకూడదు.

### ఏదైనా సరే.. ఆసక్తితో చేయాలి

అభిరుచి తెలుసుకుని, దానికోసం పనిచేస్తే విజయం లభిస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెబుతారు. నా జీవితానుభవం వేరేలా ఉంది. అప్పగించిన పని ఏదైనా ఆసక్తితో, ఇష్టంతో చేయాలి. 1980లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రి. అప్పట్లో ప్రతి జిల్లాలో మద్యం బాట్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రత్యేకాధికారిగా నియమించారు. 9 నెలల్లో పూర్తి చేయాలన్నారు. చాలా నిరాశ పడ్డాను. ఐఏఎస్ అయి ఉండి.. మద్యం బాటిళ్లు నింపుతూ ప్రపంచాన్నెలా మారుస్తానని అనుకున్నా. మూడు రోజుల మథనం తర్వాత చేయాలని నిశ్చయించుకుని గడువు కన్నా ముందే పూర్తిచేశాం. అప్పగించిన పనేదైనా ఆసక్తితో పూర్తిచేయాలి.

### తప్పు జరిగితే, సరిదిద్దుకోవాలి

ఇది మనం గూగుల్ మ్యాప్స్ నుంచి నేర్చుకోవాలి. మనం తప్పుమార్గంలోకి వెళ్తే మళ్లీ మార్గం చూపిస్తుంది. తప్పటడుగు వేసినప్పుడు, ఎదురుదెబ్బ తగిలినప్పుడు పునఃసమీక్ష చేసుకుని సరైన మార్గంలోకి రావాలి.

### సామాన్యుడి మనసు తెలుసుకోవాలి

మనం ఏ వృత్తి చేస్తున్నా, ఎందులో అడుగుపెట్టినా మన చెవి సామాన్య జనానికి దగ్గరగా ఉండాలి. ఆర్బీఐ గవర్నర్‌గా నియమించాక నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కలిసి సలహా అడిగా. 'సామాన్య ప్రజలకు ఏది మంచిదనుకుంటే అదే చెయ్యి. తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ప్రజలు ఉన్నారని గుర్తుంచుకో' అని చెప్పారు. ఆర్బీఐ ప్రధాన బాధ్యత ధరలు పెరగకుండా చూడటం. రూ.2,000 విలువచేసే కోటు రూ.2,200 అయినా పెద్ద సమస్య కాదు. కానీ బస్సు టికెట్, కిలో బియ్యం రూ.2 పెరిగినా పేదలను బాధిస్తుంది.

### కళ్లెదుట కనిపించేదాన్ని విస్మరించొద్దు

షెర్లాక్ హోమ్స్ ఓ కాల్పనిక పాత్ర. అతనొక డిటెక్టివ్. అతని సహాయకుడు వాట్సన్. వారు ఒక హత్య పరిశోధనకు లండన్ వెళ్తారు. టెంట్‌లో పడుకున్నాక.. అర్ధరాత్రి షెర్లాక్ హోమ్స్.. వాట్సన్‌ను నిద్ర లేపి, ఏం కనిపిస్తోందని అడుగుతాడు. దానికి అతను అందమైన నీలి ఆకాశం, చంద్రుడు, నక్షత్రాలు కనిపిస్తున్నాయంటాడు. ఎన్నిసార్లు అడిగినా అదే వర్ణిస్తాడు. అరే.. నీకు మన టెంట్ ఎవరో దొంగిలించినట్లు తెలియలేదా అని అడుగుతాడు. అందుకే స్పష్టంగా కనిపించే విషయాన్ని విస్మరించకూడదు. పార్వతీపురంలో సబ్ కలెక్టర్‌గా పని చేసినప్పుడు అక్కడ నక్సలైట్ల ఉద్యమం ఎందుకు పెరిగిందో ఆలోచించా. గిరిజనేతరులు వారి భూములు లాక్కోవడం, వారిని వేధించడం చూశా. ఫిర్యాదు చేస్తే ఆ భూములు తిరిగొచ్చేలా చూస్తా అన్నా. వేలల్లో ఫిర్యాదులు వస్తాయనుకున్నా. కానీ 20 మాత్రమే వచ్చాయి. కారణమేమంటే.. గిరిజనేతరులు అప్పు ఇస్తేనే వారి జీవితం నడుస్తుంది. ఇక వారు ఎలా ఫిర్యాదు చేస్తారు? ఏ విషయాన్నైనా స్పష్టంగా చూడాలి.

**ధర్మాన్ని వదలకూడదు:** అందరూ ధర్మం పాటించాలని చెబుతారు. ఏది ధర్మమో గుర్తించడమే అసలు అంశం. వివిధ సందర్భాల్లో ధర్మం వివిధ రకాలుగా ఉంటుంది. మనం మనస్సాక్షికి జవాబుదారీగా ఉండడం ముఖ్యం.

## రూపాయి విలువ ఆందోళనకరంగా లేదు

- ప్రైవేటు పెట్టుబడులతో సుస్థిరాభివృద్ధి
- 'ఈనాడు-ఈటీవీ'తో ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

ఈనాడు-అమరావతి: 'భారతదేశ ఆర్థికవ్యవస్థ ఎంత వృద్ధి చెందినా ఆ ఫలాలు అందరికీ అందుతున్నాయా లేదా అన్నదే ముఖ్యం. ఆ ఫలాలు అందరికీ అందాలంటే నాణ్యమైన ఉద్యోగాలు అందరికీ దక్కాలి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ అంత ఆందోళనకరంగా ఏమీ లేదు. సుస్థిరాభివృద్ధి కావాలంటే ప్రైవేటు పెట్టుబడులు పెరగాలి. అవి ఎంత త్వరగా వస్తే అంత మేలు' అని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. విజయవాడలో సిద్ధార్థ అకాడమీకి వచ్చిన ఆయన మంగళవారం ఈటీవీ-ఈనాడుతో మాట్లాడారు. రెపో రేటు, ద్రవ్యోల్బణం, వృద్ధి తదితర అంశాలపై ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. వివరాలు ఇలా..

- దేశ ఆర్థిక వ్యవస్థ 2028-29 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని గతంలో చెప్పిన మాట వాస్తవమే. ఇప్పటికే 4 ట్రిలియన్ డాలర్లకు చేరాం. 5 ట్రిలియన్ డాలర్లకు ఒక ఏడాది ముందే చేరుకుంటామా? తర్వాత జరుగుతుందా అన్నది ముఖ్యం కాదు. ఆ స్థాయికి ఎలా చేరాము. . ఆ వృద్ధి వల్ల వచ్చే ప్రయోజనాలు ప్రజలందరికీ చేరుతున్నాయా.. కొందరికేనా అన్నదే ముఖ్యమైన విషయం.
- ఐదారేళ్లుగా ప్రైవేటు పెట్టుబడులు తగ్గాయి. ప్రభుత్వ ఖర్చు, ఎగుమతుల వల్లే వృద్ధిరేటు వస్తోంది. వృద్ధి సుస్థిరంగా ఉండాలంటే ప్రైవేటు పెట్టుబడులు రావాలి. అవి రావాల్సినంత రావట్లేదు. పెట్టుబడులు పెట్టేందుకు చాలామంది సిద్ధంగా ఉన్నారు. విదేశీ పెట్టుబడులు కూడా వస్తాయనే అనుకుంటున్నాం. అవి ఎంత త్వరగా వస్తే అంత మంచిది.
- ఆర్బీఐకి రెండు కీలక బాధ్యతలు ఉన్నాయి. ద్రవ్యోల్బణం తగ్గించడంతో పాటు స్థిరంగా ఉండేలా చూడటం, వృద్ధి పెంచడం. ఇప్పుడు ద్రవ్యోల్బణం తక్కువగా ఉంది. ఆర్బీఐ రెపోరేటు 5.5%, రియల్ టైంలో 4.5%గా ఉంది. కొంచెం ఎక్కువ ఉన్నట్లు కనిపిస్తోంది. ద్రవ్యోల్బణం తక్కువగా ఉంది, వృద్ధి పెంచేందుకు వడ్డీ రేట్లు తగ్గిస్తే మంచిది కదా అని అందరూ అనుకుంటారు. కానీ అనేక ఇతర అంశాల ప్రభావమూ దీనిపై ఉంటుంది. అవన్నీ ఆర్బీఐ చూసుకోవాలి. అంతర్జాతీయ సుంకాలు, అనిశ్చితులు, వృద్ధిరేటు ఇంకా ఇతరత్రా అనేక అంశాలతో ఇది ముడిపడి ఉంటుంది.
- డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ అంత ఆందోళనకరంగా ఏమీ లేదు. కరెంటు ఖాతా లోటు, ఎగుమతులు-దిగుమతుల వ్యత్యాసం, విదేశీ రుణాలు, పెట్టుబడులు వీటన్నింటినీ బట్టి రూపాయి మారకం ఉంటుంది. నా ఉద్దేశంలో రూపాయి విలువ అలా స్వేచ్ఛగా మారితేనే మంచిది. ఇది ఆందోళనకరమని అనుకోను.
- మనది వేగంగా విస్తరిస్తున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెబుతున్నాం. 2047 నాటికి వికసిత్ భారత్ కావాలంటే వృద్ధిరేటు 7-8% ఉండాలి. వృద్ధి పెంచడంతో పాటు ఆ ఫలాలు అందరికీ అందేలా చూడాలి. అన్నింటికన్నా ముఖ్యం నాణ్యమైన ఉద్యోగాలు రావాలి.

# పరకామణి కేసులో మీకు తెలిసే రాజీ జరిగిందా?

- భూమన కరుణాకరరెడ్డిపై సీఐడీ ప్రశ్నల వర్షం

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: 'పరకామణిలో చోరీ కేసు విచారణ నిమిత్తం వస్తున్న తితిదే అప్పటి ఏవీఎస్వో సతీష్ కుమార్‌ది ఆత్మహత్యేనని మీడియాకు ఎలా చెప్పారు? అందుకు మీ దగ్గరున్న ఆధారాలేంటి? నిందితుడి ఆస్తిని శ్రీవారికి గిఫ్ట్‌డీడ్‌గా తీసుకునే సమయంలో పాలకమండలి సమావేశంలో టేబుల్ ఎజెండాగా ఎందుకు పెట్టాల్సి వచ్చింది' అంటూ తితిదే నాటి ఛైర్మన్, వైకాపా నేత భూమన కరుణాకరరెడ్డిని సీఐడీ ప్రశ్నించినట్లు సమాచారం. మంగళవారం విచారణకు హాజరైన ఆయనను అరగంటపాటు డీజీ రవిశంకర్ అయ్యన్నార్ విచారించారు. 'నిందితుడు రవికుమార్ స్వయంగా తప్పును అంగీకరించి.. ఆస్తుల వివరాలు వెల్లడించినప్పటికీ కేవలం రూ.14.43 కోట్ల ఆస్తులనే శ్రీవారికి గిఫ్ట్‌డీడ్‌గా ఎందుకు తీసుకున్నారు? అప్పటికప్పుడు టేబుల్ ఎజెండాగా పెట్టడంలో ఎవరి ప్రమేయం ఉంది?' అని ప్రశ్నించినట్లు సమాచారం. ఇవన్నీ తనకు సంబంధం లేని ప్రశ్నలని భూమన దాటవేసినట్లు తెలుస్తోంది. 'ఈ కేసు రాజీ చెయ్యాలని ఎవరి నుంచైనా విన్నపాలు వచ్చాయా? మీరేమైనా పోలీసులకు సూచించారా?, రవికుమార్ ఆస్తులను ఎవరైనా రాయించుకున్నట్లు అనుమానం ఉందా? అతడిపై తితిదే విజిలెన్స్ ద్వారా ఎలాంటి దర్యాప్తు చేయించారు?' అని ఆరా తీసినట్లు సమాచారం. ఈ విషయాల్లో తనకెలాంటి సంబంధం లేదని, తననెవరూ రాజీ చేయమని కోరలేదని భూమన చెప్పినట్లు తెలిసింది.

### నన్ను కేసులో ఇరికించడానికే: భూమన

సీఐడీ విచారణ అనంతరం భూమన మీడియాతో మాట్లాడారు. 'నైలు నదిలో మొసళ్ల సంఖ్య ఎంత? మన డీఎన్ఏకు మూలమైన మహాతల్లి వాళ్ల అమ్మ పేరేంటి? 1,500 ఏళ్లుగా స్వామివారికి తలనీలాలు సమర్పించిన వారు ఎంతమంది? అని అడిగితే నేనేలా సమాధానం చెప్పగలను?' అని పేర్కొన్నారు. అసలు ఈ కేసుకు, తనకు సంబంధమే లేదన్నారు. విచారణలో ఎలాంటి ప్రశ్నలు వేశారని మీడియా అడగ్గా.. సంబంధం లేని ప్రశ్నలు అడిగారన్నారు.

### మధ్యవర్తిత్వం చేయడం కరెక్టా?

పరకామణి కేసులో మధ్యవర్తిత్వం చేయడం కరెక్టా. . గిఫ్ట్‌డీడ్ విషయాన్ని పాలకమండలిలో టేబుల్ ఎజెండాగా పెట్టడం సరైనదేనా అని సీఐడీ అడిగినట్లు తితిదే మాజీ పాలకమండలి సభ్యుడు, ఎస్టేట్ కమిటీ అప్పటి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ తెలిపారు. సీఐడీ విచారణకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ 'నిందితుడు రవికుమార్ ఇచ్చిన గిఫ్ట్‌డీడ్ ఆస్తుల గురించే నన్ను ప్రశ్నలు అడిగారు. నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి.. ఈ అంశాన్ని టేబుల్ ఎజెండాగా చేర్చారని తెలిపా' అని చెప్పారు.



విచారణ అనంతరం బయటికొస్తున్న భూమన కరుణాకరరెడ్డి

### తితిదే అధికారులు, ఎస్సై విచారణ

తిరుమల వన్‌టౌన్ ఎస్సై రామలక్ష్మీరెడ్డి, పరకామణి అప్పటి డిప్యూటీ ఈవో మల్లికార్జునరావుతో పాటు కొందరు ఉద్యోగులను సీఐడీ విచారించింది. అప్పటి స్టేషన్ ఎస్‌హెచ్‌వో జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో ఎలాంటి ఆదేశాలు జారీ చేశారు? కేసు రాజీపై ఉన్నతాధికారుల నుంచి ఏమైనా ఆదేశాలు అందాయా.. అని ప్రశ్నించారు.

### సీసీ ఫుటేజీలు మాయం చేశారు

పరకామణి వ్యవహారంలో రవికుమార్ డాలర్లు దొంగలిస్తున్నట్లు నిర్ధారించే సీసీ ఫుటేజీలను తితిదే ఉద్దేశపూర్వకంగానే తొలగించిందని.. దీనివెనుక అప్పటి కమాండ్ కంట్రోల్ వీఐ శివశంకర్ హస్తం ఉందని పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. తిరుమలలో లడ్డూలు, గదులు బ్లాక్‌లో విక్రయించిన వారిని రిమాండ్‌కు పంపించిన ఘటనలున్నాయని.. కానీ శివశంకర్‌ను మాత్రం మాతృశాఖకు బదిలీ చేయడం వెనుక మర్మమేంటో తెలియాలని.. దీనిపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని, బుధవారం విచారణకు రానుందని పేర్కొన్నారు.

## 3, 4, 5 తేదీల్లో జాతీయ గిరిజన విద్యార్థుల సాంస్కృతికోత్సవాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో డిసెంబరు 3, 4, 5 తేదీల్లో 6వ జాతీయ ఏకలవ్య గురుకుల విద్యార్థుల సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల నుంచి 1,800 మంది గిరిజన విద్యార్థులు ఇందులో పాల్గొననున్నారు. రాష్ట్రం నుంచి 110 మంది ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఈ ఉత్సవాలకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను గిరిజన గురుకులాల కార్యదర్శి గౌతమి, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ సదాభార్గవితో కలసి గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి మంగళవారం విడుదల చేశారు. ఈ ఉత్సవాలకు కేంద్ర ప్రభుత్వ ఉద్భవ్-2025గా నామకరణం చేసిందని మంత్రి తెలిపారు. రాజధాని అమరావతి సమీపంలోని కేఎల్ విశ్వవిద్యాలయం వేదికగా వీటిని నిర్వహిస్తామన్నారు.

### పార్వతీపురం మన్యం జిల్లాకు రూ.500 కోట్లు

గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు లేకుండా అన్ని గ్రామాలకు అనుసంధాన రహదారులు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. ఇప్పటివరకు మౌలిక వసతుల కల్పనకు రూ.1,300 కోట్లు కేటాయించామని, దశల వారీగా అన్ని గ్రామాలకు రోడ్లు వేస్తామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు రూ.1,000 కోట్లు కేటాయించినందుకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లాకు రూ.500 కోట్లు ఇచ్చేందుకు పవన్ కల్యాణ్ ఆమోదించారని పేర్కొన్నారు.

# రేపటి నుంచి వైకుంఠ ఏకాదశి టికెట్ల రిజిస్ట్రేషన్

**మొదటి 3 రోజులకు డిసెంబర్ 2న లక్కీడిప్**



**తిరుమల, న్యూస్‌టుడే:** శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు నిర్వహించనున్న 10 రోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇచ్చేలా తితిదే చర్యలు చేపట్టింది. డిసెంబర్ 30, 31, జనవరి 1 దర్శనాలకు ఈ నెల 27 (గురువారం) నుంచి డిసెంబర్ 1 వరకు ఆన్‌లైన్‌లో ముందస్తుగా భక్తులు నమోదు చేసుకుంటే డిప్ ద్వారా ఉచిత సర్వ దర్శన టోకెన్లు కేటాయిస్తారు. జనవరి 2 నుంచి 8 వరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 ద్వారా నేరుగా సర్వదర్శనం అమలు చేయనున్నారు. భక్తులు టోకెన్లు లేకుండా నేరుగా క్యూలైన్‌లో ప్రవేశించి స్వామివారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. ఎలాంటి టోకెన్లూ జారీ చేయరు.

**డిప్ నమోదు ఇలా..**

తితిదే వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in, https://apps.apple.com/in/app/ttdev-asthanams/mobile app ద్వారా ఈ-డిప్‌నకు నమోదు చేసుకోవచ్చు. వన్ ప్లస్ 3 కింద ప్రతి వ్యక్తి నమోదు చేసుకునే అవకాశం ఉంది. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఆంగ్ల భాషల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. డిసెంబర్ 2న డిప్‌లో ఎంపికయిన వారికి దర్శన సమాచారం పంపుతారు.

**వాట్సాప్ బాట్‌లోనూ నమోదు విధానం**

వాట్సాప్ బాట్ ద్వారా ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకునే భక్తులు ఏపీ గవర్నమెంట్ సర్వీసెస్ నం **9552300009**కు ముందుగా గోవిందా లేదా హాయ్ అని మెసేజ్ చేయాలి. అనంతరం భాషను ఎంపిక చేసుకుని ఇంగ్లిష్ కోసం ఈఎన్, తెలుగు కోసం టీఈ అని రిప్లై ఇవ్వాలి. అనంతరం సర్వీసెస్ విండో ద్వారా తితిదే టెంపుల్ విభాగాన్ని ఎంపిక చేసుకోవాలి. తరువాత వైకుంఠ ద్వార దర్శనం (డిప్) రిజిస్ట్రేషన్ ఆప్షన్ వస్తుంది. భాషను ఖరారు చేసి తరువాత చిరునామా, పిన్‌కోడ్ నమోదు చేయాలి. దర్శనం తేదీని ఎంపిక చేసుకుని ఆధార్‌కార్డులో ఉన్న విధంగా పేరు, వయసు, జెండర్, ఆధార్, మొబైల్ నంబర్ నమోదు చేసి సబ్మిట్ చేయాలి. ఒక మొబైల్ నంబర్, ఆధార్‌కార్డుకు ఒకసారి మాత్రమే రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంటుంది.

- జనవరి 2 నుంచి 8 వరకు ఆన్‌లైన్‌లో రోజువారీగా 15 వేల ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300) టికెట్లు, రోజుకు 1000 శ్రీవాణి దర్శన టికెట్లను రెగ్యులర్ పద్ధతిలో కేటాయిస్తారు. డిసెంబర్ 5 ఉదయం 10 గంటలకు శ్రీవాణి, మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 (ఎస్ఈడీ) కోటాను ఆన్‌లైన్‌లో మాత్రమే విడుదల చేస్తారు.
- జనవరి 6, 7, 8 తేదీల్లో స్థానికులకు బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు రోజూ 4500, తిరుమలవాసులకు 500 టోకెన్లను జారీ చేస్తారు. వీరికి డిసెంబర్ 10న టోకెన్లను విడుదల చేస్తారు.
- వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు. ప్రివిలేజ్ దర్శనాలు రద్దు చేశారు. స్వయంగా వచ్చే వీఐపీ ప్రొటోకాల్ ప్రముఖులు మినహా సిఫారసుపై వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు ఆఫ్‌లైన్‌లో ఎటువంటి ఎస్ఎస్‌డీ టోకెన్లు జారీ చేయరు.
- రూ.కోటి ఆపైగా విరాళం ఇచ్చిన దాతలకు వారి కుటుంబ సభ్యులతో డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు రోజుకు 125 మందికి దర్శనం కల్పించనున్నారు. రూ.లక్ష నుంచి రూ.99 లక్షల వరకు విరాళం ఇచ్చిన దాతలకు డిసెంబర్ 30, 31 తేదీల్లో రోజుకు 1000 మందికి, జనవరి 1 నుంచి 8 వరకు రోజుకు 2 వేల మందికి దర్శనం కల్పించనున్నారు. వీరు కూడా ఆన్‌లైన్ అప్లికేషన్‌లో డిసెంబర్ 5న ఉదయం 10 గంటలకు విడుదల చేసే టికెట్లను ఇప్పుడున్న విధానంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.
- దాతలు, తితిదే ఉద్యోగులు, జనరల్ బ్రేక్ కలిగిన భక్తులకు మహాలఘు దర్శనం మాత్రమే కల్పిస్తారు.

## పశువైద్య విద్యలో డిగ్రీ లేకుండా వెటర్నరీ పదం వాడకూడదు

**వెటర్నరీ కౌన్సిల్ సమావేశం స్పష్టీకరణ**

**విజయవాడ (నెహ్రూనగర్), న్యూస్‌టుడే:** పశువైద్య విద్యలో డిగ్రీ పొందని వారు వెటర్నరీ అనే పదాన్ని ఉపయోగించకూడదని వెటర్నరీ కౌన్సిల్ సభ్యులు, ఆ శాఖలోని వివిధ సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. మంగళవారం గుంటూరులో రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ వీవీ లక్ష్మయ్య అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. విశ్వవిద్యాలయంపై భారాన్ని తగ్గించేందుకు సిలబస్ తయారీ, కోర్సుల పర్యవేక్షణ, పరీక్షల నిర్వహణ కోసమే బోర్డు ఉందన్నారు. అది ఏపీ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ పరిధిలోనే పని చేయాలని చెప్పారు. శ్రీవెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ జేవీ రామ్ మాట్లాడుతూ.. సిలబస్, పాఠ్య ప్రణాళిక, పరీక్షల విధానం వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవాలంటే విశ్వవిద్యాలయం విభాగాధిపతులు తప్పనిసరిగా బోర్డులో భాగస్వాములు కావాలని సూచించారు. నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ అసోసియేషన్ వంటి పేర్లు, పారా వెటర్నరీ యాక్టుల్లో 'వెటర్నరీ' పదం వాడడం వృత్తిపరమైన నిబంధనలకు విరుద్ధమని వివిధ సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ దామోదర్ నాయుడు, కార్యదర్శి డాక్టర్ బేబీరాణి, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ సర్జన్స్ సంఘం, అధికారుల సంఘం, వెటర్నరీ అసిస్టెంట్స్ సంఘం, పారా వెటర్నరీ ప్రతినిధులు, ఇతర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వేషం మార్చి... వైద్యసేవలకు వచ్చి.!

**గుంటూరు జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ రాత్రివేళ ఆకస్మిక తనిఖీలు**



సహాయకురాలితో వృద్ధుడి వేషంలో ఆసుపత్రిలో తిరుగుతున్న సూపరింటెండెంట్

మంగళవారం రాత్రి 10 గంటలు.. ఇద్దరు సహాయకులను వెంటపెట్టుకుని ఓ వృద్ధుడు గుంటూరు ప్రభుత్వ వైద్యశాల (జీజీహెచ్)లో తనకు వైద్యం చేయమంటూ అక్కడి వైద్యులు, సిబ్బందిని అభ్యర్థించారు. చింపిరి జుట్టు.. చేతిలో కర్ర, పాతచొక్కా మాసిన కండువాతో ముఖానికి మాస్క్‌తో ఉన్న అతడిని చూసి వైద్యులు కొన్ని వైద్యపరీక్షలకు రిఫర్ చేశారు. అనంతరం ఆ వృద్ధుడు ఆసుపత్రిలోని పలు విభాగాల వద్దకు వెళ్లారు. ఆసుపత్రి వరండాల్లో తిరుగుతున్న శునకాలు, ఐసీయూల వద్ద సిబ్బంది చెబుతున్న సమాధానాలను ప్రత్యక్షంగా విన్నారు. ఔషధశాల వద్ద పరిస్థితిని గమనించారు. సుమారు గంటకు పైగా ఆసుపత్రి మొత్తం తిరుగుతూ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇంతకీ ఆ వృద్ధుడెవరో కాదు.. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణ. కొంతకాలంగా ఆసుపత్రిలో పరిస్థితిపై విమర్శలొస్తున్నాయి. రాత్రివేళ ఆర్ఎంవోలు, వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఇటీవల 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఆయన ఇలా తనిఖీలు చేపట్టారు. కొన్ని లోపాలు గుర్తించినట్లు తెలుస్తోంది. – ఈనాడు, అమరావతి

## నకిలీ మద్యం కేసులో జోగి సోదరులకు విడతల వారీగా ముడుపులు

- తోడ్పాటు కోసమే సొమ్ములు
- కస్టడీలో వెల్లడించిన ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు

**ఈనాడు, అమరావతి:** వైకాపా అధికారంలో ఉన్న సమయంలో వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్, అతని సోదరుడు రాముకు విడతల వారీగా ముడుపులు ఇచ్చినట్లు నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దన్‌రావు పోలీసు కస్టడీలో వెల్లడించాడు. 2021 నుంచి 2024 మధ్య తాను రూ.70 లక్షలను ఎప్పుడెప్పుడు అందించిందీ ఇటీవల ముగిసిన ఇంటరాగేషన్‌లో పూసగుచ్చి వివరించినట్లు తెలిసింది. అద్దేపల్లి సోదరుల బ్యాంకు స్టేట్‌మెంట్లను పోలీసులు లోతుగా పరిశీలించి, ప్రతి లావాదేవీకి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెద్ద మొత్తంలో విత్‌డ్రా చేసిన నగదులో కొంత జోగి సోదరులకు అందించినట్లు చెప్పాడు.

**తొలి నుంచి చెట్టపట్టాల్**

జోగి రమేష్, రాము 2016-19 మధ్య స్వర్ణ బార్‌లో భాగస్వాములుగా వ్యవహరించారు. 2019లో దాని పేరు చెర్రీస్ బార్‌గా మార్చారు. వీరిద్దరి సహకారంతోనే జనార్దన్‌రావు 2013 లో బాలాజీ బార్‌ను గుడ్‌విల్ ఇచ్చి కొన్నాడు. తర్వాత దాని పేరును ఏఎన్ఆర్ రెస్టారెంట్ అండ్ బార్‌గా మార్చారు. 2017లో ఇబ్రహీంపట్నం బార్ యజమానులంతా సిండికేట్‌గా ఏర్పడ్డారు. అందులో జోగి రమేష్, రాము కీలకంగా ఉన్నారు. 2019లో వైకాపా ప్రభుత్వం కొలువుదీరే వరకు మద్యం సిండికేట్ కొనసాగింది.

**అండదండలు అందించినందుకే..**

2021లో జనార్దన్‌రావు హైదరాబాద్ నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్)ను క్యాన్లలో తెచ్చి ఇబ్రహీంపట్నంలో సీసాల్లోకి నింపి అమ్మకాలు సాగించేవాడు. అప్పట్లో ఏపీలో మద్యం ధరలు అధికంగా ఉండడంతో తెలంగాణ నుంచి తెచ్చి ఇక్కడ విక్రయాలు జరిపేవాడు. అనంతరం 2023 నుంచి జనార్దన్‌రావు ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ ప్రారంభించాడు. ఇది గత ఏడాది ఎన్నికల వరకు కొనసాగింది. వీటి ద్వారా భారీగా సంపాదించిన జనార్దన్‌రావు.. గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా పని చేసిన జోగి రమేష్, అతని సోదరుడు రాముకు భారీగా ముడుపులు ఇచ్చినట్లు విచారణలో అంగీకరించాడు. తమ వ్యాపారాలకు ఆటంకాలు ఎదురుకాకుండా తోడ్పాటును అందించినందుకు ముడుపులు ఇచ్చినట్లు తెలిసింది. రెండు, మూడు నెలలకోసారి జోగి రమేష్, రాముకు రూ.3 నుంచి 5 లక్షలు చొప్పున డబ్బు అందించే వాడని సిట్, ఎక్సైజ్ దర్యాప్తులో తేలింది. జోగి రమేష్ డిమాండ్ మేరకు.. 2022 జూన్‌లో జనార్దన్‌రావు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.8 లక్షలు డ్రా చేసి.. రూ.4 లక్షలు, మరోసారి రూ.5 లక్షలు.. ఇలా మూడేళ్లలో పలు దఫాలుగా జోగి రాముకు రూ.70 లక్షలు వరకు అందించాడు.

## నేటి నుంచి జోగి సోదరులకు 4 రోజుల కస్టడీ

- ఉత్తర్వులిచ్చిన విజయవాడ ఎక్సైజ్ కోర్టు



నకిలీ మద్యం కేసులో జోగి రమేష్, జోగి రాము రిమాండ్ ముగియడంతో విజయవాడ కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకువచ్చిన పోలీసులు

**ఈనాడు, అమరావతి:** నకిలీ మద్యం కేసులో నిందితులైన మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు రామును నాలుగు రోజుల కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఎక్సైజ్ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. కస్టడీ కోసం సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై గత వారం ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీనిపై న్యాయాధికారి లెనిన్ బాబు.. మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 26 నుంచి 29 వరకు నాలుగు రోజులపాటు కస్టడీకి అనుమతించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు విచారించవచ్చనీ, అనంతరం విజయవాడలోని జిల్లా కారాగారంలో అప్పగించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం జోగి సోదరులు నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. నాలుగు రోజుల విచారణ నిమిత్తం విజయవాడ జైలులో ఉంటారు.

★ ఈ కేసులో నిందితులకు మంగళవారంతో రిమాండ్ గడువు ముగియనున్న నేపథ్యంలో ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. నెల్లూరు కారాగారం నుంచి మాజీ మంత్రి జోగి రమేష్, రాము, జనార్దన్‌రావు, మిథున్‌దాస్, అంతదాస్, హాజి, శ్రీనివాసరావులను న్యాయస్థానంలో హాజరుపరిచారు. విజయవాడ జైలులో ఉన్న జగన్మోహన్‌రావు, మిగిలిన వారిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. నిందితులకు వచ్చే నెల 9 వరకు రిమాండ్‌ను పొడిగించారు.

★ కోర్టుకు జోగి రమేష్, రామును తీసుకొచ్చిన సమయంలో ఇబ్రహీంపట్నం నుంచి వారి అనుచరులు వచ్చారు. వీరిలో పలువురు కోర్టుహాల్ వెలుపల అత్యుత్సాహంతో వీడియోలు తీశారు. వీరిని నియంత్రించడం పోలీసులకు కష్టంగా మారింది.

## సంక్రాంతి వరకు ఆప్కోలో 40% రాయితీపై అమ్మకాలు

**ఈనాడు, అమరావతి:** వినియోగదారుల నుంచి వస్తున్న ఆదరణ దృష్ట్యా సంక్రాంతి వరకు ఆప్కోలో చేనేత వస్త్రాల విక్రయంపై 40 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆ శాఖ మంత్రి సవిత తెలిపారు. దసరా, దీపావళి పండుగలకు రాయితీని ప్రకటించడం వల్ల రోజువారీ విక్రయాలు రూ.3 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెరిగాయని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చేనేత వస్త్రాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు త్వరలో విశాఖ, కర్నూలు, కడప నగరాల్లో చేనేత ఎగ్జిబిషన్లు, బజార్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

## విశాల్ దివాలా తీశారని ప్రకటించేందుకు సిద్ధమా?

- నటుడి తరఫు న్యాయవాదిని ప్రశ్నించిన మద్రాస్ హైకోర్టు
- లైకాకు రుణం చెల్లింపులో సింగిల్ జడ్జి ఉత్తర్వులపై మధ్యంతర స్టే

**చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే:** తాను ధనవంతుడు కాదని చెప్పిన నటుడు విశాల్ దివాలా తీశారని ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నారా అని మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. లైకా సంస్థకు ఇవ్వాల్సిన రూ.21.29 కోట్లను 30 శాతం వడ్డీతో చెల్లించాలని విశాల్‌ను ఆదేశిస్తూ మద్రాసు హైకోర్టు గతంలో ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్‌పై సోమవారం జస్టిస్ ఎస్ఎం సుబ్రహ్మణ్యం, జస్టిస్ మహమ్మద్ షఫీక్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. న్యాయస్థానం సూచించిన కొంత మొత్తాన్ని కోర్టులో డిపాజిట్ చేయొచ్చు కదా అని న్యాయమూర్తులు ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఏడాదికి 30 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలని జారీచేసిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని, వడ్డీ మాత్రమే రూ.40 కోట్లకు పైగా ఉంటుందని విశాల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. లైకా సంస్థ చెబుతున్నట్లు విశాల్ ధనవంతుడు కాదని తెలిపారు. దీంతో జోక్యం చేసుకున్న న్యాయమూర్తులు.. విశాల్‌ను దివాలా తీసిన వ్యక్తిగా ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. 30 శాతం వడ్డీ అత్యధికమని, ఇలా దోచుకోవడాన్ని అనుమతించబోమని స్పష్టంచేశారు. రూ.21 కోట్ల రుణాన్ని 30 శాతం వడ్డీతో చెల్లించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులపై మధ్యంతర స్టే విధించారు. రూ.10 కోట్లు డిపాజిట్ చేయాలని విశాల్‌ను ఆదేశించారు. పిటిషన్‌పై లైకా జవాబివ్వాలంటూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

**ఒప్పందం ఉల్లంఘించి..**

విశాల్ తన విశాల్ ఫిలిమ్ ఫ్యాక్టరీ కోసం సినిమా ఫైనాన్షియర్ అన్బుచెళియన్‌కు చెందిన గోపురం ఫిలిమ్స్ నుంచి తీసుకున్న రూ.21.29 కోట్ల అప్పును లైకా చెల్లించింది. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించే వరకు విశాల్ తన నిర్మాణ సంస్థకు చెందిన అన్ని సినిమాల హక్కులను లైకాకు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించి విశాల్ సినిమాలు విడుదల చేశారని, నగదు తిరిగి ఇవ్వాలని లైకా మద్రాసు హైకోర్టులో కేసు వేసింది. ఆ కేసును విచారించిన సింగిల్ జడ్జి లైకాకు రూ.21.29 కోట్లను 30 శాతం వడ్డీతో చెల్లించాలని విశాల్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

## డిసెంబరులో మూడు విడతల్లో తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు


**ఈనాడు, హైదరాబాద్:** తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మూడు విడతల్లో డిసెంబరు 11, 14, 17 తేదీల్లో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూలు విడుదల చేసింది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్, అదే రోజు రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడితో పాటు ఉప సర్పంచి ఎన్నికను సైతం నిర్వహిస్తారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని మంగళవారం తమ కార్యాలయంలో ఎన్నికల షెడ్యూలు, నిర్వహణ ప్రక్రియను వెల్లడించారు.

## క్రికెటర్ కరుణకుమారికి రూ.5 లక్షల ప్రోత్సాహకం

**ఈనాడు, అమరావతి:** భారత అంధుల మహిళా క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన విశాఖకు చెందిన అంధుల గురుకుల విద్యార్థిని కరుణకుమారికి కిశోర్ గ్రానైట్స్ అధినేత గొట్టిపాటి హర్ష రూ.5 లక్షల ప్రోత్సాహకాన్ని మంగళవారం ప్రకటించారు.

## పండగ వేళ అందినంత దండుకో!

- సంక్రాంతి రద్దీని సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు బస్సు ఆపరేటర్లు
- హైదరాబాద్-విశాఖపట్నం, బెంగళూరులకు దాదాపు రూ.7 వేలు
- విజయవాడకు రూ.3,000-5,999
- విమాన టికెట్ల కంటే అధికంగా ఛార్జీలు



**ఈనాడు, హైదరాబాద్:** సంక్రాంతి పండగ రద్దీని ప్రైవేటు బస్సు ఆపరేటర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా ఛార్జీలు పెంచేస్తున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం వంటి నగరాలకు వెళ్లే రైళ్లలో, ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో టికెట్లు అయిపోయాయి. ప్రత్యేక రైళ్లను, ప్రత్యేక బస్సులను ప్రకటించడంలో రైల్వే శాఖ, రోడ్డు రవాణా సంస్థలు జాప్యం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్ని ప్రైవేటు ఆపరేటర్లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు.

**9, 10 తేదీల్లో భారీ డిమాండ్**

సంక్రాంతి పండక్కి ముందు వస్తున్న వారాంతం కావడంతో జనవరి 9, 10 తేదీల్లో భారీ డిమాండ్ ఉంది. ఆ తర్వాత రోజుల్లోనూ రద్దీ ఉన్నా ఈ రెండు రోజుల్లో ఎక్కువ మంది ప్రయాణాలు పెట్టుకుంటున్నారు. దీంతో ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు అమాంతం ఛార్జీలను పెంచేస్తున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లోనూ అదనపు ఛార్జీలు ఉంటున్నా.. గరిష్ఠంగా 50 శాతానికి మించడం లేదు. ప్రైవేటు బస్సుల యజమానులు మాత్రం రెండు, మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు.

**హైదరాబాద్–విశాఖపట్నం:** ఆర్టీసీలో టికెట్ ధర రూ.1,889. ప్రైవేటులో రూ.5 వేల నుంచి రూ.5,999. అదే ప్రైవేటు స్లీపర్ బస్సుల్లో టికెట్ ధర రూ.6,999. జనవరి 9న హైదరాబాద్-విశాఖపట్నం విమాన టికెట్ ధర రూ.6,157.

**హైదరాబాద్–రాజమహేంద్రవరం:** ఆర్టీసీ సూపర్ లగ్జరీలో రూ.1,032. స్లీపర్‌లో రూ.2,338 ఛార్జీ ఉంటే.. ప్రైవేటు బస్సుల్లో సీటర్‌లో రూ.2,599-రూ.4,999 ఛార్జీ వసూలు చేస్తున్నారు. స్లీపర్‌లో టికెట్ ధర రూ.5,999.

**హైదరాబాద్–విజయవాడ:** ఆర్టీసీలో సీటర్ టికెట్ రూ.440 ఉంటే.. ప్రైవేటులో రూ.1,750-రూ.1,799. అదే స్లీపర్‌లో బెర్తు కావాలంటే.. సౌకర్యాన్ని బట్టి రూ.3,500-5,999గా నిర్ణయించారు.

**హైదరాబాద్–బెంగళూరు:** ఆర్టీసీ స్లీపర్ బస్సు టికెట్ రూ.1,203. అదే ప్రైవేటు బస్సుల్లో ఒక్కో బెర్తుకు రూ.2,799-6,899 వరకు వసూలు చేస్తున్నారు. జనవరి 9న విమాన టికెట్ ధర రూ.3,956గా ఉంది.

**పట్టించుకోని రవాణాశాఖ**

ప్రైవేటు బస్సుల్లో ఛార్జీల్ని ఇష్టారాజ్యంగా పెంచుతున్నా రవాణాశాఖ ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదు. హైదరాబాద్-బెంగళూరు బస్సు కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదానికి గురైన తర్వాత బస్సుల ఫిట్‌నెస్, ఇతర భద్రతా పరమైన అంశాలను కొద్ది రోజులు తనిఖీలు చేసి అధికారులు కేసులు పెట్టారు. ఏటా పండగ సమయంలో భారీగా ఛార్జీలు పెంచుతున్నా కేవలం హెచ్చరికలకు పరిమితం అవుతున్నారు.

## ఆకుపై ఆకట్టుకున్న రాజముద్ర!




ఆకుపై రాజముద్ర, ఆంగ్ల అక్షరాలు

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయనగరం జిల్లా కొత్తవలస మండలం దెందేరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆకుపై రాజముద్రను తీర్చిదిద్దారు. ఉపాధ్యాయుల సాయంతో తొమ్మిదో తరగతి విద్యార్థులు అప్పికొండ మేఘన, గుమ్మడి శశిప్రియ చామదుంప ఆకుపై రాజ్యాంగ దినోత్సవం అనే ఆంగ్ల అక్షరాలు, సింహాలతో కూడిన రాజముద్రను కట్ చేశారు. పీడీ రవికుమార్, ఇన్‌ఛార్జి హెచ్ఎం కమలవాణి, ఉపాధ్యాయులు అభినందించారు. – న్యూస్‌టుడే, కొత్తవలస



అక్షరాలు కత్తిరిస్తున్న విద్యార్థినులు

## ఇక బృహత్ హైదరాబాద్!

- జీహెచ్ఎంసీలో 27 నగర, పురపాలికల విలీనం
- తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయం
- ఓఆర్ఆర్ వరకూ రాష్ట్ర రాజధాని విస్తరణ
- దేశంలోనే అతి పెద్ద నగరంగా అవతరణ

**ఈనాడు, హైదరాబాద్:** హైదరాబాద్ మహా నగరం మరింత విస్తరించి బృహత్ నగరంగా మారనుంది. బాహ్య వలయ రహదారి(ఓఆర్ఆర్) లోపల, దాన్ని ఆనుకుని బయట ఉన్న 27 నగర, పురపాలక సంఘాలను గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ)లో విలీనం చేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. వీటిని విలీనం చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలంది. అందుకు అవసరమైన జీహెచ్ఎంసీ చట్టం, తెలంగాణ మున్సిపల్ చట్టాలకు సవరణలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విలీన ప్రక్రియ ముగిశాక... ఐదు జిల్లాలు, 47 మండలాలు, 311 గ్రామాల పరిధిలో ఆరు పార్లమెంటు స్థానాలు, 28 అసెంబ్లీ స్థానాలతో దేశంలోనే అతి పెద్ద నగరంగా హైదరాబాద్ విస్తరించబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... "తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న పురపాలక, నగరపాలక సంస్థలన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేసి జీహెచ్ఎంసీని బృహత్ నగరంగా విస్తరిస్తాం. ఈ ప్రతిపాదన చాలా సంవత్సరాలుగా ఉంది. ప్రజా ప్రభుత్వం దాన్ని అమలు చేస్తోంది. నగరంలో ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నులు, వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, అందిస్తున్న పరిపాలన పూర్తిగా ఒకేవిధంగా ఉండాలనే సంకల్పంతోనే ఈ మహా విలీనం ప్రక్రియ చేపట్టాం. విలీనం పూర్తయ్యాక బృహత్ నగరాన్ని ఎన్ని కార్పొరేషన్లు విభజించాలి... ఏవిధంగా చేయాలనే నిర్ణయాలను ప్రస్తుతం ఏమీ తీసుకోలేదు. జీహెచ్ఎంసీ ప్రస్తుత నగరపాలక సంస్థ పదవీకాలం వచ్చే ఏడాది ఫిబ్రవరితో ముగుస్తుంది. అనంతరం 27 పట్టణ స్థానిక సంస్థల విలీనానికి చట్ట సవరణలు చేస్తాం. ఆ తర్వాతే ఎన్నికలు ఉంటాయి" అని శ్రీధర్‌బాబు వివరించారు.

**రెండు కోట్ల జనాభాతో సువిశాల నగరం**

ప్రస్తుతం జీహెచ్ఎంసీ జనాభా 1.45 కోట్లు. ఓఆర్ఆర్ వరకు నగరాన్ని విస్తరిస్తే దాదాపు 1.70 కోట్లకు చేరుతుంది. త్వరలో కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో అది రెండు కోట్లుగా తేలే అవకాశముందని నిపుణుల అంచనా. అప్పుడు దేశంలోని పలు చిన్న రాష్ట్రాలతో పోలిస్తే కొత్తగా ఏర్పడే బృహత్ హైదరాబాద్ నగర జనాభానే అధికంగా ఉంటుంది. మరోవైపు ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల వివరాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అధ్యయనం ప్రారంభించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతం విలీన ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం ఎదురుచూస్తుండగానే... శివారు ప్రాంతాల విలీన ప్రక్రియ పట్టాలెక్కడం గమనార్హం.

**జీహెచ్ఎంసీలో విలీనమయ్యే పట్టణ స్థానిక సంస్థలు ఇవే..**

మేడ్చల్ జిల్లా పరిధిలోనివి...

నగరపాలక సంస్థలు: బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట

మున్సిపాలిటీలు: దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, దుండిగల్, కొంపల్లి, మేడ్చల్

రంగారెడ్డి జిల్లా–

నగరపాలక సంస్థలు: బడంగ్‌పేట, మీర్‌పేట, బండ్లగూడ జాగీర్

పురపాలక సంఘాలు: పెద్ద అంబర్‌పేట, తుర్కయాంజాల్, ఆదిభట్ల, జల్‌పల్లి, శంషాబాద్ మణికొండ, తుక్కుగూడ, నార్సింగి

సంగారెడ్డి జిల్లా –

మున్సిపాలిటీలు: ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్

## 'వాసవి పెనుగొండ'గా పేరు మార్పు.. సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం

**ఆర్య వైశ్య సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రాకేశ్**

**ఈనాడు, అమరావతి:** పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ గ్రామానికి వాసవి పెనుగొండ పేరు పెట్టాలనే తరతరాల విజ్ఞప్తిని మన్నించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆర్యవైశ్య సమాజం రుణపడి ఉంటుందని ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేశ్ తెలిపారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా తమ అభ్యర్థనపై స్పందించలేదని, తమ కోరిక నెరవేర్చి పేరు మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

## దొంగచాటుగా వైద్య విద్యార్థినుల వీడియోల చిత్రీకరణ

**ప్రైవేటు వైద్యకళాశాల ఉద్యోగి నిర్వాకం**

**ఈనాడు, అమరావతి:** మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులు దుస్తులు మార్చుకుంటుండగా వీడియో తీసిన ఒక మేల్ నర్స్‌ను ప్రత్తిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. గుంటూరు శివారులోని ఓ వైద్య కళాశాలలో జరిగిన ఈ ఘటన గురించి డీఎస్పీ భానోదయ విలేకరులకు వెల్లడించారు. 'నెల రోజుల క్రితం వెంకటసాయి అనే వ్యక్తి ఈ ఆసుపత్రిలో మేల్ నర్స్‌గా చేరాడు. ఆపరేషన్ థియేటర్‌లో మహిళా వైద్యులు, పీజీ విద్యార్థినులు దుస్తులు మార్చుకుంటుండగా అతను ఫోన్‌తో వీడియోలు తీశాడని ఫిర్యాదు అందడంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి ఫోన్‌లోని వీడియోలను అప్పటికే మహిళా వైద్యులు డిలీట్ చేశారు. ఆ డేటాను తిరిగి పొందేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిందితుడి ఫోన్‌లో 200 వీడియోలు ఉన్నట్టు వైరల్ అవుతున్న విషయం తెలిసింది. కానీ దానికి ఆధారాల్లేవు' అని డీఎస్పీ చెప్పారు.

EENADU Vol: 52, Issue: 106 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

# ఈనాడు బిజినెస్

# పసిడి రుణాలకు 3,000 కొత్త శాఖలు!

## ఎన్‌బీఎఫ్‌సీల సన్నాహాలు



బంగారం ధర 10 గ్రాములు రూ.లక్షకు మించడంతో, ఆభరణాల తనఖాపై రుణాలు తీసుకోవడం బాగా పెరుగుతోంది. పసిడిని రుణాల విషయంలో బ్యాంకులు ఆచితూచి వ్యవహరిస్తుండటం, పసిడిని తాకట్టు పెడితే, సాధ్యమైనంత తక్కువ సమయంలోనే రుణం మంజూరవుతుండటం ఇందుకు కారణం. అన్ని వర్గాల వారు ఈ రుణాలు తీసుకుంటున్నారు. పసిడి రుణాలు లభిస్తున్న గిరాకీని పరిశీలించిన బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ(ఎన్‌బీఎఫ్‌సీ)లు.. భారీగా కొత్త శాఖలు నెలకొల్పి, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ రుణాల కోసమే ఏడాది వ్యవధిలో 3,000 శాఖలను ఎన్‌బీఎఫ్‌సీలు ప్రత్యేకంగా తెరవనున్నాయని సమాచారం.

**రూ.15 లక్షల కోట్లకు**

పసిడి ధర రికార్డు గరిష్ఠాలకు చేరి, ఇంకా పెరుగుతున్నందున.. తాకట్టు పెడితే లభించే రుణ మొత్తమూ అధికమవుతోంది. ఈ విభాగంలో సంస్థాగత మార్కెట్ 2025-26లో రూ.15 లక్షల కోట్లకు చేరుతుందని ఇక్రా అంచనా వేస్తోంది. 2026-27లో ఈస్థాయికి చేరొచ్చని అంచనా వేయగా, ఏడాది ముందుగానే ఈ లక్ష్యం సాకారమవుతుందని పేర్కొంది.

**ప్రస్తుత శాఖల్లోనూ..**

పసిడి ఆభరణాలు తనఖా పెట్టుకుని, రుణం ఇచ్చేందుకు ప్రత్యేక వసతులు అవసరం. పసిడి స్వచ్ఛత పరిశీలన, తగిన భద్రత చర్యల వంటివి తప్పనిసరి. ఇందుకోసమే చాలా వరకు సంస్థలు ప్రత్యేక పసిడి రుణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. ప్రస్తుత శాఖల్లోనూ ఈ సదుపాయం అందుబాటులో ఉండేలా చాలా వరకు సంస్థలు చూస్తున్నాయి.

**ఈ కంపెనీలు రంగంలోకి..**

వచ్చే మార్చి కల్లా 200 శాఖలు ఏర్పాటు చేయాలని ముత్తూట్ ఫిన్‌కార్ప్ అనుకుంటోంది. ముత్తూట్ ఫైనాన్స్, ముత్తూట్ ఫిన్‌కార్ప్, ఐఐఎఫ్‌ఎల్, బజాజ్ ఫైనాన్స్ వంటివి మొత్తం మీద 1800 శాఖలు తెరవనున్నాయి. 2027 మార్చి కల్లా బజాజ్ ఫైనాన్స్ 900 శాఖలు ప్రారంభించనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 500 శాఖల ప్రణాళికలో ఐఐఎఫ్‌ఎల్ ఉంది. గత ఫిబ్రవరిలో పసిడి రుణాల్లోకి దిగిన ఎల్ అండ్ టీ ఫైనాన్స్ కూడా 200 కేంద్రాల ఏర్పాటులో ఉంది.


- **ఒక్కో శాఖకు రూ.20 లక్షల ఖర్చు:** ఒక పసిడి రుణ శాఖను ఏర్పాటు చేయడానికి స్ట్రాంగ్ రూముల నుంచి కేంద్రాల దాకా మౌలిక వసతులను చూసుకుంటే రూ.8-20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఇటువంటి శాఖలకు 1.5-2 ఏళ్లలో బ్రేక్ ఈవెన్ వస్తుంది.
- **ఎన్‌బీఎఫ్‌సీల పసిడి రుణ ఆస్తులు 2025-26లో 30-35% వృద్ధి సాధించొచ్చు.**
- ప్రైవేటుతో పోలిస్తే, ప్రభుత్వ రంగ బ్యాంకులే పసిడి రుణ విభాగంలో ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయి. వీటి పోర్ట్‌ఫోలియో 2023-24, 2024-25ల్లో 27% పెరిగింది. ఇదే సమయంలో ప్రైవేటు బ్యాంకులు 22% వృద్ధినే నమోదుచేశాయి.

## బజాజ్ రికీ ఇ-రిక్షా



మోనోకోక్ బాడీ, లిథియం-అయాన్ బ్యాటరీ కలిగిన రికీ ఇ-రిక్షాను రూ.1.9 లక్షలకు విక్రయిస్తామని బజాజ్ ఆటో లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేష్ శర్మ తెలిపారు. లెడ్ యాసిడ్ బ్యాటరీతో అసంఘటిత సంస్థలు విక్రయిస్తున్న ఇ-రిక్షాలతో పోలిస్తే, ఇవి సురక్షితమైనవని పేర్కొన్నారు. ఈ బ్యాటరీని ఒక సారి ఛార్జ్ చేస్తే 140 కిలో మీటర్ల వరకు ప్రయాణించొచ్చని వివరించారు. 4.5 గంటల్లో పూర్తిగా ఛార్జింగ్ అవుతుందని పేర్కొన్నారు. ఈ బ్యాటరీకి 3 ఏళ్ల వారంటీ ఇస్తున్నట్లు చెప్పారు. వచ్చే జనవరి నుంచి మార్చి లోగా 200 నగరాల్లో రికీ ఇ-రిక్షాను అందుబాటులోకి తెస్తామని వివరించారు.

## టాటా సన్స్ బోర్డులోకి భాస్కర్ భట్!



టాటా గ్రూప్‌పై పూర్తి ఆధిపత్యం సాధించేందుకు టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా పావులు కదుపుతున్నారు. ఈ నెల మొదట్లో సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్‌లో ఆయన కుమారుడైన నెవిల్ టాటాతో పాటు సన్నిహితుడైన భాస్కర్ భట్ కూడా ట్రస్టీగా చేరారు. టాటా గ్రూప్ ప్రధాన కంపెనీ అయిన టాటా సన్స్ బోర్డులోకి భట్‌ను చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఒక ఆంగ్ల వార్తా సంస్థ తెలిపింది. డిసెంబరులో జరిగే సమావేశంలో భట్ పేరును పరిశీలించొచ్చని సమాచారం. టైటన్‌కు దీర్ఘకాలం పాటు మేనేజింగ్ డైరెక్టరుగా వ్యవహరించిన భట్(71) నోయల్ టాటాకు సన్నిహితుడు. టాటా గ్రూప్ కొన్ని కంపెనీల బోర్డుల్లోనూ భట్ సేవలందించారు. టాటా సన్స్‌లోకి భట్‌ను తీసుకురావడం ద్వారా గ్రూప్‌పై నోయల్ మరింత పట్టు పెంచుకోనున్నారని తెలుస్తోంది.

## సీఓపీడీకి గ్లెన్‌మార్క్ సరికొత్త చికిత్స

గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ సీఓపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) వ్యాధికి ఫిక్స్‌డ్-డోస్ ట్రిపుల్ థెరపీ ని ఆవిష్కరించింది. ఇందులో గ్లైకోపైరోనియమ్, ఫార్మోటెరాల్, బుడెసొనైడ్ మందులతో నెబ్జ్‌మార్ట్ జీఎఫ్‌బీ స్మార్ట్యూల్స్, అరిజ్ ఎఫ్‌బి స్మార్ట్యూల్స్‌ను తీసుకువచ్చింది. ఈ చికిత్సతో శ్వాస సులువు కావడంతో పాటు గాలి ప్రసరణ వ్యవస్థల్లో వాపు తగ్గుతుందని, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుందని గ్లెన్‌మార్క్ ఫార్మా వివరించింది. పలు రకాల మందులు, ఇన్‌హేలర్లు వాడే బదులు, ఈ ఒక్క చికిత్స ప్రభావవంత ఫలితాలు ఇస్తుందని పేర్కొంది.

## ఏఈఎల్ రైట్స్ ఇష్యూ ప్రారంభం

అదానీ గ్రూపు ప్రధాన సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) రైట్స్ ఇష్యూకు దరఖాస్తు ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. దేశంలోనే అతిపెద్ద రైట్స్ ఇష్యూల్లో ఒకటిగా చెబుతున్న ఈ ఇష్యూ పరిమాణం రూ.24,930.30 కోట్లు. 13.85 కోట్ల కొత్త షేర్లను ఒక్కోటి రూ.1,800 ధరకు కంపెనీ జారీ చేయనుంది. ప్రస్తుత షేరు ధర రూ.2333.70తో పోలిస్తే ఇది 24% తక్కువ. ప్రమోటర్లు సహా అర్హులైన వాటాదార్లందరూ ఈ రైట్స్ ఇష్యూలో పాల్గొనొచ్చు. ఇష్యూ ధర ప్రకారం చూస్తే, ప్రతిపాదిత రైట్స్ ఇష్యూ ద్వారా కంపెనీ సుమారు రూ.2 లక్షల కోట్ల మార్కెట్ విలువను సాధించే అవకాశం ఉంది. ఈ రైట్స్ ఇష్యూ డిసెంబరు 10న ముగియనుంది. రైట్స్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను విమానాశ్రయాలు, డేటా కేంద్రాలు, గ్రీన్ హైడ్రోజన్, రోడ్లు, పీవీసీ సహా పలు కొత్త తరం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెచ్చించనుంది.

## ముడిచమురు బ్యారెల్ 30 డాలర్లకు క్షీణిస్తుంది

### 2027 మార్చికి: జేపీ మోర్గాన్ అంచనా

ప్రస్తుతం బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 62 డాలర్ల వద్ద ఉంది. 2027 మార్చి కల్లా ఇది సగానికి దిగి వచ్చి.. 30 డాలర్ల స్థాయికి వచ్చే అవకాశం ఉందని అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ జేపీ మోర్గాన్ పేర్కొంది. ఒపెక్ యేతర దేశాలు, చమురు గిరాకీకి మించి సరఫరాలు పెంచుతుండటం ఇందుకు కారణంగా వివరించింది. భూప్రదేశాల్లో చమురు నిల్వల కోసం తవ్వకాలు పెరగడం, షేల్ ఉత్పత్తి విస్తరిస్తుండటం, ఇప్పటికే వెలికితీసిన చమురు నిల్వలు పెరుగుతుండటం వంటివి చమురు ధరలు తగ్గేందుకు కారణమవుతాయని జేపీ మోర్గాన్ విశ్లేషించింది. ఉత్పత్తిలో కనుక కోతలు వేయకుంటే, 2027 కల్లా చమురు నిల్వలు మరింతగా అధికమవుతాయని పేర్కొంది.

## అనంత్ టెక్నాలజీస్ 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్'

తిరువనంతపురం: రక్షణ, అంతరిక్ష రంగాల నావిగేషన్ సిస్టమ్స్‌లోకి ప్రైవేటు రంగ సంస్థల ప్రవేశం ఆహ్వానించదగిన పరిణామమని భారత అంతరిక్ష మండలి (ఇస్రో) ఛైర్మన్ నారాయణన్ అన్నారు. సంక్లిష్టమైన నావిగేషన్ సిస్టమ్స్‌ను ఇస్రో ఒక్కటే ఆవిష్కరించలేదని తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అనంత్ టెక్నాలజీస్‌కు చెందిన తిరువనంతపురం యూనిట్లో, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ నావిగేషన్ ను ఇస్రో ఛైర్మన్ ప్రారంభించి ప్రసంగించారు. 'మనదేశం ప్రస్తుతం అంతరిక్ష ప్రయోగాలకు, రక్షణ అవసరాలకు కావలసిన నావిగేషన్ సిస్టమ్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. ఈ సిస్టమ్స్‌ను సొంతంగా సమకూర్చుకోవటం వల్ల ఖర్చులు తగ్గడంతో పాటు ఇతరదేశాలపై ఆధారపడాల్సిన పని ఉండద'ని నారాయణన్ అన్నారు. ఈ కేంద్రం నావిగేషన్, పీఎన్‌టీ (పొజిషనింగ్, నావిగేషన్, టైమింగ్) టెక్నాలజీస్‌తో మనదేశాన్ని అగ్రభాగంలో నిలపాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

✦ 2027లో నిర్వహించదలచిన మానవ సహిత అంతరిక్షయాత్ర 'గగన్‌యాన్' ప్రాజెక్టుకు సంబంధించి 8,000 పరీక్షలు పూర్తిచేసినట్లు నారాయణన్ వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు రంగంలో మొదటి పీఎస్‌ఎల్‌వీ-ఎన్1 ప్రయోగాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**కోడి గుడ్లు**

26న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 650 |
| వరంగల్ | 652 |
| విజయవాడ | 660 |
| తూ/ప గోదావరి | 645 |
| విశాఖపట్నం | 635 |
| చిత్తూరు | 673 |

## సరికొత్తగా టాటా సియారా

- ప్రారంభ ధర రూ.11.49 లక్షలు
- డిసెంబరు 16 నుంచి బుకింగ్.. జనవరి 15 నుంచి డెలివరీ



మధ్య స్థాయి స్పోర్ట్స్ వినియోగ వాహన (ఎస్‌యూవీ) విభాగంలోకి టాటా మోటార్స్ అడుగుపెట్టింది. టాటా మోటార్స్ వాహనాల్లో ప్రాచుర్యం పొందిన సియారాను సరికొత్త ప్లాట్‌ఫామ్‌పై, విభిన్న సదుపాయాలతో తీసుకొచ్చింది. దీని ప్రారంభ ధర రూ.11.49 లక్షలు. 3 ఇంజిన్ ఆప్షన్లలో (రెండు పెట్రోల్, ఒకటి డీజిల్ వెర్షన్) ఈ ఎస్‌యూవీ లభిస్తుంది. డిసెంబరు 16 నుంచి ఈ వాహనానికి బుకింగ్‌లు మొదలవుతాయి. 2026 జనవరి 15 నుంచి డెలివరీలు ఉంటాయి. 3 డోర్ల ఎస్‌యూవీ అయిన టాటా సియారాను 1991 నుంచి 2003 వరకు టాటా విక్రయించింది. ఇప్పుడు 5 డోర్లు, 3 స్క్రీన్ల ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్, 5జీ కనెక్టివిటీ, లెవల్ 2 ప్లస్ అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్‌తో నూతన వాహనాన్ని విడుదల చేసింది. విద్యుత్ వెర్షన్ ఎస్‌యూవీని వచ్చే ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర వెల్లడించారు.

**ఎస్‌యూవీల వాటా 70 శాతానికి:** 'సియారా విడుదలతో మా మొత్తం కార్ల విక్రయాల్లో, ఎస్‌యూవీల వాటా 70 శాతానికి పైగా చేరుతుంద'ని శైలేష్ తెలిపారు. హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, మారుతీ సుజుకీ గ్రాండ్ విటారా వంటి మధ్య స్థాయి ఎస్‌యూవీ మోడళ్లతో టాటా సియారా పోటీ పడబోతోంది.

## జీఎంఆర్ ఏరోస్పేస్‌లో శాఫ్రాన్ ఎంఆర్‌ఓ

### నేడు ప్రారంభించనున్న ప్రధాని



ఈనాడు, హైదరాబాద్: విమానాల ఇంజిన్లకు నిర్వహణ, మరమ్మతు, సమగ్ర సేవలు (ఎంఆర్‌ఓ) అందించేందుకు ఫ్రాన్స్‌కు చెందిన శాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీస్ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటయింది. జీఎంఆర్ ఏరోస్పేస్, ఇండస్ట్రియల్ పార్క్-ఎస్ఈజెడ్‌లో నిర్మించిన ఈ కేంద్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృశ్యమాధ్యమ పద్ధతిలో బుధవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కేంద్ర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పాల్గొంటారు. ఎయిర్‌బస్ ఏ320 నియో, బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు ఉండే లీప్ (లీడింగ్ ఎడ్జ్ ఏవియేషన్ ప్రొపల్షన్) ఇంజిన్లకు ఎంఆర్‌ఓ సేవలను అందించే ప్రపంచంలోని అతి పెద్ద సదుపాయాలలో ఒకటిగా ఇది నిలవనుంది. రూ.1,300 కోట్ల పెట్టుబడితో, 45,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ సదుపాయాన్ని నిర్మించారు. ఈ కేంద్రం 2035 నాటికి పూర్తి సామర్థ్యంతో 300 లీప్ ఇంజిన్లకు సేవలు అందించగలదు. అధునాతన నైపుణ్యాలున్న టెక్నీషియన్లు, ఇంజినీర్లు 1,000 మందికి ఇక్కడ ఉద్యోగాలు లభిస్తాయి.

**స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ఆవిష్కరణ రేపు:** అంతరిక్ష రంగంలోని స్కైరూట్ ఏరోస్పేస్ కేంద్రాన్ని ప్రధాని మోదీ, దృశ్యమాధ్యమ విధానంలో గురువారం ప్రారంభించనున్నారు. 2లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని స్కైరూట్ ఏర్పాటు చేసింది. సంస్థ రూపొందించిన తొలి ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1నూ ప్రధాని ఆవిష్కరించనున్నారు. రాకెట్‌ల రూపకల్పన, అభివృద్ధి, పరీక్షించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలూ ఈ కేంద్రంలో ఉన్నాయి.

## రక్షణ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు ఆర్డర్ల జోరు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న రక్షణ, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీలకు వరుసగా ఆర్డర్లు లభిస్తున్నాయి. కేంద్ర రక్షణ శాఖ నుంచి రూ.108 కోట్ల సిమ్యులేటర్ల సరఫరా ఆర్డర్‌ను జెన్ టెక్నాలజీస్ సంపాదించింది. అపోలో మైక్రో సిస్టమ్స్‌కు రూ.27.37 కోట్ల ఆర్డర్లు దక్కాయి. ఇందులో రూ.5.77 కోట్ల ఆర్డర్ డీఆర్‌డీఓ నుంచి, రూ.21.60 కోట్ల ఆర్డర్ ప్రైవేటు రంగ సంస్థ నుంచి వచ్చింది. అవాంటెల్‌కు భారత్ ఎలక్ట్రానిక్స్ నుంచి కమ్యూనికేషన్ సిస్టమ్స్ సరఫరా కోసం రూ.17.55 కోట్ల ఆర్డర్, రూ.8.03 కోట్ల పవర్ యాంప్లిఫైయర్స్ సరఫరా ఆర్డర్ లభించాయి. అంతర్జాతీయ సంస్థల నుంచి ఎంటార్ టెక్నాలజీస్‌కు రూ.271 కోట్ల ఆర్డర్, ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌కు రూ.73.11 కోట్ల రక్షణ ఉత్పత్తుల సరఫరా ఆర్డర్ లభించింది.

సెక్యూరిటీస్ పత్రాల నకలు జారీకి


## నిబంధనల సరళీకరణలో సెబీ



సెక్యూరిటీస్ పత్రాల (సర్టిఫికెట్) నకళ్ల (డుప్లికేట్) జారీ ప్రక్రియను సరళీకృతం చేయాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించింది. మదుపర్లపై నిబంధనల పాటింపు భారాన్ని, దరఖాస్తుల సమర్పణ అవసరాన్ని తగ్గించడమే దీని ఉద్దేశం. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. రూ.5 లక్షలకు మించి విలువ ఉన్న సెక్యూరిటీస్ పత్రాలు పోగొట్టుకుంటే, డుప్లికేట్ సర్టిఫికెట్ పొందేందుకు మదుపర్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, వార్తా పత్రికల్లో ప్రకటన ఇవ్వడం, అఫిడవిట్, ఇండెమ్నిటీ బాండును సమర్పించడం లాంటివి చేయాలి. రూ.5 లక్షల్లోపు అయితే రెండు వేర్వేరుగా స్టాంప్ డాక్యుమెంట్లను సమర్పిస్తే సరిపోతుంది. ఈ ప్రక్రియను సులభతరం చేసే ఉద్దేశంతో సెక్యూరిటీస్ సర్టిఫికెట్ విలువ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని ప్రతిపాదించింది. దీని ప్రకారం.. రూ.10 లక్షలకు మించి సెక్యూరిటీస్ సర్టిఫికెట్ పోగొట్టుకుంటేనే, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయడం, వార్తా పత్రికల్లో ప్రకటన ఇవ్వడం లాంటివి చేయాలి. రూ.10 లక్షల్లోపు అయితే ఇవన్నీ చేయాల్సిన అవసరం లేకుండా అఫిడవిట్, ఇండెమ్నిటీ బాండు సమర్పించి సెక్యూరిటీస్ సర్టిఫికెట్ నకలు పొందొచ్చు.

## పైలట్లు, సిబ్బంది విశ్రాంతిపై డీజీసీఏ తాజా మార్గదర్శకాలు

విమానయాన సిబ్బందికి సరైన విశ్రాంతి లభించేలా చూడాలని ఆదేశిస్తూ, విమానయాన కంపెనీలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ప్రకారం..



✦ అలసట వల్ల పైలట్లు, కేబిన్ సిబ్బందిపై ఎటువంటి ప్రభావం పడుతుందన్న దానిపై అన్ని విమానయాన కంపెనీలు ఏటా కనీసం గంట పాటు శిక్షణ ఇవ్వాలి.

✦ ఏటా ఇచ్చే శిక్షణలో ఫ్లైయింగ్ అవర్స్, డ్యూటీ అవర్స్, విశ్రాంతికి సంబంధించిన నిబంధనలను వివరించాలి. పనిపై నిద్ర ప్రభావం ఎలా ఉంటుంది? శరీర గడియారాన్ని ఏది పాడు చేస్తుంది? అలసటకు కారణాలు, ఆరోగ్య సమస్యలు తదితరాలను తెలపాలి.

✦ స్లీప్ డిజార్డర్లపై సమాచారం, లాంగ్ ఫ్లైట్స్, ఎక్కువ షార్ట్ ఫ్లైట్స్ ప్రభావం, వేర్వేరు టైం జోన్లలో విమాన ప్రయాణం వల్ల ప్రభావాలనూ చెప్పాల్సి ఉంటుంది.

నివేదికలను పరిశీలించి, పరిష్కారాలను సూచించడానికి ఒక స్వతంత్ర 'ఫాటిగ్ రివ్యూ కమిటీ'ని విమానయాన సంస్థలు ఏర్పాటు చేసుకోవాలనీ డీజీసీఏ సూచించింది.

# పన్ను కోతలతో ఆదాయ వృద్ధి తగ్గింది

### మూడీస్ రేటింగ్స్



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్ను కోతలు భారత ఆదాయ వృద్ధిని దెబ్బ తీసినందున, ఆర్థిక వ్యవస్థకు విధాన మద్దతు అందించే అవకాశాలు తగ్గాయని అమెరికా కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ రేటింగ్స్ మంగళవారం పేర్కొంది. 'ఆదాయ వృద్ధి చాలా బలహీనంగా ఉంది. ఆర్థిక స్థిరీకరణ పరంగా కొన్ని అడ్డంకులు ఉండొచ్చు. పన్ను కోతలు ఆదాయ వృద్ధిపై ప్రభావం చూపుతున్నాయ'ని మూడీస్ రేటింగ్స్ ఉపాధ్యక్షుడు, సావరిన్ రిస్క్ సీనియర్ క్రెడిట్ అధికారి మార్టిన్ పెచ్ వెల్లడించారు. సీజీఏ గణాంకాల ప్రకారం, సెప్టెంబరు చివరికి నికర పన్ను ఆదాయం రూ.12.29 లక్షల కోట్లకు పైగా ఉంది. 2024-25 ఇదే కాలంలో పన్ను ఆదాయం రూ.12.65 లక్షల కోట్ల కంటే ఇది తక్కువ. 2025-26 బడ్జెట్ అంచనాల పన్ను వసూళ్లలో 43.3 శాతమే, సెప్టెంబరు వరకు వసూలయ్యాయి. 2024-25 ఇదే కాలంలో ఇది 49 శాతంగా ఉంది.

✦ ప్రభుత్వం ఆదాయపు పన్ను పరిమితిని రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు పెంచడం వల్ల, మధ్య తరగతికి రూ.లక్ష కోట్ల వరకు పన్ను ఉపశమనం కలిగింది. సెప్టెంబరు 22 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ 2.0తో సుమారు 375 వస్తువులపై జీఎస్‌టీ తగ్గింది. వినియోగాన్ని పెంచేందుకు ఈ చర్య తీసుకున్నారు.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 4.4 శాతానికి తగ్గించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ద్రవ్యోల్బణం తగ్గడంతో, గృహస్థుల కొనుగోలు శక్తి పెరిగి వినియోగం మరింత అధికమవుతుందని పెచ్ అన్నారు. వచ్చే ఏడాది స్థిరమైన ఆర్థిక వృద్ధి నమోదు కావొచ్చని తెలిపారు.

✦ దేశీయ వినియోగం, మౌలిక సదుపాయాలపై వ్యయాలు.. భారత ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తాయని, అమెరికా విధించిన అధిక టారిఫ్‌ల ప్రభావం నుంచి ఇవి కొంత వరకు కాపాడతాయని పెచ్ అంచనా వేశారు. అధిక టారిఫ్‌ల వల్ల, భారత్‌లోకి మరిన్ని పెట్టుబడులు రావడం తగ్గొచ్చని అభిప్రాయపడ్డారు.

## పన్ను చెల్లింపుదార్లకు అసౌకర్యం కలిగించొద్దు

### ట్రైనీ ఐఆర్‌ఎస్ అధికారులతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



దిల్లీ: పన్ను చెల్లింపుదార్లకు అసౌకర్యం కలగకుండా, పన్ను వసూళ్లు సజావుగా జరిగేలా చూడాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం సూచించారు. రాష్ట్రపతి భవన్‌లో తనను కలిసిన ఇండియన్ రెవెన్యూ సర్వీస్ - ఐఆర్‌ఎస్ (కస్టమ్స్, పరోక్ష పన్నులు) ఆఫీసర్ ట్రైనీలను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడారు. పారదర్శకంగా, జవాబుదారీగా, సాంకేతికతో నడిచే వ్యవస్థలను సృష్టించాలని ఆమె కోరారు. దేశ నిర్మాణానికి పన్ను వసూళ్లు చాలా కీలకమని గుర్తు చేశారు. మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమానికి నిధులు సమకూర్చేది పన్ను ఆదాయమేనని తెలిపారు. దేశ నిర్మాణ ప్రక్రియలో ఐఆర్‌ఎస్‌లు చురుకైన భాగస్వాములని, పన్ను వసూళ్లు సజావుగా చేయడంతో పాటు, పన్ను చెల్లింపుదార్లకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. 'ప్రభుత్వం తరఫున తేనెటీగలలాగా పన్నులు వసూలు చేయాలి. తేనెటీగలు పువ్వు నుంచి సరైన మొత్తంలో మకరందాన్ని సేకరిస్తాయి. దీంతో రెండూ జీవిస్తాయి' అని అర్థశాస్త్రంలో చాణక్యుడు పన్ను వసూలు గురించి చెప్పిన విషయాలను గుర్తుంచుకోండని శిక్షణ ఐఆర్‌ఎస్‌లకు రాష్ట్రపతి ఉద్బోధించారు.

## 3 బ్యాంకులకు కొత్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియాలకు ప్రభుత్వం కొత్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల (ఈడీ)ను నియమించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ అమరేష్ ప్రసాద్‌ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా చేసిన ఇ.రతన్ కుమార్‌ని బ్యాంకు బోర్డులోకి, ప్రమోద్ కుమార్ ద్వివేదిని బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఈడీగా ఈనెల 24న నియమించారు. వీరు ఈ పదవుల్లో 3 ఏళ్లు (2028 అక్టోబరు 31 వరకు) లేదా తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కొనసాగుతారు.

# వాహన, ఐటీ షేర్లలో అమ్మకాలు



ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.785.32 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.3912.47 కోట్లు

సెన్సెక్స్ ▼ 314 **84587**
నిఫ్టీ ▼ 75 **25885**

వరుసగా మూడో ట్రేడింగ్ రోజూ స్టాక్ మార్కెట్ నష్టాలను చవిచూసింది. వాహన, ఐటీ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 6 పైసలు తగ్గి రూ.89.22 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1.48% పెరిగి 62.43 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో సింగపూర్ మినహా మిగతా దేశాల సూచీలు లాభాల్లో ముగిశాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.27,000 కోట్లు తగ్గి రూ.469.41 లక్షల కోట్ల (5.26 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

**ఒడుదొడుకుల్లో కదలాడి..:** బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 84,900.71) ఉదయం స్వల్ప లాభాల్లో 85,008.93 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత తీవ్ర ఒడుదొడుకుల మధ్య కదలాడింది. ఒక దశలో 85,110.24 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. అనంతరం అమ్మకాల ఒత్తిడి పెరగడంతో 84,536.73 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. చివరకు 313.70 పాయింట్ల నష్టంతో 84,587.01 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 74.70 పాయింట్లు కోల్పోయి 25,884.80 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,857.50 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 26,032.60 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది.

**ఏడే రాణించాయి..:** సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో ఏడు మినహా మిగతావి నష్టాల్లోనే ముగిశాయి. టీఎంపీవీ 1.62%, ట్రెంట్ 1.52%, ఇన్ఫోసిస్ 1.25%, పవర్‌గ్రిడ్ 0.99%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.92%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.82%, బజాజ్ ఫైనాన్స్ 0.8% డీలాపడ్డాయి. భెల్ 1.57%, ఎస్‌బీఐ 1.33%, టాటా స్టీల్ 0.64%, ఎటర్నల్ 0.53%, భారతీ ఎయిర్‌టెల్ 0.46%, రిలయన్స్ 0.22% పెరిగాయి.

✦ సుదీప్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫర్ ముగిసేసరికి 93.71 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 15.65 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి.

✦ తిరువనంతపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో రూ.136 కోట్లతో విలాసవంత హోటల్ ఏర్పాటు చేయాలన్న **అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్** ప్రతిపాదనకు పర్యావరణ అనుమతులు లభించాయి.

✦ **భారతీ ఎయిర్‌టెల్‌లో** 0.56% వాటాకు సమానమైన 3.43 కోట్ల షేర్లను సుమారు రూ.7,190 కోట్లకు ఆ సంస్థ ప్రమోటరు అయిన సునీల్ మిత్తల్ ఫ్యామిలీ ఆఫీస్ ఇండియన్ కాంటినెంట్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ (ఐసీఐఎల్) బుధవారం విక్రయించనుంది.

## ఇన్ఫీ బైబ్యాక్‌కు 5 రెట్ల అధిక స్పందన

### నేటితో ముగియనున్న దరఖాస్తులు




ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్, 10 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేసేందుకు ఆఫర్ ఇవ్వగా.. ఇప్పటికే 50 కోట్లకు పైగా షేర్లను అమ్ముతామంటూ వాటాదార్ల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అంటే ఆఫర్ పరిమాణం కంటే 5 రెట్లు అధికంగా స్పందన వచ్చింది. ఒక్కో షేరు రూ.1,800 చొప్పున, 10 కోట్ల షేర్లను రూ.18,000 కోట్లతో తిరిగి కొనుగోలు చేస్తామని ఇన్ఫోసిస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇన్ఫోసిస్ షేరు రూ.1,530 వద్ద ఉంది. బైబ్యాక్‌కు దరఖాస్తు చేసే అవకాశం బుధవారం ముగియనుంది. బైబ్యాక్ షరతుల ప్రకారం..

✦ రికార్డు తేదీ నాటికి చిన్న వాటాదార్లు తమ వద్ద ఉన్న ప్రతి 11 షేర్లకుగాను 2 షేర్లే విక్రయించే వీలుంటుంది.

✦ జనరల్ కేటగిరిలోని ఇతర అర్హులైన వాటాదార్లు ప్రతి 706 షేర్లకుగాను 17 షేర్లను విక్రయించొచ్చు. నారాయణ మూర్తి, నందన్ నీలేకని సహా ఇన్ఫోసిస్ ప్రమోటర్లు బైబ్యాక్‌లో తమ షేర్లు విక్రయించబోమని స్పష్టం చేశారు.

## ఎగుమతి ప్రోత్సాహక మిషన్ కింద ఆ రాష్ట్రాలకు మద్దతు: గోయల్



దిల్లీ: ఇటీవలే ఆమోదం పొందిన రూ.25,060 కోట్ల ఎగుమతి ప్రోత్సాహక మిషన్ కింద భూపరివేష్టిత (చుట్టూ భూసరిహద్దులున్న) రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ తెలిపారు. ఎగుమతి రంగంలో ఆయా రాష్ట్రాలు పోటీతత్వాన్ని పెంచుకునేలా చేయాలన్నదే ఉద్దేశం. బలమైన కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యం వల్ల ఎగుమతుల్లో వృద్ధి సాధ్యమవుతుందని మంగళవారమిక్కడ జరిగిన నాలుగో బోర్డ్ ఆఫ్ ట్రేడ్ (బీఓటీ) సమావేశంలో మంత్రి పేర్కొన్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణ, ఝార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాలకు చుట్టూ భూప్రాంతమే ఉంది. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులను తట్టుకునేందుకు నవంబరు 12న రూ.25,060 కోట్లతో ఈ మిషన్‌కు కేంద్రం ఆమోదముద్ర వేసింది. ఈ మిషన్‌ను నిర్యాత్ ప్రోత్సాహన్ (రూ.10,401 కోట్లు), నిర్యాత్ దిశ (రూ.14,659 కోట్లు) కింద రెండు ఉప పథకాల రూపంలో అమలు చేయనున్నారు.

## ఎన్‌సీసీకి రూ.2062.71 కోట్ల కాంట్రాక్టు

ఈనాడు, హైదరాబాద్: మౌలిక సదుపాయాల రంగానికి చెందిన ఎన్‌సీసీ లిమిటెడ్‌కు గౌహతి వైద్య కళాశాల, ఆస్పత్రి విస్తరణ- ఆధునికీకరణ కాంట్రాక్టు లభించింది. ఈ కాంట్రాక్టు విలువ రూ.2062.71 కోట్లు. ఈ పనిని 42 నెలల్లో పూర్తిచేయాలి. అస్సాం రాష్ట్ర ప్రజా పనుల శాఖ నుంచి ఈ కాంట్రాక్టు లభించినట్లు ఎన్‌సీసీ వెల్లడించింది.

## స్పందన స్ఫూర్తి ఎండీ, సీఈఓ వెంకటేష్ కృష్ణన్

ఈనాడు, హైదరాబాద్: సూక్ష్మరుణ సంస్థ స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ ఎండీ, సీఈఓగా వెంకటేష్ కృష్ణన్ నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో ఆయన ఉంటారు. చార్టర్డ్ అకౌంటెంట్ అయిన వెంకటేష్‌కు ఆర్థిక సేవల రంగంలో మూడున్నర దశాబ్దాల అనుభవం ఉంది. గతంలో ఆయన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో మైక్రోఫైనాన్స్ డివిజన్‌కు హెడ్‌గా పనిచేశారు. అంతకు ముందు హెచ్‌ఎస్‌బీసీ, ఎల్‌అండ్‌టీ ఇన్సూరెన్స్.. తదితర సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.

ఈనాడు సినిమా

# ఎక్కడున్నా తుపాన్‌లా వచ్చేస్తా!


రణ్‌వీర్ సింగ్

'ధురంధర్'గా తెరపై తన యాక్షన్‌తో అదరగొట్టడానికి సిద్ధమవుతున్నారు బాలీవుడ్ హీరో రణ్‌వీర్‌సింగ్. ఆయన ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ తెరకెక్కించిన చిత్రమిది. సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్, అక్షయ్ ఖన్నా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌లో యాక్షన్ అవతారంలో కనిపించి సినీప్రియుల దృష్టిని ఆకర్షించారు. తాజాగా ఈ సినిమా నుంచి 'ఇష్క్ జలకర్ కర్వాన్..' అనే మరో గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. "నా కళ్లే సగం మాటలు మాట్లాడతాయి.. ఎక్కడున్నా తుపాన్‌లా వచ్చేస్తా నేను.." అంటూ రణ్‌వీర్ పాత్రను వివరిస్తూ ఆసక్తికరంగా సాగుతోందీ పాట. జియో స్టూడియోస్ నిర్మించిన ఈ సినిమా వచ్చే నెల 5న థియేటర్లలోకి రానుంది.


నితిన్, వంశీ నందిపాటి, కోనవెంకట్, రవి, బాబీ, చైతు జొన్నలగడ్డ, తేజస్వినీ, అఖిల్ రాజ్, శ్రీ విష్ణు, వేణు ఊడుగుల, సురేశ్ బొబ్బిలి, సాయిలు, సాయికృష్ణ, రాహుల్ మోపిదేవి

# ఒక్క షో కూడా ఆడదన్నారు... ప్రేక్షకులు గుండెల్లో పెట్టుకున్నారు!

"విడుదలకు ముందు ఓ నిర్మాత, పంపిణీదారుడికి ఈ సినిమాని చూపించాం. ఆయనతోపాటు మరో నలుగురు వచ్చారు. విరామం తర్వాత మాకు చెప్పకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత సినిమాపై వ్యతిరేక ప్రచారం చేయడం మొదలుపెట్టారు. ఒక్క షో కూడా ఆడదన్నారు. కానీ ఈ రోజు మా సినిమాని ప్రేక్షకులు గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్నార"న్నారు దర్శకనిర్మాత వేణు ఊడుగుల. ఆయన ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్, రాహుల్ మోపిదేవితో కలిసి నిర్మించిన చిత్రమే 'రాజు వెడ్స్ రాంబాయి'. అఖిల్ రాజ్, తేజస్వినీ జంటగా నటించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. బన్నీ వాస్, వంశీ నందిపాటి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో విజయోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ కథానాయకుడు శ్రీవిష్ణుతో పాటు, దర్శకుడు బాబీ, రచయితలు కోన వెంకట్, బి.వి.ఎస్.రవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కథానాయకుడు శ్రీవిష్ణు మాట్లాడుతూ "నేను, వేణు ఊడుగుల కలిసి 'నీది నాదీ ఒకే కథ' చేస్తున్నప్పుడు చాలా మంది నిర్మాతల దగ్గరకు వెళ్లాం. ఆ తర్వాత మేమే చేసుకున్నాం. ఆ కోపంతోనే నిర్మాత అయ్యారేమో. వేణు ఊడుగులలో మట్టి కథలు చాలానే ఉన్నాయి. ఆ కథలన్నీ కూడా తెలుగు సినిమాకి చాలా అవసరం. ప్రేక్షకులకు ఏం కావాలో అలాంటి కంటెంట్‌ని ఎంచుకొంటోంది ఈటీవీ విన్ సంస్థ" అన్నారు. వేదికపై భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఒక నిర్మాతగా ఈ వేదికపై నిలబడటానికి కారణం ఈటీవీ విన్. ఈ సినిమా శ్రీవిష్ణు చేతులమీదుగానే ప్రారంభమైంది. విజయోత్సవంలోనూ ఆయన భాగం కావడం ఆనందంగా ఉంది. చాలా అవమానాల్ని, అవహేళనల్ని దాటుకుని ఇక్కడివరకూ వచ్చాం. ఈ సినిమా చేయడానికి రెండేళ్లు పట్టింది. ఒక పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. ఒక సినిమాని ముందుగానే చూపిస్తున్నప్పుడు మధ్యలోనే వెళ్లిపోతే ఒక ఫిల్మ్‌మేకర్‌కి అంత కంటే అవమానం, బాధాకరమైన విషయం మరొకటి ఉండదు. ఈ రోజు మేం గెలిచామని ఇదంతా చెప్పడం లేదు. సినిమాకి ఇవ్వాల్సిన సాంస్కృతిక గౌరవం ఇది కాదని చెబుతున్నా. అందుకే ముందస్తు ప్రదర్శనలకు వెళ్లినప్పుడు ఎవ్వరూ మధ్యలోనే బయటకు రావొద్దని చెబుతున్నా" అన్నారు. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ "పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ సినిమా అందరికీ అందుబాటులో ఉండాలనే టిక్కెట్ ధరల్ని తగ్గించాం. మళ్లీ శివాజీ నటించిన 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' చిత్రంతో కలుద్దాం" అన్నారు. "పట్నం, పల్లె అనే తేడా లేకుండా ప్రతి చోటా 'రాజు వెడ్స్ రాంబాయి' బ్లాక్ బస్టర్ అంటున్నారు. 'నువ్వే కావాలి', 'చిత్రం' తరహాలో 25 ఏళ్ల తర్వాత ఈటీవీ సంస్థ నుంచి రెండు నెలల్లో 'లిటిల్‌హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' విజయాలు వచ్చాయి" అన్నారు ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్. నా కన్నబిడ్డతో సమానం ఈ సినిమా అన్నారు దర్శకుడు సాయిలు కంపాటి. ఈ కార్యక్రమంలో రాహుల్ మోపిదేవి, అనిత చౌదరి, శివాజీరాజా, చైతు జొన్నలగడ్డ, మిట్టపల్లి సురేందర్, సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి, ఎడిటర్ నరేశ్, ఛాయాగ్రాహకుడు వాజిద్‌తో పాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

# ఓటీటీలో ఈ వారం

కొత్త వారం.. కొత్త ముచ్చట్లతో ఓటీటీలు రెడీగా ఉన్నాయి. ఎప్పటిలాగే ఈ వారం కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు వినోదాలు పంచడానికి సిద్ధమయ్యాయి. సీటు అంచున కూర్చోబెట్టే సిరీస్‌లు, అదిరిపోయే సినిమాల్ని ఈ వారాంతం అందించబోతున్నాయి.

| | | |
|---|---|---|
| జింగిల్ బెల్ హైస్ట్ (సినిమా) | బుధవారం | నెట్‌ఫ్లిక్స్ |
| స్ట్రేంజర్ థింగ్స్ 5(సిరీస్) | గురువారం | నెట్‌ఫ్లిక్స్ |
| సన్నీ సంస్కారి కీ తులసి కుమారి (సినిమా) | గురువారం | నెట్‌ఫ్లిక్స్ |
| శశివదనే(సినిమా) | శుక్రవారం | సన్‌నెక్స్ట్ |

## లెఫ్ట్ హ్యాండెడ్ గర్ల్ సవాళ్లు




ఎడమ చేతి వాటం ఉన్న ఓ అమ్మాయి కథ ఆధారంగా రూపొందిన చిత్రం 'లెఫ్ట్-హ్యాండెడ్ గర్ల్'. ఈ చైనీస్ చిత్రానికి షి-చింగ్ త్సౌ దర్శకత్వం వహించారు. జానెల్ త్సాయ్, షిహ-యువాన్ మా, నినా యే తదితరులు కీలక పాత్రలు పోషించారు. పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం శుక్రవారం నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. షు-ఫెన్ అనే ఒంటరి తల్లి (జానెల్ త్సాయ్) తన ఇద్దరు కుమార్తెలతో కలిసి జీవిస్తుంటుంది. పట్టణానికి వెళ్లి అక్కడ ఓ మార్కెట్‌లో దుకాణాన్ని తెరిచి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారు. కానీ తన చిన్న కుమార్తె ఎడమ చేతి వాటాన్ని అపశకునంగా చూస్తుంటారు ఆ ఇంట్లో వ్యక్తులు. మరి తర్వాత ఆమె ఎలాంటి సవాళ్లు ఎదుర్కొందనేదే ఈ సినిమా కథాంశం.

## ఆర్యన్ నిజాల్ని బయటపెడతాడా?



'ఆర్యన్' సినిమాతో ఇటీవలే థియేటర్లలో సందడి చేశారు విష్ణు విశాల్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి ప్రవీణ్.కె దర్శకత్వం వహించారు. శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కథానాయికలు. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌లో పోలీసు అధికారిగా కనిపించి అలరించారు విష్ణు విశాల్. తాను ఫెయిల్యూర్ రచయితనని చెప్తూ రాబోయే ఐదు రోజుల్లో కొన్ని హత్యలు చేస్తానని చెప్తాడు ఓ వ్యక్తి. అతని హత్యాకాండను పోలీసులు ఆపడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశారనే దాని చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. మరి "ఆర్యన్ నిజాల్ని బయటపెడతాడా?" అంటూ ఆకట్టుకుంటోన్న ఈ సినిమా వెనుక కథేంటనేది శుక్రవారం నెట్‌ఫ్లిక్స్‌లో చూసి తెలుసుకోవాల్సిందే.

## శుక్రవారం మాస్ జాతర



మీ ఇంటికి జాతరని తీసుకొస్తున్నాడు ఈ మాస్ పోలీసు.. అంటూ 'మాస్ జాతర' ఓటీటీలోకి రాబోతున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. రవితేజ్ హీరోగా నటించిన చిత్రమిది. శ్రీలీల కథానాయిక. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల్ని అలరించింది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో "నేను రైల్వే పోలీసు కాదు.. క్రిమినల్ పోలీసు" అంటూ లక్ష్మణ్ భేరి పాత్రలో కనిపించారు రవితేజ. ఇందులో రాజేంద్రప్రసాద్, నవీన్ చంద్ర తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇప్పుడీ చిత్రం శుక్రవారం నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో సందడి చేయనుంది.


ఉపేంద్ర

"ఒక సినీ ప్రేమికుడిగా ఓ అభిమాని గొప్పదనాన్ని చాటి చెప్పే చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'" అన్నారు నటుడు ఉపేంద్ర. ఆయన ప్రత్యేక పాత్ర పోషించిన ఈ సినిమాలో రామ్ పోతినేని హీరోగా నటించారు. పి.మహేశ్‌బాబు తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు ఉపేంద్ర.

# ఆ ఆకలి ఎప్పుడూ ఉంటుంది


● "ఈ కథని నేను ఓ ప్రేక్షకుడిగానే విన్నా. స్క్రిప్ట్ విన్నాక ఫ్యాన్స్‌కి బాగా కనెక్ట్ అయిపోయా. ఓ సూపర్‌స్టార్‌కి అభిమానికి మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ కథలో చూపించిన తీరు బాగా నచ్చింది. అలాగే నిజ జీవిత పాత్రను తెరపై పోషించడమనేది ఇంకా కొత్తగా అనిపించింది. స్టార్స్ అందరి జీవితాల్లోనూ ఇలాంటి కొన్ని భావోద్వేగభరిత అనుభవాలు కచ్చితంగా ఎదురవుతుంటాయి. తానెవరో తెలియకున్నా ఒక అభిమాని ఇంత నిజాయతీగా ఎలా ప్రేమిస్తాడు.. తనపై ఇంతటి ఆరాధనా భావం ఎలా ఉంటుంది.. అనేది లాజిక్‌కి కూడా అందదు. కొన్నిసార్లు ఇంతటి ప్రేమకు మనం అర్హులమేనా అనిపిస్తుంది. అలాంటి అంశాలన్నీ ఈ చిత్రంలో చూడొచ్చు. ఈ సినిమా ద్వారా నా అభిమానులకు ఓ మంచి విషయం చెప్పడానికి నాకు చక్కటి అవకాశం దొరికినట్లయింది".

● "ఈ సినిమా ఒక అభిమాని బయోపిక్‌లాగే ఉంటుంది. దీంట్లో బలమైన భావోద్వేగాలున్నాయి. మంచి ప్రేమకథతో పాటు ధనవంతుడికి - పేదవాడికి మధ్య ఉండే బలమైన సంఘర్షణ కనిపిస్తుంది. ఇది అన్ని రకాల వాణిజ్యాంశాలతో అందర్నీ అలరించేలాగే ఉంటుంది. ఇందులో సూపర్‌స్టార్ సూర్యగా నా పాత్ర కూడా నిజ జీవితానికి దగ్గరగానే ఉంటుంది. ఓ హీరో సినీ ప్రయాణంలో కనిపించే ఆటుపోట్లు, జయాపజయాలు, ఫ్యాన్స్ క్రేజ్ తదితర అంశాలన్నీ దీంట్లో కనిపిస్తాయి. సాగర్ అనే క్రేజీ అభిమాని పాత్రలో రామ్ కనిపిస్తారు. ఈ కథలో మా ఇద్దరి జీవితాలు ఎలా ముడిపడ్డాయన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ముఖ్యంగా దీంట్లో ఇంటర్వెల్ సీక్వెన్స్‌లో రామ్ నటన రోమాంచితంగా ఉంటుంది. తనొక స్టార్ అయ్యి ఉండి.. అభిమానిలా జీవించిన తీరు ఆకట్టుకుంటుంది. ఈ సినిమాలో సంభాషణలు ఆకర్షణగా నిలుస్తాయి. నేను ఈ కథ విన్నప్పుడు ఎంత థ్రిల్ అయ్యానో.. తెరపై చూస్తున్నప్పుడు అంతకన్నా ఎక్కువ థ్రిల్ అయ్యాను. దర్శకుడు మహేశ్ ఈ కథను చెప్పిన దానికన్నా ఇంకా అద్భుతంగా తెరపై చూపించాడు".

● "నా తొలి సినిమా 'ఎ.ని ఫస్ట్ డే.. ఫస్ట్ షో అభిమానుల మధ్య కూర్చొని చూశా. నిజానికి అది నా తొలి చిత్రం కాబట్టి జనాల్లో పెద్దగా క్రేజ్ ఉంటుందని అనుకోలేదు. కానీ, థియేటర్ లోపలికి వెళ్లి చూస్తే కుర్రాళ్లతో నిండిపోయి ఉంది. అందరూ సినిమా చూడటం మానేసి నన్ను చూస్తున్నారని టెన్షన్ పడి బయటకొచ్చేస్తే.. వెనకాలే అందరూ వచ్చేశారు. దీంతో మళ్లీ లోపలికి వెళ్లా. ఆ తర్వాత కాసేపటికి పోలీసులు వచ్చి నన్ను జాగ్రత్తగా బయటకు తీసుకెళ్లారు. సినిమాల్లోకి వచ్చాక అదే నా ఫస్ట్ డే.. ఫస్ట్ షో అనుభవం. ఆ తర్వాత నేనెప్పుడూ నా సినిమా కోసం మళ్లీ థియేటర్‌కు వెళ్లలేదు. ఒకవేళ వెళ్తే ప్రేక్షకులు నన్ను చూసే హడావుడిలో సినిమా చూడటం మానేస్తారని భయం. ఇండస్ట్రీలోకి వచ్చిన తొలిరోజుల్లో రజనీకాంత్, రాజ్‌కుమార్, చిరంజీవి తదితరుల సినిమాల్ని ఫస్ట్ డే ఫస్ట్ షో చూసి ఆస్వాదించేవాణ్ని. 'కూలీ' ద్వారా రజనీతో కలిసి పని చేసే అవకాశం రావడం నా కల నెరవేరినట్లయింది".

● "పుట్టినరోజును ఓ వేడుకగా చేసుకోవడమనేది నా జీవితంలో ఎప్పుడూ లేదు. సినిమాల్లోకి వచ్చాక అభిమానులే నాకు పుట్టినరోజును చేయడం ప్రారంభించారు. సెప్టెంబరు 18 వచ్చిందంటే చాలు ఇంటికి వచ్చి కటౌట్‌లు పెట్టడం.. సింహాసనంపై కూర్చోబెట్టి పువ్వులతో అభిషేకం చేస్తూ వేడుక చేయడం.. ఇలా రూ.లక్షలు ఖర్చు పెట్టి పుట్టినరోజు చేస్తుంటారు. నటుడిగా ఎన్ని విలక్షణమైన పాత్రలు పోషించినా.. ఇంకా ఏదో కొత్తగా చేయాలన్న ఆకలి ఎప్పుడూ అలాగే ఉంటుంది. దర్శకుడిగా మంచి కథలు చెప్పాలనే తపన కూడా ఉంటుంది. ప్రస్తుతం నేను.. శివ రాజ్‌కుమార్, రాజ్ బి. శెట్టి కలిసి '45' అనే సినిమా చేశాం. అది డిసెంబరు 25న రానుంది. తెలుగులో దర్శకత్వం చేయాలన్న ఆలోచన ఉంది".

# రత్నమాల.. వీడిపోకే అలా..




"బిగించి గొంతు ఊపిరాపకే.. శిక్షించబోకే చిన్నదానికే. ఇక చాలే ఈ పూటకి.. దిగి రావే నా మాటకి.." అంటూ తను మనసిచ్చిన ప్రేయసిని బుజ్జగిస్తూ ప్రేమ పాటలు పాడుతున్నారు శివకార్తికేయన్. మరి తన ప్రియురాలు అలకపాన్పు నుంచి దిగి వచ్చిందో లేదో తెలుసుకోవాలంటే 'పరాశక్తి' సినిమా చూడాల్సిందే. ఆయన, శ్రీలీల జంటగా నటిస్తున్న చిత్రమిది. సుధా కొంగర దర్శకత్వం వహిస్తున్నారు. జనవరి 14న థియేటర్లలోకి రానుందీ సినిమా. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ చిత్రం నుంచి మరో పాటను విడుదల చేసింది చిత్రబృందం. 'రత్నమాల.. నన్ను వీడి నువ్వలా పోరాదే..' అంటూ సాగుతున్న ఈ గీతం.. శ్రీలీల, శివకార్తికేయన్‌ల కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. జీవీ ప్రకాశ్ కుమార్ ఆలపించారు. డాన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రవి మోహన్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

# తెలుగులోనూ చతా పటా


రోషన్ మాథ్యూ


ప్రపంచవ్యాప్తంగా వినోదం పంచుతున్న రెజ్లింగ్ ప్రేరణతో, ఆ నేపథ్యంలో రూపొందిన మొట్ట మొదటి మలయాళ చిత్రం 'చతా పటా - రింగ్ ఆఫ్ రౌడీస్' తెలుగులోనూ విడుదల కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో వచ్చే ఏడాది జనవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకు రానుంది. అర్జున్ అశోకన్, రోషన్ మాథ్యూ, ఇషాన్ షౌక్కత్, విశాఖ్ నాయర్, పూజా మోహన్‌దాస్ ప్రధాన పాత్రలు పోషించారు. అద్వైత్ నాయర్ దర్శకత్వం వహించారు. రమేశ్, రితేశ్ రామకృష్ణన్, షిహాన్ షౌక్కత్, ఎస్.జార్జ్, సునీల్ సింగ్ నిర్మాతలు. కేరళలో ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్‌కు చెందిన వేఫేరర్ ఫిల్మ్స్ సంస్థ విడుదల చేస్తోంది. "రెజ్లింగ్ నేపథ్యంలో సాగే యాక్షన్ కామెడీ చిత్రమిది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ ఎంతగానో ఆదరణ పొందింది. 115 దేశాల్లో, పలు భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంద"ని సినీ వర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి సంగీతం: శంకర్ - ఎహ్సాన్ - లాయ్.

# నటనతో ప్రభావం చూపించడమే ముఖ్యం


కృష్ణ బూరుగుల

"నటుడిగా నిరూపించుకోవాలనే నాలోని పట్టుదలకు తగ్గట్టే... 'జిగ్రీస్' సినిమాలో ఓ విభిన్నమైన పాత్ర చేసే అవకాశం వచ్చింది. అందులో నా నటనకు వచ్చిన పేరు నాలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది" అన్నారు కృష్ణ బూరుగుల. 'క్రష్', 'మా నాన్న నక్సలైట్', 'కృష్ణమ్మ' తదితర చిత్రాల్లో నటించిన ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రమే 'జిగ్రీస్'. ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా కృష్ణ బూరుగుల మాట్లాడుతూ "నా నిజ జీవితానికి పూర్తి భిన్నమైన చిచోరే పాత్రని చేశాను 'జిగ్రీస్'లో. ఆ పాత్రకు తగ్గట్టుగా లుక్ మార్చుకున్నా. సినిమా చూశాక ప్రముఖ దర్శకుడు సందీప్ వంగా బాగా చేశావని మెచ్చుకున్నారు. చాలామంది ఆ పాత్రకి కనెక్ట్ అయ్యారు. ఈ సినిమాకి ముందు 'ఆర్ఆర్ఆర్' కోసం ఆడిషన్స్‌లో పాల్గొన్నా. అందులో చిన్న పాత్ర కూడా దక్కినా అది ఎడిటింగ్‌లో పోయింది. అయినా సరే, అందులో నటించడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. 'జిగ్రీస్'లో నేను అంత ఉత్సాహంగా నటించడానికి కారణం కూడా అదే. ఎన్ని సినిమాలు చేశామనే విషయం కంటే నటుడిగా ఎంత ప్రభావం చూపించామన్నదే ముఖ్యమని నమ్ముతా. నా తదుపరి సినిమా త్వరలోనే మొదలవుతుంది" అన్నారు.

# వినోదాలతో ఖోస్లా రెడీ


అనుపమ్ ఖేర్

మధ్యతరగతికి చెందిన ఖోస్లా అనే వ్యక్తి.. తను ఎంతో కష్టపడి సంపాదించిన భూమిని ఓ మోసపూరిత వ్యాపారి నుంచి తిరిగి పొందేందుకు చేసిన ప్రయత్నాల ఆధారంగా రూపొందిన చిత్రం 'ఖోస్లా కా ఘోస్లా'. సీనియర్ నటులు అనుపమ్ ఖేర్, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. దిబాకర్ బెనర్జీ తెరకెక్కించారు. 2006లో విడుదలై విశేషంగా ఆకట్టుకున్న ఈ సినిమాకి సీక్వెల్ రాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ్.. 'ఖోస్లా కా ఘోస్లా 2' వస్తుందని చెప్తూ.. దీని గురించి కొన్ని విషయాల్ని పంచుకున్నారు. "ఇది అద్భుతమైన స్క్రిప్ట్. వచ్చే నెలలో ఈ చిత్ర షూటింగ్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మళ్లీ సెట్‌లో మిగిలిన తారాగణంతో కలిసి పనిచేయడానికి చాలా ఉత్సాహంగా ఉన్నా. ఈ సీక్వెల్‌తో ఖోస్లా మరోసారి వినోదాలు పంచడానికి సిద్ధంగా ఉన్నాడ"ని అన్నారు.

# డేంజర్ బేబీ

కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'రివాల్వర్ రీటా'. కె.చంద్రు దర్శకత్వం వహించారు. ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోంది చిత్రబృందం. ఇందులో భాగంగానే మరో పాటను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది. 'డేంజర్ మామే.. గేమ్ ఈజ్ ఓవర్ మామే' అంటూ సాగుతున్న ఈ గీతం అభిమానుల్ని ఆకట్టుకుంటోంది. ఇందులో తన యాక్షన్‌తో అదరగొడుతున్న కీర్తిని చూసి 'డేంజర్ బేబీ' అని నెట్టింట్లో పోస్టులు పెడుతున్నారు సినీప్రియులు. సాధారణ జీవితం గడుపుతున్న రీటా అనే అమ్మాయి అనుకోని పరిస్థితుల్లో తుపాకీ చేతపట్టాల్సి వచ్చింది. మరి ఆ తర్వాత ఆమె ఎదుర్కొన్న సవాళ్లేంటి? అనేదే ఈ సినిమా కథాంశం. కామెడీ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ థ్రిల్లర్ రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు.


కీర్తి సురేశ్

# అంతా రహస్యం


మేఘన

రోహిత్, మేఘన ప్రధాన పాత్రధారులుగా... మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మిస్టీరియస్'. జయ్ వల్లందాస్ నిర్మాత. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయని, డిసెంబరు 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని సినీ వర్గాలు చెప్పాయి. "ఉత్కంఠ ప్రధానంగా సాగే థ్రిల్లర్ చిత్రమిది. కథలో చోటు చేసుకునే సంఘటనల వెనక రహస్యమైన విషయాలెన్నో ఉంటాయి. అవి ఒక్కొక్కటిగా బయటకొచ్చే తీరు ఆసక్తికరమ"ని తెలిపారు సహనిర్మాతలు ఉష, శివానీ. అబిద్ భూషణ్, రియా కపూర్ తదితరులు నటించారు.

# విడుదల తేదీ విషయంలో ముందుగానే ఒప్పందం!

– ప్రశాంత్ వర్మ

ఓ దర్శకుడిగా తన సినిమా విడుదల తేదీని తానే ప్రకటించేలా నిర్మాతలతో ముందుగానే ఒప్పందం కుదుర్చుకుంటానని దర్శకుడు ప్రశాంత్ వర్మ తెలిపారు. కెరీర్ ఆరంభంలో ఎదురైన కొన్ని చేదు అనుభవాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి-2025) వేడుకలో నిర్వహించిన 'ఇమాజినింగ్ టుమారో: ఇండియాస్ వీఎఫ్ఎక్స్ రివల్యూషన్' సెషన్‌లో ప్రశాంత్ పాల్గొన్నారు. "నేనెప్పుడు ఏ సినిమాకి సంతకాలు చేసినా.. విడుదల తేదీని నేనే నిర్ణయిస్తానని సదరు నిర్మాతలతో ముందుగానే ఒప్పందం చేసుకుంటుంటా. ఎందుకంటే ఓ రుచికరమైన వంటకం తయారవ్వాలంటే పదార్థాలు ఒకటే ఉంటే సరిపోదు. అది సరిగ్గా తయారవ్వడానికి సరిపడా సమయం కేటాయించాలి. అలాగే ఓ సినిమా చిత్రీకరణ పూర్తయితే సరిపోదు.. నిర్మాణానంతర పనులకు కొంత సమయం పడుతుంది. వీఎఫ్ఎక్స్‌కు అధిక ప్రాధాన్యం ఉండే చిత్రాలకు నిర్మాతలు కాస్త ఎక్కువ సమయం ఇవ్వగలిగితే ఫలితం బాగుంటుంది" అని అభిప్రాయపడ్డారు. ప్రశాంత్ వర్మ ప్రస్తుతం రిషబ్ శెట్టితో 'జై హనుమాన్' పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు.

# 'సామ్రాజ్యం'లోకి స్వాగతం


విజయ్ సేతుపతి

శక్తిమంతమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు విలక్షణ నటుడు విజయ్ సేతుపతి. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆయన ఖాతాలో ఇప్పుడు మరో చిత్రం చేరింది. శింబు ప్రధాన పాత్రలో 'అరసన్' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో విజయ్ సేతుపతి భాగమైనట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు నిర్మాత కలైపులి ఎస్.థాను. "అరసన్ ప్రపంచంలోకి స్వాగతం" అనే వ్యాఖ్యల్ని జోడించారు. ఇందులో ఆయన ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. 'వడ చెన్నై' యూనివర్స్‌లో భాగంగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాను 'సామ్రాజ్యం' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తున్నారు.



మనదేశంలో.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది పాము కాటుతో మరణిస్తున్నారు. సత్వరం, సరైన చికిత్స అందితే వీరిలో చాలామందిని కాపాడుకోవచ్చు. కరిచింది ఎలాంటి పామో వెంటనే తెలిస్తే చికిత్స మరింత సులువవుతుంది కూడా. సాధారణంగా పాము కరచినప్పుడు అది విష పూరితమైందో, కాదో తెలియక తికమక పడుతుంటారు. మామూలు పామును విష పూరితమైందని అనుకోవచ్చు. దీంతో అనవసర భయం, గుబులు మొదలవుతాయి. విషం పామును మామూలుదని పొరపడితే ప్రాణాలకే ప్రమాదం. ఇలాంటి సందిగ్ధాన్ని తప్పించే విషయంలో బెంగళూరులోని భట్ బయోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశోధకుల బృందం గొప్ప ముందడుగు వేసింది. కరిచిన పాము విషపూరితమా, కాదో తెలిపే వినూత్న 'స్నేక్ వీనమ్ కిట్' ను రూపొందించింది. మరో రెండు నెలల్లోనే ఇది అందుబాటులోకి రానుంది. ఈ నేపథ్యంలో కంపెనీ ఛైర్మన్, పరిశోధకులు డాక్టర్ శ్యామా భట్‌తో ఈటీవీ భారత్ ముచ్చటించింది. కిట్ ఆవిష్కరణ, పనితీరు గురించి ఆయన చెప్పిన వివరాలు ఇవీ..

# విషం పామా? మామూలు పామా?

**స్నేక్ వీనమ్ కిట్ ప్రత్యేకతేంటి? ఇదెలా పనిచేస్తుంది?**

- విషం పాము కరిస్తే ప్రాణాలకు ప్రమాదమన్న సంగతి అందరికీ తెలిసిందే. సకాలంలో చికిత్స చేయకపోతే అరగంటలోనే ప్రాణాపాయం సంభవించొచ్చు. అందువల్ల కరిచిన పాము విషపూరితమైందా? కాదా? అనేది తెలుసుకోవటం చాలా కీలకం. ఇప్పుడు పాము కరిచిన వెంటనే కొన్ని యాంటీబయాటిక్స్ ఇస్తున్నారు. అవి వారికి అవసరముండొచ్చు, ఉండకపోవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వేగంగా పాము విషాన్ని గుర్తించే కిట్‌ను రూపొందించాం. ఇది గర్భధారణను నిర్ధరించే కిట్ మాదిరిగానే ఉంటుంది. పాము కాటుకు గురైన వ్యక్తి నుంచి కొద్దిగా రక్తం పిండి, రెండు చుక్కలు ఇందులో వేస్తే చాలు. కిట్‌లో రెండు గీతలు ప్రత్యక్షమైతే పాజిటివ్ అని అర్థం. అంటే కరిచింది విషం పాము అన్నమాట. రెండు గీతలు కనిపించకపోతే నెగెటివ్.. అంటే మామూలు పాము అని అర్థం. పాము కాటుకు గురైనవారిని సమీపంలోని ఆసుపత్రికి లేదా చికిత్స కేంద్రానికి తీసుకెళ్తే ఈ కిట్‌తో పరీక్షించొచ్చు. వెంటనే ఎలాంటి పామో నిర్ధరించొచ్చు. ఈ స్నేక్ వీనమ్ కిట్‌ను వేర్వేరు ఆసుపత్రుల్లో 300 మందిపై పరీక్షించాం. ఇది నూటికి నూరు శాతం పాము రకాన్ని కచ్చితంగా గుర్తించటం గొప్ప విషయం.



**గర్భధారణ పరీక్ష కిట్ల మాదిరిగా ఇది అన్ని మందుల దుకాణాల్లో అందుబాటులో ఉంటుందా? కేవలం ఆసుపత్రులకే పరిమితమా?**

- ప్రస్తుతానికి ప్రభుత్వం దీన్ని ప్రజలకు అందుబాటులో ఉంచటానికి సుముఖంగా లేదు. ఎందుకంటే దీంతో ఎలా పరీక్షించుకోవాలో చాలామందికి తెలియదు. ఇది జీవన్మరణాలతో ముడిపడిన అంశం. ఆశా వర్కర్లకు, అంబులెన్స్ సిబ్బందికి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందుబాటులో ఉంచితే మంచి ఫలితం కనిపిస్తుంది. కిట్‌తో పరీక్షించి, వెంటనే సరైన చికిత్స ఆరంభించొచ్చు.

**ఎలాంటి విష పూరిత పాము కరిచిందో, దానిలో ఎంత విషం ఉందో అనేవీ కిట్‌తో తెలుస్తాయా?**

- ప్రస్తుతానికి విషం పామా, మామూలుదా అనేది మాత్రమే కిట్‌తో తెలుస్తుంది. ముందుముందు ఎలాంటి విషం పాము కరిచిందో గుర్తించే విధంగా రూపొందించటానికి ప్రయత్నిస్తున్నాం. ఈ దిశగా పరిశోధన కొనసాగిస్తున్నాం.

**మీ సంస్థ గురించి వివరిస్తారా?**

- మేం 31 ఏళ్ల క్రితం భట్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించాం. మా బయోటెక్ పరిశ్రమను దీని ద్వారా నడిపిస్తున్నాం. ఇప్పటివరకూ మనదేశానికి 85 పరీక్ష కిట్లను అందించాం.

**సుదీర్ఘ అనుభవంతో**



డాక్టర్ శ్యామా భట్ కాసరగోడ్ జిల్లాలో జన్మించారు. స్థానిక పట్టణంలోనే ప్రాథమిక విద్య అభ్యసించారు. ఉడుపిలో డిగ్రీ పూర్తిచేశారు. కస్తూర్బా మెడికల్ కాలేజీ, మణిపాల్‌లో ఎంఎస్సీ పూర్తిచేసిన ఆయన బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేశారు. అనంతరం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కెంటకీలో శిక్షణ పొందిన శ్యామా భట్ యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో 16 ఏళ్ల పాటు న్యూరాలజీ ప్రొఫెసర్‌గా పనిచేశారు. తర్వాత మనదేశానికి వచ్చి.. బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలో భట్ బయోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించారు. దీని ద్వారా మూడు దశాబ్దాలకు పైగా బయోటెక్ ఉత్పత్తులను అందిస్తున్నారు. ప్రెగ్నెన్సీ, హెచ్ఐవీ, డెంగీ, హెపటైటిస్ టెస్ట్ కిట్ల వంటివెన్నో పరిచయం చేశారు.

**ఎప్పటి నుంచి దీనిపై కృషి చేస్తున్నారు?**

- కరిచింది విషం పామో, మామూలుదో అనేది నిర్ధరించటానికి ప్రస్తుతం ప్రామాణిక పద్ధతి లేదు. పాము కరచిన చోట గాటు తీరు, వైద్యుడి అనుభవం మేరకు దీన్ని నిర్ణయిస్తున్నారు. పాము కాటుకు గురైన వ్యక్తిలో తలెత్తే శరీరక మార్పులను బట్టి అంచనా వేస్తున్నారు. విషం పాము కరచినప్పుడు 20 నిమిషాల్లోనే ఒళ్లంతా విషం పాకుతుంది. ఇది కండరాల మీద ప్రభావం చూపుతుంది. ఆయా పాము రకాలను బట్టి లక్షణాలు, శరీరక మార్పులు కనిపిస్తుంటాయి. వీటి ఆధారంగానే డాక్టర్లు చికిత్స చేస్తుంటారు. అదే విషం పాము కరిచిందని త్వరగా, కచ్చితంగా నిర్ధరిస్తే సత్వరం, సరైన చికిత్స చేయొచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకునే మేం ఐదేళ్లుగా నిరంతరం కిట్ రూపకల్పన మీద పరిశోధన చేస్తున్నాం. ఇప్పుడిది తుది దశకు చేరుకుంది. దీని వాడకానికి అనుమతి లభించింది. దక్షిణాఫ్రికాలోనూ ఈ కిట్‌ను పరీక్షించాం. వచ్చే రెండు నెలల్లో దీన్ని మార్కెట్‌లోకి విడుదల చేయనున్నాం. దీని ధర సుమారు రూ.200 ఉండొచ్చు.

# వాబుల్ స్మార్ట్‌ఫోన్

దేశీయ వాబుల్ బ్రాండ్ తమ తొలి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. పేరు **వాబుల్ వన్**. ప్రొఫెషనల్ కెమెరా సామర్థ్యాలు, ప్రీమియం డిజైన్‌తో అలరిస్తున్న ఇది మీడియాటెక్ డైమెన్సిటీ 7400 చిప్‌సెట్, ఆండ్రాయిడ్ 15తో పనిచేస్తుంది. 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగంతో కూడిన 6.67 అంగుళాల ఎఫ్‌హెచ్‌డీ+ ఎమోలెడ్ తెర, డాల్బీ విజన్ సపోర్టుతో ఆకర్షిస్తోంది. ఇవీ ఫీచర్లు..



- వాబుల్‌కు చెందిన ఎపిక్ హైపర్‌ఇంజిన్ గేమింగ్ టెక్నాలజీ
- వెనకాల 50ఎంపీ సోనీ ఎల్‌వైటీ-600 సెన్సర్, 8ఎంపీ అల్ట్రావైడ్, 2ఎంపీ మ్యాక్రో కెమెరాల వ్యవస్థ. ప్రధాన కెమెరా 4కే రెజల్యూషన్ వరకూ వీడియోలను తీయగలదు. ముందు 50ఎంపీ సెల్ఫీ కెమెరా.
- అల్యూమినియం అలాయ్ ఫ్రేమ్, వెనకాల గ్లాస్ ప్యానెల్.
- 5000ఎంఏహెచ్ బ్యాటరీ. 47 గంటల సేపు కాల్స్, 24 గంటల పాటు వీడియో ప్లేబ్యాక్ చేసుకోవచ్చని కంపెనీ చెబుతోంది.
- అనవసర యాప్స్ ఏమీ ఉండవు. అందువల్ల యూజర్లు ఇష్టమైనవి ఇన్‌స్టాల్ చేసుకోవటానికి తగినంత స్టోరేజీ ఉంటుంది.
- గూగుల్ ఫొటోస్, జెమినై, సర్కిల్ టు సెర్చ్‌లో ఏఐ ఫీచర్లు వాడుకోవచ్చు.
- బేసి వేరియంట్ 8జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీతో వస్తోంది. దీని ధర రూ.22,000. అలాగే 8జీబీ+256జీబీ, 12జీబీ+256జీబీ రకాలూ అందుబాటులో ఉంటాయి. వీటి ధరలు తెలియాల్సి ఉంది.
- డిసెంబరు 12 నుంచి అమ్మకాలు మొదలవుతాయి.

## మోటో కొత్త బడ్జెట్ ఫోన్



మోటోరోలా జీ శ్రేణిలో కొత్త బడ్జెట్ ఫోన్‌ను పరిచయం చేసింది. **మోటో జీ57 పవర్** అనే ఇది స్నాప్‌డ్రాగన్ 6ఎస్ జెన్ 4 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత హలో యూఐ మీద పనిచేస్తుంది. 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం గల 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ ఎల్‌సీడీ తెర, ముందు కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ రక్షణ, నీరు-దుమ్మును తట్టుకోవటానికి ఐపీ64 రేటింగ్ వంటి ఫీచర్లతో ఆకట్టుకుంటోంది. కెమెరా విషయానికి వస్తే- వెనకాల 50ఎంపీ సోనీ ఎల్‌వైటీ-600 ప్రైమరీ షూటర్, 8ఎంపీ అల్ట్రా-వైడ్-యాంగిల్ సెన్సర్.. ముందు సెల్ఫీల కోసం 8ఎంపీ సెన్సర్ ఉన్నాయి. ముందు, వెనక కెమెరాలు రెండూ 1080పీ వీడియో రికార్డింగ్‌ను సపోర్టు చేస్తాయి. 30డబ్ల్యూ వైర్డ్ ఛార్జింగ్ సపోర్టు గల 7000 ఎంఏహెచ్ బ్యాటరీ గల దీనికి ఏడాది పాటు ఓఎస్, మూడేళ్ల వరకూ సెక్యూరిటీ అప్‌డేట్స్ అందుతాయి. 3.5 ఎంఎం ఆడియో జాక్, డాల్బీ ఆటమ్స్‌తో కూడిన స్టీరియో స్పీకర్, రెండు మైక్రోఫోన్లు ఉంటాయి. 8జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీతో కూడిన దీని ధర రూ.14,999.

## వాయుఏఐతో అగ్ని4



దేశీయ స్మార్ట్‌ఫోన్ కంపెనీ లావా మధ్యశ్రేణిలో **అగ్ని 4** ఫోన్‌ను తీసుకొచ్చింది. దీనికి వాయుఏఐని జోడించటం విశేషం. వందకు పైగా కాంబినేషన్లతో కూడిన యాక్షన్ కీ మరో ప్రత్యేకత. ఇది మీడియాటెక్ డైమెన్సిటీ 8350 5జీ ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 15తో పనిచేస్తుంది. థర్డ్ పార్టీ యాప్స్ ఏమీ ఉండవు. మూడేళ్ల పాటు ఓఎస్, నాలుగేళ్ల వరకూ సెక్యూరిటీ అప్‌డేట్లు అందుతాయి. ఫీచర్ల విషయానికి వస్తే..
● 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 2400 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.67 అంగుళాల 1.5కే ఎమోలెడ్ తెర ● దుమ్ము, నీటిని తట్టుకోవటంలో ఐపీ64 రేటింగ్. ● కార్నింగ్ గొరిల్లా గ్లాస్ రక్షణ ● 66డబ్ల్యూ ఛార్జర్ సపోర్టుతో కూడిన 5000ఎంఏహెచ్ బ్యాటరీ ● 8జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజీ. ● లిక్విడ్ కూలింగ్ సిస్టమ్, గేమ్ బూస్టర్ మోడ్. ● వెనకాల 50ఎంపీ ప్రైమరీ సెన్సర్, 8ఎంపీ అల్ట్రా వైడ్ లెన్స్‌తో కూడిన రెండు కెమెరాల వ్యవస్థ. ముందు 50ఎంపీ సెల్ఫీ కెమెరా. ● భారతీయుల అవసరాలకు తగినట్టుగా ఏఐ మ్యాథ్స్ టీచర్, ఏఐ ఇంగ్లిష్ టీచర్, ఏఐ ఎమోషనల్ కంపానియన్, ఏఐ హారోస్కోప్, ఏఐ టెక్స్ట్ అసిస్టెంట్, ఏఐ కాల్ సమ్మరీ, ఏఐ ఫొటో ఎడిటర్, ఏఐ ఇమేజ్ జనరేటర్, ఏఐ డాక్యుమెంట్ ఎనలైజర్ వంటి పలు కృత్రిమ మేధ ఫీచర్లు. ● ధర రూ.24,999.

## మళ్లీ వాట్సాప్ అబౌట్

వాట్సప్ తొలినాళ్ల ఫీచర్లలో ఒకటైన అబౌట్ మళ్లీ సరికొత్తగా వస్తోంది. వాట్సప్ సందేశాలు ఎన్‌క్రిప్ట్ కాకముందు యూజర్లు తామేం చేస్తున్నామో తెలియజేసుకోవటానికిది సరళమైన మార్గంగా ఉపయోగపడేది. ఇప్పుడిది స్టేటస్ అప్‌డేట్‌ను మరింత సమంజసంగా, కమనీయంగా, ఇంటరాక్టివ్‌గా మార్చే కొత్త ఫీచర్లతో ముస్తాబవుతోంది. రోజువారీ పనుల్లో అప్పుడప్పుడూ అనుకోని మార్పులు సహజమే. ఎక్కడికైనా బయటకు వెళ్లాల్సి రావొచ్చు. ఏదో మీటింగులో చిక్కుకుపోవచ్చు. ఇలా అందుబాటులో ఉండే సమయంలో మార్పులు జరిగినప్పుడు వాటిని ఎమోజీతో కూడిన పొట్టి పదబంధంతో తెలియజేసుకోవటానికి వీలుగా అబౌట్‌ను వినూత్నంగా డిజైన్ చేస్తున్నారు. తామేం చేస్తున్నామో సరదాగా చెప్పటానికిది ఉపయోగ పడుతుంది. దీంతో పూర్తి స్టేటస్‌ను అప్‌డేట్ చేయకుండానే, మెసేజ్‌ను పంపకుండానే చెప్పాలనుకున్న సంగతిని కమ్యూనికేట్ చేయొచ్చు. అబౌట్ కనిపించే స్థానమూ మారింది. వన్ ఆన్ వన్ చాట్స్ మీద కనిపిస్తుంది. యూజర్ ప్రొఫైల్ మీద ప్రముఖంగా ఉంటుంది. కాంటాక్ట్స్ గుర్తించటానికి, ప్రతిస్పందించటానికి తేలికగా ఉంటుంది. చాట్‌విండోలో తాకటం ద్వారా యూజర్లు ఇతరుల అబౌట్లకు నేరుగా జవాబివ్వచ్చు కూడా. దీనికి టైమర్ కూడా ఉంటుంది. 24 గంటల తర్వాత అబౌట్ దానంతటదే అదృశ్యమవుతుంది. ఇది ఎంతసేపు కనిపించాలో కూడా సెట్ చేసుకోవచ్చు.

# చాట్‌జీపీటీలో గ్రూప్ చాట్స్

ఓపెన్‌ఏఐ ప్రపంచవ్యాప్తంగా గ్రూప్ చాట్స్‌ను పరిచయం చేసింది. యూజర్లందరికీ (ఫ్రీ, గో, ప్లస్, ప్రొ ప్లాన్స్) ఇది అందుబాటులో ఉంటుంది. దీంతో చాట్‌జీపీటీతో స్నేహితులు, కుటుంబసభ్యులు, క్లాస్‌మేట్స్, సహోద్యోగులు.. ఇలా చాలామంది ఒకరితో ఒకరు కొలాబరేట్ కావొచ్చు. కలిసికట్టుగా ప్లానింగ్, క్రియేషన్, నిర్ణయాలు తీసుకోవటం వంటి పనులు చేసుకోవచ్చు. అంటే షేర్డ్ స్పేస్‌లో ఒకరితో ఒకరు ముచ్చటించుకోవటానికి చాట్‌జీపీటీ సహాయకుడిగా తోడ్పడుతుందన్నమాట. అవసరమైనప్పుడు తానూ చర్చల్లో పాల్గొని, సమాచారాన్ని అందిస్తుంది.




**ప్రస్తుత చాట్‌ను గ్రూప్‌గా**

ఒకరితో ఒకరు చేసే చాట్‌ను గ్రూప్‌గా మార్చుకోవచ్చు కూడా.
- కన్వర్జేషన్‌ను ఓపెన్ చేయాలి.
- వ్యక్తుల ఐకన్ మీద తాకాలి.
- స్టార్ట్ గ్రూప్ చాట్‌ను ఎంచుకోవాలి.

- దీంతో ఒరిజినల్ చాట్ నకలు గ్రూప్ కన్వర్జేషన్‌గా మారుతుంది. ఒరిజినల్ చాట్ అలాగే ఉంటుంది. దాన్ని యువర్ చాట్స్ కింద చూసుకోవచ్చు.

**గ్రూప్ చాట్‌ను ఎలా క్రియేట్ చేసుకోవాలంటే?**

- వెబ్, ఐఓఎస్, ఆండ్రాయిడ్ పరికరాల్లో చాట్‌జీపీటీ యాప్‌ను ఓపెన్ చేయాలి.
- కొత్త చాట్‌లో పైన కుడిమూలన కనిపించే వ్యక్తుల ఐకన్ల మీద క్లిక్ చేయాలి.
- స్టార్ట్ గ్రూప్ చాట్‌ను ఎంచుకోవాలి.
- కొత్త చాట్ విండో ఓపెన్ అవుతుంది. ఇన్వైట్ లింక్ ద్వారా ఇతరులను దీనిలో యాడ్ చేయాలి.

- తొలిసారి గ్రూప్ చాట్‌ను క్రియేట్ చేసేవారు పొట్టి ప్రొఫైల్ (పేరు, యూజర్‌నేమ్, ఫొటో) సెట్ చేసుకోవాల్సి ఉంటుంది.

**గ్రూప్ చాట్స్ ఎక్కడుంటాయి?**

చాట్‌జీపీటీ సైడ్‌బార్‌లో కొత్త గ్రూప్ చాట్స్ విభాగం ఉంటుంది. దీనిలోకి వెళ్లి రీసెంట్ గ్రూప్‌ను ఓపెన్ చేయొచ్చు. గ్రూప్ సభ్యులందరినీ చూడొచ్చు. సెటింగ్స్, నోటిఫికేషన్స్ మేనేజ్ చేసుకోవచ్చు.
- ఒక గ్రూప్‌లో 20 మంది వరకూ ఉండొచ్చు. వీరిలో ఎవరైనా ఇతరులకు ఇన్వైట్ లింక్ పంపొచ్చు.

**ఇలా ప్రవర్తిస్తుంది**

చర్చలు సాగుతున్న తీరును చాట్‌జీపీటీ అనుసరిస్తూ ఉంటుంది. అవసరమైనప్పుడు, సమంజసంగా అనిపించినప్పుడే తనకు తాను స్పందిస్తుంది. యూజర్లు నేరుగా సంభాషించుకుంటున్నప్పుడు మౌనంగా ఉంటుంది. కేవలం యూజర్లు కోరుకున్నప్పుడే చాట్‌జీపీటీ స్పందించాలని అనుకుంటే మెన్షన్ ఓన్లీ మోడ్ సైతం ఉంది. @ChatGPT తో ట్యాగ్ చేస్తేనే స్పందిస్తుంది.

**ఫీచర్లు ఇవీ..**

గ్రూప్ మోడ్‌లోని చాట్‌జీపీటీ జీపీటీ-5.1 ఆటోతో పనిచేస్తుంది. ఇది యూజర్ సబ్‌స్క్రిప్షన్‌ను బట్టి దానికి సరిపోయే మోడల్‌ను ఎంచుకుంటుంది. ఇది సపోర్టు చేసే ఫీచర్లు ఇవీ..
● సెర్చ్ ● ఇమేజ్ క్రియేషన్ ● ఇమేజ్ అప్‌లోడ్స్ అండ్ విజన్ ● ఐదు అప్‌లోడ్లు, డాక్యుమెంట్ రిట్రీవల్ ● పరికరం మైక్రోఫోన్ ద్వారా డిక్టేషన్/వాయిస్ ఇన్‌పుట్

- సందేశాలకు చాట్‌జీపీటీ ఎమోజీలతో ప్రతిస్పందిస్తుంది కూడా. సభ్యుల ప్రొఫైల్ ఫొటోలను వాడుకొని పర్సనలైజ్డ్ ఇమేజ్‌లనూ సృష్టిస్తుంది.


# క్రియేటర్లకు ఫేస్‌బుక్ రక్ష

ఫేస్‌బుక్‌లో ఎన్నో వీడియోలు. నాణ్యమైన వీడియోలు పోస్ట్ చేసే కంటెంట్ క్రియేటర్లకు ఇవి జీవనోపాధిగానూ నిలుస్తున్నాయి. అయితే చాలామంది వీటిని క్రియేటర్లకు క్రెడిట్ ఇవ్వకుండా, తాము సృష్టించినవేనని అనిపించేలా షేర్ చేస్తుంటారు. ఇలాంటి పరిస్థితిని తప్పించటానికి ఫేస్‌బుక్ తాజాగా కంటెంట్ ప్రొటెక్షన్ టూల్‌ను పరిచయం చేసింది. ఇదో మొబైల్ సాధనం. క్రియేటర్ల ఒరిజినల్ రీల్స్‌ను అనుమతి లేకుండా పాక్షికంగా లేదా పూర్తిగా షేర్ చేసిన వీడియోలను గుర్తించటం దీని ప్రత్యేకత. ఎన్‌రోల్ చేసుకున్న క్రియేటర్లకు ఈ విషయాన్ని తెలియజేస్తుంది. ఆ వీడియోలను షేర్ చేసినవారి ఖాతాలను క్రియేటర్లకు చూపిస్తుంది. దానిపై అవసరమైన చర్యలు తీసుకోవటానికి వీలు కల్పిస్తుంది. ఈ కంటెంట్ ప్రొటెక్షన్ టూల్ నిరంతరం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లను జల్లెడ పడుతుంది. మెటాకు చెందిన రైట్స్ మేనేజర్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్నే ఇదీ వాడుకుంటుంది. క్రియేటర్లు ఒరిజినల్‌గా సృష్టించిన వీడియోకు సరిపోయినట్టు గుర్తించగానే దాని గురించి నోటిఫికేషన్ పంపుతుంది. అప్పుడు వివరాలను క్రియేటర్లు సమీక్షించుకోవచ్చు. షేర్ చేసినవారి ఖాతాలోకి వెళ్లి దాన్ని ఎంత మంది చూశారు? ఎంత మంది అనుసరిస్తున్నారు? అనేవి చూసుకోవచ్చు. అనంతరం ఫేస్‌బుక్ యాప్‌లోనే తగు చర్య తీసుకోవచ్చు.



# యాత్రలకు గూగుల్ సాయం

విహార యాత్రలకు సన్నద్ధం కావటం, ప్రణాళిక వేసుకోవటం అంత తేలికైన పనికాదు. ముఖ్యంగా సరసమైన ధరల్లో విమాన టికెట్లను, హోటళ్లను బుక్ చేయటం కష్టమే. ఇలాంటి పనులను సులభం చేయటానికే గూగుల్ తమ సెర్చ్‌లో కొత్త ఏఐ ఆధారిత ట్రావెల్ ప్లానింగ్ టూల్స్‌ను పరిచయం చేసింది. విమాన టికెట్ల ఆఫర్లను గుర్తించటం దగ్గరి నుంచి హోటల్ రిజర్వేషన్ల వరకూ ఎన్నో పనులకు ఇవి సాయం చేస్తాయి.




- గూగుల్ ఏఐ మోడ్ గురించి తెలుసు కదా. ఇప్పుడిది అప్‌గ్రేడ్ అయ్యింది. మాట్లాడటం ద్వారా దీంతో యాత్రల ప్రణాళిక సిద్ధం చేసుకోవచ్చు. మీ మనసులో ఉన్న యాత్ర గురించి వివరిస్తే చాలు. ఉదాహరణకు- గోవాలో మూడు రోజులు పర్యటించాలని అనుకుంటున్నారనుకోండి. మాట రూపంలో దాన్ని వివరిస్తే దానంతటదే ప్రణాళిక రూపొందిస్తుంది. విమానాలు, హోటళ్ల డేటా.. ఆసక్తికరమైన అంశాలు, గూగుల్ మ్యాప్స్ సమీక్షలు, ఫొటోలు, అంచనా ప్రయాణ సమయాలు, సమీపంలోని రెస్టారెంట్ల వంటి వివరాలను తీసుకుంటుంది. ఇవన్నీ కాన్వాస్ ప్యానెల్‌లో కనిపిస్తాయి.
- ఫ్లైట్ డీల్స్ ఫీచర్‌ను తాజాగా ప్రపంచవ్యాప్తంగా 200కు పైగా దేశాలకు విస్తరించటంతో ఎక్కువమంది వాడుకోవటానికి వీలైంది. ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలని అనుకుంటున్నారో చెబితే ఇది ఏఐ సాయంతో అందుబాటులో ఉన్న తక్కువ ఛార్జీల గురించి తెలియజేస్తుంది.

# ఎయిర్‌పాడ్స్‌తో గుండె వేగం తెలుసుకో






శరీరానికి ధరించే వాచ్‌లు, స్మార్ట్‌రింగుల వంటివి యూజర్ల ఆరోగ్యాన్నీ ఓ కంట కనిపెడు తుంటాయి. అంతా వీటిల్లోని హెల్త్ ట్రాకర్ల గమ్మత్తే. గుండె వేగం వంటి వాటిని చిటికెలో తెలుసుకోవటానికివి బాగా ఉపయోగపడతాయి. యాపిల్‌కు చెందిన ఎయిర్‌పాడ్స్ ప్రొ 3 సైతం ఇందుకు సాయం చేస్తోంది. దీని ద్వారానూ అప్పటికప్పుడు గుండె వేగాన్ని గుర్తించొచ్చు. ఈ ఫీచర్‌ను ఆన్ చేసుకోవాలంటే- ముందుగా ఎయిర్‌పాడ్స్‌ను ధరించాలి. ఇప్పుడు ఐఫోన్‌లో సెటింగ్స్ యాప్‌ను ఓపెన్ చేసి, మీ ఎయిర్‌పాడ్స్ పేరు మీద తాకాలి. ఇందులో హార్ట్ రేట్ ఫీచర్‌ను ఆన్ చేసుకోవాలి. ఆ తర్వాత 'వాట్స్ మై హార్ట్ రేట్' అని సిరిని అడిగి చూడండి. వెంటనే గుండె వేగమెంతో చెప్పేస్తుంది. లేదంటే హెల్త్ యాప్‌లోనైనా చూసుకోవచ్చు.

## ఆండ్రాయిడ్, ఐఫోన్ల మధ్య ఫైళ్ల షేరింగ్

ఆండ్రాయిడ్, ఐఫోన్ల మధ్య ఫైళ్లను పంపటం ఇకపై తేలిక కానుంది. ఇందుకు వీలు కల్పించే క్విక్ షేర్ టూల్‌ను గూగుల్ తీసుకొచ్చింది. ఇది యాపిల్‌కు చెందిన ఎయిర్‌డ్రాప్‌తో కలిసి తేలికగా ఫైళ్లను బదిలీ చేస్తుంది. ప్రాథమికంగా దీన్ని పిక్సెల్ 10 ఫోన్లకు వర్తింపజేయనున్నారు. ముమ్ముందు మరిన్ని ఫోన్లకు విస్తరిస్తారు. భద్రతకు భంగం వాటిల్లకుండా క్విక్ షేర్‌ను రూపొందించామని, దీన్ని స్వతంత్ర సెక్యూరిటీ నిపుణులు పరీక్షించారని గూగుల్ చెబుతోంది. ఇది ఆర్‌సీఎస్ మెసేజింగ్ సపోర్టు చేయటమే కాకుండా అజ్ఞాత బ్లూటూత్ ట్రాకర్ల గురించి హెచ్చరిస్తుంది కూడా.

# అవిగో కృత్రిమ భూకంపాలు!

కృత్రిమ వర్షం గురించి తెలిసే ఉంటుంది. మరి కృత్రిమ భూకంపాల గురించి విన్నారా? తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం కలిగించే భూకంపాలను కోరి కోరి ఎవరు పుట్టిస్తారని అనుకుంటున్నారా? నిజానికివి నష్టం కలిగించేవి కాదు. భూకంపాల తీరును అర్థం చేసుకోవటానికే.

భూకంపాలు వచ్చిన తర్వాతే అవి స్పష్టమవుతాయి. అవి వస్తున్నట్టు ముందేమీ తెలియదు. వీటి గురించి ప్రకృతి ముందుగా ఎలాంటి సంకేతాలు అందిస్తుంది? వీటిని అర్థం చేసుకోవటమెలా? ఇదే శాస్త్రవేత్తలను ఆలోచింపజేసింది. కృత్రిమ భూకంపాల ప్రాజెక్టుకు దారితీసింది. భూమి పైపొర (క్రస్ట్) లోపల రెండు రాళ్లు దూరంగా జరిగినప్పుడు అక్కడ చీలికలు (ఫాల్ట్ లైన్స్) ఏర్పడుతుంటాయి. ఖండ ఫలకాలు (టెక్టోనిక్ ప్లేట్స్) ఢీకొట్టుకోవటంతో తలెత్తే ఇవి భూకంపాలకు దారితీస్తుంటాయి. స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల అడుగున ఇలాంటి చీలికలు బోలెడున్నాయి. అందుకే అక్కడ ఫాల్ట్ యాక్టివేషన్ అండ్ ఎర్త్‌క్వేక్ రప్చర్ (ఫియర్) ప్రాజెక్టును చేపట్టారు. నియంత్రిత పరిస్థితుల్లో కృత్రిమ భూకంపాలను సృష్టిస్తూ, భూకంప తక్షణ ప్రేరకాలను అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. కొన్ని భూకంపాలు పెద్ద చీలికల్లోనే ఎందుకు ఏర్పడతాయో తెలుసుకోవాలనీ భావిస్తున్నారు. ఎందుకంటే పెద్ద చీలికల్లో తలెత్తే భూకంపాలు తీవ్ర నష్టానికి కారణమవుతుంటాయి మరి.

**ఎలా సృష్టిస్తారు?**

ఒకప్పుడు రైల్వే ప్రాజెక్టు కోసం తవ్విన సొరంగంలోనే ఈ కృత్రిమ భూకంపాలను పుట్టిస్తున్నారు. కోట్లాది ఏళ్లుగా భూఖండ ఫలకాల కదలికల మూలంగా ఆల్ప్స్ పర్వతాల కింద చాలా లోతుగా బోలెడన్ని చీలికలు ఏర్పడ్డాయి. వీటి పక్కనుండే రాళ్లు జారటం వల్ల అక్కడ అప్పుడప్పుడూ స్వల్ప కంపాలు వస్తుంటాయి.
- ఈ చీలికల్లో ఒకదాంట్లోకి నీటిని పంప్ చేయటం ద్వారానే శాస్త్రవేత్తలు భూకంపాలను సృష్టిస్తున్నారు. చమురు, గ్యాస్ కంపెనీలు చీలికల మధ్య ఘర్షణను తగ్గించటానికి వాటిల్లోకి బావుల నుంచి వెలువడే వ్యర్థ జలాలను పంపిస్తుంటారు. కృత్రిమ భూకంప ప్రక్రియ కూడా అచ్చం ఇలాగే ఉంటుంది.
- దీని ద్వారా భూకంపానికి ముందు రాతి చీలికలు ఎలా కదులుతాయో, ఘర్షణ తగ్గినప్పుడు ఏం జరుగుతోందో గుర్తిస్తున్నారు. చీలికల మీద పెద్దఎత్తున సీస్మోమీటర్లు, యాక్సెలెరోమీటర్ల నెట్‌వర్క్‌ను ఏర్పరచి గమనిస్తున్నారు.
- ఇప్పటివరకూ సున్నా తీవ్రతతో కూడిన వేలాది భూకంపాలను సృష్టించటంలో శాస్త్రవేత్తలు విజయం సాధించారు. వచ్చే మార్చిలో వీటి తీవ్రతను పెంచాలనీ అనుకుంటున్నారు.
- భూకంప పరిణామాన్ని ఉష్ణోగ్రత ఎలా ప్రభావితం చేస్తుందో కనుక్కోవటానికి చీలికల్లోకి వేడి నీటిని పంపటం మీదా దృష్టి సారించారు.
- ఆయా తీవ్రతలో వచ్చే భూకంపాలను ప్రేరేపించే అంశాలను ముందే తెలుసుకోవటానికి, ఏయే రాతి చీలికలు ప్రమాదకరమో గుర్తించటానికి ఈ అధ్యయన ఫలితాలు తోడ్పడనున్నాయి.



## తమకి తాము నచ్చకపోతే ఏం చేయాలి? లైఫ్‌స్కిల్స్



ఎంతసేపూ వాళ్లు అందంగా ఉన్నారు, వీళ్లు బాగా చదువుతారు అంటూ ఎదుటివాళ్ల గొప్పదనం గురించే కొందరు ఆలోచిస్తుంటారు. తమకి తాము నచ్చరు. తమలో ఉన్న మంచిని విస్మరించి చెడు గురించి ఎక్కువగా బాధపడుతుంటారు. ఈ విధంగా ఎవరిని వారు అంగీకరించలేకపోవడానికి కారణం గతంలో చేసిన తప్పులు, పొరపాట్లు, ఎదురైన విమర్శలు. ఇలాంటి ఆలోచనా ధోరణిని అధిగమించకపోతే ఆశించిన లక్ష్యాన్ని సాధించలేరు. తమని తాము యథాతథంగా అంగీకరించే 'సెల్ఫ్ యాక్సెప్టెన్సీ'ని పెంచుకుని, విజయవంతంగా ముందుకు ఎలా సాగాలో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## కరెంట్ అఫైర్స్



■ 2025 అక్టోబరు 1 నుంచి ఎంత కాలానికి భారత అటార్నీ జనరల్‌గా ఆర్.వెంకట రమణి తిరిగి నియమితులయ్యారు? (2022 సెప్టెంబరు 30న ఆయన తొలి పదవీకాలం ప్రారంభమైంది.) జ: రెండేళ్లు

■ ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (2025లో ఈ దినోత్సవం థీమ్- స్మాల్ లైఫ్ స్టైల్ ఛేంజెస్, బిగ్ హెల్త్ బెనిఫిట్స్) జ: సెప్టెంబరు 29


■ దేశంలోనే మొదటి ఇంటిగ్రేటివ్ ఆంకాలజీ రిసెర్చ్ అండ్ కేర్ సెంటర్‌ను ఇటీవల ఎక్కడ ప్రారంభించారు? (ఆయుర్వేదం, యోగా పంచకర్మ, ఆధునిక ఆంకాలజీని ఒకే దగ్గరికి తీసుకొచ్చి క్యాన్సర్‌పై పోరాడేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశారు.) జ: ఏఐఐఏ, గోవా


■ నమీబియా నుంచి భారత్‌కు వచ్చిన జ్వాలా అనే చిరుతకు జన్మించిన ఏ పిల్ల (చిరుత) ఇటీవల యుక్త వయసుకు చేరుకుని వార్తల్లో నిలిచింది? (మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో ఈ చిరుత పిల్ల జన్మించింది.) జ: ముఖి

మరింత సమాచారం

# గణిత - ఆధారిత తార్కిక సమస్యలు

ఒక వస్తువును కొనాలని ఒక షాపులోకి వెళితే పదిశాతం డిస్కౌంటు అన్నారు. మరో దుకాణంలో అడిగితే వంద రూపాయల తగ్గింపు ఉందని చెప్పారు. ఎక్కడ కొనాలో నిర్ణయించుకునే ముందు ఎవరైనా శాతాన్ని, సంఖ్యా విలువలను పోల్చుకుంటారు. అంటే గణిత సమాచారాన్ని సేకరించి, దానిని ఒక గణిత నమూనాలోకి మార్చుకుంటారు. ఈ విధంగా సంఖ్యలను, ప్రాథమిక గణిత భావనలను, బీజగణిత సూత్రాలను ఉపయోగించి, సమస్యను విశ్లేషించి, తార్కిక ప్రక్రియల ద్వారా సరైన పరిష్కారాన్ని కనుక్కోవడం కోసం రూపొందించిన ప్రశ్నలను 'గణిత ఆధారిత తార్కిక సమస్యలు' అంటారు. వాటిపై పోటీ పరీక్షల్లో ప్రశ్నలు వస్తుంటాయి. తద్వారా అభ్యర్థుల్లో విమర్శనాత్మక ఆలోచనాశక్తిని, సమస్యా పరిష్కార సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. ఈ అధ్యాయంపై పట్టు పెంచుకోవాలంటే మౌలిక గణిత పరిక్రియలను నేర్చుకోవాలి. శాతాలు, సగటు, సాధారణ బీజగణితం తదితరాలను తెలుసుకోవాలి. దత్తాంశాన్ని అర్థం చేసుకోవడం, నమూనాలను గుర్తించడం ప్రాక్టీస్ చేయాలి.





## ఆలోచించు.. లెక్కించు.. సాధించు!



## జనరల్ స్టడీస్ అరిథ్‌మెటిక్

వివిధ పోటీ పరీక్షల్లో 'అరిథ్‌మెటిక్ పజిల్స్'లో భాగమైన గణిత - ఆధారిత తార్కిక సమస్యలు (Quant based logical problems) అనే ఉప విభాగం నుంచి తరచూ ప్రశ్నలు అడుగుతున్నారు. అవి అభ్యర్థుల్లో విశ్లేషణ, తార్కిక పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా ఉంటాయి. వాటికి సమాధానాలను వేగంగా, కచ్చితంగా కనుక్కోవాలంటే గణిత సంబంధిత ప్రాథమికాంశాలపై అవగాహన కలిగి ఉండాలి. అభ్యర్థులు లాజికల్‌గా ఆలోచించడం నేర్చుకోవాలి. దత్తాంశాన్ని పూర్తిగా చదివి, చిన్న, చిన్న భాగాలుగా విభజించి అర్థం చేసుకుంటే తేలికగా జవాబులను గుర్తించగలుగుతారు.



### మాదిరి ప్రశ్నలు

**1.** 800 కి.మీ. పొడవున్న రోడ్డు వెంబడి, ఒక కాంట్రాక్టర్ ప్రతి 16 మీ.లకు ఒక మొక్కను నాటాలనుకున్నాడు. అయితే అతడు నాటాల్సిన మొత్తం మొక్కల సంఖ్య?

1) 50 2) 49 3) 51 4) 52

**వివరణ:**

సూత్రం: $\dfrac{\text{మొత్తం రోడ్డు పొడవు}}{\text{రెండు పక్క పక్క మొక్కల మధ్య దూరం}} + 1$

$= \dfrac{800}{16} + 1 = 50 + 1 = 51$

∴ నాటాల్సిన మొత్తం మొక్కల సంఖ్య = 51

జ: 3

**2.** ఒక వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో ఏనుగులు.. పులుల కంటే ఎక్కువ, కొన్ని కోతులు కంటే తక్కువ. నక్కలు, కోతుల సంఖ్య సమానం. నక్కలు, జింకల సంఖ్యలో $\frac{1}{3}$ వ వంతు ఆ కేంద్రంలో అత్యధికంగా కుందేళ్లు ఉన్నాయి. అయితే కోతులు, జింకల నిష్పత్తి?

1) $\frac{1}{2}$ 2) $\frac{2}{3}$ 3) $\frac{1}{3}$ 4) $\frac{1}{4}$

**వివరణ:** ఇచ్చిన దత్తాంశంలో నక్కలు, కోతులు, జింకలకు సంబంధించిన అంశాన్ని మాత్రమే పరిగణించాలి.

నక్కల సంఖ్య = కోతుల సంఖ్య

∴ నక్కల సంఖ్య = జింకల సంఖ్యలో $\frac{1}{3}$ వ వంతు = $\frac{1}{3}$ వ వంతు జింకల సంఖ్య

కోతుల సంఖ్య = $\frac{1}{3}$ వ వంతు జింకల సంఖ్య

∴ $\dfrac{\text{కోతుల సంఖ్య}}{\text{జింకల సంఖ్య}} = \dfrac{1}{3}$

∴ కోతులు, జింకల నిష్పత్తి = 1 : 3 జ: 3

**3.** ఒక వ్యక్తి ఒక కంపెనీలో తన 30వ ఏట అంటే 1985లో చేరాడు. ఆ కంపెనీ నియమం ప్రకారం, ఆ ఉద్యోగి ఉద్యోగంలో చేరినప్పటి వయసు, పని చేసిన కాలాల మధ్య భేదం 6 ఏళ్లు ఉన్నప్పుడు పదవీ విరమణ పొందుతాడు. అయితే ఆ వ్యక్తి ఏ సంవత్సరంలో పదవీ విరమణ పొందుతాడు?

1) 2013 2) 2011 3) 2018 4) 2009

**వివరణ:** ఆ ఉద్యోగి x సంవత్సరాలు ఆ కంపెనీలో పనిచేశాడనుకుంటే దత్తాంశం ప్రకారం,

$30 - x = 6 \Rightarrow x = 30 - 6 = 24$

∴ 1985 నుంచి 24 ఏళ్ల తర్వాత అంటే, 1985 + 24 = 2009 లో ఆ వ్యక్తి పదవీ విరమణ పొందుతాడు. జ: 4

**4.** ఒక రైలు రైల్వేస్టేషన్ నుంచి కొంత మంది ప్రయాణికులతో బయలుదేరింది. ఆ రైలు నుంచి మొదటి స్టేషన్ దగ్గర సగం మంది ప్రయాణికులు దిగిపోగా, 135 మంది ఎక్కారు. రెండో స్టేషన్‌లో $\frac{1}{3}$ వ వంతు మంది దిగిపోగా, 110 మంది ఎక్కారు. చివరగా 350 ప్యాసింజర్లతో గమ్యస్థానం చేరుకుంది. అయితే ప్రారంభంలో ఎంతమంది ప్రయాణికులు ఆ రైలులో ఉన్నారు?

1) 350 2) 450 3) 550 4) 650

**వివరణ:** ఆ రైలులో మొదట ఉన్న ప్రయాణికులు 'x' మంది అనుకుందాం.

దత్తాంశం నుంచి, మొదటి స్టేషన్ దగ్గర సగం మంది ప్రయాణికులు దిగిపోగా, 135 మంది ఎక్కారు.

$\Rightarrow \frac{x}{2} + 135$



రెండో స్టేషన్‌లో $\frac{1}{3}$ వ వంతు మంది దిగిపోగా, 110 మంది ఎక్కారు. చివరగా గమ్యస్థానం చేరినప్పటికి ఆ రైలులో ఉన్న ప్రయాణికులు.

రెండో స్టాప్ దగ్గర ఆ రైలులో ఉన్న ప్రయాణికులు = $\left(1 - \frac{1}{3}\right) = \frac{2}{3}$ వ వంతు

$\Rightarrow \frac{2}{3}\left(\frac{x}{2} + 135\right) + 110 = 350$

$\Rightarrow \frac{2}{3}\left(\frac{x}{2} + 135\right) = 350 - 110$

$\Rightarrow \frac{x}{3} + \frac{270}{3} = 240 \Rightarrow \frac{x + 270}{3} = 240$

$\Rightarrow x + 270 = 240 \times 3 = 720$

$\Rightarrow x = 720 - 270 \Rightarrow x = 450$

∴ ఆ రైలులో మొదట ఉన్న ప్రయాణికులు = 450 మంది జ: 2

**5.** ఒక తరగతిలో బాలురు, బాలికల నిష్పత్తి B. బాలికలు, బాలురు నిష్పత్తి G. అయితే B + G విలువ ఎంత?

1) = 1 2) > 1 3) < 1 4) ≥ 1

**వివరణ:** బాలురు, బాలికల నిష్పత్తి = $\frac{2}{3}$ వ వంతు అనుకుంటే, దత్తాంశం నుంచి,

$\dfrac{\text{బాలురు}}{\text{బాలికలు}} = \dfrac{2}{3} = B \Rightarrow \dfrac{\text{బాలికలు}}{\text{బాలురు}} = \dfrac{3}{2} = G$

∴ $B + G = \frac{2}{3} + \frac{3}{2} = \frac{4+9}{6} = \frac{13}{6} > 1$

జ: 2

**6.** కెప్టెన్‌లు, సైనికులతో కూడిన 1200 మంది వ్యక్తుల బృందం ఒక రైలులో ప్రయాణిస్తోంది. ప్రతి 15 మంది సైనికులకు ఒక కెప్టెన్ ఉంటారు. అయితే ఆ సమూహంలో కెప్టెన్‌ల సంఖ్య?

1) 75 2) 80 3) 85 4) 72

**వివరణ:** దత్తాంశం నుంచి ప్రతి 15 మంది సైనికులకు ఒక కెప్టెన్ ఉంటారు. అంటే మొత్తం 16 మందిలో ఒక కెప్టెన్ ఉంటారు.

∴ ఆ సమూహంలో కెప్టెన్‌ల సంఖ్య = $\frac{1200}{16}$

= 75 మంది జ: 1

**7.** కొన్ని ఎద్దులు, కోళ్ల సమూహంలో మొత్తం కాళ్ల సంఖ్య.. మొత్తం తలల సంఖ్యకు రెట్టింపు కంటే 48 ఎక్కువ. అయితే ఎద్దుల సంఖ్య ఎంత?

1) 50 2) 48 3) 26 4) 24

**వివరణ:** ఆ సమూహంలో

ఎద్దులు = a, కోళ్లు = b అనుకుంటే

మొత్తం తలలు = a + b

మొత్తం కాళ్లు = 4a + 2b



దత్తాంశం నుంచి, $4a + 2b = 2(a + b) + 48$

$\Rightarrow 4a + 2b = 2a + 2b + 48$

$\Rightarrow 4a + 2b - 2a - 2b = 48$

$\Rightarrow 2a = 48 \Rightarrow a = \frac{48}{2} = 24$



∴ ఎద్దుల సంఖ్య = 24 జ: 4

**8.** ఒక పరీక్షలో ఒక విద్యార్థి ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోల్పోతాడు. అలాగే ప్రతి సరైన సమాధానానికి 3 మార్కులు పొందుతాడు. 100 ప్రశ్నలకు సమాధానమిచ్చి 88 మార్కులు సాధిస్తే, అతడు ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు రాశాడు?

1) 68 2) 58 3) 47 4) 53

**వివరణ:** సరైన సమాధానాల సంఖ్య x అనుకుంటే


తప్పు సమాధానాల సంఖ్య (100 – x) అవుతుంది

దత్తాంశం నుంచి, $3x - (100 - x) = 88$

$\Rightarrow 3x - 100 + x = 88$

$\Rightarrow 4x = 100 + 88 = 188$

∴ $x = \frac{188}{4} = 47$ జ: 3



**9.** A > B > 838 అయ్యేలా A, B అనేవి రెండు సంఖ్యలు. A, B ఘనాల భేదం D అయితే, (D – 1) అనేదాన్ని కిందివాటిలో ఏది భాగిస్తుంది?

1) A 2) B 3) 11 4) 3

**వివరణ:** దత్తాంశం నుంచి, A > B > 838

A = 840, B = 839 అనుకుంటే

A – B = 1 అవుతుంది

$A^3 - B^3 = D$

$\Rightarrow (A - B)^3 = A^3 - B^3 - 3AB(A - B)$

$\Rightarrow 1^3 = A^3 - B^3 - 3AB(1) \quad \because A^3 - B^3 = D$

$\Rightarrow 1 = D - 3AB \Rightarrow 3AB = D - 1$

∴ (D – 1) అనేదాన్ని 3తో భాగించవచ్చు. జ: 4



రచయిత: జె.వి.ఎస్. రావు



# వ్యక్తిగతంగా రాష్ట్రపతికి.. సమష్టిగా లోక్‌సభకు!

## ఇండియన్ పాలిటీ

దేశ పరిపాలన, ప్రభుత్వ విధానాల రూపకల్పన, అమలులో విశిష్టంగా వ్యవహరించే కార్యనిర్వాహక వ్యవస్థే ప్రధానమంత్రితో కూడిన కేంద్ర మంత్రిమండలి. రాష్ట్రపతి పేరుతో జరిగే దేశ కార్యనిర్వాహక వ్యవహారాల్లో వాస్తవ అధికారం దాని పరిధిలోనే ఉంటుంది. పాలనకు కేంద్రబిందువుగా ఉంటూ దేశానికి దశ, దిశ చూపించే ఆ అత్యున్నత మండలికి సంబంధించిన రాజ్యాంగ నిబంధనలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ప్రధాని, మంత్రిమండలి విధులు, బాధ్యతలు, వ్యక్తిగతంగా రాష్ట్రపతికి, సమష్టిగా లోకసభకు బాధ్యత వహించే తీరును అర్థం చేసుకోవాలి. అవసరమైన రాజ్యాంగ సవరణలపై, అధికార ప్రయోగంలో నైతికతకు ప్రాధాన్యం ఇచ్చిన గత సందర్భాలు, ఉదాహరణలపై అవగాహన కలిగి ఉండాలి.




### ప్రధానమంత్రి - కేంద్ర మంత్రిమండలి

1. రాష్ట్రపతికి పరిపాలనా వ్యవహారాల్లో సహకరించేందుకు ప్రధాని నేతృత్వంలో కేంద్ర మంత్రిమండలి ఉంటుందని రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ పేర్కొంటుంది?
   1) ఆర్టికల్ 73(1) 2) ఆర్టికల్ 74(1)
   3) ఆర్టికల్ 75(1) 4) ఆర్టికల్ 76(1)
2. ప్రధాని నేతృత్వంలోని కేంద్ర మంత్రిమండలి చేసిన సిఫార్సును రాష్ట్రపతి తప్పనిసరిగా పాటించాలని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా నిర్దేశించారు?
   1) 42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976
   2) 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978
   3) 43వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976
   4) 45వ రాజ్యాంగ సవరణ చట్టం, 1980
3. ప్రధాని నేతృత్వంలో కేంద్ర మంత్రిమండలి చేసిన సిఫార్సును రాష్ట్రపతి తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం లేదని, ఒకసారి పునఃపరిశీలనకు పంపవచ్చునని, పునఃపరిశీలన అనంతరం వచ్చిన సిఫార్సును రాష్ట్రపతి తప్పనిసరిగా ఆమోదించాలని ఏ రాజ్యాంగ సవరణచట్టం ద్వారా నిర్దేశించారు?
   1) 47వ రాజ్యాంగ సవరణ చట్టం, 1984
   2) 46వ రాజ్యాంగ సవరణ చట్టం, 1982
   3) 45వ రాజ్యాంగ సవరణ చట్టం, 1980
   4) 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978
4. ఆర్టికల్ 74(2) ప్రకారం ప్రధాని నేతృత్వంలోని కేంద్ర మంత్రిమండలి పదవీకాలాన్ని గుర్తించండి.
   1) 5 సంవత్సరాలు నిర్దిష్టంగా
   2) పార్లమెంటు విశ్వాసం ఉన్నంతవరకు
   3) రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంతవరకు
   4) లోక్‌సభలో విశ్వాసం ఉన్నంతవరకు
5. 'లోక్‌సభకు జరిగిన సాధారణ ఎన్నికల అనంతరం లోక్‌సభలో మెజార్టీ పార్టీ నాయకుడిని, లేదా మెజార్టీ పార్టీల కూటమి నాయకుడిని ప్రధానమంత్రిగా రాష్ట్రపతి నియమిస్తారు'. ఈ అంశాన్ని రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ పేర్కొంది?
   1) ఆర్టికల్ 74(1) 2) ఆర్టికల్ 75(1)
   3) ఆర్టికల్ 76(1) 4) ఆర్టికల్ 77(1)
6. ప్రధానమంత్రి సలహా మేరకు కేంద్ర మంత్రిమండలి సభ్యులను ఎవరు నియమిస్తారు?
   1) పార్లమెంటరీ కమిటీ 2) లోక్‌సభ స్పీకర్
   3) రాజ్యసభ ఛైర్మన్ 4) రాష్ట్రపతి
7. ఆర్టికల్ 75(1)(ఎ) ప్రకారం కేంద్ర మంత్రిమండలి సభ్యుల సంఖ్య లోక్‌సభలోని మొత్తం సభ్యుల సంఖ్యలో ఎంతకు మించరాదు?
   1) 10% 2) 12% 3) 15% 4) 21%
8. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం సభాధిపతి అనర్హుడిగా ప్రకటించిన చట్ట సభ్యుడిని ఎలాంటి లాభదాయక పదవిలో నియమించరాదని రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ పేర్కొంది?
   1) ఆర్టికల్ 75(1)(B) 2) ఆర్టికల్ 75(1)(C)
   3) ఆర్టికల్ 76(1)(A) 4) ఆర్టికల్ 76(1)(B)
9. ప్రధాని, కేంద్ర మంత్రిమండలి సభ్యులు రాష్ట్రపతి సమక్షంలో ప్రమాణస్వీకారం చేయాలని రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ పేర్కొంటుంది?



   1) ఆర్టికల్ 75(4) 2) ఆర్టికల్ 75(5)
   3) ఆర్టికల్ 78(3) 4) ఆర్టికల్ 77(2)
10. ఆర్టికల్ 75(2) ప్రకారం కేంద్ర మంత్రి మండలి సభ్యులు వ్యక్తిగతంగా ఎవరికి బాధ్యత వహించాలి?
    1) రాష్ట్రపతి 2) ప్రధానమంత్రి
    3) పార్లమెంట్ 4) లోక్‌సభ
11. ప్రధాని నేతృత్వంలోని కేంద్రమండలి ఆర్టికల్ 75(3) ప్రకారం ఎవరికి సమష్టిగా బాధ్యత వహించాలి?
    1) పార్లమెంటు 2) రాష్ట్రపతి
    3) లోక్‌సభ 4) ప్రజలు
12. ఏ రాజ్యాంగ సవరణచట్టం ద్వారా రాజ్యాంగానికి ఆర్టికల్స్ 75(1)(ఎ), 75(1)(బి)లను చేర్చారు?
    1) 91వ రాజ్యాంగ సవరణ చట్టం, 2003
    2) 93వ రాజ్యాంగ సవరణ చట్టం, 2005
    3) 94వ రాజ్యాంగ సవరణ చట్టం, 2006
    4) 90వ రాజ్యాంగ సవరణ చట్టం, 2003
13. చట్టసభ సభ్యుడుకాని వ్యక్తిని ప్రధానమంత్రి లేదా కేంద్ర మంత్రిగా నియమిస్తే ఎంతకాలంలోగా చట్టసభకు ఎన్నిక కావాలి(లేదంటే పదవి కోల్పోతారు)?
    1) 3 నెలలు 2) 4 నెలలు
    3) 5 నెలలు 4) 6 నెలలు
14. చట్టసభలో సభ్యత్వం లేకపోయినప్పటికీ 1991లో ప్రధానమంత్రి పదవి చేపట్టి తదుపరి లోకసభకు ఎన్నికై పదవిలో కొనసాగినవారు?
    1) హెచ్.డి.దేవేగౌడ
    2) పి.వి.నరసింహారావు
    3) వి.పి.సింగ్
    4) చంద్రశేఖర్




పి.వి.నరసింహారావు

15. ప్రధానమంత్రి తన పదవికి రాజీనామా చేశాక లోక్‌సభ రద్దు అయితే రాజీనామా చేసిన ప్రధానినే 'ఆపద్ధర్మ ప్రధాని'గా నియమించవచ్చని ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది?
    1) పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ Vs మొరార్జీ దేశాయ్ (1978)
    2) యు.ఎన్.ఆర్. రావు Vs ఇందిరా గాంధీ కేసు (1971)
    3) బెరుబారి Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1961)
    4) నందినీశతపతి Vs పి.వి.నరసింహారావు కేసు (1996)
16. కింది పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
    ఎ) ప్రధాని నేతృత్వంలోని కేంద్ర మంత్రిమండలి జీతభత్యాలను పార్లమెంటు నిర్ణయిస్తుంది.
    బి) కేంద్ర మంత్రిమండలిలో చర్చించి తీసుకున్న నిర్ణయాలన్నింటినీ ప్రధానమంత్రి రాష్ట్రపతికి తెలియజేయాలి.
    సి) రాష్ట్రపతికి, మంత్రిమండలికి మధ్య సంధానకర్తగా ప్రధానమంత్రి వ్యవహరిస్తారు.
    1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి
17. ప్రధాన మంత్రి అధికార విధులకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) ప్రధాని సిఫార్సుల మేరకు రాష్ట్రపతి కేంద్రమంత్రులను నియమించి, వారికి మంత్రిత్వ శాఖను కేటాయిస్తారు.
    బి) ప్రభుత్వ విధానాలను పార్లమెంటులో ప్రకటిస్తారు.
    సి) సివిల్ సర్వీసెస్‌కు రాజకీయ అధిపతిగా వ్యవహరిస్తారు.
    డి) ప్రధానమంత్రి పదవి ఏదైనా కారణంతో ఖాళీ అయితే మొత్తం మంత్రిమండలి రద్దవుతుంది.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
18. కేంద్ర కేబినెట్‌కు అధ్యక్షులుగా ఎవరు వ్యవహరిస్తారు?
    1) స్పీకర్ 2) రాష్ట్రపతి
    3) ప్రధాన మంత్రి 4) కేబినెట్ మంత్రి
19. పదవీరీత్యా ప్రధాన మంత్రి ఏ సంస్థలకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు?





    ఎ) జాతీయ అభివృద్ధి మండలి, అంతరాష్ట్ర మండలి
    బి) జాతీయ జలవనరుల మండలి, నీతి ఆయోగ్
    సి) జాతీయ విపత్తు నిర్వహణ మండలి
    డి) జాతీయ మానవ హక్కుల సంఘం
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
20. ప్రధాని నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి అధికారాన్ని కోల్పోయే సందర్భాన్ని గుర్తించండి.
    ఎ) లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానం వీగిపోయినప్పుడు.
    బి) లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ తిరస్కరణకు గురైనప్పుడు.
    సి) లోక్‌సభలో ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పుడు.
    డి) లోక్‌సభలో ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన కోత తీర్మానాలు నెగ్గినప్పుడు.
    1) ఎ, సి, డి 2) ఎ, బి, డి
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
21. "ప్రధాని సూర్యుడు అయితే మంత్రివర్గ సహచరులందరూ అతని చుట్టూ పరిభ్రమించే గ్రహాల వంటివారు" అని ఎవరు వ్యాఖ్యానించారు?
    1) లార్డ్ మార్లే
    2) ఐవర్ జెన్నింగ్స్
    3) విలియం వెర్నార్ కోట్ 4) నానీ పాల్కీవాలా



ఐవర్ జెన్నింగ్స్

22. మన దేశంలో 1949లో ఎవరి అధ్యక్షతన ఏర్పడిన కమిటీ పరిపాలనా సౌలభ్యం కోసం కేంద్ర మంత్రిమండలిని 3 రకాలుగా వర్గీకరించాలని సిఫార్సు చేసింది?
    1) అనంతశయనం అయ్యంగార్ 2) కె.టి.షా
    3) ఎన్.గోపాలస్వామి అయ్యంగార్
    4) నార్మన్‌డి పాలిమర్
23. కేంద్ర మంత్రిమండలి వర్గీకరణకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) కేబినెట్ మంత్రులు బి) రాజ్య మంత్రులు
    సి) సహాయ మంత్రులు డి) అదనపు మంత్రులు
    1) ఎ, సి 2) ఎ, బి, సి
    3) ఎ, డి 4) ఎ, బి, డి
24. కేబినెట్ మంత్రులకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) సాధారణంగా వీరి సంఖ్య 15 నుంచి 20 వరకు ఉంటుంది.
    బి) వీరు ప్రభుత్వంలోని అత్యంత కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తారు.
    సి) తమకు కేటాయించిన మంత్రిత్వ శాఖలకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో కీలకపాత్ర పోషిస్తారు.
    డి) వీరు ఆరు నెలలకోసారి సమావేశాలకు హాజరవుతారు.
    1) ఎ, సి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
25. ఆర్టికల్ 352(7)లో 'కేబినెట్' అనే పదాన్ని ఎప్పుడు చేర్చారు?
    1) 1951లో 1వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా
    2) 1976లో 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా
    3) 1964లో 17వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా
    4) 1978లో 44వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా
26. కేంద్ర మంత్రిమండలి అధికార, విధులకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) వార్షిక బడ్జెట్ రూపొందించి, పార్లమెంటు ఆమోదం పొందడం.
    బి) దేశంలో శాంతి భద్రతలను పరిరక్షించడం, దేశ రక్షణకు బాధ్యత వహించడం.
    సి) పార్లమెంటు రూపొందించిన చట్టాలు అమలుచేయడం.
    డి) ఆర్టికల్ 123 ప్రకారం 'ఆర్డినెన్స్' జారీ చేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేయడం.
    1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
27. 'సమష్టి బాధ్యతా సూత్రం'కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) ప్రధాని నేతృత్వంలోని కేంద్ర మంత్రిమండలి లోక్‌సభకు సమష్టి బాధ్యత వహించాలి.
    బి) దీని ప్రకారం మంత్రులంతా ఒకేసారి అధికారం పొందుతారు, ఏదైనా తేడా జరిగితే మంత్రులందరూ ఒకేసారి అధికారాన్ని కోల్పోతారు.
    సి) అందరికోసం ఒక్కరు, ఒక్కరి కోసం అందరూ అనేది దీని లక్ష్యం.
    డి) ప్రభుత్వానికి సంబంధించిన తీర్మానాన్ని ఒక మంత్రి లోక్‌సభలో ప్రవేశపెడితే సభలో అతను ఇచ్చే జవాబులకు, ప్రవర్తనకు మిగిలిన మంత్రులందరూ బాధ్యత వహించాల్సి ఉంటుంది.
    1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి




రచయిత: బంగారు సత్యనారాయణ

### సమాధానాలు

1-2; 2-1; 3-4; 4-4; 5-2; 6-4; 7-3:- 8-1; 9-1; 10-1; 11-3; 12-1; 13-4; 14-2; 15-2; 16-4; 17-4: 18-3; 19-1; 20-4; 21-2; 22-3; 23-2; 24-2; 25-4; 26-4; 27-4.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

# ఫలితం దక్కాలంటే.. ప్రయత్నం చేయాల్సిందే!




## పట్టిక విధానం

### మాదిరి ప్రశ్నలు

**సూచన (ప్ర. 1 – 4):** దిగువ ఇచ్చిన పట్టికను అధ్యయనం చేసి, ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

ఒక కంపెనీకి చెందిన అయిదు యూనిట్లు పలు సంవత్సరాల్లో తయారు చేసిన (M -మ్యానుఫ్యాక్చర్డ్), లోపభూయిష్ట (D - డిఫెక్టివ్) రిఫ్రిజిరేటర్ల సంఖ్యను వందల్లో తెలుపుతుంది.

| సంవత్సరం | యూనిట్ - 1 | | యూనిట్ - 2 | | యూనిట్ - 3 | | యూనిట్ - 4 | | యూనిట్ - 5 | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | M | D | M | D | M | D | M | D | M | D |
| 2006 | 64 | 11 | 55 | 7 | 86 | 28 | 66 | 11 | 56 | 8 |
| 2007 | 59 | 8 | 42 | 10 | 55 | 14 | 73 | 14 | 46 | 11 |
| 2008 | 60 | 8 | 58 | 8 | 65 | 6 | 78 | 20 | 44 | 5 |
| 2009 | 75 | 10 | 78 | 5 | 67 | 10 | 64 | 9 | 58 | 3 |
| 2010 | 80 | 21 | 82 | 3 | 92 | 12 | 58 | 17 | 68 | 10 |

**1.** అన్ని సంవత్సరాలకు కలిపి యూనిట్ 1, యూనిట్ 5 తయారు చేసిన మొత్తం రిఫ్రిజిరేటర్లకు మధ్య నిష్పత్తి?

1) 125 : 144 2) 169 : 289
3) 169 : 136 4) 169 : 150

**సాధన:** యూనిట్ 1 తయారు చేసిన మొత్తం రిఫ్రిజిరేటర్ల సంఖ్య = 33800

యూనిట్ 5 తయారు చేసిన మొత్తం రిఫ్రిజిరేటర్ల సంఖ్య = 27200

నిష్పత్తి 33800 : 27200 = 169 : 136

**సమాధానం: 3**

**2.** యూనిట్ 2 తయారు చేసిన రిఫ్రిజిరేటర్లలో ఏ సంవత్సరంలో లోపభూయిష్ట రిఫ్రిజిరేటర్ల శాతం అతి తక్కువగా ఉంది?

1) 2008 2) 2010 3) 2009 4) 2006

**సాధన:** ప్రశ్నప్రకారం, 2006లో లోపభూయిష్ట రిఫ్రిజిరేటర్ల శాతం

$$= \frac{700}{5500} \times 100 = 12.73\%$$

2007లో $\Rightarrow \frac{1000}{4200} \times 100 = 23.81$

2008లో $\Rightarrow \frac{800}{5800} \times 100 = 13.79\%$

2009లో $\Rightarrow \frac{500}{7800} \times 100 = 6.41\%$

2010లో $\Rightarrow \frac{300}{8200} \times 100 = 3.66\%$

యూనిట్ 2 తయారు చేసిన రిఫ్రిజిరేటర్లలో, లోపభూయిష్ట రిఫ్రిజిరేటర్ల శాతం 2010లో అత్యల్పంగా ఉంది.

**సమాధానం: 2**

**3.** అన్ని సంవత్సరాలలో యూనిట్ 3 ద్వారా ఉత్పత్తి అయిన లోపభూయిష్ట రిఫ్రిజిరేటర్ల సగటు ఎంత?

1) 1400 2) 1200 3) 1000 4) 900

**సాధన:** అన్ని సంవత్సరాలలో యూనిట్ 3 నుంచి లోపభూయిష్ట రిఫ్రిజిరేటర్ల మొత్తం సంఖ్య

= 2800 + 1400 + 600 + 1000 + 1200 = 7000

సగటు $= \frac{7000}{5} = 1400$

**సమాధానం: 1**

**4.** 2007లో అన్ని యూనిట్లు కలిసి తయారు చేసిన రిఫ్రిజిరేటర్ల సంఖ్యపై అన్ని యూనిట్ల లోపభూయిష్ట రిఫ్రిజిరేటర్ల సంఖ్య శాతం?

1) 11.12% 2) 18.52% 3) 10.72% 4) 20.72%

**సాధన:** 2007లో అన్ని యూనిట్ల ద్వారా లోపభూయిష్ట రిఫ్రిజిరేటర్ల మొత్తం సంఖ్య = 5700.

2007లో అన్ని యూనిట్ల ద్వారా తయారు చేసిన రిఫ్రిజిరేటర్ల మొత్తం సంఖ్య = 27500.

శాతం $= \frac{5700}{27500} \times 100 = 20.72\%$

**సమాధానం: 4**

**సూచన (ప్ర. 5 – 8):** దిగువ ఇచ్చిన పట్టికను అధ్యయనం చేసి, ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

కింది పట్టిక కంపెనీ స్థాపించినప్పటి నుంచి ఏటా పలు విభాగాల్లో చేరిన కొత్త ఉద్యోగులు (N), వదిలివెళ్లిన ఉద్యోగుల (L) సంఖ్యను తెలుపుతుంది.

| సంవత్సరం | మేనేజర్లు | | టెక్నీషియన్లు | | ఆపరేటర్లు | | అకౌంటెంట్లు | | ప్యూన్లు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | N | L | N | L | N | L | N | L | N | L |
| 2001 | 760 | 0 | 1200 | 0 | 880 | 0 | 1160 | 0 | 820 | 0 |
| 2002 | 280 | 120 | 272 | 120 | 256 | 104 | 200 | 100 | 184 | 96 |
| 2003 | 179 | 92 | 240 | 128 | 240 | 120 | 224 | 104 | 152 | 88 |
| 2004 | 148 | 88 | 236 | 96 | 208 | 100 | 248 | 96 | 196 | 80 |
| 2005 | 160 | 72 | 256 | 100 | 192 | 112 | 272 | 88 | 224 | 120 |
| 2006 | 193 | 96 | 288 | 112 | 248 | 144 | 260 | 92 | 200 | 104 |

**5.** 2002 నుంచి 2006 వరకు కంపెనీలో చేరిన ఆపరేటర్లు, మేనేజర్ల మొత్తం సంఖ్యలో భేదం ఎంత?

1) 184 2) 204 3) 250 4) 300

**సాధన:** భేదం = (256 + 240 + 208 + 192 + 248) – (280 + 179 + 148 + 160 + 193)

= 1144 – 960 = 184

**సమాధానం: 1**

**6.** 2004లో కంపెనీలో పనిచేస్తున్న అకౌంటెంట్ల సంఖ్య?

1) 1532 2) 1632 3) 1532 4) 1600

**సాధన:** 2004లో కంపెనీలో పనిచేస్తున్న అకౌంటెంట్ల సంఖ్య = 2001-04 వరకు ఉద్యోగంలో చేరిన అకౌంటెంట్ల సంఖ్య – 2001-04 వరకు ఉద్యోగం వదిలి వెళ్లిన అకౌంటెంట్ల సంఖ్య

= (1160 + 200 + 224 + 248) – (100 + 104 + 96)

= 1532

**సమాధానం: 3**

**7.** 2002లో అన్ని విభాగాల మొత్తం ఉద్యోగుల సగటు ఎంత?

1) 1101 2) 1105 3) 1106 4) 1094.4

**సాధన:** 2002లో మేనేజర్ల సంఖ్య = 920,

టెక్నీషియన్ల సంఖ్య = 1352, ఆపరేటర్ల సంఖ్య = 1032

అకౌంటెంట్ల సంఖ్య = 1260, ప్యూన్ల సంఖ్య = 908.

$$\text{సగటు} = \frac{920 + 1352 + 1032 + 1260 + 908}{5}$$

$$= \frac{5472}{5} = 1094.4$$

**సమాధానం: 4**

**8.** 2001-06 వరకు కంపెనీలో చేరిన మొత్తం టెక్నీషియన్ల సంఖ్యలో, కంపెనీ నుంచి వైదొలిగిన టెక్నీషియన్ల సంఖ్య ఎంత శాతం?

1) 22.31% 2) 34.55%
3) 32.11% 4) 11.52%

**సాధన:** కంపెనీ నుంచి వైదొలిగిన టెక్నీషియన్ల సంఖ్య

= (120 + 128 + 96 + 100 + 112)

= 556

కంపెనీలో చేరిన టెక్నీషియన్ల మొత్తం సంఖ్య

= (1200 + 272 + 240 + 236 + 256 + 288) = 2492

శాతం $= \frac{556}{2492} \times 100 = 22.31\%$

**సమాధానం: 1**



రచయిత
రాజేశ్ మధు,
విషయ నిపుణులు

## Word of the Day 842

### Fatuous

***Telugu meaning:*** మూర్ఖమైన, బుద్ధిలేని

***English meaning:*** Fatuous (ఫ్యాట్యుయస్) is an adjective used to describe something foolish, silly, or lacking in intelligence.

***Synonyms:*** Silly, Foolish; ***Antonyms:*** Sensible, Wise

***Usage:*** **1.** His fatuous comments during the meeting annoyed everyone who was trying to focus on serious issues.

**2.** The movie received criticism for its fatuous storyline that lacked depth and logic.

## కరెంట్ అఫైర్స్



జస్టిస్ సూర్యకాంత్ 2025, నవంబరు 24న సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. దేశ న్యాయ వ్యవస్థలో అత్యున్నత పదవి చేపట్టిన తొలి హరియాణా వాసిగా రికార్డు సృష్టించారు. 2027 ఫిబ్రవరి 9 వరకూ 15 నెలలపాటు ఆయన సీజేఐగా కొనసాగుతారు. జమ్మూ కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దుతోపాటు బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) లాంటి అంశాల్లో కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో ఈయన సభ్యుడు.



భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతగా నిలిచాడు. 2025, నవంబరు 24న సిడ్నీలో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 21-15, 21-11తో యుషి తనక (జపాన్)పై విజయం సాధించాడు.



దిగ్గజ భారతీయ నటుడు ధర్మేంద్ర (89) 2025, నవంబరు 24న ముంబయిలో మరణించారు. ఆయన దాదాపు 300 చిత్రాల్లో నటించారు. ధర్మేంద్ర 1935 డిసెంబరు 8న పంజాబ్‌లో జన్మించారు. అసలు పేరు ధర్మేంద్ర కేవల్ క్రిషన్ దేఓల్.

మానవ అక్రమ రవాణా నివారణ కోసం మై ఛాయిస్ ఫౌండేషన్ (ఎంసీఎఫ్)తో కలిసి తెలంగాణ మహిళా భద్రత విభాగం 'సేఫ్ విలేజ్ (సురక్షిత గ్రామం)' కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో శిక్షకులకు ఇచ్చే శిక్షణను డీజీపీ శివధర్‌రెడ్డి, ఆ విభాగం అదనపు డీజీపీ చారుసిన్హా 2025, నవంబరు 23న ప్రారంభించారు. అనంతరం మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేలా రూపొందించిన సేఫ్ విలేజ్ కామిక్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.


మహిళల కోసం జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) 24 గంటలూ అందుబాటులో ఉండే కొత్త హెల్ప్‌లైన్ నంబర్-14490ను ప్రారంభించింది. హింస, వేధింపులు లేదా ఏ రూపంలోనైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఇది ఉపయోగపడుతుందని వివరించింది. దేశవ్యాప్తంగా మహిళలు ఈ నంబర్‌ను సంప్రదించి తాము ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకోవచ్చు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## జాతీయ రాజ్యాంగ దినోత్సవం

నవంబరు 26
చరిత్రలో ఈనాడు

భారత్ అతిపెద్ద లిఖిత రాజ్యాంగం కలిగిన గణతంత్ర రాజ్యం. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపమే మన రాజ్యాంగం. పౌరులు, పాలకులు, పాలనా యంత్రాంగం పాటించాల్సిన అత్యున్నత చట్టంగా దీన్ని పేర్కొంటారు. ఇందులో ప్రభుత్వ విభాగాలు - వాటి స్వరూపం, స్వభావం, లక్ష్యాలు, ఆశయాలను వివరించారు. వ్యక్తి స్వేచ్ఛకు, సర్వతోముఖాభివృద్ధికి రాజ్యాంగం హామీ ఇస్తుంది. భారతదేశ ప్రజాస్వామ్య, లౌకిక, సమానత్వ భావనలను సూచించే ప్రాథమిక పత్రంలా ఇది పనిచేస్తుంది. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన తేదీకి గుర్తుగా ఏటా **నవంబరు 26న 'జాతీయ రాజ్యాంగ దినోత్సవం'**గా (National Constitution Day) నిర్వహిస్తారు. రాజ్యాంగ రచనలో పాలుపంచుకున్నవారిని గౌరవించడం, రాజ్యాంగ సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.




### భారత రాజ్యాంగం – ముఖ్యాంశాలు

భారత రాజ్యాంగం రాజకీయ వ్యవస్థల నిర్మాణం, ప్రభుత్వ సంస్థల అధికారాలు - విధులను నిర్దేశిస్తుంది. ప్రజల ప్రాథమిక హక్కులను, విధులను తెలుపుతుంది. మన రాజ్యాంగ ప్రధాన లక్ష్యం ప్రాథమిక హక్కులను కాపాడటం.

✦ రాజ్యాంగ పరిషత్ ద్వారా భారత ప్రభుత్వ చట్టం 1935 స్థానంలో రాజ్యాంగం ఏర్పడింది. ఇది దేశానికి మొదటి పాలక పత్రంగా పనిచేస్తుంది.

✦ కేబినెట్ మిషన్ సూచన మేరకు రాజ్యాంగ పరిషత్‌ను 1946లో ఏర్పాటు చేశారు.

✦ 1946, డిసెంబరు 11న డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ రాజ్యాంగ పరిషత్‌కు శాశ్వత అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

### చారిత్రక నేపథ్యం

రాజ్యాంగ ముసాయిదా కమిటీ రూపొందించిన రాజ్యాంగానికి 1949, నవంబరు 26న ఆమోదం లభించింది. దీంతో ఆ తేదీని 'జాతీయ రాజ్యాంగ దినోత్సవం'గా జరుపుకోవాలని ప్రభుత్వం భావించింది. 2015 భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 125వ జయంతి సందర్భంగా జయంతి ఉత్సవాలను ఘనంగా జరపాలని నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ఏడాది నుంచి నవంబరు 26ను రాజ్యాంగ దినోత్సవంగానూ ప్రకటించింది. నాటి నుంచి ఏటా దీన్ని నిర్వహిస్తున్నారు.

భారత రాజ్యాంగానికి సంబంధించిన ఇతర ముఖ్య విశేషాలు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## Latest Updates

### Project Scientist-2 Posts

BRIC - Translational Health Science and Technology Institute (THSTI-BRIC), Faridabad, is inviting applications for the posts of Project Scientist-2 and Data Entry Operator. The total no. of posts is 10. The application fee is Rs.590. The last date for receipt of online applications is 1st December 2025.

### Technical Jobs

ISRO - National Remote Sensing Centre (NRSC), Hyderabad, is inviting applications for filling up the Technician posts in various departments. The total no. of posts is 13. The last date for receipt of online applications is 30 November 2025.

### Scientist Posts

CSIR - National Environmental Engineering Research Institute is inviting applications for the recruitment of Scientist posts. The total no. of posts is 14. Eligible candidates can apply online before 23 December 2025.

### Did You Apply..?

***Today (November 26) is the last date for the following Jobs/ Apprentice posts.***

☛ 90 Group - A, B, C Jobs in CCRH Delhi. ***Eligibility:*** Diploma, BLIB, Inter.

☛ 30 Relationship Manager jobs in Punjab & Sind Bank. ***Eligibility:*** Degree.

☛ 72 Graduate, Technician, Trade Apprentice Trainee posts in HOCL. ***Qualification:*** ITI/B.Sc, Diploma, BE/B.Tech.

*For more information and other notifications - scan QR code*

## Bank Exams

### English

### *Cloze Test*

#### Passage

India's export landscape is undergoing a gradual but important transformation as the country aspires to move up the global value chain and position itself as a reliable trading partner. Over the last decade, the government has introduced several policy measures to boost merchandise and services exports, including Production-Linked Incentive (PLI) schemes, export promotion councils, and trade facilitation reforms. These developments aim to shift India from a largely cost-driven exporter to a more ...... (1) ...... player, capable of supplying highervalue goods such as electronics, pharmaceuticals, specialty chemicals and sophisticated services. Digitalisation of customs procedures, implementation of a single-window system, and improvements in port infrastructure have together reduced some of the delays and paperwork that once ...... (2) ...... export operations. At the same time, India is actively exploring new free trade agreements and economic partnerships in order to gain preferential access to key markets. Such agreements, when carefully negotiated, can help Indian firms integrate into regional and global value chains. However, greater market access also brings tougher competition and stricter quality standards, exposing structural gaps in domestic capabilities. Many micro, small and medium enterprises (MSMEs) strug-



gle to meet international certification norms, environmental requirements and just-intime delivery expectations. This creates a persistent ...... (3) ...... between policy ambition and ground-level readiness. Logistics remains another decisive factor shaping India's export competitiveness. Despite the launch of multimodal connectivity initiatives and digital freight platforms, logistics costs as a percentage of GDP remain higher than those of several competing economies. High freight charges, port congestion during peak periods, and inadequate last-mile connectivity to interior manufacturing clusters collectively act as a ...... (4) ...... on price competitiveness. Furthermore, the export basket is still concentrated in a limited set of products and markets, leaving India vulnerable to demand shocks, trade disputes and geopolitical tensions. Technology adoption is emerging as both an opportunity and a challenge. On one hand, e-commerce platforms, online marketplaces and digital marketing channels have widened access for smaller exporters, enabling them to reach buyers directly. On the other hand, gaps in digital literacy, cyber-security preparedness and data-handling capabilities can ...... (5) ...... trust with international customers if not addressed properly. Export financing is another critical area: although schemes exist to support exporters, many smaller firms face difficulties in securing working capital due to risk perceptions, inadequate collateral and complex documentation. When credit flows are constrained, firms cannot scale production or invest in quality upgradation, resulting in ...... (6) ...... participation in global trade. From a policy perspective, India is increasingly emphasising diversification—of products, markets and modes of delivery. Greater focus on services exports, such as IT, healthcare and education, has opened new avenues for foreign exchange earnings. Yet, to translate potential into performance, India must strengthen its institutional capacity for trade negotiation, standards-setting and dispute resolution. Building such capacity requires close coordination between government, industry bodies and financial institutions so that reforms are not merely announced but effectively ...... (7) ....... Sustainability considerations are also reshaping global trade rules. As importing countries introduce carbon border measures and stricter environmental norms, Indian exporters will need to adopt greener technologies and transparent reporting practices. Those who adapt early may gain a competitive edge, while laggards risk facing non-tariff barriers. Ultimately, transforming India's export landscape will depend on how well the country can align infrastructure, finance, technology and skills to build a ..... (8) ..... export ecosystem. For bank job aspirants, understanding these dynamics is crucial, because credit decisions, risk assessment and trade finance products are closely linked to the ...... (9) ...... health of the export sector. A more competitive and diversified export base not only supports growth and employment but also strengthens external sector resilience, helping the economy better absorb global ...... (10) .......

***Directions (Qs. 1 - 10):*** *Select the most appropriate option for blanks.*

**1.** A) value-added B) complacent C) volatile D) speculative E) fragmented

**2.** A) simplified B) accelerated C) streamlined D) boosted E) hampered

**3.** A) synergy B) mismatch C) bridge D) overflow E) alignment

**4.** A) catalyst B) tax C) premium D) drag E) surplus

**5.** A) reinforce B) dilute C) undermine D) formalise E) celebrate

**6.** A) marginal B) dominant C) generous D) negligible E) exclusive

**7.** A) announced B) postponed C) debated D) implemented E) abandoned

**8.** A) fragile B) resilient C) fragmented D) temporary E) distorted

**9.** A) cultural B) fiscal C) structural D) external E) overall


**10.** A) opportunities B) imbalances C) shocks D) surpluses E) deficits

*Scan the QR code for Key*

***Writer:*** *P. Manoj Kumar, Subject Expert*

విదేశీ విద్యార్థులు, ఉద్యోగార్థులు అమెరికా రాకుండా మోకాలడ్డుతున్న ట్రంప్ విధానాలకు ఆ దేశ సంస్థలు తగిన పరిష్కారాన్ని కనుగొన్నాయి. ఫలితంగా భారత్‌లోని కొన్ని రంగాల్లో ఉద్యోగాలు ఆకాశమే హద్దుగా పెరుగుతున్నాయి. ఈ అవకాశాలకు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)లు వేదిక కానున్నాయి.

# సంక్షోభంలోనూ.. సదవకాశం




## ఏమిటీ జీసీసీ?

ఇవి కొత్తగా పుట్టుకొచ్చినవి కాదు కానీ ట్రంప్ ప్రతికూల విధానాల కారణంగా ఇటీవల జీసీసీలు తెరపైకి వచ్చాయి. విస్తృత కార్యకలాపాలు, బహుముఖ వాణిజ్య అవకాశాలున్న ఒక భారీ కంపెనీ దేశం వెలుపల శాఖలను ప్రారంభించి బలమైన కేంద్రంగా తీర్చిదిద్దడం.

ఎక్కువగా ఐటీ సేవలు, ఇంజినీరింగ్, ఆర్ అండ్ డీ, ఫైనాన్స్ కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు ఇతర దేశాల్లో జీసీసీలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే మన దేశంలో ఇవి మూడు పూలు - ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయి. మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్, అమెజాన్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్, గోల్డ్‌మ్యాన్ సర్వీసెస్ ఇండియా, జేపీ మోర్గాన్ చేజ్ ఇండియా, డెలాయిట్ ఇండియా డెలివరీ సెంటర్, హెచ్‌ఎస్‌బీసీ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్, వాల్‌మార్ట్ టెక్ ఇండియా, షెల్ బిజినెస్ ఆపరేషన్స్ ఇండియా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్.. ఇలా ఎన్నో ఉన్నాయి.

## ఏం చేస్తాయివి?

జీసీసీలంటే తమకు కావాల్సిన పని మరో ఏజెన్సీకి అప్పగించే అవుట్ సోర్సింగ్ కాదు..సకల సౌకర్యాలతో మాతృసంస్థ స్వయంగా నెలకొల్పే కేంద్రం. ప్రధాన సంస్థకు పూర్తి నియంత్రణ ఉంటుంది. వ్యూహాత్మకంగా సంస్థ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవకాశం లభిస్తుంది. సాంకేతికత (టెక్నాలజీ), ప్రతిభ-నైపుణ్యం (టాలెంట్), సృజన, నూతన ఆవిష్కరణల (ఇన్నొవేషన్) మేళవింపే జీసీసీ. వీటి ద్వారా సంస్థలు ఆశించిన ఫలితాలు దక్కుతాయి.



## లక్షల్లో కొలువులు..

ప్రస్తుతం దేశంలో పెద్ద సంఖ్యలో బెంగళూరు, హైదరాబాద్, పుణె, చెన్నైల్లో వివిధ బహుళ జాతి సంస్థల జీసీసీలు ఉన్నాయి. భారత్‌లో మొత్తం ఇవి 1700 ఉండగా వీటిలో 10 లక్షల మంది ఐటీ, ఇంజినీరింగ్, ఫైనాన్స్ రంగ నిపుణులు పనిచేస్తున్నారు. ఏటా 11 శాతం వృద్ధిరేటుతో మరో ఐదేళ్లలో జీసీసీలు అత్యధిక ఉద్యోగాలు కల్పించే దిశగా దూసుకెళుతున్నాయని వివిధ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ స్పీడుకు తోడు ట్రంప్ విధానాల కారణంగా ఇప్పటి వరకూ జీసీసీల గురించి ఆలోచించని సంస్థలూ ప్రస్తుతం ఇటువైపు అడుగులు వేస్తున్నాయి. ఫలితంగా సమీప భవిష్యత్తులో జీసీసీలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకూ వ్యాపిస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ ఒరవడి కొనసాగి మరో ఐదేళ్లకు అంటే 2030 నాటికి జీసీసీల్లో మరో 20 లక్షల ఉద్యోగాలు ఉత్పన్నమవుతాయని నిపుణులు చెబుతున్నారు.

## ముందు చూపుతో..

భవిష్యత్తులో ట్రంప్ దూకుడు ఇంకా పెరగొచ్చు లేదా అతడి తర్వాత కూడా అమెరికన్స్ ఫస్ట్ విధానాలు కొనసాగొచ్చని అంచనా వేస్తున్న పలు అమెరికా సంస్థలు అక్కడ భారతీయ ఉద్యోగార్థులను చేర్చుకోవడం కష్టసాధ్యం కావచ్చునని భావిస్తున్నాయి. విదేశీ నిపుణులను నియమించుకునే అవకాశాలు పరిమితంగా ఉండటంతో అమెరికాలోని కార్పొరేట్ సంస్థలు ఆ దేశం వెలుపల కేపబిలిటీ సెంటర్ల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నాయి. ఇందులో భాగమే వైజాగ్‌లో గూగుల్ నెలకొల్పుతున్న ఏఐ ఆధారిత డేటా సెంటర్. ఈ ఒక్క సెంటర్ 1.88 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు కల్పించనున్నది. ఇదే బాటలో పలు అమెరికన్ సంస్థలు నడిచేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి.

## నైపుణ్యాలకు పదును!

జీసీసీలు వస్తేనే చాలు.. ఉద్యోగాలు మన ముంగిట వాలుతాయనుకోవద్దు. ప్రపంచ మార్కెట్ అవసరాలకు తగ్గట్టు, అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పే జీసీసీల్లో కొలువు పొందాలంటే అదే స్థాయి నైపుణ్యాలూ ఉండాలి. పాత నైపుణ్యాలతో నెట్టుకొచ్చే వీలుండదు. భవిష్యత్ అవసరాలను తీర్చగలిగే సామర్థ్యాలు సంతరించుకున్న వారికే వీటిలో అవకాశం ఉంటుంది.

డేటా సైంటిస్టులు(ఇంజినీర్లు, క్లౌడ్ ఇంజినీర్స్, సైబర్ సెక్యూరిటీ అనలిస్టులు), ఏఐ, మెషిన్ లెర్నింగ్ స్పెషలిస్టులు వంటి నిపుణులకు జీసీసీలు పెద్దపీట వేస్తున్నాయి. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వీటి గమనం మారుతుంది. వాటి ప్రకారం ప్రస్తుత సామర్థ్యాల స్థానంలో భవిష్యత్తులో కొత్తవి చేరొచ్చు. అందువల్ల ఎల్లకాలం ఒకే రకమైన నైపుణ్యాలతో నెట్టుకురావడం వీలుపడదని గ్రహించగలగాలి.

## అందుకునేదేలా?

గతంలో కోర్ సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు, ఇప్పుడిప్పుడే కోర్సులు పూర్తి చేస్తున్నవారు, ఇంకా కోర్సుల్లో చేరాలనుకుంటున్నవారు.. జీసీసీలకు తగ్గ నైపుణ్యాలు నేర్చుకునేందుకు ఏం చేయాలని మథనపడాల్సిన పనిలేదు. కావాల్సిన స్కిల్స్ నేర్పించేందుకు ఇవి.. స్థానిక విశ్వవిద్యాలయాలు, టెక్ లెర్నింగ్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. అవసరమైన లక్షణాలున్న యువతకు స్కిల్స్ నేర్పించి, ఆపై ప్రాజెక్టుల్లో నిమగ్నం చేస్తున్నాయి. జీసీసీల స్థాపన ద్వారా బడా కార్పొరేట్ సంస్థలకు రెండు లక్ష్యాలు నెరవేరుతున్నాయి. మొదటిది.. బ్యాక్ ఎండ్ ఆఫీస్ కార్యకలాపాల ద్వారా వ్యయ తగ్గింపు. రెండు.. నూతన ఆవిష్కరణల ద్వారా మార్కెట్‌లో కొత్త అవకాశాలను ఒడిసి పట్టుకోవడం. ఈ రెండు ప్రయోజనాల రీత్యా భవిష్యత్తులో మరెన్నో జీసీసీలు ఏర్పాటవుతాయి. అమెరికాలో చేయాల్సిన ఉద్యోగాలు మన దేశంలోనే చేసుకోవడానికి మార్గం తేలికవుతోంది. అందుకే జీసీసీలు ఉద్యోగాల కోటగా మారనున్నాయి.



యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

ఉపాధి పథం
నైపుణ్య సాధనం

**ఎనిమిదో తరగతి వరకు రెగ్యులర్‌గా, పదో తరగతి ఓపెన్‌లో చదివాను. ఇంటర్(సీఈసీ) రెగ్యులర్‌గా, డిగ్రీ దూరవిద్యలో పూర్తిచేశాను. ఇప్పుడు ఐటీ వైపు వెళ్లడం సాధ్యమవుతుందా? ఏ కోర్సులు నేర్చుకోవాలి? – పి.శ్రీనివాస్**

# ఐటీ కొలువులకు ఏ కోర్సులు?



■ మీ అకడమిక్ కెరియర్ గమనిస్తే.. ముందు రెగ్యులర్, తర్వాత ఓపెన్, మళ్లీ రెగ్యులర్, చివరికి ఓపెన్ విద్యా విధానాల మేళవింపులా ఉంది. జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం.. ఇది ఆహ్వానించదగ్గ పరిణామమే! కానీ, ఐటీ రంగంలోకి ప్రవేశించాలంటే.. ఐటీ/కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించిన విద్యార్హతలు, లేదా ఉద్యోగానుభవం, లేదా ప్రోగ్రామింగ్/ కోడింగ్ నైపుణ్యాలు అవసరం. మీరు ఇప్పుడు ఐటీ రంగంలోకి వెళ్లడం సాధ్యమేనా? అని అడిగితే అసాధ్యం అని అనలేం. కానీ, చాలా కష్టం అని చెప్పొచ్చు. ప్రస్తుత ఐటీ ఉద్యోగ మార్కెట్‌లో సాంకేతిక నేపథ్యం లేని వారికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు దొరకడం అంత తేలిక కాదు. కొన్ని ఐటీ సంస్థలు మాత్రమే డిగ్రీ ఓపెన్ యూనివర్సిటీలో చదివినా, డిగ్రీలో కామర్స్/ ఆర్ట్స్‌తో పూర్తిచేసినా పెద్దగా పట్టించుకోవడం లేదు. కానీ, నైపుణ్యాలు, ప్రాక్టికల్ నాలెడ్జ్, సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులు చేసిన అనుభవం ఉన్న వారికి మాత్రం ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. కాబట్టి.. వెబ్ డిజైన్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, యూఐ/ యూఎక్స్ డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్ లాంటి కోర్సులు నేర్చుకుంటే ఐటీ రంగంలో త్వరగా ఉద్యోగం పొందొచ్చు.

ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో దాదాపు 70 శాతం మంది ఇంజినీరింగ్ పట్టభద్రులు కంప్యూటర్, ఐటీ, ఏఐ అండ్ ఎంఎల్, డేటాసైన్స్ రంగాలకు సంబంధించిన వారే ఉన్నారు. చాలా ఐటీ ఉద్యోగాలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ అవుతున్నాయి. ఐటీ రంగంలో ఎలాంటి అకడమిక్ డిగ్రీ, ఉద్యోగానుభవం లేకుండా ఫ్రెషర్‌గా కొలువు పొందడంలో కొన్ని ఇబ్బందులూ ఉన్నాయి. మీరు డిగ్రీ స్థాయిలో కంప్యూటర్ సైన్స్ సంబంధిత కోర్సులు చదవలేదు కాబట్టి, కొంతకాలం కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తీసుకుని, ఉద్యోగ ప్రయత్నాలు చేయొచ్చు.


అవకాశం ఉంటే డేటాసైన్స్/ ఏఐ/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీల్లో డిప్లొమా/ సర్టిఫికెట్ లేదా ఎంబీఏలో బిజినెస్ అనలిటిక్స్ కానీ చదివి ఉద్యోగ ప్రయత్నాలు చేయండి. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు వీలుకాకపోతే, కింది కోర్సుల గురించి ఆలోచించవచ్చు.

ముందుగా మీకు ఆసక్తి ఉన్న రంగాన్ని గుర్తించండి. ఐటీ, డిజిటల్ మార్కెటింగ్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మీడియా వంటి చాలా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కొన్ని ప్రత్యేక నైపుణ్యాలు నేర్చుకుంటే డిగ్రీలతో సంబంధం లేకుండా మంచి ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో ప్రభుత్వ సంస్థలు అందిస్తున్న స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లు, ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకోండి. ఇంటర్నెట్ ద్వారా పనిచేసే ఫ్రీలాన్సింగ్ అవకాశాలు, రిమోట్ ఉద్యోగాలు, యూట్యూబ్, బ్లాగింగ్ వంటి వాటి గురించీ ఆలోచించవచ్చు.

1. **ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్:** జావా, జావాస్క్రిప్ట్.
2. **డేటా సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్:** డేటా అనాలిసిస్, ప్రెడిక్టివ్ మోడలింగ్, మెషిన్ లెర్నింగ్ ఆల్గారిథమ్స్, పైతాన్, ఆర్ ప్రోగ్రామింగ్.
3. **క్లౌడ్ కంప్యూటింగ్**
4. **సైబర్ సెక్యూరిటీ:** నెట్‌వర్క్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్.
5. **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డీప్ లెర్నింగ్.**

రోజుకి మూడు - నాలుగు గంటల పాటు సాధన చేస్తే, మీ నైపుణ్యాలు మెరుగై, సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం పొందే అవకాశాలు ఉంటాయి. మొదటి ఉద్యోగాన్ని తక్కువ వేతనంతో అయినా మొదలుపెట్టండి. కొంత అనుభవంతో మెరుగైన కొలువులు పొందే అవకాశం ఉంది. నిరంతర కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే మీ ఆశయాన్ని నెరవేర్చుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్




# ఇలా నేర్చుకుందామా...

విద్యార్థి దశలో ప్రతి సంవత్సరం ఎన్నో విషయాలు నేర్చుకుంటూనే ఉంటాం. ఇంకా కొత్తగా ఏం తెలుసుకోవాలనే సందేహం కొందరు విద్యార్థులకు రావొచ్చు. కానీ ఈ పద్ధతిలో నేర్చుకోవడం అనేది విద్యార్థుల మార్గాన్ని సులువు చేస్తుంది.

✦ పరీక్షలు రాసి పైతరగతులకు వెళ్లడం ఏటా జరుగుతూనే ఉంటుంది. కానీ ఇదో మొక్కుబడి వ్యవహారంలా కాకుండా ఆసక్తిగా సాగితే నూతన అంశాలను సరికొత్తగా సాధన చేయగలుగుతారు.

✦ ప్రాథమిక పాఠశాల నుంచి.. కళాశాల స్థాయి వరకూ ఎదిగే క్రమంలో ఎన్నో విషయాలను తెలుసుకునే ఉంటారు. వీటన్నింటినీ మెదడులో అలాగే నిక్షిప్తం చేసుకుని అక్కడితో ఆపేయకూడదు. అనవసరమైన వాటిని ఎప్పటికప్పుడు వదిలించుకుంటూ ఉండాలి. ఆ స్థానాన్ని ఉపయోగపడే కొత్త విషయాలతో భర్తీ చేయాలి. చిన్న తరగతుల్లో కొన్ని సూత్రాలను మాత్రమే నేర్చుకుని ఉంటారు. పై తరగతుల్లో వాటిని అన్వయించడాన్ని ఉదాహరణలు, వివరణలతో వివరంగా తెలుసుకుంటారు.

✦ ఇప్పటికే చాలా విషయాలు తెలుసుకున్నామని నేర్చుకోవడం ఆపేశామనుకోండి, మన ఎదుగుదల అంతటితోనే ఆగిపోతుంది. విద్యార్థి ఉద్యోగార్థిగా మారిన తర్వాత మరెన్నో సరికొత్త నైపుణ్యాలూ అవసరం అవుతాయి. నిరంతరం మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం తప్పనిసరి. దీన్ని ఆచరణలో పెట్టినవారే మరింత ముందుకు వెళ్లగలరు. అందుకే నిత్య విద్యార్థులుగా కొత్త విషయాలను తెలుసుకోవడానికే ఎప్పుడూ ప్రయత్నిస్తుండాలి.

✦ సందేహాలు నివృత్తి చేసుకోవడాన్ని అవమానంగానూ భావించకూడదు. అందరూ అన్ని విషయాల్లోనూ పరిపూర్ణులు కారు. ఒక సబ్జెక్టులో అపారమైన పరిజ్ఞానం ఉన్నవారికి మరో సబ్జెక్టులో ప్రాథమిక పరిజ్ఞానం కూడా ఉండకపోవచ్చు. ఇది తప్పు కాదు కూడా.

✦ ఒక విషయాన్ని సమగ్రంగా తెలుసుకున్న తర్వాత నేర్చుకోవడాన్ని అంతటితో ఆపేయకూడదు. మరో కొత్త విషయాన్ని అవగాహన చేసుకోవడం ప్రారంభించాలి.

✦ నేర్చుకోవడం అనేది విద్యార్థులకు మాత్రమే కాదు.. ఉద్యోగార్థులకూ ఎంతో అవసరం. గతంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఉద్యోగాన్వేషణకు అదనపు అర్హతగా ఉండేది. ఇప్పుడు ఆ స్థానాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భర్తీ చేస్తోంది. అందుకే 'లెర్న్, అన్‌లెర్న్, రీలెర్న్'లను అన్వయించుకుని కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి.

# ఇంటర్న్‌షిప్స్

## హైదరాబాద్‌లో

### కంటెంట్ మార్కెటింగ్

**సంస్థ:** ద కలినరీ లాంజ్
**నైపుణ్యాలు:** కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, కంటెంట్, ఈవెంట్, సోషల్‌మీడియా మార్కెటింగ్, క్రియేటివ్ రైటింగ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్
**స్టైపెండ్:** రూ.10,000
**దరఖాస్తు గడువు:** డిసెంబరు 17
☛ https://tinyurl.com/5a5m2c6a

### సీఏ ఆర్టికల్‌షిప్

**సంస్థ:** రవి లాడియా అండ్ కంపెనీ
**నైపుణ్యాలు:** అకౌంటింగ్, ఎంఎస్-ఆఫీస్
**స్టైపెండ్:** రూ.10,000-12,000
**దరఖాస్తు గడువు:** డిసెంబరు 17
☛ https://tinyurl.com/4x9cjyzn

### ఈవెంట్ మేనేజ్‌మెంట్

**సంస్థ:** ఎక్స్‌ట్రాలివింగ్ ప్రై.లి.
**నైపుణ్యాలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్
**స్టైపెండ్:** రూ.5,000-10,000
**దరఖాస్తు గడువు:** డిసెంబరు 11
☛ https://shorturl.at/w3jiY

### డెర్మా కేర్ కన్సల్టెంట్ ట్రెయినీ (ఓన్లీ ఫిమేల్ గ్రాడ్యుయేట్స్)

**సంస్థ:** క్లారియన్
**నైపుణ్యాలు:** అనలిటికల్ థింకింగ్, డేటా అనాలిసిస్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, ప్రజెంటేషన్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిపోర్ట్ జనరేషన్ **స్టైపెండ్:** రూ.5,500-13,000
**దరఖాస్తు గడువు:** డిసెంబరు 17
☛ https://tinyurl.com/497zd2kx

### బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

**సంస్థ:** కన్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) **నైపుణ్యాలు:** డిజిటల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఎక్సెల్
**స్టైపెండ్:** రూ.10,000-12,000
**దరఖాస్తు గడువు:** డిసెంబరు 19
☛ https://shorturl.at/kQSkR

### సోషల్‌మీడియా మార్కెటింగ్

**నైపుణ్యాలు:** డిజిటల్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్‌మీడియా మార్కెటింగ్
**స్టైపెండ్:** రూ.6,000-8,000
**దరఖాస్తు గడువు:** డిసెంబరు 18
☛ https://tinyurl.com/44uwxf6y

### డేటా ఎంట్రీ

**సంస్థ:** జీగ్లర్ ఏరోస్పేస్
**నైపుణ్యాలు:** ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
**స్టైపెండ్:** రూ.8,000
**దరఖాస్తు గడువు:** డిసెంబరు 18
☛ https://tinyurl.com/jvrh5n7f

### డిజిటల్ మార్కెటింగ్

**సంస్థ:** యాడ్స్‌గోట్
**నైపుణ్యాలు:** డిజిటల్, ఫేస్‌బుక్, సెర్చ్‌ఇంజిన్, సోషల్‌మీడియా మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈఓ)
**స్టైపెండ్:** రూ.10,000-12,000
**దరఖాస్తు గడువు:** డిసెంబరు 19
☛ https://shorturl.at/nAr3B

## బామర్ లారీలో..

బామర్ లారీ అండ్ కో లిమిటెడ్, కోల్‌కతా.. పలు విభాగాల్లో 10 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● అసిస్టెంట్ మేనేజర్: 04 ● డిప్యూటీ మేనేజర్: 02
● యూనిట్ హెడ్: 01 ● జూనియర్ ఆఫీసర్: 03
**అర్హత:** పోస్టును అనుసరించి.. సీఏ, సీఎంఏ లేదా సంబంధిత విభాగంలో డిప్లొమా/ డిగ్రీ/ ఎంబీఏ/ పీజీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
**ప్రారంభ వేతనం:** నెలకు డిప్యూటీ మేనేజర్, యూనిట్ హెడ్‌కు రూ.40,000- రూ.1,40,000; అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.50,000- రూ.1,60,000; జూనియర్ ఆఫీసర్‌కు రూ.38,226. **వయసు:** అసిస్టెంట్ మేనేజర్‌కు 27-32 ఏళ్లు; డిప్యూటీ మేనేజర్, యూనిట్ హెడ్‌కు 32 ఏళ్లు; జూనియర్ ఆఫీసర్‌కు 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూలతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 19-12-2025.
**వెబ్‌సైట్:** https://www.balmerlawrie.com/

## యంగ్ ప్రొఫెషనల్స్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రిసెర్చ్, హైదరాబాద్.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
● యంగ్ ప్రొఫెషనల్స్-I: 04 పోస్టులు
**అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
**వేతనం:** నెలకు రూ.30,000.
**ఇంటర్వ్యూ తేదీ:** 04-12-2025.
**వేదిక:** ఐఐఎంఆర్, రాజేంద్రనగర్, హైదరాబాద్.
**వెబ్‌సైట్:** https://www.millets.res.in/ad.php

**మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఎస్‌టీసీఎల్).. 37 మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులను భర్తీచేయనుంది. బీఈ/ బీటెక్/ సీఏ/ లా/ ఎంబీఏ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి.**

# ఎంఎస్‌టీసీలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు



మొత్తం ఉద్యోగాల్లో అన్‌రిజర్వ్‌డ్‌కు 16, ఓబీసీకి 11, ఈడబ్ల్యూఎస్‌కు 3, ఎస్సీకి 5, ఎస్టీకి 2 కేటాయించారు. జనరల్ విభాగంలో 14, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్‌లో 23 ఖాళీలు ఉన్నాయి.

**ఎంపిక:** విద్యార్హతల ఆధారంగా అభ్యర్థులను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)కు ఎంపిక చేస్తారు. సీబీటీ తేదీ, వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు. దీన్ని వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సీబీటీలో జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు 35 శాతం కనీసార్హత మార్కులు సంపాదించాలి. వీరిని 1:10 నిష్పత్తిలో గ్రూప్ డిస్కషన్‌కు, 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు షార్ట్‌లిస్ట్ చేస్తారు. సీబీటీ, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల్లో సాధించిన మార్కులతో కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు.

ఎంపికైనవారికి ఏడాది శిక్షణ ఉంటుంది. దీన్ని విజయవంతంగా పూర్తిచేసినవారిని అసిస్టెంట్ మేనేజర్‌గా నియమిస్తారు. వీరిని సంస్థ/ అనుబంధ సంస్థల్లో దేశవ్యాప్తంగా ఎక్కడైనా నియమించే అవకాశం ఉంటుంది.

**గమనించాల్సినవి:** ఒకరు ఒక దరఖాస్తును మాత్రమే పంపాలి. ఒకటికంటే ఎక్కువ పంపితే చివరి దాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

✦ రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్‌కు హాజరయ్యే ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు సెకండ్‌క్లాస్ ఏసీ రైలు ఛార్జీలను చెల్లిస్తారు.

**సన్నద్ధత:** సీబీటీలో చూపిన ప్రతిభతోనే తర్వాతి దశకు ఎంపిక చేస్తారు. కాబట్టి ముందుగా ఇందులో కనీసార్హత మార్కులు సంపాదించాలి. విద్యార్హతలకు సంబంధించిన ముఖ్యాంశాలను పునశ్చరణ చేసుకోవాలి. డిసెంబరులో రాత పరీక్షను నిర్వహిస్తారు. కాబట్టి ఈ తక్కువ వ్యవధిలోనే సన్నద్ధత పూర్తి కావాలి. అలాగే గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకూ ప్రాధాన్యమివ్వాలి. తుది ఎంపికలో ఈ మూడిటిలోనూ సాధించిన మార్కులను పరిగణలోకి తీసుకుంటారు.

### ముఖ్యాంశాలు

**అర్హతలు:** సిస్టమ్స్ విభాగంలో.. ఎలక్ట్రానిక్స్/ ఐటీ/ కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్ లేదా ఎంసీఏ.
**ఆపరేషన్స్, పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్‌లో..** హ్యుమానిటీస్/ సైన్స్/ కామర్స్/ లా/ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిగ్రీ/ పీజీ.
**లా విభాగంలో..** లా డిగ్రీ/ పీజీ.
**ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో..** ఎంబీఏ (ఫైనాన్స్).
విద్యార్హతల డిగ్రీలను 60 శాతంతో పూర్తిచేయాలి. అన్ని విభాగాల్లోని ఉద్యోగాలకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.
**వయసు:** 28 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
**దరఖాస్తు ఫీజు:** రూ.500 (జీఎస్టీ అదనం). ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.
**వేతన శ్రేణి:** నెలకు రూ.50,000 - 1,60,000. మూలవేతనానికి అదనంగా హెచ్‌ఆర్ఏ, టీఏ, డీఏ, గ్రాట్యుటీ, పీఎఫ్, వైద్య సదుపాయాలుంటాయి.
**తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వైజాగ్.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 30.11.2025
**రాత పరీక్ష:** డిసెంబరు 2025 **వెబ్‌సైట్:** https://www.mstcindia.co.in

## అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నాగ్‌పుర్.. తాత్కాలిక ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● అసిస్టెంట్ ప్రొఫెసర్ - 06
**అర్హత:** సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్/ పీహెచ్‌డీ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్) ఉండాలి.
**వేతనం:** పీహెచ్‌డీ ఉన్నవారికి నెలకు రూ.65,000, పీహెచ్‌డీ లేనివారికి రూ.60,000.
**దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** recruitment@iiitn.ac.in
**దరఖాస్తుకు చివరి తేదీ:** 10-12-2025
**ఎంపిక:** ఇంటర్వ్యూతో
**వెబ్‌సైట్:** https://www.iiitn.ac.in/recruitments

## ఐఐటీలో ఎస్ఆర్ఎఫ్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్.. ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రిసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్) కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
● సీనియర్ రిసెర్చ్ ఫెలో
**అర్హత:** సివిల్ ఇంజినీరింగ్ లేదా అనుబంధ విభాగంలో ఎంఈ/ఎంటెక్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
**వయసు:** డిసెంబరు 10, 2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
**వేతనం:** నెలకు రూ.42,000.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 10-12-2025.
**ఎంపిక:** ఇంటర్వ్యూతో
**వెబ్‌సైట్:** https://www.iith.ac.in/careers/



## భర్తపై గృహహింస కేసు పెట్టిన సెలీనా జైట్లీ

ముంబయి: బాలీవుడ్ ప్రముఖనటి, మాజీ మిస్ ఇండియా సెలీనా జైట్లీ (44) తన భర్త పీటర్ హాగ్‌పై గృహహింస, క్రూరత్వం, మోసపూరిత చర్యలకు పాల్పడ్డారని కేసు పెట్టారు. మంగళవారం ముంబయిలోని ఓ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందుకు ఈ పిటిషను వచ్చింది. పీటర్ హాగ్‌కు నోటీసు జారీచేసిన జడ్జి కేసు తదుపరి విచారణను డిసెంబరు 12కు వాయిదా వేశారు. ఆస్ట్రియాలో పీటర్ కస్టడీలో ఉన్న తన పిల్లలతో మాట్లాడే అవకాశం ఇవ్వాలని సెలీనా పిటిషనులో కోరారు. నెలకు రూ.10 లక్షల భరణంతో పాటు రూ.50 కోట్ల పరిహారాన్ని పీటర్ నుంచి ఇప్పించాలన్నారు. సెలీనా జైట్లీ, పీటర్ హాగ్ 2010లో ఆస్ట్రియాలో వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పలు హిందీ చిత్రాల్లో నటించిన సెలీనా జైట్లీ 2004లో విడుదలైన తెలుగు సినిమా 'సూర్యం'లో నటుడు మంచు విష్ణు సరసన నటించారు.

## అరుణాచల్‌లో కొత్తరకం హోయా జాతి మొక్క గుర్తింపు

ఇటానగర్: వృక్షశాస్త్ర పరిశోధనల్లో అరుణాచల్‌ప్రదేశ్ కీలక మైలురాయిని చేరుకొంది. ఇక్కడి చాంగ్లాంగ్ జిల్లాలోని జీవవైవిధ్యం అధికంగా ఉండే విజయ్‌నగర్ ప్రాంతంలో హోయా జాతికి చెందిన కొత్త రకం మొక్క 'హోయా దపోడియాన్సిస్'ను పరిశోధకులు కనుగొన్నారు. ఇది రాష్ట్ర వృక్షశాస్త్ర పరిశోధనలో 'కీలక అధ్యాయం'గా ముఖ్యమంత్రి పెమా ఖండూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. విజయ్‌నగర్... రాష్ట్రంలో అతి తక్కువగా పరిశోధనలు జరిపిన, జీవసంపద అధికంగా ఉన్న ప్రాంతం. ఉష్ణమండలంలో పుష్పించే అతిపెద్ద పూల మొక్కల్లో హోయా ఒకటి.

## బద్రీనాథ్ ఆలయ ద్వారాలు మూసివేత

గోపేశ్వర్: ఉత్తరాఖండ్‌లోని అప్పర్ గఢ్వాల్ ప్రాంతంలోనున్న బద్రీనాథ్ ఆలయం తలుపులను మంగళవారం ప్రత్యేక పూజల అనంతరం మూసివేశారు. దీంతో ఈ ఏడాది చార్‌ధామ్ యాత్రను అధికారికంగా ముగించినట్లయింది. అంతకుముందు... తీవ్రమైన చలిగాలులు వీస్తున్నప్పటికీ పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి బద్రీ విశాలను దర్శనం చేసుకున్నారని బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ కమిటీ వెల్లడించింది.

## అఫ్గాన్‌పై పాకిస్థాన్ దాడి.. ఒకే ఇంట్లో 10 మంది మృతి

### పాక్‌లో 22 మంది ఉగ్రవాదుల హతం

పెషావర్: అఫ్గానిస్థాన్-పాకిస్థాన్ మధ్యలు మరో సారి భగ్గుమన్నాయి. సోమవారం అర్ధరాత్రి అఫ్గాన్‌పై పాక్ గగనతల దాడులకు పాల్పడింది. ఖోస్ట్ ప్రావిన్స్‌లోని పలు నివాసాలు ధ్వంసమయ్యాయి. ఒకేఇంట్లో పది మంది ప్రాణాలు కోల్పోగా... అందులో తొమ్మిది మంది చిన్నారులేనని తాలిబన్ ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు- ఖైబర్ పఖ్తున్ సాగిన కాల్పుల అనంతరం తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ)కు చెందిన 22 మంది ఉగ్రవాదులను ఖైబర్ పఖ్తున్ఖ్వాలో హతమార్చినట్లు పాక్ భద్రతాదళాలు తెలిపాయి. దేశం నుంచి ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టేయడానికి భద్రతాదళాలు కట్టుబడి ఉన్నాయని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెప్పారు. అఫ్గాన్‌పై తాము గగనతల దాడులు జరిపామన్న ఆరోపణల్ని పాక్ సైన్యం తోసిపుచ్చింది. ఎక్కడైనా దాడులు చేస్తే ఆ విషయాన్ని ప్రకటిస్తామని డైరెక్టర్ జనరల్ చెప్పారు. మంచి, చెడు తాలిబన్లు అనే విభేదమేమీ ఉండదన్నారు. అఫ్గాన్ ఒక ప్రభుత్వంలా వ్యవహరించాలని సూచించారు.

## దుబాయ్‌లో చిక్కిన డ్రగ్స్ రాకెట్ నిందితుడు

దిల్లీ: దుబాయ్‌లో ఉంటూ అంతర్జాతీయ మాదక ద్రవ్యాల ముఠాను నడిపిస్తున్న పవన్ ఠాకుర్ అనే వ్యక్తిని అక్కడి దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సెప్టెంబరులో ఇంటర్‌పోల్ సిల్వర్ నోటీస్ జారీ చేసింది. దీంతో చర్యలకు ఉపక్రమించారు. గత ఏడాది దేశంలో పట్టుబడ్డ అతిపెద్ద కొకైన్ రాకెట్‌లో ఒకడానికి అతడే ప్రధాన సూత్రధారి. త్వరలో భారత్‌కు రప్పించేందుకు భారత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరు 2024లో దిల్లీలో దాదాపు 82 కిలోల అత్యంత నాణ్యమైన కొకైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.2,500 కోట్లు. ఈ భారీ స్మగ్లింగ్ వెనక ఉన్నది ఠాకుర్‌ అని దర్యాప్తులో తేలింది. ఇదేవిధంగా దిల్లీలో రూ.282 కోట్ల విలువైన 'మెత్' డ్రగ్స్‌ను కూడా ఎన్‌సీబీ స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో కూడా పవన్ హస్తం ఉన్నట్లు అధికారులు తెలిపారు. గతేడాది దిల్లీలో డ్రగ్స్ పట్టుబడడం, తన బంధువుల అరెస్టు కావడంతో ఠాకుర్ తన కుటుంబ సభ్యులతో కలిసి దుబాయ్‌కి పారిపోయారు.

## మాదక ద్రవ్యాల కేసులో సిద్ధాంత్ కపూర్ విచారణ

ముంబయి: మాదక ద్రవ్యాల కేసులో బాలీవుడ్ నటుడు, దర్శకుడు సిద్ధాంత్ కపూర్‌ను మంగళవారం ముంబయి పోలీసులు విచారించారు. దాదాపు ఐదు గంటలపాటు పోలీసులు ఆయనను ప్రశ్నించినట్లు అధికారులు తెలిపారు. నటి శ్రద్ధాకపూర్ సోదరుడైన సిద్ధాంత్ వాంగ్మూలం ఇచ్చేందుకు మంగళవారం ఉదయం యాంటీ నార్కోటిక్ సెల్ కార్యాలయానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను అధికారులు ఐదు గంటల పాటు విచారించి వివరాలు సేకరించారు.

## న్యూజిలాండ్‌లో ఇద్దరు పర్వతారోహకుల మృతి

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌లోని అతిపెద్ద పర్వత శిఖరమైన అయోరాకిని అధిరోహిస్తున్న నలుగురు పర్వతారోహకుల్లో ఇద్దరు మృతిచెందారు. అయితే సహాయక బృందాలు వారి మృతదేహాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి అయోరాకిపై నలుగురు పర్వతారోహకులు చిక్కుకున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో సహాయక బృందాలు అక్కడికి వెళ్లాయి. 'హెలికాప్టర్ ద్వారా గాలింపు చేపట్టిన సహాయక సిబ్బంది ఇద్దరిని కాపాడిన' అధికారులు పేర్కొన్నారు. మరికొన్ని గంటలు వెతికిన తర్వాత మరో ఇద్దరు పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు.

# అమెరికా ప్రయోజనాల మేరకే.. పరిమితంగానే హెచ్-1బీ వీసాలు




• అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలపై శ్వేతసౌధం వివరణ

వాషింగ్టన్: వలసేతర హెచ్-1బీ వీసాలపై తరచూ స్వరం మారుస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై శ్వేత సౌధం వివరణ ఇచ్చింది. ఈ వీసాలతో అమెరికాకు వచ్చే వారిపై అధిక రుసుముల బాదాన్ని మోపిన ట్రంప్.. తాజాగా 'అమెరికాలో నిపుణులైన ఉద్యోగులు తక్కువగా ఉన్నారని' చెప్పడం గమనార్హం. ఆయన హెచ్-1బీ వీసాను సమర్థిస్తూ చేసిన వ్యాఖ్యలపై మద్దతుదారుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై శ్వేత సౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పందిస్తూ...'విదేశీ పెట్టుబడులను ప్రోత్సహిస్తూనే అమెరికన్లకు దక్కాల్సిన ఉద్యోగాలను రక్షించేందుకు ట్రంప్ కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. 'అమెరికన్లకు దక్కాల్సిన ఉద్యోగాలను వేరొకరితో భర్తీ చేయడాన్ని ట్రంప్ సమర్థించడం లేదు. యూఎస్‌లో తయారీ పరిశ్రమలను మెరుగుపరచాలని ఆయన భావిస్తున్నారు. అందులో భాగంగానే పలు దేశాలపై సుంకాలు విధించారు. వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇక, హెచ్-1బీ వీసాలపై ఆయన దృష్టిసారించారు. అమెరికాలో విదేశీ కంపెనీలు ట్రిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడంతో పాటు ప్రత్యేక ఉత్పత్తుల తయారీకి విదేశీ ఉద్యోగులను తీసుకురావాలని ట్రంప్ యోచిస్తున్నారు. ఆ తర్వాత ఆయా కంపెనీలు విదేశీ ఉద్యోగుల స్థానాన్ని అమెరికన్లతో భర్తీ చేయాలి. దేశంలో పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయాలనుకునే కంపెనీలు అమెరికన్లకు ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు' అని విలేకరుల ప్రశ్నలకు లీవిట్ బదులిచ్చారు.

## త్వరలో భారత్-కెనడా మధ్య యురేనియం ఒప్పందం

ఒట్టావా: వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఇంధనం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించే దిశగా భారత్-కెనడా చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఇరుదేశాల మధ్య 2.8 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.25వేల కోట్లు) యురేనియం ఒప్పందం చేసుకున్నట్లు కెనడా మీడియా వర్గాలు వెల్లడించాయి. త్వరలో ఖరారు కానున్న ఈ ఒప్పందం పదేళ్ల పాటు అమల్లో ఉంటుందని తెలిపాయి. రెండు దేశాల మధ్య విస్తృత పౌర అణు సహకార ప్రయత్నాల్లో భాగంగా కెనడాకు చెందిన కామెకో కార్ప్ అనే సంస్థ ఈ సామగ్రిని భారత్‌కు సరఫరా చేయనున్నట్లు సమాచారం. 2015లో కెనడాతో భారత్ యురేనియం ఒప్పందం చేసుకున్న సమయంలోనూ కామెకో నుంచి భారత్ యురేనియం దిగుమతి చేసుకుంది. భారత్, కెనడాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలను తిరిగి ప్రారంభించడానికి ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్లకు పెంచాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు.

### ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నాం: అనితా ఆనంద్

భారత్‌తో దౌత్య విషయంలో తమ ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నట్లు కెనడా మంత్రి అనితా ఆనంద్ వెల్లడించారు. జస్టిన్ ట్రూడో హయాంలో ఇరుదేశాల సంబంధాలు దెబ్బతిన్నాయని.. ప్రస్తుతం తమ ప్రభుత్వం భారత్‌తో సంబంధాలను జాగ్రత్తగా ముందుకు తీసుకెళ్లడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## పెళ్లికి పెద్దల నిరాకరణ.. కాలినడకన పాక్ నుంచి భారత్ చేరిన ప్రేమజంట

కచ్: తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోవడం లేదన్న కారణంగా పాకిస్థాన్‌కు చెందిన ఓ ప్రేమజంట కాలినడకన గుజరాత్‌లోని కచ్‌కు చేరుకున్న ఉదంతమిది. వివరాల్లోకి వెళితే.. పోపట్(24), గౌరి(20)లది అంతర్జాతీయ సరిహద్దుకు 8 కి.మీ. దూరంలో ఉన్న పాకిస్థాన్‌లోని మిథి గ్రామం. పెద్దలు పెళ్లికి నిరాకరించడంతో ఆదివారం రాత్రి ఇంటి నుంచి తప్పించుకొని భారత్-పాకిస్థాన్ మధ్య ఉన్న అంతర్జాతీయ సరిహద్దును దాటి గుజరాత్‌లోని కచ్‌కు చేరుకున్నారు. దీంతో అక్కడ విధుల్లో ఉన్న బీఎస్‌ఎఫ్ బలగాలు వీరిని అదుపులోకి తీసుకున్నాయి. దర్యాప్తు నిమిత్తం వీరిని భుజ్‌కు తరలిస్తామని అధికారి ఒకరు తెలిపారు.

## ఏప్రిల్‌లో ట్రంప్ చైనా పర్యటన.. ఆ తర్వాతే అమెరికాకు జిన్‌పింగ్

• ఇరు దేశాధినేతల ఫోను సంభాషణ



వాషింగ్టన్: వచ్చేఏడాది ఏప్రిల్‌లో తమ దేశంలో పర్యటించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పంపిన ఆహ్వానాన్ని అంగీకరించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. బదులుగా ఆ తర్వాత అమెరికాలో పర్యటించాలని జిన్‌పింగ్‌ను కోరినట్లు సోమవారం తన సామాజిక మాధ్యమం 'ట్రూత్'లో తెలిపారు. గతనెలలో దక్షిణ కొరియాలో జరిగిన భేటీ తర్వాత తాజాగా ట్రంప్, జిన్‌పింగ్ ఫోనులో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య తైవాన్, ఉక్రెయిన్, ఫెంటనిల్ సహా సోయాల కొనుగోళ్లపై చర్చలు జరిగాయి. ఈ విషయాన్ని ట్రంప్ అనంతరం ప్రకటించారు. 'చైనాతో మా సంబంధాలు చాలా దృఢంగా ఉన్నాయి' అని తెలిపారు. అంతకుముందే ఫోను సంభాషణ గురించి బీజింగ్ అధికార ప్రకటనలో తెలిపింది. నేతలిద్దరి పర్యటనల గురించి ప్రస్తావించకపోయినా...తైవాన్, ఉక్రెయిన్‌లపై జిన్‌పింగ్, ట్రంప్ మాట్లాడారని చైనా విదేశాంగశాఖ వెల్లడించింది. ''చైనా ప్రధాన భూభాగంలో తైవాన్‌ను తిరిగి కలపడం అన్నది 'యుద్ధానంతరం మారిన ప్రపంచ క్రమంలో ఓ అంతర్భాగం. రెండో ప్రపంచ యుద్ధంలో చైనా, అమెరికా కలిసి ఫాసిజంకు వ్యతిరేకంగా భుజం భుజం కలిపి పోరాడాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రెండో ప్రపంచ యుద్ధ విజయాన్ని మనం సంయుక్తంగా కాపాడుకోవాల్సిన అవసరం మరింత ఉంది'' అని ట్రంప్‌కు జిన్‌పింగ్ తెలిపినట్లు చైనా విదేశాంగశాఖ పేర్కొంది. ఈ విషయాన్ని మాత్రం ట్రంప్ ప్రస్తావించకపోవడం గమనార్హం.

## మమత హెలికాప్టర్‌పై డ్రామా..

బోన్‌గావ్: పశ్చిమ బెంగాల్ సీఎం మమత తొలుత హెలికాప్టర్‌లో బిన్‌గావ్‌ను చేరుకోవాల్సి ఉంది. ఆ హెలికాప్టర్ లైసెన్సు గడువు ముగిసిందని, బీమాలో లోపాలు ఉన్నాయంటూ అధికారులు ఆపరేటర్‌కు సరిగ్గా మంగళవారం ఉదయం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీంతో సీఎం రోడ్డు మార్గాన ప్రయాణించి మధ్యాహ్నం 2గంటలకు బిన్‌గావ్‌కు చేరుకోవాల్సి వచ్చింది. ఇది భాజపా తనపై చేసిన 'రాజకీయ విద్రోహచర్య' అంటూ మమత ఆరోపించారు. సీఎం ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని, అధికారుల చర్యలకు కచ్చితమైన కారణాలు ఉంటాయని, ప్రతీదానిని రాజకీయం చేయడం ఆమె మానుకోవాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య ప్రత్యారోపణలు చేశారు.

## ఈసీతో భేటీ కానున్న టీఎంసీ ప్రతినిధులు

కోల్‌కతా: తమకు సమయాన్ని కేటాయించాలంటూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)నేత డెరెక్ ఓబ్రియన్ చేసిన విజ్ఞప్తికి ఈసీ స్పందించింది. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఓ అధికార ప్రతినిధి, మరో నలుగురితో కూడిన బృందం తమను కలవొచ్చని టీఎంసీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి లేఖ రాసింది. పార్టీలతో నిర్మాణాత్మక చర్చలను తాము ఎల్లప్పుడూ స్వాగతిస్తామని అందులో పేర్కొంది.

# దిల్లీ పేలుడు.. బుర్హాన్ హత్యకు ప్రతీకార చర్యా?

• కీలక విషయాలు వెలుగులోకి..



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో కారు బాంబు పేలుడు కేసులో విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. విచారణలో అరెస్టయిన ఉగ్రవాదుల నుంచి దర్యాప్తు అధికారులు కీలక సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆత్మాహుతి చేసుకున్న ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీ.. 2016లో భద్రతా బలగాల చేతిలో మృతిచెందిన ఉగ్రవాది బుర్హాన్ వానీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని చూశాడని తేలింది. ముఖ్యంగా ఈ ముఠాలో అతడి పాత్ర, ప్రణాళికలు, అతణ్ని ఉగ్రవాదిగా మార్చిన కారణాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. హరియాణాలోని ఫరీదాబాద్‌లో పట్టుబడ్డ ఈ 'వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్'కు చెందిన పలువురు నిందితులను అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఈ మాడ్యూల్‌లోని ఇతర సభ్యులకు తాను నాయకుడినని చెప్పడానికి ఉమర్ తరచూ తనను తాను 'ఎమిర్' అని పిలుచుకునేవాడని తెలిసింది. ఫరీదాబాద్‌లోని అల్-ఫలా యూనివర్సిటీ డాక్టర్ ముజమ్మిల్ షకీల్ ఈ సూసైడ్ బాంబర్ గురించి అధికారులకు చెప్పినట్లు సమాచారం. జైషే మహమ్మద్ ప్రధాన కాంటాక్ట్ మౌల్వి ఇర్ఫాన్ అహ్మద్ ద్వారా ఉగ్రవాద మాడ్యూల్‌లో మొదట చేరింది షకీల్ అని తేలింది. ఉమర్ హోదా, అనుభవంతో పోలిస్తే తాను కేవలం ఒక 'సాధారణ కూలీ'నని అతడు చెప్పినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడయ్యాయి. ఈ ఉగ్రవాద ముఠా తమ ప్రణాళికకు 'ఆపరేషన్ ఎమిర్' అని పేరు పెట్టినట్లు విచారణలో వెల్లడైంది.

## ఆర్మీ క్రమశిక్షణను ఒక్కసారి ఉల్లంఘించినా నేరమే

• గర్భగుడిలోకి ప్రవేశించ నిరాకరించిన అధికారి తొలగింపునకు సుప్రీం సమర్థన

దిల్లీ: సైన్యంలో ఒక రెజిమెంటుకు నాయకత్వం వహిస్తున్న అధికారి... ఆ రెజిమెంట్‌కు సంబంధించిన పూజా కార్యక్రమంలో పాల్గొనడానికి నిరాకరించడం ఆర్మీ క్రమశిక్షణను ఉల్లంఘించడమేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆర్మీలో ఒక్కసారి ఉల్లంఘనకు పాల్పడినా నేరమేనని, సైన్యం నుంచి అతనిని తొలగించడం సబబేనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు ఇచ్చిన ఇదే విధమైన తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఒక వ్యవస్థగా ఆర్మీ లౌకికమైందని, క్రమశిక్షణ విషయంలో రాజీ పడలేమని తేల్చి చెప్పింది. ''తన కింద ఉన్న సిబ్బంది అన్ని మతాల పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆయన మాత్రం పాల్గొనబోనని చెప్పడం ద్వారా ఎలాంటి సందేశం పంపుతున్నారు? ఇది పూర్తిగా క్రమశిక్షణారాహిత్యం. ఒకసారి ఆర్మీ యూనిఫాం ధరించాక వ్యక్తిగత అభిప్రాయాలు, విశ్వాసాలకు తావుండకూడదు.. .ఆ వ్యక్తి అత్యుత్తమంగా విధులు నిర్వర్తించే అధికారైనా సరే. ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించే స్వభావం ఆర్మీకి సరిపోదు''అని మాజీ సైనికాధికారి శామ్యూల్ కమలేశన్ కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఆ అధికారి విశ్వసించే క్రైస్తవ మతానికి చెందిన ఫాదర్ వచ్చి చెప్పినా తోటి సైనిక సిబ్బందితో కలిసి గర్భగుడిలోకి వెళ్లడానికి నిరాకరించడాన్ని ధర్మాసనం ప్రస్తావించింది.

## బీఎల్‌వో మరణాల కలవరం.. ఎన్నికల సంఘం అప్రమత్తం

ఇంటర్నెట్ డెస్క్: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియ కొనసాగుతున్న కొన్ని రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం అప్రమత్తమైంది. తాజా పరిణామాలపై ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల (సీఈవోల) నుంచి నివేదిక కోరింది. దీంతో సీఈవోలు ఆయా జిల్లా ఎన్నికల అధికారుల (డీఈఓ) నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత ఎన్నికల సంఘానికి పూర్తి నివేదిక అందిస్తారు.

## రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య ఆగని దాడులు

కీవ్: రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతి సాధనకు అమెరికా తీసుకుంటున్న చొరవ ఫలించే సూచనలు కనిపిస్తున్నా, రెండు దేశాల మధ్య దాడులు మాత్రం ఆగడంలేదు. ఉక్రెయిన్‌పై రష్యా సోమవారం రాత్రి 22 క్షిపణులు, 460 డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో ఆరుగురు మరణించారు. రష్యాలోని దక్షిణ రోస్తోవ్ ప్రాంతంపై ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. రష్యా దాడిలో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని రేవులు, విద్యుత్, తాగునీటి సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. మరోవైపు.. మంగళవారం అబుధాబీలో అమెరికా సైన్య కార్యదర్శి డ్యాన్ డ్రిస్కోలీ రష్యన్ అధికారులతో చర్చలు జరిపారు. ఆదివారం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో అమెరికా- ఉక్రెయిన్‌ల మధ్య చర్చలు జరిగాయి. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య నాలుగేళ్ల నుంచి జరుగుతున్న యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శాంతి ప్రణాళికను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. బహుశా ఈ నెలలోనే శాంతి ఒప్పందం ఖరారు అవుతుందనే ఆశాభావాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడి సీనియర్ సలహాదారు రుస్తుం ఉమెరోవ్ వ్యక్తం చేశారు.

## ఇజ్రాయెల్‌కు భారతీయ యూదుల తరలింపు

జెరూసలెం: ఈశాన్య భారతంలో నివసిస్తున్న 5,800 మంది బనె మెనాష్ యూదు సంతతివారిని వచ్చే అయిదేళ్లలో విడతలవారీగా ఇజ్రాయెల్‌కు తరలించడానికి ఆ దేశం ఆమోదముద్ర వేసింది. వీరిని భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు విమానాల్లో తరలించి, హీబ్రూ భాషలో శిక్షణ ఇచ్చి, గృహవసతి, ఇతర విధాలుగా పునరావాసం కల్పించడానికి 2 కోట్ల 70 లక్షల డాలర్లు కావాలి. ఈ ప్రతిపాదనను ఇజ్రాయెల్ వలస వ్యవహారాల మంత్రి ఓఫిర్ సోఫర్‌కు సమర్పించారు. మరికొన్ని రోజుల్లో ఇజ్రాయెల్ నుంచి యూదు మతాచార్యుల బృందం భారత్‌కు రానున్నది. 2,700 సంవత్సరాల క్రితం అస్సీరియన్లు పశ్చిమాసియా నుంచి వెళ్లగొట్టిన 10 యూదు తెగలలో తమదీ ఒకటని బనె మెనాష్ తెగ చెబుతోంది. వారు ఈశాన్య భారతానికి వలసవచ్చారు. వీరిలో 2,500 మంది ఇప్పటికే ఇజ్రాయెల్‌కు చేరారు. మిగిలిన 5,800 మందిని 2030కల్లా భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు తరలిస్తారు.

## మధ్యలో వదిలేసిన అంబులెన్స్ 2 కిలోమీటర్లు నడిచిన బాలింత




పాల్‌ఘర్: మహారాష్ట్రలోని పాల్‌ఘర్ జిల్లాలో ఓ బాలింతను అంబులెన్స్ డ్రైవరు మార్గమధ్యంలో వదిలేయడంతో నవజాత శిశువుతో ఆమె 2 కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది. ఆమ్‌లా గ్రామానికి చెందిన సవితా బరాట్ (20) మొఖాడా ప్రాంత జవహర్ కుటీర్ ఆసుపత్రిలో ఈ నెల 19న ఒక శిశువుకు జన్మనిచ్చారు. సోమవారం డిశ్చార్జి చేయడంతో ఆసుపత్రి అంబులెన్సులో తమ గ్రామానికి బయల్దేరారు. గ్రామం ఇంకా 2 కిలోమీటర్లు ఉందనగానే వాహనం ఆపి ముందుకు వెళ్లడానికి ససేమిరా అన్న డ్రైవరు అందరినీ అక్కడే దించి వెళ్లిపోయాడు. గత్యంతరం లేక ఆ బాలింత తన తల్లి, అత్తల సాయంతో అక్కడి నుంచి నడుస్తూ ఇంటికి చేరుకొంది. దీనిపై బాధిత కుటుంబం అధికారులకు ఫిర్యాదు చేసింది. సవిత ఇంటికి వైద్యబృందాన్ని పంపామని, అంబులెన్స్ డ్రైవరుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తాలుకా ఆరోగ్యాధికారి డాక్టర్ భవూసాహెబ్ ఛట్టర్ తెలిపారు.

## ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయులే!

దిల్లీ: భారత్‌లో ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయంతో బాధపడుతున్నట్లు దిల్లీలోని 'టోని బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్' అనే సంస్థ నిర్వహించిన పరిశోధనలో వెల్లడైంది. దేశంలోని పల్లె, పట్టణాల్లో ఊబకాయ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నట్లు హెచ్చరించింది. దేశంలో 24శాతం మంది మహిళలు, 23 శాతం మంది పురుషులు అధిక బరువు/ఊబకాయంతో బాధపడుతున్నట్లు పేర్కొంది. 2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేని ఉటంకించిన నివేదిక దేశ రాజధాని దిల్లీలో 41శాతం మంది మహిళలు ఊబకాయంతో బాధపడుతున్నారని తెలిపింది.

## రూ.81 కోట్లు పలికిన 'సూపర్‌మ్యాన్' పుస్తకం




న్యూయార్క్: ముగ్గురు అన్నదమ్ములకు ఇల్లు శుభ్రం చేస్తుండగా అటక మీద కనిపించిన 'సూపర్ మ్యాన్' కామిక్స్ పుస్తకం మొదటి సంచిక ఈ నెల టెక్సాస్‌లో జరిగిన వేలంలో రికార్డు స్థాయిలో 9.12 మిలియన్ డాలర్లు (రూ.81.25 కోట్లు) పలికింది. దివంగతురాలైన వీరి తల్లి ఇల్లు శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉండగా.. ఆ ఇంటి దుమ్ము దులుపుతున్న సమయంలో పాత వార్తాపత్రికల మధ్య కార్డుబోర్డులో ఈ పుస్తకం దొరికింది. ఓ కామిక్స్ పుస్తకానికి ఈ స్థాయి ధర పలకడం ఇదే మొదటిసారి. ఇంకా రెండో ప్రపంచయుద్ధ ప్రారంభ కాలం నాటి పలు కామిక్స్ పుస్తకాలు ఆ కార్డుబోర్డులో దొరికాయి.

## దేశంలో ప్రతి విద్వేష ప్రసంగాన్నీ పర్యవేక్షించలేం: సుప్రీంకోర్టు



దిల్లీ: దేశ వ్యాప్తంగా జరిగే విద్వేష ప్రసంగాల ఘటనలపై చట్టాన్ని రూపొందించే ఉద్దేశం కానీ, అలాంటి ఉదంతాలను పర్యవేక్షించే ఉద్దేశం కానీ తనకు లేదని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. ఆ పనులు చేయడానికి శాసన నిర్మాణ వ్యవస్థలు, పోలీస్ స్టేషన్లు, హైకోర్టులు ఉన్నాయని పేర్కొంది. ఒక వర్గాన్ని సామాజికంగా, ఆర్థికంగా బహిష్కరించాలంటూ వచ్చిన నినాదాలపై దాఖలైన దరఖాస్తుపై విచారణ జరుపుతున్న జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ''ఈ దరఖాస్తు సాకుతో మేం ఈ విషయంపై చట్టాన్ని రూపొందించబోవడం లేదు. దేశంలోని ఏదో ఒక భాగంలో జరిగే ప్రతి చిన్న ఘటనపైనా మేం చట్టాన్ని రూపొందించడం, పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టబోం. అందుకు హైకోర్టులు, పోలీస్ స్టేషన్లు, శాసన నిర్మాణ చర్యలు ఉన్నాయి'' అని ధర్మాసనం పేర్కొంది. 'మీరు సంబంధిత అధికారుల దగ్గరికి వెళ్లండి. వాళ్లను చర్య తీసుకోనివ్వండి. అలా కాకుంటే హైకోర్టుకు వెళ్లండి' అని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం ఆదేశించింది.

## తాత్కాలిక సయోధ్య క్రూర ప్రవర్తనను చెరిపి వేయదు

### విడాకులు మంజూరు చేస్తూ దిల్లీ హైకోర్టు వ్యాఖ్య

దిల్లీ: భర్త పట్ల భార్య గతంలో ప్రదర్శించిన క్రూర, దూషణ పూర్వక ప్రవర్తనను గర్భధారణ, తాత్కాలిక సయోధ్య వంటివి చెరిపివేయ లేవని ఒక విడాకుల కేసులో దిల్లీ హైకోర్టు మంగళవారం పేర్కొంది. ఆ ప్రాతిపదికన భర్తకు విడాకులు మంజూరు చేసింది. క్రూరత్వాన్ని పరిస్థితులన్నిటినీ మొత్తంగా పరిశీలించి నిర్ధారించాలే తప్ప అప్పుడప్పుడూ జరిగే తాత్కాలిక సయోధ్యల ఆధారంగా కాదని జస్టిస్ అనిల్ క్షేత్రపాల్, జస్టిస్ రేణు భట్నాగర్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. విడాకుల కోసం ఒక భర్త దాఖలు చేసుకున్న దరఖాస్తును పక్కన పెడుతూ ఫ్యామిలీ కోర్టు వెలువరించిన తీర్పును హైకోర్టు కొట్టివేసింది. ''భార్య గర్భస్రావాన్ని ఆధారంగా చేసుకొని భార్యాభర్తల మధ్య సయోధ్య కుదిరిందన్న నిర్ణయానికి కుటుంబ న్యాయస్థానం వచ్చింది. అలాంటి నిర్ణయానికి రావడం చట్టపరంగా చెల్లుబాటు కాదు'' అని హైకోర్టు ధర్మాసనం తెలిపింది.

## 57 స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు మా తీర్పునకు లోబడే ఉంటాయి

### మహారాష్ట్రలో 50శాతం రిజర్వేషన్ల పరిమితి దాటడంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50శాతాన్ని మించరాదన్న ఆదేశాలు 57 చోట్ల ఉల్లంఘనకు గురయ్యాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు న్యాయస్థానం తీర్పునకు లోబడే ఉంటాయని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం మంగళవారంనాడు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది. స్థానిక సంస్థల్లో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్ల కేటాయింపుపై నిర్ణయం వెలువడే వరకూ ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని ఈ నెల 19న సుప్రీంకోర్టు సూచించింది. అయితే, డిసెంబరు 2న పోలింగ్‌కు సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన వాటిల్లో 57 స్థానిక సంస్థల్లో 50శాతం కోటాను మించి రిజర్వేషన్లు కల్పించారని సీనియర్ న్యాయవాది ఒకరు కోర్టుకు తెలిపారు.

## ప్రతి చిన్నారికీ చేరువలో బడి

### ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుపై కేరళ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: ఉచిత, నిర్బంధ విద్యా హక్కు (ఆర్టీఈ) చట్టం ప్రకారం ప్రతి చిన్నారికీ వారి నివాస ప్రాంతం చేరువలోనే పాఠశాల ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇప్పటి వరకూ ఎలాంటి విద్యా వసతులు లేని ప్రాంతాలకు 3 నుంచి 4 కిలోమీటర్ల దూరంలోనే ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాలని కేరళ రాష్ట్రాన్ని ఆదేశించింది. భౌగోళికంగా ప్రతికూలతలు ఉన్న ప్రతి నివాస ప్రాంతం సమీపంలోనూ పాఠశాల అందుబాటులో ఉండేలా సమగ్ర నిర్ణయం తీసుకోవాలంటూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం మంగళవారం పలు సూచనలు చేసింది. విద్యా వసతిలేని ఓ ప్రాంతంలో పాఠశాల ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన కేరళ హైకోర్టు ఉత్తర్వును సమర్థించింది. ప్రభుత్వ భవనాలు, ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోతే ప్రైవేటు భవనాలను, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల సేవలను తాత్కాలికంగా వినియోగించుకోవాలనీ సూచించింది.

## క్రికెట్ బెట్టింగ్ ఆదాయం నేరపూరితమే

### పీఎంఎల్‌ఏ ప్రకారం చర్యలకు అర్హమే: దిల్లీ హైకోర్టు

దిల్లీ: క్రికెట్ బెట్టింగ్ ద్వారా సమకూరే ఆదాయం నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) ప్రకారం నేరపూరిత ఆర్జన కిందకే వస్తుందని దిల్లీ హైకోర్టు పేర్కొంది. అక్రమంగా సమకూరిన సొమ్ముతో కొనుగోలు చేసిన ఆస్తికి కూడా ఆ మరక అంటుకుంటుందని జస్టిస్ అనిల్ క్షేత్రపాల్, జస్టిస్ హరీశ్ వైద్యనాథన్ శంకర్ ధర్మాసనం స్పష్టం చేసింది. దశాబ్దం క్రితం రూ.2,400 కోట్లతో ముడిపడిన అంతర్జాతీయ క్రికెట్ బెట్టింగ్‌తో వ్యవహారంలో నిందితులకు చెందిన రూ.20 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేయడాన్ని సవాల్ చేస్తూ పలువురు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తూ ఈ తీర్పును వెలువరించింది.

## మావోయిస్టు హిడ్మా మద్దతుదారులపై 'జాతీయ సమైక్యతకు భంగం' అభియోగాలు

### సెక్షన్ 197ను ఎఫ్ఐఆర్‌లో చేర్చిన దిల్లీ పోలీసులు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఆదివారం 'ఇండియా గేట్' వద్ద కాలుష్యానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల్లో మావోయిస్టు నేత మడ్వీ హిడ్మాకు మద్దతుగా నినాదాలు చేసిన వారిపై పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 197 (జాతీయ సమైక్యతకు భంగం)ను నమోదు చేశారు. ఎన్‌కౌంటర్‌కు గురైన హిడ్మాను కీర్తిస్తూ నిరసనలకు దిగడంతో ఇప్పటికే బీఎన్ఎస్ సెక్షన్ 74, 79, 197 కింద కర్తవ్యపథ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు మంగళవారం అధికారులు వెల్లడించారు. తమపై పెప్పర్ స్ప్రేతో దాడి చేశారంటూ 23 మందిని నిరసనకారులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిలో ఆరుగురిపై కర్తవ్య పథ్ పోలీస్‌స్టేషన్‌లో, మరో 17 మందిపై సంసద్ మార్గ్ పోలీస్‌స్టేషన్‌లో రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

✦ పోలీసులకు మద్దతు తెలుపుతూ మంగళవారం పలువురు ఇండియా గేట్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. 'పోలీసులకు మేం మద్దతిస్తున్నాం', 'దేశ వ్యతిరేకుల్ని కాపాడటం ఆపండి' అంటూ నినాదాలు చేశారు. మావో నేత హిడ్మాకు అనుకూల నినాదాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

## వినాయకా!
# మా పెళ్లికి రావయ్యా!

- ఇందౌర్ ఆలయానికి శుభలేఖల వెల్లువ

పెళ్లి అనగానే ముందుగా చేయాల్సిన పనుల్లో ఒకటి ఆహ్వాన పత్రికలు పంచడం. మొదటి కార్డును భగవంతుడి పాదాల దగ్గర పెట్టే సంప్రదాయం చాలాచోట్ల ఉన్నదే. ఇలా మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో గల ఖజ్రానా గణేశ మందిరానికి పెళ్లిళ్ల సీజనులో ఒక్కో రోజు వెయ్యికి పైగా ఆహ్వాన పత్రికలు వస్తుంటాయి. ప్రతి కార్డుపై “మా వివాహానికి మొదటి అతిథిగా ఉండండి'' అని రాసి వినాయకుడి పాదాల దగ్గర పెడుతుంటారు. ఇందౌర్‌తోపాటు చుట్టుపక్కల పలు జిల్లాల ప్రజలు వివాహ ఆహ్వాన పత్రికలతో ఈ ఆలయానికి వస్తారు. ఇక్కడికి చేరుకోలేని చాలామంది భక్తులు పెళ్లి కార్డులను స్పీడ్ పోస్టు ద్వారా పంపుతుంటారు. విదేశాల్లో ఉండేవారు వివాహ ఆహ్వానాలను ఆన్‌లైనులో పంపి, అంతా జయప్రదంగా జరగాలని ప్రార్థిస్తుంటారని ఖజ్రానా గణేశ్ ఆలయ ప్రధాన పూజారి అశోక్ భట్ తెలిపారు. రాష్ట్రంలోని అత్యంత సంపన్న ఆలయాల్లో ఇదొకటి. ఇక్కడి వినాయకుడి తలపై రూ.5 కోట్ల విలువైన కిరీటం ఉంటుంది. గర్భగుడి వెండి ధగధగలతో ప్రకాశిస్తూ ఉంటుంది.



## వివాదాలు పరిష్కరించే
# హనుమంతుడు!

సాధారణంగా వివాదాలు, గొడవల పరిష్కారానికి జనం పోలీస్‌స్టేషన్ల చెంతకు వెళ్తారు. గ్రామాల్లో ముందుగా పెద్దల సమక్షంలో పంచాయితీ జరుగుతుంది. మధ్యప్రదేశ్‌లోని భిండ్ ప్రాంతీయులు కత్రౌల్ గ్రామంలోని హనుమంతుడి గుడికి వెళతారు. 250 ఏళ్ల చరిత్ర గల ఈ ఆలయంలో హనుమంతుడి ఎదుట అబద్ధం చెబితే ఆ దేవుడే శిక్షిస్తాడని స్థానికుల నమ్మకం. కుటుంబ వివాదాలు, దొంగతనం కేసులు, ఎవరి పైనైనా తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు ఇక్కడ పంచాయితీ జరుగుతుందని ఆలయ మహంత్ రాందాస్ మహారాజ్ తెలిపారు. ఇరుపక్షాలు పంచాయితీలో పాల్గొని ఆంజనేయుడికి తమ వాదనలను వినిపిస్తున్నారు. వివాదంలో వారు చెప్పింది నిజమేనని నమ్మేందుకు ఆలయంలో ప్రమాణం చేయాలని పంచాయితీ సభ్యులు కోరుతారు. నిజాయతీగా ప్రమాణం చేసినవారికి న్యాయం లభిస్తుంది. ఒకవేళ అబద్ధం చెప్పి తప్పుడు ప్రమాణం చేస్తే హనుమంతుడి ఆగ్రహానికి గురై శిక్ష అనుభవిస్తారని ఇక్కడివారు నమ్ముతారని కత్రౌల్ గ్రామ సర్పంచి మున్నాసింగ్ తెలిపారు.



# బుర్ఖా ధరించి పార్లమెంటుకు.. మహిళా సెనేటర్‌పై నిషేధం

మెల్‌బోర్న్: బుర్ఖా ధరించి పార్లమెంటుకు వచ్చిందన్న కారణంతో ఓ మహిళా సెనేటర్‌పై నిషేధం విధించారు. ఆస్ట్రేలియాలో బుర్ఖాను నిషేధించాలంటూ ఆమె తీసుకొచ్చిన ప్రతిపాదనను తోటి సెనేటర్లు అంగీకరించకపోవడంతో దీనికి నిరసనగా పౌలిన్ హాన్సన్(71) అనే మహిళా సెనేటర్ సోమవారం బుర్ఖాతో పార్లమెంటుకు వచ్చారు. దీంతో ఆరోజే ఆమెను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేశారు. ఈ చర్యపై ఆమె క్షమాపణలు కోరలేదు. ఫలితంగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మళ్లీ పార్లమెంటు సమావేశాలు మొదలయ్యే వరకు ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చర్యపై పౌలిన్ స్పందించారు. ‘వారు బుర్ఖాను నిషేధించరు. పార్లమెంటుకు ధరించి వస్తే మాత్రం అంగీకరించరు. పార్లమెంటులో డ్రెస్ కోడ్ లేనప్పటికీ.. నేను ధరించి వస్తే అంగీకరించలేదు’ అని ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రిన్సిపల్ లైంగిక వేధింపులు..

- ఛత్తీస్‌గఢ్‌లో విద్యార్థిని ఆత్మహత్య

జశ్‌పుర్: ఛత్తీస్‌గఢ్‌లోని జశ్‌పుర్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ప్రధానోపాధ్యాయుడు తనను లైంగిక వేధిస్తున్నాడన్న ఆరోపణలతో 15 ఏళ్ల బాలిక ప్రైవేటు పాఠశాలలోని స్టడీ రూమ్‌లో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బగీచా పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని విద్యార్థిని రాసిన లేఖను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ప్రిన్సిపల్ కుల్దీపన్ టోప్పాను పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలిని సర్గుజా జిల్లాలోని సీతాపుర్ గ్రామానికి చెందిన విద్యార్థినిగా గుర్తించారు. ఆ బాలిక తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లుగా పోలీసులు తెలిపారు.

# స్వర్ణయుగంలోకి భారత రక్షణ ఆధునికీకరణ

- రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి

దిల్లీ: మారుతున్న ప్రపంచ పరిస్థితులు, పరిణామం చెందుతున్న భౌగోళిక రాజకీయాల నేపథ్యంలో భారత్ సకారాత్మక దృక్పథంతో భవిష్యత్తులోకి దూసుకుపోయేందుకు సిద్ధం కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. మంగళవారం దిల్లీలో “స్వావలంబన్ 2025” పేరుతో నిర్వహించిన భారత నావికాదళ ఫ్లాగ్‌షిప్ దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. భారత్ రక్షణ ఆధునికీకరణ స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తోందని ఆయన పేర్కొన్నారు. రక్షణ వాతావరణంలో మనం మరింత బృహత్తరమైన, వేగవంతమైన పద్ధతిలో పురోగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. రక్షణ రంగంలో ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని స్వాగతిస్తూ, ప్రైవేటు సంస్థలూ జాతీయ ప్రయోజనాల కోసం పనిచేయాలన్నారు. ఉజ్వలమైన భారత నౌకా నిర్మాణ రంగంలో భాగస్వాములై



కార్యక్రమంలో పాల్గొన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రిదళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి

దేశ తదుపరి తరం నౌకా సామర్థ్యాలను పెంపొందించడంలో సహకారం అందించాల్సిందిగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రపంచంలోని ప్రముఖ రక్షణ పరిశ్రమల్ని కోరారు. త్రిదళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి, వివిధ బలగాల సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దిల్లీలో ప్రమాదకరంగా గాలి నాణ్యత

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో గాలి నాణ్యత దారుణంగా క్షీణించింది. కాలుష్య కారక ధూళి కణాలు(పీఎం 2.5) స్థాయులు గణనీయంగా పెరిగాయి. సగటు పీఎం 2.5 సాంద్రత ఒక క్యూబిక్ మీటర్‌కు 101 మైక్రోగ్రాములకు చేరింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన దానికంటే 20 రెట్లు అధికం. ఈ జాబితాలో చండీగఢ్ రెండో స్థానంలో నిలిచింది.

### కాలుష్య వాహనాలపై చర్యలు తీసుకోండి : పీఎంవో

దేశ రాజధానిలో కాలుష్య తీవ్రత దృష్ట్యా ప్రధానమంత్రి కార్యాలయం రంగంలోకి దిగింది. నగరంలో కాలుష్యానికి కారణమయ్యే వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించింది. ఇదే సమయంలో విద్యుత్ వాహనాలను విస్తృత పరిచే చర్యలు ముమ్మరం చేయాలని సూచించినట్లు తెలిసింది. దిల్లీలో వాయునాణ్యత మరింత క్షీణిస్తోన్న వేళ ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది.

### ఇథనాల్ తయారీతో పెరిగిన రైతు ఆదాయం: గడ్కరీ

దిల్లీ: వాయు కాలుష్యాన్ని నివారించడానికి భారత దేశం జీవ ఇంధనాలు, నూతన సాంకేతికతలు, నవీకరణలను చేపట్టాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. మంగళవారం దిల్లీలో జరిగిన ఓ సదస్సులో ఆయన మాట్లాడారు. మన దేశంలో 40 శాతం వాయుకాలుష్యానికి మోటారు వాహనాల నుంచి వెలువడే పొగనే కారణమని ఆయన అన్నారు. భారత్ ఏటా శిలాజ ఇంధనాల దిగుమతికి రూ. 22 లక్షల కోట్లను వెచ్చిస్తోందని, దీని బదులు ఇథనాల్ వంటి జీవ ఇంధనాల వినియోగాన్ని చేపట్టాలని గడ్కరీ సూచించారు. మొక్కజొన్న నుంచి ఇథనాల్ జీవ ఇంధనాన్ని తయారుచేయడం వల్ల బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ రైతులు అదనంగా రూ. 45,000 కోట్ల ఆదాయం కళ్లజూస్తున్నారని ఆయన వివరించారు.

# నేడు రాజ్యాంగ దినోత్సవ సభ

- పాల్గొననున్న రాష్ట్రపతి, ప్రధాని

దిల్లీ: భారత రాజ్యాంగ 76వ వార్షికోత్సవ సందర్భంగా బుధవారం సంవిధాన్ సదన్ (పాత పార్లమెంటు భవనం) లోని చారిత్రక సెంట్రల్ హాల్‌లో జరగనున్న కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేతృత్వం వహిస్తారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు ఈ వేడుకలో పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి ఆధ్వర్యంలో రాజ్యాంగ ప్రవేశిక సామూహిక పఠనాన్ని నిర్వహిస్తారు. తెలుగు, మలయాళం, మరాఠీ, నేపాలీ, పంజాబీ, బోడో, కశ్మీరీ, ఒడియా, అస్సామీ భాషల్లోకి అనువదించిన రాజ్యాంగ ప్రతులను విడుదల చేస్తారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు, వాటి అనుబంధ కార్యాలయాలు, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ప్రవేశిక పఠన కార్యక్రమంలో పాల్గొనాలకునే వారు MyGov.in and Constitution75.com ద్వారా ఆన్‌లైన్‌లో పాల్గొనవచ్చు. హమారా సంవిధాన్, హమారా స్వాభిమాన్ పేరుతో నిర్వహించనున్న ఆన్‌లైన్ జాతీయ క్విజ్, వ్యాసరచన పోటీల్లో పౌరులందరూ పాల్గొనవచ్చని అధికార ప్రకటన తెలిపింది. ■ 76 ఏళ్లుగా అంబేడ్కర్‌పై, రాజ్యాంగంపై ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా దాడి చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ‘ఎక్స్’ వేదికగా ధ్వజమెత్తారు.

# నిబంధనల ప్రకారమే వ్యవహరించాం

- షాంఘై విమానాశ్రయంలో భారత మహిళకు వేధింపులపై చైనా స్పందన

బీజింగ్, ఈటానగర్: షాంఘై విమానాశ్రయంలో అధికారులు తనను వేధించారని అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ చేసిన వ్యాఖ్యలపై చైనా స్పందించింది. సదరు మహిళ విషయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు చట్ట ప్రకారమే వ్యవహరించారని సమర్థించుకుంది. అలాగే జాంగ్నాన్ (అరుణాచల్‌ప్రదేశ్‌ను చైనా పిలిచే పేరు) తమ భూభాగమేనని మరోసారి బుకాయించింది. ఈ నెల 21న వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ అనే మహిళ లండన్ నుంచి జపాన్‌కు వెళ్లే విమానం ఎక్కారు. అయితే అది ట్రాన్సిట్ హాల్ట్ కోసం చైనాలోని షాంఘైలో ఆగింది. ఆ సమయంలో తన పాస్‌పోర్ట్‌ను అధికారులు తనిఖీ చేశారని, అందులో తాను పుట్టిన రాష్ట్రం అరుణాచల్‌ప్రదేశ్ అని ఉండటంతో పాస్‌పోర్ట్ చెల్లదని ఇమ్మిగ్రేషన్ అధికారులు వేధించారని వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మంగళవారం మాట్లాడుతూ.. “వాంగ్‌జోమ్ పేర్కొన్నట్లు మా ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆమెను వేధించలేదు. చట్ట నిబంధనల ప్రకారమే వ్యవహరించారు. ఆ మహిళ హక్కులకు భంగం కలిగించలేదు. విశ్రాంతి, ఆహారం, నీరు తీసుకోవడానికి ఆమెకు విమానాశ్రయ అధికారులు అవకాశం కల్పించారు. జాంగ్నాన్ ఎప్పుడూ చైనాలో భాగమే'' అని చెప్పారు. ఘటనపై భారత్ అదే రోజు స్పందిస్తూ బీజింగ్, దిల్లీలో తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. అరుణాచల్‌ప్రదేశ్ నిస్సందేహంగా తమదేనని, అక్కడి పౌరులు భారత పాస్‌పోర్ట్‌లతో ప్రయాణాలు చేస్తారని గట్టిగా బదులిచ్చింది.

### చైనా తీరు సరికాదు: సీఎం పెమా ఖండూ



మరోవైపు.. వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ బీజింగ్‌లో నిర్బంధించడాన్ని అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఖండించారు. ఇలాంటి చర్య ఎట్టిపరిస్థితుల్లో ఆమోదయోగ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ఇది భారత పౌరులను అవమానించడమేనని చైనా అధికారుల తీరుపై ఆయన ధ్వజమెత్తారు.

## బూడిద మేఘాలపై ఆందోళన అక్కర్లేదు

### పౌర విమానయాన శాఖ

దిల్లీ: ఆఫ్రికాలోని ఇథియోపియాలో హేలీ గుబ్బి అగ్నిపర్వతం పేలడంతో.. దాని బూడిద మేఘాలు భారత్ వైపు కదిలి వచ్చాయి. ఈ నేపథ్యంలో విమాన సర్వీసులతో పాటు ఆయా రాష్ట్రాలపై ఇవి ప్రభావం చూపే అవకాశం ఉందనే కథనాలు వచ్చాయి. దీనిపై పౌరవిమానయాన శాఖ స్పందించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విమాన కార్యకలాపాలు సజావుగానే సాగుతున్నట్లు వెల్లడించింది. ముందు జాగ్రత్త చర్యగా కొన్ని విమానాలను దారి మళ్లించినట్లు తెలిపింది. ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఓ ప్రకటనలో పేర్కొంది. ‘ఈ వ్యవహారంపై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), భారత వాతావరణ విభాగం (ఐఎండీ), విమానయాన సంస్థలు, అంతర్జాతీయ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటున్నాం. భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) ఇప్పటికే నోటమ్ జారీ చేసింది. ప్రభావిత విమానాలకు ఈ మేరకు సమాచారం అందించింది. దేశవ్యాప్తంగా విమాన కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి.

ప్రస్తుతానికి ఎటువంటి ఆందోళన అక్కర్లేదు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాం’ అని పౌరవిమానయాన శాఖ తెలిపింది. ఇథియోపియాలో హేలీ గుబ్బి అగ్నిపర్వతం విస్ఫోటంతో ఏర్పడిన ఈ బూడిద మేఘాలు నింగిలో వేల అడుగుల ఎత్తులోకి చేరాయి. ఎర్రసముద్రం మీదుగా అరేబియా ద్వీపకల్పం చేరుకొని అక్కడి నుంచి భారత ఉపఖండం దిశగా పయనించాయి. గుజరాత్, దిల్లీ-ఎన్‌సీఆర్, రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, హరియాణా రాష్ట్రాలకు విస్తరించాయి. ఇవి మంగళవారం రాత్రి 7:30 గంటలకు భారత గగనతలం దాటి, చైనా దిశగా కదులుతున్నట్లు ఐఎండీ అధికారులు వెల్లడించారు.

## ‘భూమి లేని వ్యవసాయ కూలీలకు సామాజిక భద్రత కల్పించాలి’

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో భూమి లేని వ్యవసాయ కూలీల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్), భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్), కిసాన్ మోర్చా ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు సామాజిక భద్రత కల్పించాలని విన్నవించారు. ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, శ్రమ్ యోగి మాన్ ధన్ పెన్షన్ వర్తింపజేయాలని, ఈ ప్రీమియం ప్రభుత్వమే భరించాలని కోరారు. బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రఘురాం, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, బీకేఎస్ ప్రతినిధులు అనుమోలు గాంధీ, జితేంద్ర, పత్రిరాజు తదితరులు ముఖ్యమంత్రిని కలిశారు.

## 1 నుంచి తెదేపా కేడర్‌కు శిక్షణ

- పార్టీ మండలాధ్యక్షులతో ప్రారంభం

ఈనాడు, అమరావతి: తెలుగుదేశం పార్టీ సుదీర్ఘ విరామం తర్వాత పార్టీ నాయకులు, కేడర్‌కు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనుంది. పార్టీ కేంద్ర కార్యాలయంలో డిసెంబరు 1 నుంచి మండల అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఒక్కో బ్యాచ్‌కి 100 మందిని ఎంపిక చేస్తారు. ప్రతి సోమ, మంగళవారాల్లో ఒక బ్యాచ్‌కి శిక్షణ ఉంటుంది. మొదట పార్టీ మండలాధ్యక్షులకు శిక్షణ పూర్తయ్యాక, రెండో దశలో బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జుల వరకు శిక్షణ ఇవ్వాలన్నది ఆలోచన. పార్టీ చరిత్ర, సిద్ధాంతాలు, మైలురాళ్లు, సాధించిన విజయాలు, తెదేపా ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వంటి అంశాల్ని పార్టీ సీనియర్ నాయకులు వివరిస్తారు. శిక్షణ కార్యక్రమాల ఏర్పాట్లపై మంత్రి లోకేశ్ మంగళవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్టీ ప్రాంతీయ కోఆర్డినేటర్లు, కార్యాలయ సిబ్బందితో సమీక్షించారు.

◆ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని లోకేశ్ స్పష్టంచేశారు. ఏడు జిల్లాల్లో పార్టీ కార్యాలయాల డిజైన్లను మంగళవారం ఖరారు చేశారు.

## ప్రత్యేక ఐటీ బృందం సేవల కొనసాగింపు

ఈనాడు, అమరావతి: గిరిజన సంక్షేమశాఖకు సంబంధించిన సేవలను పౌరులకు వేగవంతంగా అందించేందుకు ఏర్పాటు చేసిన ఐటీ బృందాలను రెండేళ్లపాటు(2026 మార్చి 31వ తేదీ వరకు) కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. గిరిజన ప్రగతి పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పన, అభివృద్ధి, అమలు, నిర్వహణ కోసం ఈ బృందాలు పని చేయనున్నాయి. ప్రాజెక్టు మేనేజర్ నుంచి సిస్టమ్ అడ్మిన్ వరకు 20 మంది ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

# ప్రజాదర్బార్‌కు తరలివచ్చిన బాధితులు

- అండగా ఉంటానని మంత్రి లోకేశ్ భరోసా

ఈనాడు, అమరావతి: ఒక్కొక్కరిదీ ఒక్కో సమస్య. గూడు కోసం కొందరు.. ఆర్థిక ఊతం ఇవ్వాలని, ఉపాధి అవకాశం కల్పించాలని ఇంకొందరు.. న్యాయం చెయ్యాలని మరికొందరు.. ఇలా రాష్ట్ర నలుమూలల నుంచి సమస్యలు విన్నవించేందుకు బాధితులు తరలివచ్చారు. వారి సమస్యలను ఓపిగ్గా వింటూ అండగా ఉండి, ఆదుకుంటానని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో లోకేశ్ బాధితుల నుంచి వినతులు స్వీకరించారు.

◆ తెదేపా సానుభూతిపరుడిననే కక్షతో గత వైకాపా ప్రభుత్వంలో తనపై అక్రమ కేసులు బనాయించి, తమ కుటుంబాన్ని క్షోభకు గురిచేశారని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన జరుగుళ్ల గురుమూర్తి వాపోయారు. అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఆర్థిక సాయం అందించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

◆ గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 70 మంది కలిసి పొదుపు చేసిన రూ. 7.55 కోట్లను సీఈవో దుర్వినియోగం చేశారని.. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు కోరారు.

◆ రిటైర్డ్ పార్ట్‌టైం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.4,000 పింఛను రూ. 10,000కు పెంచాలని కోరుతూ ఏపీ రిటైర్డ్ పార్ట్‌టైం వీఏవో, పీటీఏ, వీఆర్వోల ఫెడరేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు.

◆ విశాఖలోని మధురవాడలో స్వతంత్ర నగర్, బాపూజీ కాలనీలో 110 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయని, కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నామని స్వతంత్రనగర్ మురికివాడ నిర్వాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు.





తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వచ్చిన వృద్ధులతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్ ◆ ప్రజాదర్బార్‌లో దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

◆ తమ 39 సెంట్ల వ్యవసాయ భూమిని వెబ్‌ల్యాండ్‌లో నమోదుకు చర్యలు తీసుకోవాని గుంటూరు జిల్లా పెద్దవడ్లపూడికి చెందిన కుర్రా వెంకటరావు కోరారు.

◆ పీజీ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని కర్నూలు జిల్లా గోవిందపల్లెకు చెందిన పగిడి వెంకటలక్ష్మి వినతిపత్రం అందించారు.

◆ ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచరుగా పనిచేస్తున్నానని.. తనకు మూడు చక్రాల స్కూటర్ అందించి ఆదుకోవాలని పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన దివ్యాంగురాలు షేక్ సుబాన్ కోరారు.

◆ పూర్తి వైకల్యంతో బాధపడుతున్న తనకు రూ. 15,000 పింఛను ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ అనంతపురం జిల్లా గుత్తి పట్టణానికి చెందిన వై. మహాలక్ష్మి మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం అందించారు.

## లాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతి

- ఐదు ప్రధాన విభాగాల అనుసంధానం

ఈనాడు, అమరావతి: ఏపీ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు అనుమతించారు. పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్లు, అంతర్గత జల రవాణా, గోదాంలను దీనికి అనుసంధానించాలని నిర్ణయించారు. సచివాలయంలో అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. సీఎం మాట్లాడుతూ.. ‘ ‘ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే హోల్డింగ్ కంపెనీ తరహాలో కార్పొరేషన్ ఉంటుంది. లాజిస్టిక్స్ వ్యయం తగ్గించాలన్నదే దీని లక్ష్యం. ఈ రంగంలో భారీ ఎత్తున పెట్టుబడులు తెచ్చేలా కార్పొరేషన్ వ్యవహరిస్తుంది. రాష్ట్రంలోని లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు, సమన్వయం, పర్యవేక్షణకు నోడల్ ఏజెన్సీగా కార్పొరేషన్ వ్యవహరిస్తుంది. దీనికి ఎండీ స్థాయి అధికారితో పాటు అనుబంధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, సలహా కమిటీ, క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులు అమలు చేసేందుకు జిల్లా స్థాయి విభాగాలు ఉంటాయి'' అని చెప్పారు. వివిధ రంగాలకు అవసరమైన లాజిస్టిక్స్ అందించే విషయంలో సమన్వయం చేసుకోవాలని అధికారులకు చంద్రబాబు సూచించారు.

## సమాజంలో మహిళ పోషించే పాత్ర అద్వితీయమైనది

- సెర్ప్ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి కరుణ

ఈనాడు, అమరావతి: సమాజంలో మహిళలు పోషించే పాత్ర అద్వితీయమైనదని గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) ఎక్స్‌అఫీషియో కార్యదర్శి వాకాటి కరుణ పేర్కొన్నారు. మహిళలపై వివక్ష ఇంకా కొనసాగుతోందని, దీన్ని రూపుమాపటానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో నయీ చేతన్ జెండర్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపెయిన్ ప్రచార పోస్టర్లు, ప్రచార సామగ్రిని ఆమె ఆవిష్కరించారు.

## 4పామాయిల్ మిల్లుల ఏర్పాటుకు ప్రతిపాదన

ఈనాడు-అమరావతి: రాష్ట్రంలో నాలుగు సమీకృత ఆధునిక పామాయిల్ మిల్లుల ఏర్పాటుకు వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేసేందుకు నాలుగు పెద్ద కంపెనీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ కోరుతున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ తెలిపింది. ఆయిల్‌ఫెడ్ అవసరాలకు అనుగుణంగా ఏలూరు, కాకినాడ జిల్లాల్లో వాటి ఏర్పాటుకు నిర్ణయించామని పేర్కొంది. వాటిని ఆయిల్‌ఫెడ్ సొంత నిధులతో ఏర్పాటు చేస్తుందా? లేక పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ కింద చేపట్టాలా? అదీ కాకుంటే ప్రభుత్వమే నిధులు వెచ్చిస్తుందా? అనే దానిపై స్పష్టత రావలసి ఉంది.

## దేశ సాంస్కృతిక పునరుత్థానానికి సంకేతం

- అయోధ్య ధ్వజారోహణ ఉత్సవంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిరంపై ధ్వజారోహణ ఉత్సవం.. దేశ సాంస్కృతిక పునరుత్థానం, నాగరికత పునరుద్ధరణకు సంకేతమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. సనాతన జ్ఞానాన్ని ఆధునికతతో కలిపి నూతన భారత నిర్మాణం వైపు సాగుదామని పిలుపునిచ్చారు. ఇది కేవలం మార్పు కాదని, ప్రతి భారతీయుడి ఆత్మలో భారతీయతను తిరిగి మేలుకొలిపే శక్తిమంతమైన ఉద్యమమని పేర్కొన్నారు. దేశంలో వలస పాలన చిహ్నాలను లేకుండా చేయడం, భారత్‌కు అసలైన గుర్తింపు తీసుకురావడం వంటివి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో జరుగుతుండడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ మేరకు ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

## చిన్నారుల సంరక్షణ కేంద్రాల తనిఖీకి కమిటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని చిన్నారుల సంరక్షణ కేంద్రాల తనిఖీకి రాష్ట్రస్థాయి కమిటీని ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర చిన్నారుల సంరక్షణ సొసైటీ అడిషనల్ సీఈవో దీనికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. చిన్నారుల సంరక్షణ కమిటీ, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, స్టేట్ అడాప్షన్ రీసోర్స్ ఏజెన్సీ నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా ఉంటారు.

## ఉపరాష్ట్రపతితో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడి భేటీ

ఈనాడు, దిల్లీ: ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తన శాఖ సీనియర్ అధికారులతో కలిసి మంగళవారం ఇక్కడి పార్లమెంటు భవనంలో సమావేశమయ్యారు. ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా పౌర విమానయాన రంగంలో తీసుకుంటున్న చర్యల గురించి ఉపరాష్ట్రపతికి వివరించారు. ఈ రంగంలో ఆత్మనిర్భరతను ప్రోత్సహించడానికి అవలంబిస్తున్న విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ఉడాన్ పథకం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీనివల్ల స్థానిక ప్రజలకు సాధికారత కల్పించడంతో పాటు, ప్రాంతీయ ఆర్థిక, పర్యాటక సామర్థ్యాలను వెలుగులోకి తీసుకొచ్చినట్లయిందన్నారు. నిరుపయోగంలో ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌లను ఉపయోగంలోకి తేవడం పట్ల ఆయన కేంద్రమంత్రిని అభినందించారు.



ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

## స్టెమీతో 3,027 మందికి తప్పిన ప్రాణాపాయం

- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: గుండెనొప్పి వచ్చిన వారికి అత్యవసరంగా స్టెమీ విధానంలో అందిస్తున్న వైద్యం వల్ల గతేడాది జూన్ 1 నుంచి ఈ నెల 15 వరకు 3,027 మంది ప్రాణాలు నిలిచాయని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో 238 సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో ఖరీదైన టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్‌ను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడం వల్ల ఎన్నో ప్రాణాలు నిలుస్తున్నాయని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 3,155 మంది గుండెనొప్పితో ఆసుపత్రులకు వస్తే అందులో 95.94 శాతం మంది ప్రాణాలు కాపాడగలిగామని వెల్లడించారు. ప్రతి పీహెచ్‌సీలో మూడు, ప్రాంతీయ ఆసుపత్రిలో నాలుగు, జిల్లా ఆసుపత్రిలో ఐదు చొప్పున ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ ఇంజెక్షన్ ధర రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వం టెండరు ద్వారా వీటిని కొనుగోలు చేస్తోందని.. ఒక్కో ఇంజెక్షన్‌కు రూ.19 వేలతోపాటు మందులకు అదనంగా రూ.6 వేల చొప్పున వెచ్చిస్తూ ఉచిత సేవలు అందిస్తోందని మంత్రి వెల్లడించారు.

## డ్యామ్‌ల భద్రత కమిటీ పునర్వ్యవస్థీకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో డ్యామ్‌ల భద్రతను పర్యవేక్షించేందుకు కేంద్ర చట్టం కింద ఏర్పాటు చేయాల్సిన కమిటీని పునర్వ్యవస్థీకరించారు. ఈ మేరకు జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కమిటీకి జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్ ఎక్స్‌అఫీషియో ఛైర్‌పర్సన్‌గా.. హైడ్రాలజీ, ఆకృతుల సంస్థ, కృష్ణా డెల్టా వ్యవస్థ, కర్నూలు, విశాఖపట్నం, తిరుపతి చీఫ్ ఇంజినీర్లు సభ్యులుగా ఉంటారు. కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల నుంచి ఆయా నదులకు సంబంధించి ఎగువన ఉన్న రిజర్వాయర్ల చీఫ్ ఇంజినీర్లు కూడా కమిటీలో ఉంటారు. కేంద్ర జల సంఘం నుంచి డైరెక్టర్ స్థాయి అధికారి, హైడ్రాలజీ, డ్యాం డిజైన్‌లకు సంబంధించి ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లకు చెందిన నిపుణులు సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి, శుభదీప్ బెనర్జీ, పి.సుబ్బారావులను నియమించారు. కేంద్ర విద్యుత్తు సంస్థ నుంచి ముకేశ్‌కుమార్‌ను కమిటీలోకి తీసుకున్నారు.

◆ రాష్ట్రంలో చిన్న నీటివనరుల సర్కిళ్లు, డివిజన్లను చిన్ననీటిపారుదల, మధ్య తరహా నీటిపారుదల చీఫ్ ఇంజినీర్ పరిధి నుంచి తప్పించారు. వాటిని సమీపంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ల పరిధిలోకి తీసుకువచ్చారు. ఈ మేరకు జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

## ఉత్తరాంధ్ర పారిశ్రామికీకరణతో గిరిజనులకు మేలు

- గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

ఈనాడు, అమరావతి: పెట్టుబడుల వికేంద్రీకరణలో భాగంగా గిరిజన ప్రాంతాలకు ప్రముఖ కంపెనీల్ని తీసుకొచ్చి.. గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఐటీడీఏ, ఈడీబీ, పరిశ్రమలశాఖ గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా అభివృద్ధి సాగుతోందని తెలిపారు. నవయుగ ఇంజినీరింగ్, ఎంఐసీఈ, సన్‌విక్, చింతా గ్రీన్ లాంటి కంపెనీలను పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు తీసుకొచ్చి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పునాదులు వేసిందని వెల్లడించారు.